
'బీడుబడిన భూముల్లో జలయజ్ఞంతో ఆనందపు సిరులు పండాలి'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 101

మంగళవారం 2-7-2019




**తప్పులు సరిచేసుకుంటారా?**
ప్రపంచకప్‌లో నేడు బంగ్లాతో భారత్ ఢీ. గెలిస్తే సెమీస్‌లోకి టీమిండియా -స్పోర్ట్స్‌లో



**ఆధ్యాత్మికం @ ఆన్‌లైన్!**
భారత్‌లో 30 బిలియన్ డాలర్ల మార్కెట్. ఆధ్యాత్మిక కంటెంట్‌కు డిమాండ్ -బిజినెస్‌లో


SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


# బీసీల్లోకి కొత్త కులాలు

**30 కులాల చేరికపై కొనసాగుతున్న పరిశీలన**

ఇప్పటికే 22 కులాల నుంచి వినతుల స్వీకరణ

త్వరలో 33 జిల్లాల్లో బీసీ కమిషన్ క్షేత్రస్థాయి పరిశీలన

రెండు నెలల్లో ప్రభుత్వానికి అందనున్న నివేదిక

సర్కారు ఆమోదం పొందితే వీరికీ రిజర్వేషన్లు, పథకాల లబ్ధి

సాక్షి, హైదరాబాద్

వెనుకబడిన తరగతుల్లో (బీసీ)కి మరిన్ని కొత్త కులాలు చేరబోతున్నాయి. ఈ దిశగా బీసీ కమిషన్ చర్యలు చేపట్టింది. వాస్తవానికి రెండున్నరేళ్ల క్రితమే కొత్త కులాల చేరికపై పరిశీలన నివేదిక రూపొందించిన బీసీ కమిషన్ అప్పట్లో ఆయా కులాల నుంచి వినతులు, సూచనలు, సలహాలు స్వీకరించింది. వాటిని ప్రాథమికంగా పరిశీలించిన అనంతరం క్షేత్ర పరిశీలన నిర్వహించాలనుకుంటున్న సందర్భంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం కోడ్ పూర్తికావడంతో బీసీ కమిషన్ తిరిగి పరిశీలన మొదలుపెట్టింది. ఇందులో భాగంగా మరోమారు ఆయా కులాల నుంచి సూచనలు, వినతులు స్వీకరిస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 5వ తేదీ వరకు వినతులను స్వీకరించనుంది. అనంతరం ఈనెల 11వ తేదీ వరకు నిర్దేశిత కులాలకు సంబంధించిన కుల సంఘాల ప్రతినిధులు లిఖిత పూర్వక ఆధారాలు, డాక్యుమెంటరీలు తదితరాలను స్వీకరిస్తుంది. ఇప్పటివరకు 22 కులాలకు

మిగతా 2వ పేజీలో ▶




**బీసీల్లోకి చేర్చాలని భావిస్తున్న కులాలు**

బీసీల్లో 112 కులాలే ఉండగా.. అనాథలను సైతం చేర్చడంతో ఈ సంఖ్య 113కి పెరిగింది. వీటికి అదనంగా కాకి పగడాల, మందెచ్చుల,బత్తిన, కుల్ల కడగి, సన్నాయోల్లు/బౌల్ కమ్మర, బాగోతుల, బొప్పల, తోలుబొమ్మలాట, గంజి కూటి, శ్రీ క్షత్రియ రామజోగి, ఏనూటి, గుర్రపు, అద్దపు, కడారి సైదరోళ్లు, సరగాని, ఓడ్, మాసయ్యలు/పటం, సాధనాశూరులు, రుంజ, పాపల, పనస, పెక్కర, పాండవుల, గౌడ జెట్టి, ఆదికొడుకులు, తెరచీరల, సారోళ్లు, అరవకోమటి, అహీర్ యాదవ్, గోవిలి కులాలను బీసీలో చేర్చేందుకు కమిషన్ పరిశీలన చేస్తోంది.

# నిర్ణయాధికారం ఏఎఫ్‌ఆర్సీదే..

- ఇంజనీరింగ్ ఫీజుల వ్యవహారంపై సుప్రీంకోర్టు తీర్పు
- హైకోర్టు పరిధికి మించి వ్యవహరించిందని వ్యాఖ్య
- ప్రక్రియపై న్యాయ సమీక్ష జరపొచ్చని వెల్లడి
- అయితే నిర్ణయం తీసుకోవద్దని సూచన
- హైకోర్టు నిర్ధారించిన ఫీజు చెల్లదు..
- ఈ తీర్పుతో వాసవి, శ్రీనిధి విద్యార్థులకు ఊరట



సాక్షి, న్యూఢిల్లీ: ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజుల నిర్ణయాధికారం ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీదేనని (ఏఎఫ్ఆర్సీ).. దీని నిర్ణయాలనే అమలు చేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఫీజు నిర్ధారణ ప్రక్రియలో లోపాలుంటే కోర్టు సమీక్షించవచ్చని.. కానీ కోర్టే ఫీజులపై నిర్ణయం తీసుకోరాదని సూచించింది. ఈ విషయంలో హైకోర్టు తన పరిధిని దాటి వ్యవహరించిందని వెల్లడించింది. వాసవీ, శ్రీనిధి ఇంజనీరింగ్ కళాశాలల ఫీజు వివాదంపై దాఖలైన పిటిషన్లపై విచారణ పూర్తి చేసిన సుప్రీంకోర్టు సోమవారం తుదితీర్పు వెలువరించింది. ఏఎఫ్ఆర్సీ నిర్ధారించిన ఫీజులే వర్తిస్తాయని స్పష్టం చేసింది. ఈ రెండు కాలేజీల ఫీజులను నిర్ధారించడం ద్వారా హైకోర్టు ఏఎఫ్ఆర్సీ పరిధిలో చొరబడిందని పేర్కొంది. తెలంగాణలో ఇంజనీరింగ్ విద్యాసంస్థలకు సంబంధించి 2016–17 నుంచి 2018–19 విద్యా సంవత్సరాల బ్లాక్ పీరియడ్‌కు గానూ ఏఎఫ్ఆర్సీ ఫీజులు నిర్ధారించింది. దీని ఆధారంగా తెలంగాణ ప్రభుత్వం జీవో 21 ద్వారా జూలై 4, 2016న నోటిఫై చేసింది. దీని ప్రకారం వాసవీ ఇంజనీరింగ్ కళాశాల వార్షిక ఫీజు రూ.86 వేలు కాగా శ్రీనిధి ఇంజనీరింగ్ కళాశాల ఫీజు రూ.91 వేలు. ఈ ఫీజుల నిర్ధారణ తగినరీతిలో లేదని పునఃసమీక్షకు ఆయా కళాశాలలు అభ్యర్థించగా ఫిబ్రవరి 4, 2017న ఏఎఫ్ఆర్సీ రెండు కళాశాలల ఫీజును రూ.97 వేలుగా నిర్ధారించింది.

**హైకోర్టు తీర్పుపై.. సుప్రీంకు!**

ఈ నేపథ్యంలో ఈ నిర్ణయాన్ని ఆయా విద్యా సంస్థలు హైకోర్టులో సవాలు చేశాయి. దీంతో హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం న్యాయ సమీక్ష జరిపి వాసవీ కళాశాల ఫీజును రూ.1,60,000గా, శ్రీనిధి కళాశాల ఫీజును రూ.1,37,000గా నిర్ధారిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. దీనిని రాష్ట్ర ప్రభుత్వం సవాలు చేయగా.. ఏకసభ్య ధర్మాసనం ఉత్తర్వులను హైకోర్టు డివిజన్ బెంచ్ సమర్థించింది. ఈ నేపథ్యంలో హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ మొదట వాసవీ కళాశాల

మిగతా 2వ పేజీలో ▶

**పది రోజుల్లో ఇంజనీరింగ్ ఫీజులు ఫిక్స్**

- వివరాలు 4లో

## న్యూస్‌రీల్

### కర్ణాటక సర్కారుకు షాక్



కర్ణాటకలో దినదినగండంగా కొనసాగుతున్న కాంగ్రెస్–జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వానికి షాక్ తగిలింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆనంద్ సింగ్(విజయనగర), రమేశ్ జార్కిహోళి(గోకాక్)లు తమ పదవులకు, పార్టీకి సోమవారం రాజీనామా సమర్పించారు.

- వివరాలు 5లో

### జిందాల్‌పై అభియోగాలు నమోదు చేయండి



బొగ్గు బ్లాకుల కేటాయింపు కుంభకోణానికి సంబంధించిన కేసులో పారిశ్రామికవేత్త నవీన్ జిందాల్, మరో నలుగురిపై అభియోగాలు నమోదు చేయాలని ప్రత్యేక కోర్టు దర్యాప్తు సంస్థను ఆదేశించింది.

- వివరాలు 5లో

### పీవోకేలో మీకు పనేంటి?



భారత నిఘా సంస్థ 'రా'కు చెందిన ఓ మాజీ అధికారిపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పీవోకేతో పాటు గిల్గిత్‌ను లోక్‌సభ స్థానాలుగా ప్రకటించేలా కేంద్రాన్ని ఆదేశించాలని దాఖలు చేసిన పిల్ కొట్టివేయడంతోపాటు జరిమానా విధించింది.

- వివరాలు 5లో

### ప్రైవేట్ స్కూళ్లలో పేదలకు 25% సీట్లు



అన్ని ప్రైవేట్, ప్రత్యేక కేటగిరీ పాఠశాలల్లో 25% సీట్లను బలహీన వర్గాల వారి పిల్లలకు ఇవ్వాలని కేంద్రం రాష్ట్రాలకు స్పష్టం చేసింది.

- వివరాలు 5లో

# గురుకుల విభజన సంపూర్ణం



- నియామకాల బోర్డు ప్రతిపాదనలకు మంత్రిత్వ శాఖల ఆమోదం
- కొత్త జోనల్ నిబంధనల ఆధారంగా ఉద్యోగులకు కొత్త సర్వీసురూల్స్
- దీంతో 4వేల ఉద్యోగాలకు లైన్ క్లియర్
- వీలైనంత త్వరగా నియామక నోటిఫికేషన్!

2లో



జమ్మూకశ్మీర్‌లోని కిస్తవర్ జిల్లాలో బస్సు లోయలో పడి గాయపడిన చిన్నారిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

# లోయలో పడిన బస్సు

**35 మంది మృతి**

- జమ్మూ కశ్మీర్‌లోని కిస్తవర్ జిల్లాలో సోమవారం ఓ మినీబస్సు లోయలో పడింది. ఈ ఘటనలో 35 మంది మృతి చెందగా, 17 మంది గాయపడ్డారు. మరణించిన 35 మందిలో 13 మంది మహిళలే. - 5లో

సోమవారం అసెంబ్లీ భవనాన్ని సందర్శిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేతలు భట్టి విక్రమార్క, జీవన్‌రెడ్డి, రేవంత్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క తదితరులు



# పేరు కోసమే కొత్త భవనాలు

**సీఎం కేసీఆర్‌పై మండిపడిన కాంగ్రెస్ నేతలు**

సచివాలయం, అసెంబ్లీ భవనాల సందర్శన

కొత్త భవనాలతో ప్రజాధనం దుర్వినియోగమని వెల్లడి

మరమ్మతులతో 50 ఏళ్లు వాడుకోవచ్చని సూచన

సాక్షి, హైదరాబాద్

వచ్చే వందేళ్ల వరకు ఉండగలిగే భవనాలను కూల్చి కొత్త సచివాలయాన్ని నిర్మిస్తామని సీఎం కేసీఆర్ అనడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ పార్టీ నేతలు విమర్శించారు. నీళ్లు, నిధుల కోసం తెచ్చుకున్న తెలంగాణ.. కేవలం నలుగురు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయిందని మండిపడ్డారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు భట్టి విక్రమార్క, టి.జీవన్ రెడ్డి, రేవంత్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క, విశ్వేశ్వర్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, జగ్గారెడ్డి, మాజీ మంత్రి ప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యేలు టీఆర్ఆర్ (టి.రామ్మోహన్ రెడ్డి), విజయరమణారావు, కొండేటి శ్రీధర్‌తో కూడిన బృందం సోమవారం రాష్ట్ర సచివాలయం, శాసనసభ భవనాలను సందర్శించింది. ఈ సందర్భంగా విలేకరులతో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. శిలాఫలకాలపై తన పేరు ఉండాలనే తపన కోసమే కేసీఆర్ కొత్త భవనాల నిర్మాణం పేరుతో నిధులు దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో సీఎం, 42 మంది మంత్రులు, 294 మంది ఎమ్మెల్యేలతో పాలన సాగిన సచివాలయం, అసెంబ్లీ ఇప్పుడు 119 మంది ఎమ్మెల్యేలకు సరిపోవడం లేదా అని ప్రశ్నించారు. 1980లో మర్రి చెన్నారెడ్డి హయాంలో కొన్ని భవనాలు నిర్మిస్తే, 2012, 2013లో కొన్నింటిని నిర్మించారని, ఈ నిర్మాణాలకు 30 ఏళ్లు కూడా దాటలేదని వివరించారు. ఉన్న వాటిని కూల్చి కొత్తవి కట్టడం దుర్మార్గమన్నారు. ఇంత పెద్ద సచివాలయంలో ఇప్పటికే అనేక భవనాలు ఖాళీగా ఉన్నాయని, మళ్లీ కొత్తగా కట్టాల్సిన పనిలేదని, చిన్న చిన్న మరమ్మతులతో వాటిని సరిచేసుకోవాలని సూచించారు. సీఎం కేసీఆర్ మహారాజు, చక్రవర్తిలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

**ప్రజాధనం దుర్వినియోగం...**

కొత్త భవనాల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం అన్యాయమని ఎంపీ రేవంత్‌రెడ్డి

మిగతా 2వ పేజీలో ▶



ఈశాన్య బంగాళాఖాతంలో

# అల్పపీడనం

**నేడు, రేపు రాష్ట్రంలో వర్షాలు**

సాక్షి, హైదరాబాద్: మంగళ, బుధవారాల్లో రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈశాన్య బంగాళాఖాతం దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా మారి వాయవ్య బంగాళాఖాతం దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ బెంగాల్, ఒడిశా తీరాలలో కేంద్రీకృతమై ఉందని పేర్కొంది. దీనికి అనుబంధంగా 7.6 కి.మీ. ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది మరింత తీవ్రంగా మారి రానున్న 24 గంటలలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని తెలిపింది.







NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Vencobb CHICKEN | ప్రతిపాదించిన నేటి గుడ్డు & చికెన్ హైదరాబాద్ జోన్ ధరలు

| గుడ్ల రిటైల్ ధర | | | | |
|---|---|---|---|---|
| ₹ 55 డజన్ | ఫారం దగ్గర లైవ్ బర్డ్ | 112 కిలో | డ్రెస్డ్ స్కిన్‌తో | 194 కిలో |
| | రిటైల్ లైవ్ బర్డ్ | 134 కిలో | స్కిన్‌లెస్ | 221 కిలో |

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది


## ఇదండీ సంగతి



..ధరలు ఆకాశాన్నంటుతున్నాయ్! అధికార పార్టీ దిష్టిబొమ్మలను కనీసం ఒక్కటి కూడా తగలబెట్టలేకపోతున్నాం!!

# అమ్మ కడుపు చల్లగా..

సురక్షిత ప్రసవాలే లక్ష్యంగా 'దక్షత'కు సర్కారు శ్రీకారం

మాతా శిశు మరణాలను గణనీయంగా తగ్గించేలా కార్యాచరణ

ప్రభుత్వ ఆసుపత్రుల్లోని డాక్టర్లు, నర్సులకు ప్రత్యేక శిక్షణ

ఈ నెలలో మిగిలిన జిల్లాల్లోనూ శిక్షణా కార్యక్రమాలు

| 10 పైలట్ ప్రాజెక్టు పూర్తయిన జిల్లాలు | అవగాహన కల్పించిన వారి సంఖ్య 2,000 |
|---|---|



సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో పూర్తిస్థాయిలో మాతా శిశు మరణాలను తగ్గించేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలుకు వైద్య ఆరోగ్యశాఖ సన్నాహాలు చేసింది. ప్రస్తుతం ప్రతి లక్ష ప్రసవాల్లో 81 మంది తల్లులు, ప్రతి వెయ్యి జననాల్లో 28 మంది శిశువులు మరణిస్తున్నారు. ఈ నేపథ్యంలో సురక్షిత ప్రసవాలే లక్ష్యంగా 'దక్షత'అనే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రసవాల సందర్భంగా లేబర్ రూం (ప్రసవ గది)లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హైరిస్క్ కేసులను ఎలా డీల్ చేయాలన్న దానిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాలకు అనుగుణంగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను, ఏకరూప కార్యక్రమాన్ని తయారు చేసింది. దానికి అనుగుణంగా లేబర్ రూంలలో పనిచేసే డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి మాతా శిశు మరణాలను తగ్గించేలా చేయాలన్నదే సర్కారు ఉద్దేశం. ఎవరిష్టం వచ్చినట్లు వాళ్లు లేబర్ రూంలలో ప్రసవాలు చేయకుండా అత్యంత సురక్షిత పద్ధతిలో కీలకాంశాలపై అవగాహన కల్పించనున్నారు. అలాగే సిజేరియన్లు కాకుండా సాధారణ ప్రసవాలు జరిగేలా శిక్షణ ఇవ్వనున్నారు. ఇప్పటివరకు పది జిల్లాల్లో 'దక్షత'ను వైద్య ఆరోగ్యశాఖ పైలట్ ప్రాజెక్టుగా చేపట్టింది. పైలట్ ప్రాజెక్టు కింద ఇప్పటివరకు పది జిల్లాల్లో 2 వేల మంది డాక్టర్లు, నర్సులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. వారు కిందిస్థాయిలో మరికొందరికి ఇచ్చేలా కార్యక్రమాన్ని సిద్ధం చేశారు. ఈ నెల 16, 17, 18 తేదీల్లో మిగిలిన జిల్లాల్లోనూ 'దక్షత'కార్యక్రమాన్ని నిర్వహించి శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ వరప్రసాద్ 'సాక్షి'కి తెలిపారు. రాష్ట్రంలో చేపట్టిన ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అమలుకు పూనుకోవడం విశేషం.

**ఆ 72 గంటలే కీలకం...**

మాతాశిశు మరణాలు ప్రసవ సమయం నుంచి 72 గంటల మధ్య ఎక్కువగా సంభవిస్తుంటాయి. రక్తస్రావం జరగడం, బీపీలో హెచ్చుతగ్గులు, ఇన్‌ఫెక్షన్ సోకడం, శిశువు బయటకు రాకపోవడం తదితర కారణాల వల్ల గర్భిణులు చనిపోయే పరిస్థితి ఎక్కువగా ఉంటుంది. అలాగే శిశువులైతే ఉమ్మనీరు మింగేయడంతో ఊపిరి తీసుకోలేని పరిస్థితుల్లో చనిపోతుంటారు. గర్భిణులు ప్రసవం కోసం వచ్చిన దగ్గరి నుంచి ప్రసవం జరిగే వరకు మధ్యగల 72 గంటలే అత్యంత కీలకమైనవి. ఈ సమయంలో డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది తీసుకునే ప్రత్యేక జాగ్రత్తల మీదే మాతా శిశువుల ప్రాణాలు ఆధారపడి ఉంటాయి. కానీ కొన్ని సందర్భాల్లో లేబర్‌రూంలు ఎంత గొప్పగా ఉన్నా హైరిస్క్ కేసుల్లో చేపట్టాల్సిన ప్రొటోకాల్ చికిత్సను పాటించకపోవడం వల్ల మరణాలు సంభవిస్తుంటాయి. ఒక్కొక్కరు

మిగతా 2వ పేజీలో ▶



# నేటితో సమాప్తం

- రాష్ట్రంలోని మున్సిపాలిటీల పాలకవర్గాలకు ముగిసిన గడువు
- 53 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లలో ప్రత్యేక పాలన
- కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీల్లో ఇప్పటికే ప్రత్యేకాధికారులు

సాక్షి, హైదరాబాద్: మున్సిపాలిటీల్లో ప్రత్యేక పాలనకు తెరలేచింది. ప్రస్తుత పాలకవర్గాల పదవీకాలం మంగళవారంతో ముగియనుంది. దీంతో బుధవారం నుంచి పురపాలన ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లనుంది. రాష్ట్రవ్యాప్తంగా పాలకమండళ్ల ఏలుబడిలో ఉన్న 61 నగర/పురపాలక సంస్థల్లో ప్రస్తుతం 3 కార్పొరేషన్లు, 53 మున్సిపాలిటీల పాలకవర్గాల పదవీకాలం

మిగతా 2వ పేజీలో ▶

## నిఘా కోసం చైనా డ్రోన్లు

**బాలాకోట్ దెబ్బతో వ్యూహం మార్చిన పాక్**



- పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని బాలాకోట్‌లో జైషే ఉగ్రవాద శిక్షణ శిబిరంపై భారత వైమానిక దళం మెరుపుదాడి చేయడంతో పాకిస్తాన్‌కు రక్షణ పరంగా తన వైఫల్యాలేమిటో తెలిసి వచ్చింది. అత్యాధునిక ఆయుధాలు, నిఘా వ్యవస్థలను సత్వరమే సమకూర్చుకోవాలని, సరిహద్దులో నిఘాను పెంచాలని నిర్ణయించింది. వాటిని చైనా నుంచి కొనాలని నిర్ణయించింది.

- వివరాలు 5లో

## రక్షణ కల్పిస్తేనే అడవుల్లోకి..

**పీసీసీఎఫ్ పీకే ఝాకు అటవీ అధికారుల సంఘాల విజ్ఞప్తి**



పీకే ఝా

- 'మాకు రక్షణ ఏర్పాట్లు చేయకపోతే అడవుల్లోకి వెళ్లలేం. మాపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో అడవుల సంరక్షణ బాధ్యతలు చేపట్టలేం. అడవుల్లో స్థానికంగా రాజకీయ జోక్యం పెరుగుతోంది. పోలీసు, రెవెన్యూ శాఖలు సహకరించడం లేదు' అని ఐఎఫ్ఎస్ స్థాయి మొదలుకుని వివిధ స్థాయిల్లోని అటవీ అధికారులు పీసీసీఎఫ్ పీకే ఝాకు విజ్ఞప్తి చేశారు.

- వివరాలు 4లో

## బాధ్యులపై చర్యలు చేపట్టారా?

### ఇంటర్ ఫలితాల వ్యవహారంపై గవర్నర్ అసంతృప్తి



సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియట్ మార్కుల వ్యవహారంలో తలెత్తిన తప్పిదాలపై గవర్నర్ నరసింహన్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్యా శాఖలపై సోమవారం గవర్నర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ ఫలితాల వ్యవహారంలో చోటుచేసుకున్న పరిణామాలపై కొంత అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. మార్కుల్లో పొరపాట్లకు కారణమైన బాధ్యులను గుర్తించారా? ఏం చర్యలు చేపట్టారని ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా బోర్డు కార్యదర్శి అశోక్ కోర్టు క్లీన్ చీట్ ఇచ్చిందని పేర్కొన్నప్పటికీ అసంతృప్తిగానే ఆ అంశాన్ని ముగించినట్లు సమాచారం. అలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా పక్కా ప్రణాళిక రూపొందించుకొని ముందుకు సాగాలని ఆదేశించినట్లు తెలిసింది. విద్యా సంబంధ అంశాల్లో జాగ్రత్తగా ఉండాలని సూచించినట్లు సమాచారం. అలాగే పాఠశాల విద్య, ఉన్నత విద్య కార్యక్రమాలపైనా సమీక్షించి, నాణ్యత ప్రమాణాల పెంపు కోసం పక్కా చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు తెలిసింది. ఇంజనీరింగ్ ఫీజుల వ్యవహారంపై అడిగినట్లు సమాచారం. సమావేశంలో ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, కళాశాల విద్య కమిషనర్ నవీన్ మిట్టల్, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ లింబాద్రి, వెంకటరమణ, ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్, పాఠశాల విద్య కమిషనర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి, కృష్ణా జలాలపై నేడు, రేపు ఇంజనీర్ల భేటీ

సాక్షి, హైదరాబాద్: గోదావరి నీటిని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు తరలించే అంశంపై చర్చించేందుకు నీటి పారుదల శాఖ నియమించిన ఇంజనీర్ల కమిటీ మంగళవారం జలసౌధలో భేటీ కానుంది. ఇప్పటికే నిర్ధారించిన ప్రతిపాదనలపై ఎలా ముందుకు వెళ్లాలి, ఏయే అంశాలను అధ్యయనం చేయాలి, అలైన్‌మెంట్ ప్రాంతాల్లో పర్యటన, ఏపీ ఇంజనీర్లతో సమన్వయం వంటి అంశాలపై ఈఎన్‌సీ మురళీధర్ నేతృత్వంలోని కమిటీ చర్చించనుంది. ఇక ఏపీ నేతృత్వంలోని ఇంజనీర్ల బృందం సైతం మంగళవారం రాత్రికి హైదరాబాద్ రానుంది. వీలును బట్టి మంగళవారం రాత్రికే ఇరు రాష్ట్రాల ఇంజనీర్ల సంయుక్త భేటీ జరిగే అవకాశం ఉంది. లేని పక్షంలో బుధవారం సంయుక్త భేటీ జరుగనుంది. ఈ భేటీలో దుమ్ముగూడెం, పోలవరంల నుంచి నాగార్జునసాగర్, శ్రీశైలంలకు నీటిని తరలించే అంశాలతో పాటు ఇతర ప్రతిపాదనలపైనా చర్చించనున్నారు.

## జరిమానా, శిక్ష తర్వాత కూడా..

- డ్రంక్ అండ్ డ్రైవ్ సమాచారం ఇవ్వడం అన్యాయం
- హైకోర్టులో పిల్ దాఖలు

సాక్షి, హైదరాబాద్: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారి వాహనాల్ని పోలీసులు స్వాధీనం చేసుకోవడమే కాకుండా, జరిమానా చెల్లించిన తర్వాత ఆ వివరాలన్నింటినీ వారి కార్యాలయాలకు తెలియజేయడం అన్యాయమని పేర్కొంటూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పోలీసులకు పట్టుబడ్డాక జరిమానా చెల్లించి, జైలు శిక్ష అనుభవించిన తర్వాత కూడా ఆ వివరాల్ని ఆఫీసులకు చెప్పడం అన్యాయమని పేర్కొంటూ ఒక ప్రైవేటు ఉద్యోగి పృథ్వీ కృష్ణ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు సోమవారం విచారణ జరిపింది. ప్రతివాదులైన హోం శాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీలకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో కూడిన ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. వాహనాన్ని స్వాధీనం చేసుకునే అధికారం పోలీసులకు లేదని.. జరిమానా, సాధారణ జైలు శిక్ష సమాచారాన్ని తాము పనిచేసే కార్యాలయాలకు ఇవ్వడం వల్ల ఉద్యోగాలకే ఎసరు వస్తోందని పిటిషనర్ తెలిపారు. ఇది రాజ్యాంగాన్ని, చట్టాల్ని ఉల్లంఘించడమేనని ఆయన న్యాయవాది వాదించారు. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన హైకోర్టు.. విచారణను 22కి వాయిదా వేసింది.

## అకాల వర్ష బాధిత రైతులకు పరిహారం

### హైకోర్టుకు విన్నవించిన ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: అకాల వర్షాలకు ఆదిలాబాద్ జిల్లాతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.22.34 కోట్లు మంజూరు చేశామని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. గతేడాది అకాల వర్షాలకు ఆదిలాబాద్ జిల్లాలో నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించకపోవడాన్ని తప్పుబడుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని సోమవారం హైకోర్టు మరోసారి విచారించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో కూడిన ధర్మాసనం గత ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి హైకోర్టులో హాజరయ్యారు. ఆదిలాబాద్ జిల్లాలో అకాలవర్షాలకు 16,690 హెక్టార్ల పంటలు నష్టపోయి రూ.12.13 కోట్లను రైతులు నష్టపోయారని, రాష్ట్ర వ్యాప్తంగా 12 జిల్లాల్లో 28 వేల హెక్టార్లలో రూ.23.34 కోట్ల విలువైన పంట దెబ్బతిని 51 మందికిపైగా రైతులకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది శరత్ కుమార్ హైకోర్టుకు తెలిపారు. మంజూరైన ఈ మొత్తానికి ఆర్థిక శాఖ కూడా సమ్మతి తెలిపిందన్నారు. దీంతో ఈ వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. అలాగే ఈనెల 15వ తేదీన జరిగే విచారణకు ముఖ్య కార్యదర్శి హాజరు కావాల్సిన అవసరం లేదని ధర్మాసనం తెలిపింది.

## 5, 6 తేదీల్లో టీఎస్‌సెట్-2019

- కొత్త సిలబస్‌తో పరీక్షలు
- నిర్ణీత సమయానికి 15 నిమిషాలు ముందుండాలి

హైదరాబాద్: డిగ్రీ కాలేజీలు, యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలతో పాటు పదోన్నతులు, పీహెచ్‌డీ కోర్సుల్లో నేరుగా ప్రవేశాలు కల్పించేందుకు నిర్వహించే టీఎస్‌సెట్–2019 ఈ నెల 5, 6 తేదీల్లో జరగనున్నట్లు చైర్మన్, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాంచంద్రం తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 29 సబ్జెక్టులకు 20 కేంద్రాల్లో టీఎస్‌సెట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తొలిసారి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఉదయం, సాయంత్రం జరిగే పరీక్షకు నిర్ణీత సమయానికంటే 15 నిమిషాలు ముందుగా చేరుకోవాలని సూచించారు. మొదటి పేపర్ కేవలం గంట మాత్రమే ఉంటుందని గంట కంటే ఎక్కువ సమయం అయితే కంప్యూటర్ క్లోజ్ అవుతుందన్నారు. గంట కంటే ముందుగా పరీక్ష పూర్తి చేసిన అభ్యర్థులు తిరిగి చూసుకోవచ్చని తెలిపారు. కొత్త సిలబస్ ప్రకారం పరీక్ష పేపర్ ఉంటుందని పేర్కొన్నారు.

## గ్రూప్-2 ఇంటర్వ్యూలు ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–2 అభ్యర్థులకు ఇంటర్వ్యూలు సోమవారం ప్రారంభమయ్యాయి. కాగా ఈ నెల 8 నుంచి 12 వరకు రెండో వారం ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థుల జాబితా వెబ్‌సైట్‌లో పెట్టినట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. పూర్తి వివరాలకు అభ్యర్థులు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించింది.

## మాకు గుర్తింపు ఇవ్వండి

### బీసీ కమిషన్‌కు పలు కులసంఘాల వినతి

సాక్షి, హైదరాబాద్: కళనే నమ్ముకుని ఏళ్లుగా జీవనం సాగిస్తున్న తమకు గుర్తింపు ఇవ్వాలని వివిధ కుల సంఘాల ప్రతినిధులు బీసీ కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం బీసీ కమిషన్ కార్యాలయంలో కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు ఆంజనేయగౌడ్, గౌరీశంకర్, కార్యదర్శి అనిత ఆధ్వర్యంలో వినతుల స్వీకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా సన్నాయి, తోలుబొమ్మలాట, అద్దపు, భాగవతుల కులాలకు చెందిన ప్రతినిధులు కమిషన్ బృందాన్ని కలిసి తమ కులాల స్థితిగతులను వివరించారు. ఎలాంటి గుర్తింపు లేని తమ కులాలను వెనుకబడిన తరగతుల్లో చేర్చి రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ఈ విషయంపై కమిషన్ సానుకూలంగా స్పందించిందని, ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని హామీ ఇచ్చిందని కుల సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు.



సోమవారం హైదరాబాద్‌లో జరిగిన డాక్టర్స్ డే కార్యక్రమంలో సన్మాన గ్రహీతలతో హైకోర్టు చీఫ్ జస్టిస్ రాఘవేంద్ర సింగ్. చిత్రంలో ప్రముఖ వైద్యులు నాగేశ్వర్‌రెడ్డి, గురవారెడ్డి, గోఖలే తదితరులు

# కోర్టుల్లో తక్షణ న్యాయం జరగట్లేదు

- వైద్యుల్లాగే బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి
- ప్రపంచ వైద్యుల దినోత్సవంలో హైకోర్టు చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్

సాక్షి, హైదరాబాద్: 'బాధితులు న్యాయం కోసం కోర్టును ఆశ్రయిస్తుంటారు. నొప్పితో బాధపడే వారు వైద్యులను ఆశ్రయిస్తుంటారు. నొప్పి నుంచి వైద్యులు వెంటనే ఉపశమనం కల్పిస్తుండగా.. న్యాయస్థానాల్లో మాత్రం తక్షణ న్యాయం జరగడం లేదు' అని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్ అభిప్రాయపడ్డారు. ప్రపంచ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హై9 వెబ్ టీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వైద్యుల్లాగే తామూ బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. విశిష్ట అతిథిగా హాజరైన పద్మశ్రీ అవార్డు గ్రహీత, డాక్టర్ కాకర్ల సుబ్బారావు మాట్లాడుతూ.. గతంతో పోలిస్తే వైద్యులు, రోగులకు మధ్య అవినాభావ సంబంధం తగ్గిందని, ఫలితంగా సమాజంలో వైద్యులకు గౌరవం తగ్గిందని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక బాధ్యతగా రోగులకు సేవ చేయాల్సిన వైద్యులు ఆర్థిక లావాదేవీలే ప్రధానంగా భావిస్తున్నారన్నారు. ఈ వైఖరిలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏసియన్ గ్యాస్ట్రో ఎంటరాలజీ చీఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ వైద్యులు కుటుంబ జీవితాన్నే వృత్తికి అంకితం చేస్తున్నారని చెప్పారు. ప్రతి అవార్డు తమ బాధ్యతను పెంచుతుందన్నారు. ప్రముఖ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ ఏజీ గురవారెడ్డి మాట్లాడుతూ.. వైద్యులపై దాడులు పెరుగుతున్నాయని, వైద్యులకు రక్షణ కల్పించాలని కోరారు. నూటికి తొంబై శాతం మంది వైద్యులు మానవతా దృక్పదంతోనే సేవలు అందిస్తున్నారని, ఒకరిద్దరి వల్ల వృత్తికి కళంకం ఏర్పడుతోందని తెలిపారు.

### ప్రముఖ వైద్యులకు సన్మానం..

ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి (జీవిత సాఫల్య పురస్కారం), ప్రముఖ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ ఏజీ గురవారెడ్డి (డాక్టర్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డు), ప్రముఖ గుండె మార్పిడి నిపుణుడు డాక్టర్ ఏజీకే గోఖలే (మోస్ట్ ఫిలాంత్రోఫిక్ డాక్టర్ అవార్డ్), ప్రముఖ స్పైన్ సర్జన్ డాక్టర్ జీపీవీ సుబ్బయ్య (రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ఇన్ మెడిసిన్ అవార్డు), ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ మానస్ ప్రాణిగ్రహి, గైనకాలజిస్ట్ డాక్టర్ అనురాధ (ఉత్తమ డాక్టర్స్ దంపతులు)లను అవార్డులతో ఘనంగా సన్మానించారు. డాక్టర్ ఎంఎస్‌గౌడ్ (ఉత్తమ డెంటిస్ట్), డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి (ఉత్తమ న్యూరాలజిస్ట్), డాక్టర్ మంజుల అన గాని (ఉత్తమ గైనకాలజిస్ట్), డాక్టర్ దశరథరామిరెడ్డి (ఉత్తమ ఆర్థోపెడిక్ సర్జన్), డాక్టర్ దినేష్‌కుమార్ (ఉత్తమ పీడియాట్రిషన్), డాక్టర్ సోమశేఖర్ రావు (ఉత్తమ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్), డాక్టర్ చిన్మయి (ఉత్తమ ఫీటల్‌మెడిసిన్), డాక్టర్ శ్రీనివాసకుమార్ (ఉత్తమ కార్డియాలజిస్ట్)లతో సన్మానించారు.

# గురుకుల పోస్టుల విభజన సంపూర్ణం

- నియామకాల బోర్డు ప్రతిపాదనలకు మంత్రిత్వ శాఖల ఆమోదం

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యాసంస్థల సొసైటీల్లోని పోస్టుల విభజన పూర్తయింది. గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్‌ఈఐఆర్‌బీ) రూపొందించిన ప్రతిపాదనలకు సంబంధిత శాఖల మంత్రులు ఆమోద ముద్ర వేశారు. దీంతో గురుకుల విద్యాసంస్థల్లో పోస్టులకు కొత్త సర్వీసు నిబంధనలు అందుబాటులోకి రానున్నాయి. కొత్త జిల్లాల ఏర్పాటు, జోన్లు, మల్టీ జోన్ల ఏర్పాటుతో రాష్ట్రంలో కొత్త జోనల్ విధానం అమల్లోకి వచ్చింది. గతంలో కేవలం రెండు జోన్లతో ఉన్న రాష్ట్రంలో ఇప్పుడు 33 జిల్లాలు, ఏడు జోన్లు, రెండు మల్టీజోన్లు ఏర్పడ్డాయి. ఈక్రమంలో పోస్టుల విభజన చేపట్టాల్సి వచ్చింది. రాష్ట్రంలో ఐదు గురుకుల సొసైటీలున్నాయి. ఇందులో ఎస్సీ (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్), ఎస్టీ (టీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్), బీసీ (ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్), మైనారిటీ (టీఎంఆర్‌ఈఐఆస్), జనరల్ (టీఆర్‌ఈఐఎస్) సొసైటీ కార్యదర్శులు సంయుక్తంగా చర్చలు జరిపారు. ఇందులో భాగంగా చర్యలు చేపట్టిన గురుకుల నియామకాల బోర్డు ప్రతిపాదనలు రూపొందించింది. పలు దఫాలు చర్చలు నిర్వహించి సర్వీసు నిబంధనలను పూర్తిస్థాయిలో పరిశీలించిన అధికారులు.. కొత్త జోనల్ విధానం ఆధారంగా నిబంధనలు ఖరారు చేసి ప్రభుత్వానికి నివేదించారు. కాగా, గురుకుల విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సర్వీసు నిబంధనలు ఒక్కో సొసైటీకి ఒక్కో రకంగా ఉండగా కొత్త సర్వీసు నిబంధనల రూపకల్పనలో భాగంగా అన్ని సొసైటీలకు ఒకే తరహా నిబంధనలను గురుకుల బోర్డు రూపొందించింది.

### నియామకాలకు లైన్ క్లియర్

కొత్త జోనల్ విధానం ప్రకారం పోస్టుల విభజన పూర్తి కావడం, ప్రభుత్వ ఆమోదం దక్కడంతో కొత్త నియామకాలకు లైన్ క్లియర్ అయ్యింది. ప్రస్తుతం 4వేల ఉద్యోగ నియామకాల ప్రక్రియ పెండింగ్‌లో ఉంది. ఇదివరకే పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదం తెలిపినప్పటికీ కొత్త జోనల్ విధానం మేరకు నియామకాలు చేపట్టాల్సి రావడంతో నోటిఫికేషన్లు వెలువడలేదు. తాజాగా పోస్టుల విభజన పూర్తి కావడంతో వీటిని వీలైనంత త్వరగా భర్తీ చేసే అవకాశం ఉందని గురుకుల బోర్డు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. కొత్త సర్వీసు నిబంధనలు, పోస్టుల విభజనకు సంబంధించిన మార్గదర్శకాల ప్రతులు మాత్రం ఇంకా బోర్డు కార్యాలయానికి అందలేదు. ఒకట్రెండు రోజుల్లో సంబంధిత శాఖలకు ఇవి చేరతాయని సచివాలయ వర్గాలు చెబుతున్నాయి.

# నిర్ణయాధికారం ఏఎఫ్‌ఆర్సీదే..

▶ మొదటి పేజీ తరువాయి

పేరెంట్స్ అసోసియేషన్, ఆ తర్వాత తెలంగాణ ప్రభుత్వం.. సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. ఏఎఫ్‌ఆర్సీ నిర్ధారించిన ఫీజునే తీసుకోవాలని, అదనంగా ఫీజులు వసూలు చేయరాదని, విద్యార్థులను పరీక్షలకు అనుమతించాలని సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అనంతరం సుదీర్ఘంగా వాదనలు విన్న సుప్రీంకోర్టు ఏప్రిల్ 10న తీర్పు రిజర్వ్ చేసింది. తాజాగా జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ నవీన్ సిన్హాతో కూడిన ధర్మాసనం సోమవారం 35 పేజీల తీర్పు వెలువరించింది. పేరెంట్స్ అసోసియేషన్ తరపున న్యాయవాదులు డి.మహేష్ బాబు, కె.శ్రవణ్ కుమార్ వాదనలు వినిపించగా, తెలంగాణ ప్రభుత్వం తరపున రాధాకృష్ణన్, పాల్వాయి వెంకటరెడ్డి, కళాశాలల తరపున సీనియర్ న్యాయవాదులు ఫాలీ నారీమన్ వాదనలు వినిపించారు.

### ఏఎఫ్‌ఆర్సీ ఫీజులే వర్తిస్తాయ్

హైకోర్టు తన పరిధి దాటి వ్యవహరించిందని సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొంది. 'నిర్ణయం తీసుకునే ప్రక్రియపైనే న్యాయ సమీక్ష ఉంటుంది. కానీ తీసుకున్న నిర్ణయంలో ఉన్న మెరిట్‌పై కాదు. సహజ న్యాయసూత్రాలను ఉల్లంఘిస్తూ నిర్ణయ ప్రక్రియ ఉంటే దానిని కోర్టులు సరిదిద్దవచ్చు. చట్టప్రకారం తిరిగి నిర్ణయాత్మక అధీకృత వ్యవస్థ (ఏఎఫ్ఆర్సీ)ని తిరిగి మొదటి నుంచి ప్రక్రియను సజావుగా చేపట్టాలని ఆదేశించవచ్చు. కానీ కోర్టులు న్యాయసమీక్ష పేరుతో బలవంతంగా నిర్ణయాత్మక అధీకృత వ్యవస్థ పరిధిలోకి వెళ్లి తానే నిర్ణయం తీసుకోరాదు' అని ధర్మాసనం పేర్కొంది. 'ఇక్కడ ఏఎఫ్‌ఆర్సీ సిఫారసుల్లో జోక్యం చేసుకుని హైకోర్టు తన పరిధి దాటి వ్యవహరించింది. అందువల్ల హైకోర్టు ఉత్తర్వులను పక్కనపెడుతున్నాం. ఏఎఫ్‌ఆర్సీ ఫిబ్రవరి 4, 2017న నిర్ధారించిన ఫీజులు 2016–17 నుంచి 2018–19 బ్లాక్ పీరియడ్‌కు అమలులో ఉంటాయి' అని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది.

# నేటితో సమాప్తం

▶ మొదటి పేజీ తరువాయి

సమాప్తం కానుంది. గ్రేటర్ హైదరాబాద్, గ్రేటర్ వరంగల్, ఖమ్మం, సిద్దిపేట, అచ్చంపేట మున్సిపాలిటీల గడువు 2021 వరకు ఉండటంతో.. వీటికి మినహా మిగతా వాటికి ప్రత్యేకాధికారులను నియమిస్తోంది. మరోవైపు కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీల్లో ఇప్పటికే ప్రత్యేక పాలన సాగుతోంది.

**తాత్కాలికమే!:** నిర్ణీత వ్యవధిలోపు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం తొలుత భావించినా.. కొత్త పుర చట్టం రూపకల్పనలో జాప్యం జరగడంలో ఆలస్యం జరిగింది. అయితే ఎట్టిపరిస్థితుల్లోఈ నెలాఖరులోపు ఎన్నికలు జరపాలని సీఎం కేసీఆర్ ఆదేశించడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల గుర్తింపు, వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియను పురపాలకశాఖ చేస్తోంది. ఈ నెల 14లోగా దీన్ని పూర్తి చేయడం ద్వారా ఎన్నికలకు సిద్ధమవ్వాలని నిర్ణయించింది. దీంతో బుధవారం నుంచి కొలువుదీరే ప్రత్యేకాధికారులు.. తాత్కాలికంగానే సేవలందించే అవకాశముంది. కాగా, మున్సిపాలిటీ స్థాయికి అనుగుణంగా కలెక్టర్/జాయింట్ కలెక్టర్, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ హోదాగల అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమిస్తున్నట్లు పురపాలకశాఖ డైరెక్టర్ టీకే శ్రీదేవి 'సాక్షి'కి తెలిపారు.

# అమ్మ కడుపు చల్లగా..

▶ మొదటి పేజీ తరువాయి

ఒక్కో రకమైన చికిత్సా పద్ధతులు పాటించడం వల్ల మరణాలు సంభవిస్తుంటాయని, అలాంటి వాటికి చెక్ పెట్టడమే దక్షత కార్యక్రమం ఉద్దేశమని డాక్టర్ వరప్రసాద్ తెలిపారు. చాలావరకు సంభవించే మరణాలన్నీ కూడా లేబర్ రూంలో జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లేనని ఆయన విశ్లేషించారు. దక్షత ద్వారా శిక్షణ ఇవ్వడంతోపాటు ప్రసవాల సందర్భంగా పర్యవేక్షణ, జవాబుదారీతనాన్ని పెంచుతారు. ప్రసవాల సందర్భంగా పాటించాల్సిన పద్ధతులను చెబుతారు. అత్యవసరంగా తీసుకోవాల్సిన చర్యలను శిక్షణలో భాగంగా నేర్పిస్తారు.

### సిజేరియన్ల తగ్గింపూ లక్ష్యమే...

ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు వచ్చే హైరిస్క్ ప్రసవాల కేసుల్లో అనేక మంది వైద్యులు సిజేరియన్ ఆపరేషన్ల వైపు వెళ్తున్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది మొదటి మూడు నెలల్లో 1,03,827 ప్రసవాలు జరగ్గా అందులో 62,591 మంది అంటే 60 శాతం సిజేరియన్ ద్వారానే జరిగినట్లు సర్కారు నివేదిక తెలిపింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో 28,790, ప్రైవేటు ఆసుపత్రుల్లో 33,801 ప్రసవాలు సిజేరియన్ ద్వారా జరిగినట్లు నిర్ధారించారు. దేశంలోకెల్లా తెలంగాణలో అత్యధికంగా సిజేరియన్ ఆపరేషన్లు జరుగుతుండటం గమనార్హం. ఈ నేపథ్యంలో ఎలాగైనా మాతాశిశు మరణాలను తగ్గించడం, సిజేరియన్లను వీలైనంత వరకు నివారించడమే లక్ష్యంగా దక్షత కార్యక్రమం ద్వారా ముందుకు సాగాలని వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ప్రసవాలను సురక్షితంగా ఎలా చేయాలి? హైరిస్క్ సమయాల్లో ఎలా వ్యవహరించాలి? మతాశిశు మరణాలను వీలైనంత మేర ఎలా తగ్గించాలనే అంశాల గురించి వైద్యులు, సిబ్బందికి ప్రయోగాత్మకంగా చూపేందుకు ఉన్నతాధికారులు ఒక పరికరాన్ని కొనుగోలు చేశారు. ఇదొకరకంగా మాక్ డ్రిల్ లాంటిది. ఆ పరికరం ధర లక్ష రూపాయలు ఉంటుందని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి.

# బీసీల్లోకి కొత్త కులాలు

▶ మొదటి పేజీ తరువాయి

చెందిన ప్రతినిధులు వినతులు, సలహాలు, సూచనలు సమర్పించారు. బీసీ కేటగిరీల్లో కొత్త కులాల చేర్పు అంశంలో ఆర్థిక, సామాజిక పరమైన అంశాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వనుంది. ఇందులో భాగంగా నిర్దేశిత కులాల్లోని ప్రజల జీవన విధానంతో పాటు వారి ఆర్థిక స్థితిని పరిశీలిస్తారు. అదేవిధంగా కుల జనాభాలోని వ్యక్తుల వయసు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, విద్యను సైతం పరిగణనలోకి తీసుకుంటారు. వీటన్నింటినీ క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ప్రత్యక్షంగా పరిశీలించి విచారణ చేపడతారు. ఈనెల రెండో వారంనుంచి క్షేత్రపరిశీలన చేపట్టేందుకు బీసీ కమిషన్ చర్యలు తీసుకుంటోంది. పురపాలిక ఎన్నికల కోడ్ రాకముందే విచారణ పూర్తి చేయాలని కమిషన్ భావిస్తోంది. ఈమేరకు చర్యలను చకచకా పూర్తి చేస్తోంది. మొత్తంగా రెండు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసి పరిశీలన నివేదికను ప్రభుత్వానికి ఇవ్వాలని బీసీ కమిషన్ భావిస్తోంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తే ఈ ప్రక్రియ వాయిదా పడే అవకాశం లేకపోలేదు.

### ఆ కులాల జనాభా గరిష్టంగా 2లక్షలే

'బీసీ కులాల్లోకి కొత్తగా 30 కులాల చేర్పుపై పరిశీలన చేపట్టాం. ఈ కులాల మొత్తం జనాభా గరిష్టంగా 2లక్షలే. కొన్ని కులాల జనాభా 200–500 మాత్రమే ఉంది. అతి తక్కువ జనాభా ఉండడం, వీరికి గుర్తింపు లేకపోవడంతో ఈ కులాలన్నీ ఇప్పటికీ నిరాదరణకు గురయ్యాయి. ప్రస్తుతం మా కమిషన్ ద్వారా చేపడుతున్న పరిశీలనతో ఈ కులాలన్నింటికీ న్యాయం జరుగుతుందని భావిస్తున్నా. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఈ కులాలన్నీ చాలా వెనుకబాటుకు గురయ్యాయి. వీటికి ఆదరణ అవసరం. ఇప్పటివరకు చేపట్టిన ప్రాథమిక పరిశీలనలో ఈ కులాల నుంచి పెద్దగా విద్యావంతులు లేరు. ఉద్యోగవంతులూ లేరు. కనీసం ఆర్థికంగా ఎదిగిన వారు సైతం లేరు. కొన్ని కులాల్లో కనీసం పదో తరగతి సైతం చదవలేదు. ప్రధాన కారణం రిజర్వేషన్లు లేకపోవడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి కలగకపోవడం, జనరల్ కేటగిరీలో పోటీపడే సత్తా లేక పోవడంతో వెనుకబాటుకు గురయ్యారు. రెండు నెలల్లో కులాల చేర్పు పరిశీలన పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించేలా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం ఆమోదిస్తే ఆ కులాలకు ఆర్థిక, సామాజికంగా ముందుకు వెళ్లే అవకాశం ఉంటుంది'

– బీఎస్ రాములు, బీసీ కమిషన్ చైర్మన్

## పేరు కోసమే కొత్త భవనాలు

▶ మొదటి పేజీ తరువాయి

అన్నారు. కేసీఆర్ మూఢ నమ్మకాలను కాంగ్రెస్ పార్టీ పూర్తి వ్యతిరేకిస్తోందన్నారు. నేడు రూ.400 కోట్లు అని చెప్పిన కేసీఆర్ అంచనాలు.. రూ.2 వేల కోట్ల వరకు పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తప్పని, దీన్ని సరిదిద్దుకోవాలని సూచించారు. ఈ భవనాల్లో ఇంకా 50 ఏళ్ల వరకు ఉండొచ్చని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని అన్ని ప్రభుత్వ శాఖలను ఇక్కడికి తరలించాలని కోరారు. ముందు విద్యను అభివృద్ధి చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. అమరవీరుల కోసం స్థూపం నిర్మిస్తామని చెప్పిన కేసీఆర్ ఐదేళ్లు దాటినా ఒక ఇటుక కూడా పెట్టలేదని, అదే విధంగా కుల సంఘాలకు భవనాలు నిర్మిస్తామన్నా ఆ ఊసేలేదని ధ్వజమెత్తారు. సచివాలయ నిర్మాణంపై ఇప్పటికే హైకోర్టులో కేసు ఉందన్నారు. దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామని, అన్ని పార్టీలను కలుపుకుని ఉద్యమిస్తామన్నారు. రైతులు, ఉద్యోగుల సమస్యలను సీఎం పట్టించుకోవాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. పక్క రాష్ట్రం సీఎం ఐఆర్ ప్రకటించారని గుర్తుచేశారు. ఎస్ఎల్‌బీసీ సమావేశానికి హాజరుకాని ఏకైక వ్యక్తి కేసీఆరేనని అన్నారు. ఎర్రమంజిల్‌లో మెట్రో, షాపింగ్, వివిధ కార్యాలయాలు ఉన్నాయని.. అసెంబ్లీ అక్కడికి మారిస్తే ట్రాఫిక్ సమస్య తీవ్రం అవుతుందన్నారు. ఆసిఫాబాద్‌లో మహిళా అటవీ అధికారిపై ప్రజాప్రతినిధి దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు అన్నారు. పోడు భూములను తీసుకోవడం తప్పన్నారు. పోడు భూముల వద్ద కుర్చీ వేసుకొని పేదలకు పంచుతానన్న సీఎం హామీ ఏమైందని ప్రశ్నించారు.



రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్. చిత్రంలో రాజాసింగ్, ఇంద్రసేనారెడ్డి, మురళీధర్‌రావు తదితరులు

# 'ఇంటర్' ఆత్మహత్యలపై నివేదిక కోరండి

- రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కోరిన బీజేపీ నేతలు
- జ్యుడీషియల్ విచారణ జరిపేలా గవర్నర్‌కు సూచించాలని విన్నపం

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ఇంటర్ బోర్డులో జరిగిన అవకతవకల కారణంగా పరీక్షల్లో ఫెయిలై 27 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడిన ఉదంతంపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి నివేదిక కోరాల్సిందిగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను బీజేపీ నేతలు కోరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధరరావు, రాష్ట్ర ఇన్‌చార్జ్ కృష్ణదాస్, ఎమ్మెల్యే రాజాసింగ్, సీనియర్ నేతలు వెదిరే శ్రీరాం, యందల లక్ష్మీనారాయణ, ఎ.శ్రీనివాస్, కె.బాలసుబ్రహ్మణ్యం తదితరులు సోమవారం ఢిల్లీలో రాష్ట్రపతిని కలసి ఇంటర్ బోర్డు వ్యవహారంపై ఫిర్యాదు చేశారు. ఇంటర్ బోర్డులో జరిగిన అవకతవకల కారణంగా 27 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో వెంటనే కల్పించుకొని రాష్ట్ర ప్రభుత్వం నుంచి నివేదిక తెప్పించుకొని బాధిత విద్యార్థుల కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలని బీజేపీ నేతలు రాష్ట్రపతిని కోరారు. ఇంటర్ పరీక్షలకు 9 లక్షల మంది విద్యార్థులు హాజరైతే 3 లక్షల మంది ఫెయిల్ అయ్యారని, వీరిలో 27 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని వివరించారు. విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోయిందని, బోర్డు అవకతవకలపై విచారణ జరిపి బాధిత విద్యార్థులందరికీ న్యాయం చేస్తామన్న భరోసా ఇవ్వకపోగా.. అధికారుల మధ్య అంతర్గత విభేదాల వల్లే తప్పులు జరిగాయంటూ దీన్నొక చిన్న ఘటనగా చిత్రీకరించేందుకు విద్యా మంత్రి ప్రయత్నించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ బోర్డు, పరీక్షలు నిర్వహించిన గ్లోబరీనా సంస్థదే తప్పుగా నిర్ధారించిందన్నారు. గ్లోబరీనాకు పరీక్షల నిర్వహణలో అనుభవం లేదని కమిటీ గుర్తించిందన్నారు. కమిటీ నివేదిక ఇచ్చినా ఇప్పటివరకు బోర్డు అధికారులపై, పలుకుబడి కలిగి ఉండటంతో గ్లోబరీనా సంస్థపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు రాష్ట్రపతికి వివరించారు.

## ‘అప్పు తీర్చేది కేసీఆర్ కుటుంబం కాదు’



**సాక్షి, హైదరాబాద్:** కొత్త సెక్రటేరియట్, అసెంబ్లీ భవనాలు అవసరమనుకుంటే ఒక కమిటీ వేసి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సీఎల్పీ నేత భట్టివిక్రమార్క అభిప్రాయపడ్డారు. అధికారంలో ఉన్నవాళ్లు ఏదనుకుంటే అది చేయడం సరైంది కాదని, తాము అధికారంలోకి వచ్చాక మరో సెక్రటేరియట్ కడతామంటే పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. సోమవారం అసెంబ్లీ హాల్‌లో ఆయన మీడియాతో ఇష్టాగోష్టి మాట్లాడుతూ, కొత్త నిర్మాణాల ద్వారా అయ్యే అప్పు తీర్చేది కేసీఆర్ కుటుంబం కాదని, ప్రజలు తీర్చాల్సి వస్తుందని చెప్పారు. కేసీఆర్ చేసిన తప్పుకు ప్రజలు శిక్ష అనుభవించాలా అని ఆయన ప్రశ్నించారు. కాగజ్‌నగర్ ఘటన అక్కడి ప్రజల తిరుగుబాటుకు సంకేతమని చెప్పారు. ఆ భూమి విషయంలో వారిది బతుకు పోరాటమని, అయితే మహిళా అధికారిణిపై దాడి చేయడాన్ని తాము సమర్థించడం లేదన్నారు. అంబేడ్కర్ అందరూ గౌరవించే వ్యక్తి అని, కానీ ఈ ప్రభుత్వం అంబేడ్కర్ అంటే ఇష్టం లేనట్టుగా వ్యవహరిస్తోందని, సాగునీటి ప్రాజెక్టుకు పెట్టిన ఆయన పేరును తొలగించడంతో పాటు విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేసుకోనివ్వడం లేదన్నారు. తాను ఢిల్లీ వెళ్లి పార్టీ ఫిరాయింపులపై రాజకీయ, న్యాయ నిపుణులతో మాట్లాడానని, వారంతా త్వరలోనే జరగబోయే రౌండ్‌టేబుల్ సమావేశానికి వస్తారని చెప్పారు. కానీ, తాను పీసీసీ అధ్యక్ష పదవికోసం ఢిల్లీ వెళ్లానని కొందరు ప్రచారం చేశారని, ఇది సరైంది కాదన్నారు. సీఎల్పీ నేతగా అధిష్టానం తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నెరవేర్చడమే తన ముందున్న కర్తవ్యమన్నారు. రాజగోపాల్‌రెడ్డి పార్టీ మారతాడని తాను అనుకోవడం లేదన్నారు. కేసీఆర్‌కు కాంగ్రెస్ పార్టీ అంటే భయమని, అందుకే తమ పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తున్నాడని ఆయన వ్యాఖ్యానించారు.

## కాగజ్‌నగర్ దాడిపై కమిటీ వేసిన కాంగ్రెస్

**సాక్షి, హైదరాబాద్:** ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ పరిధిలో మహిళా అటవీ అధికారిపై జరిగిన దాడి ఘటనకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, సీతక్క, పొడెం వీరయ్య, జగ్గారెడ్డిలను సభ్యులుగా నియమిస్తున్నట్లు సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. కమిటీ ఘటన జరిగిన ప్రాంతంలో పర్యటించి వాస్తవాలను తెలుసుకుంటుందని, వారంలోగా నివేదిక ఇస్తుందని తెలిపారు.

## ‘పోడు రైతుల సమస్యలు పరిష్కరించాలి’

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని ఆదివాసీలు భూములపై హక్కులు కోల్పోయి నష్టపోతున్నారని, పోడు భూముల విషయంలో ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుని పరిష్కారం చూపాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, సీతక్క డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ అటవీ భూముల విషయంలో ఆదివాసీల హక్కులను పరిరక్షించాలని కోరారు. టీఆర్ఎస్ నేతలు రాష్ట్రంలో ఆటవిక పాలన సాగిస్తున్నారని, అటవీ అధికారులపై దాడులు చేయడం అమానుషమని విమర్శించారు. ఉన్నతాధికారులకే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు.

## బీజేపీలో చేరేది లేదు: కడియం



**సాక్షి, హైదరాబాద్:** భారతీయ జనతా పార్టీలో తాను చేరుతున్నట్లు వస్తున్న వార్తలు సత్యదూరమని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి సోమవారం విడుదల చేసిన ఓ బహిరంగ లేఖలో పేర్కొన్నారు. రాజకీయ వారసత్వం, కోట్లాది రూపాయల సంపద లేకున్నా.. నిజాయితీ, సమర్థత, విలువలే పెట్టుబడిగా రాజకీయాల్లో కొనసాగుతున్న తనపై మీడియాలో ఆధారాలు లేని వార్తలు వస్తున్నాయన్నారు. సమాజంలోని అట్టడుగు, నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన తనకు ఎమ్మెల్యే, మంత్రి, ఉప ముఖ్యమంత్రిగా అవకాశాలు వచ్చాయన్నారు. ఎదుగుతున్న దళిత నాయకత్వాన్ని బలహీన పరిచి, బద్నాం చేసే కుట్రలో భాగంగా కొన్ని శక్తులు బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సందర్భంలోనూ పార్టీ మారుతున్నాననే తప్పుడు ప్రచారంతో వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే కుట్రలు జరిగాయని, రాజకీయ స్వార్థం కోసం పార్టీలు మారాల్సిన అవసరం తనకు లేదన్నారు. అవినీతి, అక్రమాలను పెంచి పోషించి, విలువలను భ్రష్టు పట్టించిన కాంగ్రెస్‌కు తాను ఏనాడూ ఓటు వేయలేదన్నారు. కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా నిలవబోతోందని కడియం చెప్పారు.

## విమర్శించడమే కాంగ్రెస్ నైజం: బాల్క



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే ప్రతి పనినీ విమర్శించడమే కాంగ్రెస్ నేతలు లక్ష్యంగా పెట్టుకున్నారని టీఆర్ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గట్టు రాంచందర్‌రావుతో కలసి సోమవారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. పార్కింగ్ వసతులు, భద్రతా ఏర్పాట్లకు అనుగుణంగా ప్రస్తుత భవనాలు లేనందునే.. దూరదృష్టితోనే సీఎం కేసీఆర్ అసెంబ్లీ, సచివాలయ భవనాల నిర్మాణం చేపట్టారన్నారు. ప్రభుత్వ నిర్ణయాలని గుడ్డిగా వ్యతిరేకించడాన్ని కాంగ్రెస్, బీజేపీ నేతలు మానుకోవాలని బాల్క సూచించారు. రాష్ట్రం బాగుపడాలనే తపన కాంగ్రెస్, బీజేపీ నేతలకు లేదని గట్టు అన్నారు. విపక్షాలకు ప్రభుత్వంపై పోరాడేందుకు ఎలాంటి ఎజెండా లేనందునే.. అసెంబ్లీ, సచివాలయం నిర్మాణ ప్రతిపాదనపై రాద్ధాంతం చేస్తున్నారని శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు.

## ‘అటవీ’ చట్టాన్ని అమలుచేయాలి: తమ్మినేని



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని 2006 అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలని, సాగుచేస్తున్న భూముల్లోకి పోలీసులు, అటవీ అధికారులు వెళ్లకుండా ఆపాలని, అటవీ అధికారులు పెట్టిన కేసులు ఎత్తేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. రైతులపై ఫారెస్ట్ అధికారులు సాగిస్తున్న దాడులు ఆపకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎన్నికల సందర్భంగా పోడు భూములు సాగుచేసుకుంటున్న వారికి రక్షణ కల్పించి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చినా, అటవీ అధికారులు దౌర్జన్యంగా పోలీసుల అండతో సాగుచేస్తున్న రైతుల భూములు లాక్కొని చెట్లు నాటుతున్నారని పేర్కొన్నారు. దీనిలో భాగంగానే ఆసిఫాబాద్ జిల్లా సార్సాల గ్రామంలో అటవీ అధికారులు అక్రమంగా రైతుల భూముల్లో చెట్లు నాటుతూ ఘర్షణ సృష్టించి, అక్రమ కేసులు బనాయించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ ఘటనలో ఫారెస్ట్ అధికారులపై దాడులు జరగడం విచారకరమని, ఇలాంటి దాడులు జరగకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## ‘ఫీజుల కట్టడిపై సుప్రీం తీర్పు భేష్’



**సాక్షి, హైదరాబాద్:** అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల అరాచకాలను కట్టడి చేసే విధంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం హర్షణీయమని మాజీ ఎంపీ విజయశాంతి అన్నారు. సుప్రీం తీర్పుతోనైనా మేలుకుని విద్య పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. కార్పొరేట్ విద్యాసంస్థలు వసూలు చేస్తున్న ఫీజులను నియంత్రించడానికి కంటితుడుపుగా ఓ కమిటీని వేసి టీఆర్ఎస్ ప్రభుత్వం చేతులు దులుపుకుందని మండిపడ్డారు. దీంతో ఐదేళ్లుగా కేజీ నుంచి పీజీ వరకు ఇష్టానుసారం ఫీజులు వసూలు చేస్తూ కార్పొరేట్ విద్యా సంస్థలు స్వైర విహారం చేశాయన్నారు. ఇప్పటికైనా ఫీజు నియంత్రణ కోసం నియమించిన కమిటీలు స్వేచ్ఛగా పనిచేసేందుకు అవకాశమిచ్చి, ఎవరి ప్రలోభాలకు లొంగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

## ‘ఆ తీర్పును కొట్టేయడం హర్షణీయం’



**సాక్షి, హైదరాబాద్:** ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకు అనుకూలంగా ఉన్న ఫీజుల పెంపు తీర్పును సుప్రీంకోర్టు కొట్టేయడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యాల ఒత్తిడికి తలొగ్గకుండా పాత ఫీజులతోనే కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు. సోమవారం సచివాలయంలో విలేకరులతో జాజుల మాట్లాడుతూ.. వేలల్లో ఉన్న ఫీజులను లక్షల్లో పెంచుకుంటూ పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందకుండా ప్రైవేటు యాజమాన్యాలు కుట్ర చేస్తున్నాయని విమర్శించారు.

# రక్షణ కల్పిస్తేనే అడవుల్లోకి..

**పీసీసీఎఫ్ పీకే ఝాకు అటవీ అధికారుల సంఘాల విజ్ఞప్తి**

- అడవుల్లో స్థానిక రాజకీయ జోక్యం పెరిగిపోతోందని ఆవేదన
- ఆత్మరక్షణకు ఆయుధాలివ్వాలంటూ వినతి..
- అడవుల్లోని పరిస్థితులపై ప్రభుత్వానికి పీకే ఝా నివేదిక

**సాక్షి, హైదరాబాద్:** ‘మాకు రక్షణ ఏర్పాట్లు చేయకపోతే అడవుల్లోకి వెళ్లలేం. మాపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో అడవుల సంరక్షణ బాధ్యతలు చేపట్టలేం. అడవుల్లో స్థానికంగా రాజకీయ జోక్యం పెరుగుతోంది. పోలీసు, రెవెన్యూ శాఖలు సహకరించడం లేదు. మమ్మల్ని మేము రక్షించుకునేందుకు అధికారులు, సిబ్బంది వద్ద ఆయుధాలు కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మా రక్షణకు ప్రభుత్వపరంగా స్పష్టమైన హామీ ఇవ్వకపోతే ఇకముందు విధుల నిర్వహణ కష్టమవుతుంది..’అని రాష్ట్ర ప్రభుత్వానికి ఐఎఫ్ఎస్ స్థాయి మొదలుకుని వివిధ స్థాయిల్లోని అటవీ అధికారులు విజ్ఞప్తి చేశారు. తాజాగా కాగజ్‌నగర్‌లో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అనితపై దాడి జరిగిన నేపథ్యంలో తమపై దాడులు జరగకుండా నిరోధించాలని, బాధ్యులపై పీడీయాక్ట్ పెట్టాలని, ఈ దాడి వెనక రాజకీయంగా ఎవరున్నారో తేల్చి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అటవీ కేసులను త్వరితంగా పరిష్కరించేందుకు వీలుగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం అరణ్యభవన్‌లో ఐఎఫ్ఎస్ స్టేట్ ఫారెస్ట్ సర్వీస్, రేంజ్ ఆఫీసర్స్, జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్, తదితర సంఘాల నేతలు సమావేశమై కాగజ్‌నగర్ దాడి పరిణామాల నేపథ్యంలో సర్కార్ నుంచి అన్ని విధాలా సహకారం అందించాలని పీసీసీఎఫ్ పీకే ఝాకు వినతిపత్రాన్ని సమర్పించాయి. అధికారులు, సిబ్బంది అధైర్యపడొద్దని, శాఖాపరంగా అన్ని విధాలా మద్దతుగా నిలుస్తామని, ప్రభుత్వపరంగా పూర్తి సహాయ సహకారాలు అందించేలా చర్యలు తీసుకుంటామని పీకే ఝా పేర్కొన్నట్టు సమాచారం. అటవీ సిబ్బంది ప్రభుత్వ నిబంధనల ప్రకారమే హరితహారంలో భాగంగా ప్రత్యామ్నాయ అటవీ పెంపకం చేస్తున్నట్టు సమావేశంలో వివిధ స్థాయిల అధికారులు పేర్కొన్నారు. అటవీ భూములను ఆక్రమించటమే కాకుండా



సోమవారం అరణ్య భవన్‌లో సమావేశమైన అటవీ ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు

తమపైనే దాడికి దిగుతున్న వారిపై ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించాలని, వేగంగా విచారణ చేయటంతో పాటు చట్ట ప్రకారం నిందితులను శిక్షించాలని కోరారు. సమావేశంలో ఐఎఫ్ఎస్ అధికారుల సంఘం అధ్యక్షుడు పి.రఘువీర్, వైస్ ప్రెసిడెంట్ మునీంద్ర, సెక్రటరీ లోకేష్ జైస్వాల్, జాయింట్ సెక్రటరీ స్వర్గం శ్రీనివాస్, స్టేట్ ఫారెస్ట్ సర్వీస్ అసోసియేషన్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ల అసోసియేషన్, జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ల అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**అడవుల్లోని పరిస్థితులపై సర్కార్‌కు నివేదిక..**

కాగజ్‌నగర్ దాడి ఘటన నేపథ్యంలో అడవుల్లో చోటు చేసుకుంటున్న పరిస్థితులు, అధికారులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు, ఇతరత్రా అంశాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి పీసీసీఎఫ్ పీకే ఝా నివేదిక సమర్పించినట్టు సమాచారం. ప్రస్తుతం వర్షాల సీజన్ మొదలవుతుండటంతో అటవీ ఆక్రమణలు వేగం పుంజుకుంటున్నాయని, కొత్తగా పెరుగుతున్న ఆక్రమణలను అరికట్టే క్రమంలో దాడులు పెరుగుతున్నాయని అటవీశాఖ ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చినట్టు తెలుస్తోంది. కొత్తగా అటవీభూమిని సాగులోకి తెచ్చేందుకు దున్నడం, ఇతర పొలం పనులు మొదలుపెట్టి దానిని కొన్నేళ్లుగా సాగు చేస్తున్నట్టుగా చూపే ప్రయత్నం జరుగుతోందని, రాజకీయ నేతల జోక్యం పెరగడంతో, స్థానిక స్థాయిల్లో వారి అండతో అనుచరుల దాడులు పెరిగాయని పేర్కొన్నట్టు తెలిసింది. అడవుల్లో సైతం హరితహారం, ప్రత్యామ్నాయ అడవుల పెంపకం వంటి కార్యక్రమాలకు వీరి నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించినట్టు సమాచారం. అటవీ ఆక్రమణలు గణనీయంగా పెరుగుతున్నాయని వరంగల్ రూరల్ జిల్లాలో అత్యధికంగా 85 శాతం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో 27 శాతం, ఆదిలాబాద్ జిల్లాలో 21 శాతం, భద్రాద్రి కొత్తగూడెంలో 18 శాతం, కొమురం భీం జిల్లాలో 15 శాతం ఆక్రమణలు చోటుచేసుకున్నట్టు ప్రభుత్వం దృష్టికి తెచ్చినట్టు సమాచారం.

## ప్రాణాలకు రక్షణ కల్పించాలి

**ప్రభుత్వాన్ని కోరిన ఎఫ్ఆర్వో అనిత**



**హైదరాబాద్:** మళ్లీ విధులకు వెళితే తన ప్రాణాలకు రక్షణ ఉండదని, ప్రభుత్వం రక్షణ కల్పించాలని సిర్పూర్ కాగజ్‌నగర్ ఘటనలో గాయపడిన ఎఫ్ఆర్వో అనిత కోరారు. సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేసేందుకు మాత్రమే అక్కడికి వెళ్లానని, 4 రోజుల ముందే గ్రామస్తులతో సమావేశం నిర్వహించి స్పష్టంగా చెప్పిన తర్వాత పొలంలోకి వెళ్లామని చెప్పారు. తాము మొక్కలు నాటే పనులు చేస్తుండగా జెడ్పీ వైస్ చైర్మన్ కృష్ణతోపాటు మిగతావారు వచ్చి పోలీసులందరినీ దూరం జరిపి, తనను చుట్టుముట్టి కొట్టారని చెప్పారు. ఎంత వేడుకున్నా వినకుండా పశువులకంటే హీనంగా దాడి చేశారన్నారు. ఇక్కడ రాజకీయ నాయకులు గ్రామస్తులను రెచ్చగొట్టడం, అధికారులపై దాడులకు ఉసిగొల్పడం చేస్తుంటారని, గతంలో ఇలాంటి సంఘటనలు అనేకం ఉన్నాయని చెప్పారు. దాడి చేసినవారిపై ఏదో ఒక కేసు పెడితే మళ్లీ రాజకీయ బలంతో బయటకు వస్తారని, అప్పుడు తన ప్రాణాలకు రక్షణ ఉండదని భయాందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వీరిపై సీరియస్‌గా చర్యలు తీసుకుని తన ప్రాణాలకు రక్షణ కల్పించాలని ఆమె విన్నవించారు.

**నిలకడగా ఆరోగ్యం**

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అనిత ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు. ఆమె శరీరంపై గాయాలయ్యాయని, వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించామని, వాటిని పరిశీలించి పూర్తి వివరాలు చెబుతామని చెప్పారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటుందని చెప్పారు.

## ‘తీవ్రంగా పరిగణిస్తున్నాం’

**సాక్షి, న్యూఢిల్లీ:** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సార్సాలలో మహిళా అటవీ అధికారి అనితపై జరిగిన దాడిని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ స్పష్టం చేశారు. ఇలాంటి దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. సోమవారం రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో పర్యావరణ పరిరక్షణ చట్టాల అమలుకు సంబంధించి కర్ణాటకకు చెందిన బీజేపీ ఎంపీ రాజీవ్ చంద్రశేఖర్ లేవనెత్తిన అంశం మీద కేంద్ర మంత్రిపై స్పందించారు. అటవీ అధికారులపై దాడుల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. పార్లమెంటు సమావేశాలు ముగిసిన అనంతరం ఈ ఘటనపై ఉన్నతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు.

**డీజీపీకి జాతీయ మహిళా కమిషన్ నోటీసు**

మహిళా ఎఫ్ఆర్వోపై దాడి ఘటనపై నివేదిక సమర్పించాలని డీజీపీకి జాతీయ మహిళా కమిషన్ నోటీసు జారీ చేసింది. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేపట్టి తమకు నివేదిక పంపాలని డీజీపీ మహేందర్‌రెడ్డికి సూచించింది.

## కాంగ్రెస్ నేతల ముల్లె ఏం పోయింది?

**ప్రతిదానికీ అడ్డుపడతారా?: మంత్రి తలసాని**



**సాక్షి, హైదరాబాద్:** ఇతర రాష్ట్రాల్లో ఉన్న విధంగా సచివాలయం, అసెంబ్లీ ఉండాలన్నదే సీఎం కేసీఆర్ ఆలోచనని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. కాంగ్రెస్ నేతలు దీన్ని అర్థం చేసుకోకుండా ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కొత్తగా కడితే కాంగ్రెస్ నేతల ముల్లె ఏం పోయిందో అర్థం కావడం లేదన్నారు. సోమవారం సచివాలయ మీడియా పాయింట్‌లో విలేకరులతో తలసాని మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతల సెక్రటేరియట్ సందర్శన ఒక పిక్‌నిక్‌లా ఉందని, వచ్చి అరగంట కూడా ఉండలేదన్నారు. వాళ్లు వచ్చి ఏం చూశారో, వారికి ఏం అర్థమైందో చెప్పాలన్నారు. ఏదో టైం పాస్‌కి వచ్చి టీవీలో పేపర్లో కనపడాలని ఇష్టం వచ్చినట్లు గురుకులాలకు, ఇంకాదేనికైనా ఇవ్వాలని చెబుతున్నారని ఆరోపించారు. సచివాలయం చుట్టూ ఇరుకుగా రహదారులున్న సంగతి వాళ్లకు తెలియదా.. అని ప్రశ్నించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త ప్రాజెక్టులు, గురుకులాలు నిర్మిస్తున్నామని చెప్పారు. టీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న గొప్ప పనులు కనిపించడం లేదా.. అయినా వీళ్ల ముఖానికి ఏ రోజైన ఇలాంటి ఆలోచన చేశారా అని అడిగారు. కాళేశ్వరంపై అనేక కేసులు పెట్టారని అయినా పూర్తి చేశామన్నారు. ప్రతీ పనిని అడ్డుకోవడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. ఎవరెన్ని చెప్పినా సచివాలయం కట్టి తీరుతామని తేల్చి చెప్పారు. లక్ష ఉద్యోగాలు విడతల వారీగా ఇస్తున్నామన్నారు. దశల వారీగా డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. ఎర్రమంజిల్‌లో అసెంబ్లీ నిర్మిస్తే ట్రాఫిక్ జామ్ అవుతుంది కదా అని విలేకరులు ప్రశ్నించగా.. దానికి అనేక ఆలోచనలు చేశామని, మా ప్లాన్లు మాకున్నాయని చెప్పారు.

# 10 రోజుల్లో ఫీజులు ఫిక్స్?

- ఇంజనీరింగ్ ఫీజులపై ఏఎఫ్ఆర్సీ కసరత్తు వేగవంతం
- 3 రోజుల్లో కోర్టుకు వెళ్లిన కాలేజీల ఫీజుల ఖరారు
- ఆ తర్వాత మిగతా కాలేజీ ఫీజుల ఖరారుకు చర్యలు
- కోర్టుకు వెళ్లని కాలేజీల ఫీజు పెంపుపై ఇప్పటికే ప్రతిపాదన
- 15 శాతం, 20 శాతానికి యాజమాన్యాల అంగీకారం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజుల ఖరారుకు ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీ (ఏఎఫ్ఆర్సీ) చర్యలు వేగవంతం చేసింది. 10 రోజుల్లోగా ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజును ఖరారు చేసేందుకు చర్యలు చేపట్టింది. కోర్టు ఆదేశాల మేరకు యాజమాన్య ప్రతిపాదిత ఫీజును అమలు చేయకుండా, ఫీజులను ఖరారు చేశాకే కౌన్సెలింగ్‌ను కొనసాగించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా కోర్టును ఆశ్రయించిన 81 కాలేజీల ఫీజులను మూడు రోజుల్లో ఖరారు చేసేందుకు చర్యలు ప్రారంభించింది. సోమవారం 20 కాలేజీల ఫీజులను ఖరారు చేసేందుకు యాజమాన్యాలతో హియరింగ్ నిర్వహించింది. యాజమాన్యాలు ఇచ్చిన గత రెండేళ్ల ఆదాయ వ్యయాలు, తాజా ప్రతిపాదనలను ఏఎఫ్ఆర్సీ పరిశీలించింది. ఇప్పటికే ఆడిటర్లు



ఆ కాలేజీల ఆదాయ వ్యయాలను సమీక్షించిన నేపథ్యంలో సోమవారం ఏఎఫ్ఆర్సీ సమావేశమై వాటన్నింటినీ పరిశీలించి ఫీజులను ప్రాథమికంగా నిర్ణయించింది. మరోవైపు మంగళవారం మరో 30 కాలేజీల ఫీజులను కూడా ఖరారు చేసేందుకు యాజమాన్యాలతో హియరింగ్ నిర్వహించనుంది. బుధవారం మరో 31 కాలేజీల ఫీజులను కూడా ఖరారు చేయనుంది. కోర్టును ఆశ్రయించి యాజమాన్య ప్రతిపాదిత ఫీజు అమలుకు ఉత్తర్వులు పొందిన 81 కాలేజీల ఫీజులను ఖరారు చేయనుంది. దీంతో యాజమాన్య ప్రతిపాదిత ఫీజు కాకుండా, ఏఎఫ్ఆర్సీ ఖరారు చేసే ఫీజుతో ప్రవేశాలను చేపట్టనున్నారు. మరోవైపు కోర్టుకు వెళ్లని 108 కాలేజీల ఫీజులను కూడా వచ్చే పది రోజుల్లోగా ఖరారు చేయాలన్న నిర్ణయానికి వచ్చింది. ఈ 108 కాలేజీల్లో రూ.50 వేల లోపు వార్షిక ఫీజు ఉన్న కాలేజీలకు 20 శాతం, రూ.50 వేల కంటే ఎక్కువ ఫీజు ఉన్న కాలేజీలకు 15 శాతం ఫీజులను తాత్కాలికంగా పెంచేందుకు ఏఎఫ్ఆర్సీ యాజమాన్యాలతో సమావేశమై ప్రతిపాదించింది. వీటికి ఒప్పుకుంటే ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహిస్తామని సూచించింది. తర్వాత కాలేజీ వారీగా, ఆదాయ వ్యయాల ఆధారంగా పూర్తి స్థాయి ఫీజును ఖరారు చేస్తామని వెల్లడించింది. ఇందుకు మెజారిటీ యాజమాన్యాలు అంగీకరించాయి. దీనిపై ఏఎఫ్ఆర్సీ ప్రభుత్వానికి నివేదిక కూడా పంపించింది. అయితే ఇప్పుడు తాత్కాలికంగా 15 శాతం, 20 శాతం ఫీజులను పెంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తే విద్యార్థులు ఈ ఫీజుల ప్రకారమే కాలేజీల్లో చేరుతారు. ఆ తర్వాత పూర్తి స్థాయి ఫీజు ఖరారు చేసినప్పుడు, ప్రస్తుతం ఇచ్చిన 15–20 శాతం పెంపునకు మించి పూర్తిస్థాయి ఫీజులో కాలేజీల ఆదాయ వ్యయాల ఆధారంగా పెంపుదల వస్తే గందరగోళం తలెత్తుతుందన్న ఆలోచన ఏఎఫ్ఆర్సీ వర్గాల్లో వచ్చింది. ఈ నెల 5 వరకు ఇంజనీరింగ్ ప్రవేశాల వెబ్ ఆప్షన్లను ప్రవేశాల కమిటీ వాయిదా వేసింది. కాబట్టి 6 నుంచి వెబ్ ఆప్షన్లను ప్రారంభించినా 10 వరకు గడువు ఇవ్వాల్సి ఉంటుంది. ఈలోగా అన్ని కాలేజీలకు పూర్తి స్థాయి ఫీజులను ఖరారు చేసి, కాలేజీ వారీ ఫీజులను విద్యార్థులకు అందుబాటులో ఉంచే లక్ష్యంతో ముందుకుసాగుతోంది.

### అప్పీల్ కోరితే రూ. లక్ష

వాసవి, శ్రీనిధి కాలేజీల ఫీజులపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో.. ఏఎఫ్ఆర్సీ ఖరారు చేసిన ఫీజులను సవాల్ చేస్తూ అప్పీల్‌కు వెళ్లే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో ఏఎఫ్ఆర్సీ ఖరారు చేసిన ఫీజులను రివ్యూ చేయాలంటే మళ్లీ ఏఎఫ్ఆర్సీకే అప్పీల్ చేసుకోవాలి. అందుకు రూ.లక్ష అప్పీల్ ఫీజుగా ఏఎఫ్ఆర్సీ నిర్ణయించింది. సోమవారం జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో కచ్చితంగా ఉండే కాలేజీలు మాత్రమే అప్పీల్‌కు వచ్చే అవకాశం ఉంటుందని భావిస్తోంది.

**టాప్ కాలేజీల ప్రతినిధులు హాజరు..**

ఇంజనీరింగ్ ఫీజుల ఖరారు కోసం ఏఎఫ్ఆర్సీ చేపట్టిన హియరింగ్‌కు సోమవారం టాప్ కాలేజీల ప్రతినిధులు ఏఎఫ్ఆర్సీ కార్యాలయానికి వచ్చారు. కాలేజీల ఆదాయ వ్యయాలను బట్టి ఏఎఫ్ఆర్సీ ఫీజులను ఖరారు చేసింది. వాటిపై యాజమాన్యాల అభ్యంతరాలను స్వీకరించింది. సంప్రదింపుల తర్వాత ఆయా కాలేజీల ఫీజులను ఖరారు చేసింది. సోమవారం వర్ధమాన్, సీబీఐటీ, అనురాగ్, వాసవి తదితర కాలేజీల యా జమాన్య ప్రతినిధులు హాజరయ్యారు. అనురా గ్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ తరఫున పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. విచారణకు హాజరైన కొన్ని కాలేజీల యాజమాన్య ప్రతినిధులు మంగళ, బుధవారాల్లో మళ్లీ వస్తామని గడువు కోరారు.

## ఇంజనీరింగ్‌లో 91,988 సీట్లు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో 91,998 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. యూనివర్సిటీలు అనుబంధ గుర్తింపునిచ్చిన కాలేజీలు, సీట్ల సంఖ్యను ఉన్నత విద్యా మండలి ఖరారు చేసింది. ఈనెల 5 తర్వాత వెబ్‌ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో యూనివర్సిటీలు ఇచ్చిన అనుబంధ గుర్తింపు పొందిన కాలేజీల జాబితాను ప్రవేశాల క్యాంపు కార్యాలయానికి ఉన్నత విద్యా మండలి పంపించింది. మొత్తంగా ఈసారి 183 ఇంజనీరింగ్ కాలేజీల్లో 91,988 సీట్లు అందుబాటులోకి రానున్నాయి. ఇందులో 14 ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీల్లోని 3,055 సీట్లు పోగా, ప్రైవేటు కాలేజీల్లో 88,933 సీట్లు అందుబాటులోకి రానున్నాయి. ప్రైవేటు కాలేజీల్లోని 70 శాతం, ప్రభుత్వ కాలేజీల్లోని 100 శాతం సీట్లు కలుపుకొని మొత్తంగా 65,308 సీట్లు కన్వీనర్ కోటాలో అందుబాటులోకి రానున్నాయి. 30 శాతం మేనేజ్‌మెంట్ కోటాలో 26,680 సీట్లు ఉండనున్నాయి. ఇంజనీరింగ్‌లో గతేడాది సీట్లతో పోల్చితే ఈసారి 15 కాలేజీలు తగ్గిపోగా, 3,247 సీట్లు తగ్గిపోయాయి.

**వర్సిటీల వారీగా రానున్న సీట్లు..**

| యూనివర్సిటీ | కాలేజీలు | సీట్లు |
|---|---|---|
| జేఎన్‌టీయూ | 157 | 81,009 |
| కేయూ | 8 | 2,565 |
| మహాత్మాగాంధీ | 1 | 180 |
| ఓయూ | 15 | 8,180 |
| అగ్రికల్చర్ యూనివర్సిటీ | 2 | 54 |

# అర్బన్‌పై టీఆర్ఎస్ నజర్!

**సభ్యత్వ నమోదుతోపాటే మునిసిపాలిటీల్లో ప్రచారం**

- గెలుపుగుర్రాల ఎంపిక బాధ్యత ఇన్‌చార్జీలకే
- పట్టణం, వార్డుల వారీగా ఔత్సాహికుల జాబితా
- స్థానిక పరిస్థితులపై పార్టీ ఇన్‌చార్జీల నివేదిక
- హుజూర్‌నగర్‌లో వలసల వ్యూహంపై యోచన

**సాక్షి, హైదరాబాద్:** పురపాలక సంఘాల పదవీకాల పరిమితి మంగళవారంతో ముగియనుండటంతో.. మునిసిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. రాష్ట్రంలోని 138 మున్సిపాలిటీలు, వాటి పరిధిలోని 3,300కు పైగా వార్డులకు జూలై నెలాఖరులోగా ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. మరో 15 రోజుల్లో మున్సిపాలిటీలు, వార్డుల వారీగా ఓటరు జాబితా, రిజర్వేషన్ల ఖరారు వంటి అంశాలు కొలిక్కిరానున్నాయి. ఆ వెంటనే మునిసిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మెజారిటీ మున్సిపాలిటీ పాలక కమిటీలను తమ ఖాతాలో వేసుకునేందుకు అధికార టీఆర్ఎస్ పావులు కదుపుతోంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్ష విజయాన్ని సాధించిన టీఆర్ఎస్.. మునిసిపల్ ఎన్నికల్లోనూ సత్తా చాటేందుకు సన్నద్ధమవుతోంది. ఈ దిశగా పార్టీ యంత్రాంగాన్ని ముందస్తుగా సన్నద్ధం చేసేందుకు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని నిర్ణయించింది. జూన్ 24న పార్టీ అధినేత కేసీఆర్ టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించగా.. జూన్ 30న పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. సభ్యత్వ నమోదు ఇన్‌చార్జీలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో సభ్యత్వ నమోదు, పార్టీ కమిటీల నిర్మాణంపై నియోజకవర్గ ఇన్‌చార్జీలకు దిశానిర్దేశం చేసిన కేటీఆర్.. మునిసిపల్ ఎన్నికల సన్నద్ధతపైనా పలు సూచనలు చేశారు.



**సభ్యత్వ నమోదుతో పాటు ప్రచార కార్యక్రమాలు**

జూలై 10 నాటికి పార్టీ సభ్యత్వాల సేకరణ కార్యక్రమాన్ని పూర్తి చేసి, 20వ తేదీలోగా గ్రామ, మండల, పట్టణ, వార్డు కమిటీల నిర్మాణం పూర్తి చేసేలా షెడ్యూల్ రూపొందించారు. అయితే మునిసిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మునిసిపాలిటీలు, వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిందిగా పార్టీ ఇన్‌చార్జీలను కేటీఆర్ ఆదేశించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మునిసిపాలిటీల్లో వార్డుల వారీగా సమావేశాలు నిర్వహించడంతో పాటు.. వివిధ వర్గాలతో ఇన్‌చార్జీలు ప్రత్యేకంగా భేటీ అవుతారు. ఓవైపు వార్డు స్థాయి సమావేశాల్లో పాల్గొంటూనే.. స్థానికంగా పార్టీ పరిస్థితి, క్రియాశీలంగా పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తల వివరాలను సేకరించి క్రోడీకరించే బాధ్యతను సభ్యత్వ నమోదు ఇన్‌చార్జీలకు అప్పగించారు. జూలై రెండోవారంలోగా మునిసిపాలిటీ చైర్మన్లు, వార్డు సభ్యుల స్థానాల రిజర్వేషన్లు ఖరారు కానుండటంతో.. రిజర్వేషన్లకు అనుగుణంగా ఔత్సాహిక అభ్యర్థుల వివరాలను కూడా సేకరించాలని నిర్ణయించారు.

### హుజూర్‌నగర్‌పై ప్రత్యేక దృష్టి

మునిసిపల్ ఎన్నికలతో పాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్, హుజూర్‌నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికలకూ పార్టీ యంత్రాంగాన్ని సన్నద్ధం చేసేందుకు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని టీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. నల్లగొండ ఎంపీగా కాంగ్రెస్ తరపున పోటీ చేసిన గెలుపొందిన ఉత్తమ్‌కుమార్ రెడ్డి.. హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా రాజీనామా చేశారు. దీంతో హుజూర్‌నగర్ శాసనసభ స్థానానికి ఉపఎన్నిక నోటిఫికేషన్ త్వరలో వెలువడే అవకాశం ఉంది. పార్టీ ఆవిర్భావం నుంచి ఒక్కసారి కూడా ఇక్కడి నుంచి టీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించ లేదు. దీంతో ఉప ఎన్నిక నాటికి టీఆర్ఎస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ఇతర పార్టీల నుంచి వలసల వ్యూహాన్ని అమలు చేసే యోచనలో పార్టీ నేతలు ఉన్నారు. పార్టీ సభ్యత్వ నమోదులో భాగంగా వలస నేతలకు పార్టీ కమిటీల్లో ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం.


మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు, సంబంధీకులు

# లోయలో పడిన బస్సు.. 35 మంది మృతి

- జమ్మూ కశ్మీర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
- 17 మందికి గాయాలు
- మోదీ, షా సంతాపం

**జమ్మూ:** జమ్మూ కశ్మీర్‌లోని కిస్తవర్ జిల్లాలో సోమవారం ఓ మినీబస్సు లోయలో పడింది. ఈ ఘటనలో 35 మంది మృతి చెందగా, 17 మంది గాయపడ్డారని సీనియర్ సూపరింటెండెంట్ పోలీసు శక్తి పాతక్ తెలిపారు. మరణించిన 35 మందిలో 13 మంది మహిళలే. వారిలో 45 రోజుల పసికందుతోపాటు ముగ్గురు టీనేజర్లు సాజన్ శర్మ (18), వసీమ్ రాజా (18), షజియా (19)లు ఉన్నారు. కేష్వాన్ నుంచి కిస్తవర్ వెళుతున్న బస్సు సోమవారం ఉదయం 7:30 గంటలకు అదుపు తప్పి పల్టీలు కొట్టుకుంటూ లోయలోకి పడిపోయింది. బస్సు సామర్థ్యం 28 కాగా, అందులో 52 మంది ఉన్నట్లు జిల్లా డిప్యూటీ కమిషనర్ ఏఎస్ రాణా తెలిపారు. పోలీసులు, రక్షణ బలగాలు, స్థానికులు కలిసి బస్సులోని వారిని బయటకు తీశారు. ఎంఐ–17 హెలికాప్టర్ల ద్వారా బాధితులను ఆస్పత్రికి తరలించారు. అందులో తొమ్మిది మందికి జమ్మూ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**విచారం వ్యక్తం చేసిన నేతలు..**

ప్రమాదంపై జమ్మూ కశ్మీర్ గవర్నర్ సత్యప్రకాశ్ మాలిక్ విచారం వ్యక్తం చేశారు. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఇలాంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో 32 మంది మృతి చెందడం హృదయ విదారకమని ప్రధాని మోదీ అన్నారు. మృతిచెందిన వారి కోసం దేశమంతా రోదిస్తోందని అన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా రోడ్డు ప్రమాద వార్త వినగానే విచారానికి లోనయ్యానని అన్నారు. గాయాలపాలైన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వీరితోపాటు ఒమర్ అబ్దుల్లా, ఫరూక్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తి, గులాం నబీ ఆజాద్, గులామ్ అహ్మద్ మిర్, ఎంవై తరిగమిలు కూడా ప్రమాదం పట్ల విచారం వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు రవీందర్ రైనా మాట్లాడుతూ పర్వత ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ గురించి ఈ ప్రమాదం ప్రశ్నలను లేవనెత్తుతోందని అన్నారు. దీనిపై ఉన్నత స్థాయి కమిటీ వేసి విచారణ జరపాలని కోరారు.

## ఇనుప కంచెలు నిర్మించాలి: ఐఆర్‌ఎఫ్

సురక్షిత రోడ్డు ప్రయాణం కోసం కృషి చేస్తున్న జెనీవాలోని ఇంటర్నేషనల్ రోడ్ ఫెడరేషన్ (ఐఆర్‌ఎఫ్) సంస్థ ఈ ప్రమాదంపై స్పందించింది. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపింది. పర్వత ప్రాంతాలైన జమ్మూ కశ్మీర్, ఉత్తరాఖండ్, ఈశాన్య రాష్ట్రాలలో రోడ్డు ప్రమాదాలను నివారించాలని ప్రభుత్వాన్ని కోరింది. అధునాతన సాంకేతికతను ఉపయోగించి ప్రమాదాల శాతాన్ని తగ్గించాలని ఐఆర్‌ఎఫ్ ప్రెసిడెంట్ ఎమిరిటస్ కేకే కపిల అన్నారు. వాహనాల్లో జీపీఎస్‌ను అమర్చడంతో పాటుగా లోయ ఉన్న వైపు దృఢమైన ఇనుప కంచె నిర్మించాలన్నారు. భారత్‌లో 2017లో రోడ్డు ప్రమాదాల్లో 1.46 లక్షల మంది మృతి చెందారు.

# కర్ణాటక సర్కారుకు షాక్

## ప్రమాదంలో కాంగ్రెస్‌-జేడీఎస్ ప్రభుత్వం

- ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల రాజీనామా
- సిద్దరామయ్య ఇంట్లో కాంగ్రెస్ నేతల అత్యవసరభేటీ
- కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీజేపీ బ్లాక్‌మెయిల్ చేస్తోందని ఆగ్రహం
- సంకీర్ణ ప్రభుత్వం తనంతటతానుగా కూలిపోతుంది: యడ్యూరప్ప

**సాక్షి, బెంగళూరు:** కర్ణాటకలో దినదినగండంగా కొన సాగుతున్న కాంగ్రెస్–జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వానికి షాక్ తగిలింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆనంద్ సింగ్ (విజయనగర), రమేశ్ జార్కిహోళి (గోకాక్)లు తమ పదవులకు, పార్టీకి సోమవారం రాజీనామా సమర్పించారు. కర్ణాటక స్పీకర్ రమేశ్ ఇంటికి వెళ్లిన ఆనంద్ సింగ్ రాజీనామా సమర్పించగా, రమేశ్ జార్కిహోళి ఫ్యాక్స్ ద్వారా రాజీనామా లేఖను పంపారు. ఈ సందర్భంగా రాజ్‌భవన్‌కు వెళ్లిన ఆనంద్ సింగ్ గవర్నర్ వజూభాయ్‌వాలాకు కూడా రాజీనామాను అందజేశారు. దీంతో అప్రమత్తమైన కాంగ్రెస్ నేతలు మాజీ సీఎం సిద్దరామయ్య ఇంట్లో అత్యవసరంగా సమావేశమయ్యారు. బీజేపీ తమ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం కుమారస్వామి అమెరికాలో పర్యటిస్తున్న నేపథ్యంలో ఇద్దరు ఎమ్మెల్యేలు సంకీర్ణ ప్రభుత్వాన్ని వీడటం గమనార్హం.

**డిమాండ్లు ఒప్పుకోనందుకే..**

ఈ సందర్భంగా ఆనంద్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ..'నిజమే.. నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా సమర్పించాను. విజయనగర జిల్లాను ఏర్పాటుచేయడం, జేఎస్‌డబ్ల్యూ కంపెనీకి బళ్లారి జిల్లాలో 3,667 ఎకరాలు అమ్మేందుకు ఇచ్చిన అనుమతుల్ని రద్దుచేయాలన్న నా డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చలేదు. ఒకవేళ ఈ డిమాండ్లకు ప్రభుత్వం అంగీకరిస్తే, నా రాజీనామాపై పునరాలోచిస్తా' అని స్పష్టం చేశారు. అయితే తనపై రిసార్టులో దాడిచేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యే జె.ఎన్.గణేశ్‌పై సస్పెన్షన్ ఎత్తివేయడంతో ఆనంద్‌సింగ్ రాజీనామా చేసినట్లు ఆయన సన్నిహితవర్గాలు చెప్పాయి. మరో తిరుగుబాటు ఎమ్మెల్యే రమేశ్ జార్కి హోళి స్పందిస్తూ..' మంగళవారం అమావాస్య కాబట్టి ఈరోజు(సోమవారం) నా రాజీనామాను స్పీకర్‌కు ఫ్యాక్స్ ద్వారా పంపాను. రేపు ఉదయం వ్యక్తిగతంగా కలిసి రాజీనామా సమర్పిస్తాను' అని చెప్పారు. మరికొంత మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా పార్టీకి రాజీనామా చేయబోతున్నారా? అన్న మీడియా ప్రశ్నకు.. 'మీకు ప్లాన్ మొత్తం చెప్పేస్తే ఎలా? వేచిచూడండి' అని జవాబిచ్చారు. కాగా, ఆనంద్ సింగ్ రాజీనామా లేఖ తమకు అందిందనీ, నిబంధనల మేరకు ఈ విషయంలో చర్యలు తీసుకుంటామని స్పీకర్ కార్యాలయం తెలిపింది.

**కాంగ్రెస్ నేతల అత్యవసర భేటీ**

ఇద్దరు ఎమ్మెల్యేల రాజీనామా చేయడంతో కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. ఆ పార్టీ సీనియర్ నేతలు డిప్యూటీ సీఎం జి.పరమేశ్వర, మంత్రి డి.కె.శివకుమార్, కేపీసీసీ అధ్యక్షుడు దినేశ్ గుండూరావు మాజీ సీఎం సిద్దరామయ్య ఇంటిలో అత్యవసరంగా భేటీ అయ్యారు. పార్టీని ఎమ్మెల్యేలు ఎవరూ వీడకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం గుండూరావు మీడియాతో మాట్లాడుతూ..'మా ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. బీజేపీ అగ్రనేతలు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ, కేంద్ర సంస్థల ద్వారా మా ఎమ్మెల్యేలను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. ఎన్నికుట్రలు చేసినా ఐదేళ్ల పాటు కాంగ్రెస్–జేడీఎస్ సంకీర్ణ సర్కారు కొనసాగుతుంది' అని స్పష్టం చేశారు కర్ణాటకలో రాజకీయ పరిస్థితుల్ని తాను గమనిస్తున్నాననీ, తమ ప్రభుత్వాన్ని కూల్చాలని బీజేపీ పగటి కలలు కంటోందని సీఎం కుమారస్వామి ఎద్దేవా చేశారు. అయితే కాంగ్రెస్–జేడీఎస్ కూటమిలో తీవ్రమైన అసంతృప్తి ఉందనీ, ప్రభుత్వం దానంతట అదే కూలిపోతుందని రాష్ట్ర బీజేపీ చీఫ్ బీఎస్ యడ్యూరప్ప జోస్యం చెప్పారు.


రాజీనామా పత్రాన్ని చూపిస్తున్న ఆనంద్ సింగ్

**అసెంబ్లీలో బలాబలాలు..**

కాంగ్రెస్ పార్టీకి 77 మంది, జేడీఎస్‌కు 37 మందితో పాటు ముగ్గురు స్వతంత్రులు కలిపి కర్ణాటక అసెంబ్లీలో అధికార కూటమికి 117 స్థానాలు ఉన్నాయి. అయితే ఆనంద్ సింగ్, రమేశ్ రాజీనామాతో ఆ బలం 115కు పడిపోయింది. ఇప్పుడు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే కావాల్సిన ఎమ్మెల్యేల సంఖ్య 113కు తగ్గింది. ప్రస్తుతం బీజేపీకి 105 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్–జేడీఎస్ కూటమి నుంచి మరో 9 మంది ఎమ్మెల్యేను ఆకర్షించే దిశగా బీజేపీ పావులు కదుపుతోంది.

# ప్రైవేట్ స్కూళ్లలో పేదలకు 25% సీట్లు

- తప్పనిసరిగా ప్రవేశాలు కల్పించాలన్న కేంద్రం
- బౌన్సర్లతో రుణ వసూళ్ల అధికారం బ్యాంకులకు లేదు
- లోక్‌సభలో ప్రభుత్వం స్పష్టీకరణ



**న్యూఢిల్లీ:** దేశంలోని అన్ని ప్రైవేట్, ప్రత్యేక కేటగిరీ పాఠశాలల్లో 25 శాతం సీట్లను బలహీన వర్గాల వారి పిల్లలకు కేటాయించాలని కేంద్రం రాష్ట్రాలకు స్పష్టం చేసింది. బాలలకు ఉచిత, నిర్బంధ విద్య చట్టం–2010 ప్రకారం..ప్రాథమికోన్నత స్థాయి విద్య 6–14 ఏళ్ల మధ్య పిల్లలందరి ప్రాథమిక హక్కని తెలిపింది. అదేవిధంగా బౌన్సర్ల నియమించుకుని బలవంతంగా రుణ వసూళ్లు చేపట్టే అధికారం ఏ బ్యాంకుకూ లేదని తెలిపింది. మానవ వనరుల శాఖ మంత్రి రమేశ్ పొఖ్రియాల్ నిశాంక్ సోమవారం లోక్‌సభలో మాట్లాడుతూ.. అన్ని ప్రైవేట్ ఎయిడెడ్, అన్ ఎయిడెడ్, స్పెషల్ కేటగిరీ పాఠశాలల్లో ఒకటి, అంతకంటే తక్కువ తరగతులకు చేపట్టే ప్రవేశాల్లో ఆ తరగతిలోని కనీసం 25 శాతం సీట్లను బలహీన, వెనుకబడిన వర్గాల వారి పిల్లలకు ఇవ్వాలి. ఆ తరగతి పూర్తయ్యే వరకు వారికి ఉచితంగా విద్య అందించాలి' అని ఆయన కోరారు. 'ఆ చిన్నారుల కయ్యే ఖర్చును ప్రభుత్వమే చెల్లిస్తుంది. రాష్ట్రం నిర్ణయించిన ఫీజు ప్రకారం, లేదా వాస్తవంగా ఒక్కో చిన్నారి నుంచి వసూలు చేసే ఫీజు.. ఏది తక్కువైతే అందుకు సరిసమానమైన మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తుంది' అని తెలిపారు. ప్రభుత్వం నుంచి భూమి, వసతి, పరికరాలను ఉచితంగా గానీ లేదా తక్కువ ధరకుగానీ పొంది 25 శాతం మంది చిన్నారులకు రిజర్వేషన్ ప్రకారం ఉచిత విద్య అందిస్తున్న పాఠశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉండదని తెలిపారు.

**బౌన్సర్లతో వసూళ్లు వద్దు:**

బలవంతంగా రుణాలను వసూలు చేసుకునేందుకు గాను ఏ బ్యాంక్‌కు కూడా బౌన్సర్లను నియమించుకునే అధికారం లేదని ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ప్రకటించారు. 'ఆమోదించిన మార్గదర్శకాల మేరకే రుణ వసూళ్లు చేపట్టాలి. రుణ గ్రహీతపై దౌర్జన్యం చేయడం, ఇబ్బందులు పెట్టడాన్ని ఆర్‌బీఐ నిషేధించింది. పోలీసుల ధ్రువీకరణ, అవసరమైన ఇతర అర్హతలు పొందిన తర్వాత మాత్రమే బ్యాంకులు రికవరీ ఏజెంట్లను నియమించుకునేందుకు ఆర్‌బీఐ వీలు కల్పించింది' అని తెలిపారు.

**టీచర్స్ కోటా బిల్లుకు ఆమోదం**

కేంద్ర విద్యాసంస్థలు (టీచర్స్ కేడర్ బిల్లు–2019) బిల్లును సోమవారం లోక్‌సభ ఆమోదించింది. దేశవ్యాప్తంగా 41 సెంట్రల్ యూనివర్సిటీల్లో 8వేల పోస్టుల భర్తీకి అమలయ్యే రిజర్వేషన్ల విషయంలో డిపార్టుమెంట్‌ను యూనిట్‌ను కాకుండా యూనివర్సిటీని యూనిట్‌గా పరిగణించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. దీంతోపాటు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఇటీవల ప్రభుత్వం తెచ్చిన చట్టం కూడా అమలవుతుంది. ఈ బిల్లు చట్ట రూపం దాల్చితే ఆర్డినెన్స్ స్థానంలో అమలవుతుంది.

## కశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన మరో ఆరు నెలలు



**న్యూఢిల్లీ:** జమ్మూ కశ్మీర్‌లో రాష్ట్రపతి పాలనను మరో ఆరు నెలలు పొడిగించేందుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఈ నెల 3వ తేదీ నుంచి అమల్లోకి రానున్న ఈ పొడిగింపు ప్రతిపాదనకు ఇటీవలే లోక్‌సభ అంగీకారం తెలిపింది. ఈ ఏడాది చివర్లో కశ్మీర్‌లో ఎన్నికలు జరపాలని భావిస్తున్నందున రాష్ట్రపతి పాలనను పొడిగించడం తప్ప తమకు మరో ప్రత్యామ్నాయం లేదని ఈ సందర్భంగా హోం మంత్రి అమిత్ షా రాజ్యసభకు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలను ప్రభుత్వం ఆలస్యం చేస్తోందంటూ ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలకు ఆయన బదులిస్తూ.. గతంలో ఎన్నడూ రంజాన్ మాసం (మే 7–జూన్4)లో రాష్ట్రంలో ఎన్నికలు జరపలేదన్నారు. అదేవిధంగా, జూన్ 30 నుంచి ఆగస్టు 15 వరకు అమర్‌నాథ్ యాత్ర సాగుతోందని తెలిపారు. రాష్ట్రంలో 2018 డిసెంబర్ 20వ తేదీ నుంచి రాష్ట్రపతి పాలన కొనసాగుతోంది. ఈ సందర్భంగా హోం మంత్రి అమిత్ షా.. కశ్మీర్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఉన్న ప్రజలకు ఉద్యోగాలు, ప్రమోషన్లు, ప్రవేశాల్లో రిజర్వేషన్లు కల్పించే బిల్లును సభలో ప్రవేశపెట్టారు. 2030 కల్లా దేశంలోని ప్రజలందరికీ సురక్షిత నీటిని అందించాలన్న లక్ష్యాన్ని 2024 సంవత్సరానికి కుదించినట్లు జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ రాజ్యసభకు తెలిపారు. ఐక్యరాజ్యసమితి తీర్మానానికి లోబడే ఈ చర్య తీసుకున్నామన్నారు. నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న జిల్లాల్లో వృథా జలాన్ని శుద్ధిచేసి వాడుకునే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. నీటి కొరతను నివారించే విషయంలో రాష్ట్రాలతో కలిసి పనిచేస్తున్నట్లు వివరించారు.

## పీవోకేలో మీకు పనేంటి?

**మాజీ 'రా' అధికారిపై సుప్రీంకోర్టు ఆగ్రహం**

**పిల్ కొట్టివేత.. రూ.50,000 జరిమానా**



**న్యూఢిల్లీ:** భారత నిఘా సంస్థ రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్(రా)కు చెందిన ఓ మాజీ అధికారిపై సుప్రీంకోర్టు సోమవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)తో పాటు గిల్గిత్‌ను లోక్‌సభ స్థానాలుగా ప్రకటించేలా కేంద్రాన్ని ఆదేశించాలని దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని(పిల్) కొట్టివేయడంతో పాటు భారీ జరిమానా విధించింది. 'రా' మాజీ అధికారి రామ్‌కుమార్ యాదవ్ ఈ పిల్‌ను దాఖలు చేశారు. గిల్గిత్, పీవోకేలు భారత్‌లో అంతర్భాగమని రామ్‌కుమార్ తెలిపారు. కాబట్టి ఈ రెండు ప్రాంతాలను భారత్‌లో అంతర్భాగంగా ప్రకటించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. దీంతో సీజేఐ జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ దీపక్ గుప్తా, జస్టిస్ అనిరుద్ధ బోస్‌ల ధర్మాసనం స్పందిస్తూ..'దీన్ని పిల్ అంటారా? మీరు(రామ్‌కుమార్) ఢిల్లీలో ఉంటున్నారు. పీవోకేలో మీకు ఉన్న ప్రయోజనాలేంటి? ఈ పిటిషన్ ఎంతమాత్రం విచారణార్హం కాదు. దీన్ని మేం విచారించబోం' అంటూ కొట్టివేసింది. ఇలాంటి పిటిషన్‌తో కోర్టు సమయాన్ని వృథా చేసినందుకు రూ.50,000 జరిమానా విధించింది.

**అగ్రవర్ణాలకు రిజర్వేషన్‌పై విచారణ..**

అగ్రవర్ణాల పేదల(ఈడబ్ల్యూఎస్)కు విద్య, ఉద్యోగాల్లో కేంద్ర ప్రభుత్వం 10 రిజర్వేషన్ కల్పించడాన్ని సవాలుచేస్తూ దాఖలైన అన్ని పిటిషన్లను జూలై 30 నుంచి విచారిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది.

## రాహుల్‌కు బుజ్జగింపులు

- కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగాలి: గహ్లోత్
- రాహుల్‌ను కలిసిన ఐదుగురు కాంగ్రెస్ సీఎంలు


మీడియాతో మాట్లాడుతున్న గహ్లోత్. చిత్రంలో అమరీందర్, కమల్‌నాథ్

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేసే విషయంలో పట్టువదలని విక్రమార్కుడిలా ఉన్న రాహుల్ గాంధీని బుజ్జగించేందుకు సోమవారం కాంగ్రెస్ ముఖ్యమంత్రులంతా రంగంలోకి దిగారు. రాజస్తాన్, పంజాబ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, పుదుచ్చేరిల సీఎంలు వరుసగా అశోక్ గహ్లోత్, అమరీందర్ సింగ్, కమల్‌నాథ్, భూపేశ్ బఘేల్, వి.నారాయణస్వామిలు రాహుల్‌ను ఢిల్లీలో కలిశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఘోర ఓటమిపై వారు దాదాపు రెండు గంటలపాటు చర్చించి, తమ అభిప్రాయాలను పంచుకున్నారు. పార్టీ అధ్యక్షుడిగా కొనసాగాల్సిందిగా రాహుల్‌ను వారంతా అభ్యర్థించారు. భేటీ అనంతరం గహ్లోత్ మాట్లాడుతూ 'మేమంతా రాహుల్‌తో మనసువిప్పి మాట్లాడుకున్నాం. పార్టీ కార్యకర్తల అభిప్రాయాల గురించి కూడా రాహుల్‌కు వివరించాం. పార్టీ అధ్యక్షుడిగా కొనసాగాలని కోరాం. ఆయన మా విన్నపాన్ని మన్నిస్తారని ఆశిస్తున్నాం. ప్రస్తుత పరిస్థితుల్లో రాహుల్ మాత్రమే పార్టీని నడిపించగలరని గట్టిగా నమ్ముతున్నాం' అని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయానికి బాధ్యత వహిస్తూ పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నానని రాహుల్ చెప్పడం, అప్పటి నుంచి కాంగ్రెస్ నేతలు ఆయనను బుజ్జగిస్తుండటం తెలిసిందే. ఇటీవలే 150 మంది కాంగ్రెస్ నాయకులు కూడా ఓటమికి తమదే బాధ్యత అంటూ రాజీనామా చేయడం తెలిసిందే.

## ఆగస్టులో ప్రయోగాత్మక జనగణన

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ ఏడాది ఆగస్టు 12–సెప్టెంబర్ 30 మధ్య ప్రయోగాత్మక జనగణన చేపట్టనున్నట్లు కేంద్రం తెలిపింది. దేశ జనగణన చరిత్రలోనే మొట్టమొదటిసారిగా ఈసారి మొబైల్ యాప్ ద్వారా జనాభా లెక్కలను సేకరించనున్నట్లు రిజిస్ట్రార్ జనరల్, జనగణన కమిషనర్ వివేక్ జోషి తెలిపారు. ఇందుకు అనుగుణంగా ఎన్యుమరేటర్లు మొబైల్ ఫోన్‌ను వెంట తీసుకువెళతారని ఆయన వివరించారు. 2021 జనగణనకు మంచుకురిసే జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు రిఫరెన్స్ తేదీ అక్టోబర్ 1, 2020 కాగా ఇతర రాష్ట్రాలకు మార్చి 1, 2021గా పరిగణిస్తారన్నారు. 2021 జనగణన ప్రపంచంలోనే అతిపెద్దది కానుందన్నారు. 33 లక్షల మంది ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరిగి వివరాలను సేకరిస్తారన్నారు. జన సంఖ్యతోపాటు పథకాలు రూపకల్పన, అమలుకు సాయపడే సామాజిక–ఆర్థిక స్థితిగతులు కూడా వెల్లడవుతాయన్నారు. కాగా, 2021 వాస్తవ జన గణన మొదటి విడత 2020 ఏప్రిల్ –సెప్టెంబర్ మధ్యలో చేపట్టే వెసులుబాటు రాష్ట్రాలకు ఉంది. రెండో విడత జనాభా లెక్కలను 2021 ఫిబ్రవరి 9–28 తేదీల మధ్య సేకరిస్తారు. సవరించిన లెక్కలను మార్చి 1–5 తేదీల మధ్య తీసుకుంటారు. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో జనాభా లెక్కలను వచ్చే ఏడాది సెప్టెంబర్ 11–30 తేదీల మధ్య చేపడతారు. మళ్లీ అక్టోబర్ 1–5 తేదీల్లో సవరించిన లెక్కలు తీసుకుంటారు.


బ్రిటిష్ పాలన నుంచి చైనా ఆధిపత్యంలోకి వచ్చి 22 ఏళ్లు నిండిన సందర్భంగా ప్రజలు సోమవారం భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం మాస్కులు ధరించిన ఆందోళనకారులు హాంకాంగ్ పార్లమెంట్‌లోకి చొచ్చుకెళ్లారు. నేతల చిత్రాలను చించివేసి, బ్రిటిష్ జెండాను ఎగురవేశారు. పోలీసులు లాఠీచార్జి, టియర్‌గ్యాస్ ప్రయోగంతో వారిని చెదరగొట్టారు.

## భార్యాపిల్లలను చంపిన సైకో

**గురుగ్రామ్‌లో హైదరాబాదీ కంపెనీ ఉద్యోగి ఘాతుకం**

**గురుగ్రామ్:** హరియాణాలోని గురుగ్రామ్‌లో దారుణం చోటుచేసుకుంది. హైదరాబాద్‌లోని ఓ ఫార్మా కంపెనీకి చెందిన ఉద్యోగి ప్రకాశ్ సింగ్(55) తన భార్యాపిల్లలను సుత్తి, కత్తితో వెంటాడి కిరాతకంగా హత్యచేశాడు. అనంతరం ఫ్యానుకు ఉరివేసుకుని తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ దుర్ఘటనలో ప్రకాశ్ భార్య సోనూ(50), అదితి(22), ఆదిత్య(13)లు ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. ఇంట్లో అలికిడి లేకపోవడంతో ఇరుపొరుగువారు సమాచారం అదించడంతో దారుణం వెలుగులోకి వచ్చిందన్నారు. తొలుత సుత్తితో భార్యాపిల్లలపై దాడిచేసిన ప్రకాశ్, అనంతరం కత్తితో గొంతుకోసి హత్య చేశాడని వెల్లడించారు. ఓ టీవీ క్రైమ్ షో స్ఫూర్తితో ప్రకాశ్ ఈ దారుణానికి తెగబడ్డాడనీ, ఇంట్లోవాళ్లు పారిపోకుండా మెయిన్‌డోర్‌కు ముందుగానే తాళం వేశాడని పేర్కొన్నారు. 'ఈ కుటుంబాన్ని నేను భరించలేకపోతున్నా. అందుకే భార్యపిల్లలను చంపేశా' అని ప్రకాశ్ సూసైడ్‌నోట్‌లో రాశాడన్నారు.

## జిందాల్‌పై అభియోగాలు నమోదుచేయండి

**దర్యాప్తు సంస్థకు ఢిల్లీకోర్టు ఆదేశం**



**న్యూఢిల్లీ:** బొగ్గు బ్లాకుల కేటాయింపు కుంభకోణానికి సంబంధించిన కేసులో పారిశ్రామికవేత్త నవీన్ జిందాల్, మరో నలుగురిపై అభియోగాలు నమోదు చేయాలని ప్రత్యేక కోర్టు సోమవారం దర్యాప్తు సంస్థను ఆదేశించింది. జిందాల్‌తో పాటు మరో నలుగురిపై భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 420 (చీటింగ్), 120–బి (క్రిమినల్ కుట్ర) కింద అభియోగాలు మోపాలని ప్రత్యేక న్యాయమూర్తి భరత్ పరాషర్ ఆదేశించారు. జిందాల్‌తోపాటు, జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ మాజీ డైరెక్టర్ సుశీల్ మరూ, మాజీ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్ గోయల్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విక్రాంత్ గుజ్రాల్, కంపెనీ అధీకృత ఉద్యోగి డీఎన్ అబ్రోల్‌పై అభియోగాలు మోపారు. మధ్యప్రదేశ్‌లోని బొగ్గు బ్లాకుల కేటాయింపునకు సంబంధించిన విషయాన్ని కోర్టు విచారించింది. నిందితులపై అభియోగాలను అధికారికంగా ప్రకటించేందుకు జూలై 25 వరకు సమయం ఇచ్చింది.

## జైరా వ్యాఖ్యలపై చెలరేగిన దుమారం

**తప్పుపట్టిన శివసేన, రవీనా టాండన్**



**న్యూఢిల్లీ:** ఇస్లాంకు దూరం కావడం ఇష్టంలేక సినిమాల నుంచి తప్పుకుంటున్నట్లు 'దంగల్' సినిమా నటి జైరా వసీమ్ ప్రకటించడం సినీ, రాజకీయవర్గాల్లో దుమారం లేపింది. కొందరు జైరా వసీమ్ నిర్ణయాన్ని సమర్థిస్తుండగా, మరికొందరు మాత్రం తప్పుపడుతున్నారు. తన జీవితం గురించి ఏ నిర్ణయమైనా తీసుకునే హక్కు జైరాకు ఉందనీ, దాన్ని ఎవ్వరూ ప్రశ్నించలేరని జమ్మూకశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. జైరా వ్యక్తిగత నిర్ణయాన్ని తాము గౌరవిస్తామనీ, మతానికి–కళకు ఏమాత్రం సంబంధం లేదని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సూర్జేవాలా తెలిపారు. ఇస్లాం అసహనంతో కూడిన మతం అనేలా జైరా వ్యాఖ్యలు ఉన్నాయని శివసేన నేత ప్రియాంకా చతుర్వేది విమర్శించారు. అన్నీ ఇచ్చిన సినీపరిశ్రమకు కొందరు రుణపడి ఉండరనీ, అలాంటివాళ్లు తమ మౌనంగా వెళ్లిపోవడం మంచిదని నటి రవీనా టాండన్ అన్నారు.

## రూ.30 అడిగినందుకు తలాక్!

**నోయిడా:** ముప్పై రూపాయలు అడిగిన పాపానికే ఓ ప్రబుద్ధుడు 'తలాక్.. తలాక్.. తలాక్' అని చెప్పి నలుగురు బిడ్డల తల్లికి నడిబజార్లో విడాకులిచ్చేశాడు. జైనాబ్(30) కూరగాయలు కొనుక్కునేందుకు 30 రూపాయలివ్వమని భర్త సబీర్‌ని కోరడమే ఆమె చేసిన నేరమైంది. భర్త, అతని తల్లి కలిసి జైనాబ్‌పై దాడిచేయడమే కాకుండా నోయిడాలోని రావూజీ మార్కెట్‌లోనే ఉన్న ఫళంగా తలాక్ చెప్పేశాడు సబీర్. స్క్రూడ్రైవర్‌తో భార్యపై దాడి చేయడంతోపాటు తలాక్ చెప్పిన సబీర్, అతని తల్లి,, సోదరిపై దాద్రీ పోలీసులు 504, 506 సెక్షన్ల కింద, గృహహింస చట్టం 498'ఏ' కింద కేసులు నమోదు చేశారు. ట్రిపుల్ తలాక్ శిక్షార్హమనే దానిపై అధికారిక ఆదేశాలేవీ రానందున ఈ కేసును ఫ్యామిలీ కోర్టుకు పంపిస్తామని పోలీసులు తెలిపారు.

## యురేనియం 'పరిమితి'ని దాటేశాం: ఇరాన్

**టెహ్రాన్:** 2015 నాటి అణు ఒప్పందంలో నిర్దేశించిన దాని కన్నా ఎక్కువగా యురేనియంను తాము నిల్వచేశామని ఇరాన్ సోమవారం ప్రకటించింది. ఇరాన్ విదేశాంగ మంత్రి మహ్మద్ జావద్ జరీఫ్ మాట్లాడుతూ 'అణుఒప్పందంలో పరిమితి విధించిన 300 కిలో గ్రాముల కన్నా ఎక్కువగానే మేం యురేనియంను నిల్వ చేశాం' అని చెప్పారు. ఈ ఒప్పందం నుంచి అమెరికా గతేడాదే బయటకు వెళ్లిపోవడం, అనంతరం ఇరాన్‌పై పలు ఆంక్షలు విధించడం తెలిసిందే.

## • భారీ భద్రత మధ్య అమర్‌నాథ్ యాత్ర


భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య సోమవారం అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమైంది. మొదటి రోజు 8వేల మందికి పైగా యాత్రికులు అమర్‌నాథుడిని దర్శించుకున్నారు. యాత్ర ప్రారంభానికి ముందు నిర్వహించిన 'ప్రథమ పూజ' కార్యక్రమంలో జమ్మూకశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్ పాల్గొన్నారు. 46 రోజుల పాటు కొనసాగే ఈ యాత్రకు ఈ ఏడాది 1.5 లక్షల మంది యాత్రికులు పేర్లు నమోదు చేసుకున్నారు.

# నిఘా కోసం చైనా డ్రోన్లు

## బాలాకోట్ దెబ్బతో వ్యూహం మార్చిన పాక్



పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని బాలాకోట్‌లో జైషే ఉగ్రవాద శిక్షణ శిబిరంపై భారత వైమానిక దళం మెరుపుదాడి చేయడంతో పాకిస్తాన్‌కు రక్షణ పరంగా తన వైఫల్యాలేమిటో తెలిసి వచ్చింది. దాంతో భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా జాగ్రత్తపడుతోంది. భారత్ విషయంలో ఇంత వరకు అనుసరిస్తున్న వ్యూహాలను మార్చుకుంటోంది. సైనిక స్థావరాల వద్ద భద్రతను పటిష్టం చేయడం, సరిహద్దులో నిఘాను పెంచడం వంటి చర్యలు తీసుకుంటున్నట్టు భారత నిఘా వర్గాలు పసిగట్టాయి.

ఏ మాత్రం దొరక్కుండా, రాడార్లకు కూడా చిక్కకుండా భారత్ దాడి చేయడం, ఆ తర్వాత భారత్‌పై దాడికి చేసిన యత్నం విఫలమవడాన్ని పాక్ సైన్యం జీర్ణించుకోలేకపోతోందని భారత నిఘావర్గాల భోగట్టా. అత్యాధునిక ఆయుధాలు, నిఘా వ్యవస్థలను సత్వరమే సమకూర్చుకోవాలని, సరిహద్దులో నిఘాను పెంచాలని నిర్ణయించింది. వాస్తవాధీన రేఖ, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లలో నిఘాకోసం మరిన్ని డ్రోన్‌లను ఉపయోగించాలని, వాటిని చైనా నుంచి కొనాలని నిర్ణయించింది. అలాగే, సరిహద్దులో చైనా తయారీ మధ్యంతర క్షిపణులను మోహరించాలని కూడా ఆలోచిస్తోంది. అత్యాధునిక రైన్‌బో డ్రోన్‌లు, యూఏవీల కొనుగోలుకు చైనాతో ఒప్పందాలు కుదుర్చుకుంది. మరోవైపు ఉగ్ర సంస్థలకు కూడా జాగ్రత్తలు చెబుతోంది. ఆయుధాలను బహిరంగంగా ప్రదర్శించవద్దని, వాస్తవాధీన రేఖకు దూరంగా శిబిరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించినట్టు నిఘా వర్గాల సమాచారం. అలాగే, ఉగ్రవాదులంతా పాక్ సైనిక యూనిఫాంలు లేకుండా బయట తిరగవద్దని కూడా స్పష్టం చేసింది. భారత్‌పై దాడుల కోసం ఉగ్రవాదుల కన్సార్టియం ఏర్పాటుకు ఐఎస్‌ఐ ప్రయత్నిస్తోందని తెలిసింది. ఇందుకోసం జైషే, హఖానీ, తాలిబన్, ఐసిస్ వంటి ఉగ్ర సంస్థల మధ్య సమావేశాలు ఏర్పాటు చేస్తోందని నిఘా వర్గాలు పసిగట్టాయి.

సాక్షి
మంగళవారం, జూలై, 2

# అత్యంత అమానుషం

తెలంగాణలోని కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ మండలం సార్సాల అటవీ ప్రాంతంలో ఆదివారం నాడు మహిళా అటవీ అధికారి(ఎఫ్ఆర్ఓ) అనితపైనా, ఇతర సిబ్బందిపైనా జరిగిన దాడి దేశం మొత్తాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రభుత్వ విధానాలను అమలు చేయడానికెళ్లిన అటవీ శాఖ సిబ్బందిపై అధికార పక్ష ప్రజాప్రతినిధే అనుచరులను పోగేసుకుని దాడికి దిగడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇది నాలుగేళ్లక్రితం ఏపీలో చంద్రబాబు పాలనలో తహసీల్దార్ వనజాక్షిపై అప్పటి టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఆయన నాయకత్వంలోని మాఫియా గణం చేసిన దాడిని గుర్తుకు తెచ్చింది. అయితే ఆ దాడి విషయంలో బాబు తరహాలోకాక తెలంగాణ సీఎం కేసీఆర్ సార్సాల ఉదంతాన్ని తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకున్నారు. దానికి నాయకత్వం వహించిన జడ్‌పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణతో ఆ పదవికి రాజీనామా చేయించారు. పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఉదంతం జరిగినప్పుడు చేష్టలుడిగి ఉండిపోయిన డీఎస్‌పీ, సీఐలను సస్పెండ్ చేశారు. ప్రభుత్వ విధానాలను అమలు చేసే క్రమంలో సిబ్బందికి ఇబ్బందులు తలెత్తడం రివాజే. ఆ విధానాలతో నష్టపోతున్నామని భావించేవారు తమ వాదనను బలంగా వినిపించడం, భావోద్వేగాలు పెరిగి అడ్డుకోవడానికి ప్రయత్నించడం కూడా సర్వసాధారణం. కానీ కర్రలతో ప్రభుత్వ సిబ్బందిపై దాడికి తెగబడటం క్షమార్హం కానిది. అలాంటి చర్యల పర్యవసానంగా ఉన్న సమస్య పరిష్కారం కాకపోగా అది పూర్తిగా శాంతిభద్రతలకు సంబంధించిన వ్యవహారంగా మారి వికటిస్తుంది.

పోడు భూముల సమస్య దాదాపు దేశమంతా ఉంది. అడవులపై తమకున్న సంప్రదాయ హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఆదివాసులు తీవ్ర అసంతృప్తితో, ఆగ్రహావేశాలతో ఉన్నారు. ఈ విషయంలో ఎన్నో ఉద్యమాలు సాగాక అటవీ హక్కుల చట్టం అమల్లోకొచ్చింది. కానీ దశాబ్దకాలం గడిచినా, లోటుపాట్లను సవరించడానికి మధ్యలో దానికి సవరణలు చేసినా అది సక్రమంగా అమలు చేయటం లేదన్నది గిరిజనుల ఆరోపణ. ఆ చట్టం ప్రకారం తమ సాగులో ఉన్న అటవీ భూములకు వ్యక్తిగత పట్టాలివ్వాలని, అలాగే గిరిజన గూడేలకు ఉమ్మడి హక్కు పత్రాలు ఇవ్వాలని వారు కోరుతున్నారు. వానా కాలం ప్రవేశించాక పోడు భూములు సాగు చేసుకుందామని గిరిజనులు ప్రయత్నించినప్పుడు అటవీ సిబ్బంది దాడులు చేయడం ఏటా షరా మామూలుగా సాగుతోంది. పోడు భూములకు పట్టాలున్నా అటవీ సిబ్బంది ఖాతరు చేయరని, విత్తనాలు చల్లుకున్న భూమిని బుల్‌డోజర్లతో, జేసీబీలతో నాశనం చేస్తారని గిరిజనులు ఆరోపిస్తున్నారు. గిరిజనుల దగ్గరున్న పట్టాలు సరైనవా, కాదా... అందులో సాగు చేసుకోవడానికి వారికి హక్కుందా లేదా అన్న సంగతిని నిర్ధారిస్తే పదే పదే ఈ ఉదంతాలు పునరావృతం కావు. మొక్కలు నాటాలనుకున్న భూమి తమదేనని అటవీ శాఖ అంటుంటే, తమకు పట్టాలున్నాయని గిరిజనులు చెబుతున్నారు. కొన్నిచోట్ల గిరిజనేతరులు సైతం ప్రవేశించి వారికి దక్కాల్సిన ప్రయోజనాలను కాజేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రాజకీయ నాయకులు తమ పలుకుబడితో తాత్కాలికంగా సమస్య సద్దుమణిగేలా చూస్తున్నారు. కానీ మరుసటి ఏడాది తిరిగి ఇదంతా యధాప్రకారం సాగుతుంది. ఇందులో ఎక్కడ తేడా వచ్చినా అటవీ సిబ్బందిపై దాడులు చేయడం, వారిని దుర్భాషలాడటం వంటి ఉదంతాలు చోటుచేసుకుంటాయి. ఈ ఉదంతాల్లో ఎందరో గిరిజనులు కేసుల్లో చిక్కుకుని జైలుపాలవుతున్నారు. కేవలం బతకడానికి, కుటుంబాలను బతికించుకోవడానికి ప్రయత్నించే క్రమంలో గిరిజనులు ఇన్ని ఇబ్బందులు పడటం విషాదకరం. అటవీ భూములను ప్రాజెక్టుల పేరు చెప్పి, అభయారణ్యాల పేరు చెప్పి, రిజర్వ్ ఫారెస్టు భూములుగా చూపి ప్రభుత్వాలు స్వాధీనం చేసుకుంటుంటే... వాటిపై ఆధారపడి జీవించే గిరిజనుల బతుకు అధోగతి అవుతోంది. గత నెలలో ఇదే కాగజ్‌నగర్ మండలం కొలాంగోందిగూడలో 67మంది గిరిజనులను టింబర్ డిపోలో నిర్బంధించిన ఉదంతం ఇటువంటిదే. హైకోర్టు ధర్మాసనం జోక్యం చేసుకుని నిర్బంధితులను విడుదల చేయడంతోపాటు వారికి ఆర్నెల్లలో భూమి, ఏడాదిలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఆదేశించింది.

గిరిజనుల జీవనాధారం దెబ్బతినకుండా, వారిని అడవికి దూరం చేయకుండా సమస్యను ఎలా పరిష్కరించాలన్న అంశంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి. హరితహారమో, మరే ఇతర కార్యక్రమమో మొదలెట్టినప్పుడు... లేదా ఒక విధానాన్ని రూపొందించే ముందు ఆ సమస్యతో సంబంధం ఉన్న అన్ని పక్షాలనూ పిలిచి మాట్లాడటం, ప్రజాప్రతినిధులను కూడా అందులో భాగస్వామ్యం చేయడం, అందరి అంగీకారంతో ఒక సామరస్యపూర్వక పరిష్కారాన్ని సాధించడం అవసరం. ఎవరి దారి వారిదన్నట్టు ప్రభుత్వం ఒక విధానాన్ని రూపొందించడం, దాన్ని అమలు చేయటం కోసం అధికారులు రంగంలోకి దిగడం, ప్రజాప్రతినిధులు జనాన్ని సమీకరించి ఆ అధికారులపై దాడులకు పూనుకోవడం ప్రమాదకరమైన పర్యవసానాలకు దారితీస్తుంది. ఆదివారం నాటి ఉదంతంలో అనితను లక్ష్యంగా చేసుకుని కోనేరు కృష్ణ, ఆయన అనుచరులు సాగించిన దాడే ఇందుకు రుజువు. అంతమంది జనాన్ని పోగేసి ఆమెపైనా ఇతర సిబ్బందిపైనా దాడికి దిగడానికి బదులు... తానూ, తన సోదరుడు అధికార పక్ష ప్రజాప్రతినిధులు కనుక ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రులతో చర్చించి స్థానిక సమస్యలేమిటో చెప్పడం, ఇప్పుడు అమలవుతున్న విధానంలో సవరణలు సూచించడం, అటవీ హక్కుల చట్టం సక్రమంగా అమలయ్యేలా చూడటం వంటివి చేయాలి. అందుకు భిన్నంగా అధికారులనూ, సిబ్బందినీ దాడులతో బెదరగొడితే సమస్య తీరుతుందని వారెలా అనుకున్నారో అనూహ్యం. సార్సాల దాడి ఉదంతం పోడు భూముల చుట్టూ అల్లుకున్న సమస్యల తీవ్రతను తెలియజేసింది గనుక తెలంగాణ ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలి. భవిష్యత్తులో సార్సాల ఉదంతం వంటివి పునరావృతం కాకుండా అందరి సహకారంతో సామరస్యపూర్వక పరిష్కారం సాధించాలి.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం, తిథి అమావాస్య రా.1.02 వరకు, తదుపరి ఆషాఢ శు.పాడ్యమి, నక్షత్రం మృగశిర ఉ.8.32 వరకు, తదుపరి ఆరుద్ర వర్జ్యం సా.4.41 నుంచి 6.14 వరకు, దుర్ముహూర్తం ఉ.8.10 నుంచి 9.00 వరకు, తదుపరి రా.10.56 నుంచి 11.40 వరకు అమృతఘడియలు... రా.10.05 నుంచి 11.54 వరకు.

సూర్యోదయం : 5.33
సూర్యాస్తమయం: 6.33
రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

# జలవివాదాలు : 'కొలరాడో' కొరడా!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

**విభజనానంతరం నేటికీ ఆంధ్ర–తెలంగాణాలను వేధిస్తున్న పలు అంశాలలో అత్యంత కీలకమైనది కృష్ణా–గోదావరి జలాల పంపిణీ సమస్య. ఆంధ్ర తెలంగాణలే కాకుండా రెంటికీ ఎగువన ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాలతోనూ ముడిపడి ఉన్న ఈ అంతర్రాష్ట్ర నదీజల వివాదాల పరిష్కారం పరస్పరం జలరాశి ఉపయోగం దృష్ట్యా మాత్రమే జరగాలి. కానీ ఏలికల రాజకీయ స్వార్థప్రయోజనాలు ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని కాకుండా పాలకపక్షాల కచ్చిపోతు కుమ్ములాటలపై ఆధారపడుతున్నందున, ప్రజల మధ్య తగాదాలకు దారి తీస్తూ వచ్చాయి. కనీసం ఇప్పటికైనా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల దీర్ఘకాల ప్రయోజనాల రక్షణ కోసం జలవివాదాల దశకు చరమగీతం పాడాలని కేసీఆర్, వైఎస్ జగన్ నిర్ణయించి ఒక పరిష్కారాన్ని సూచించే సంకల్పంతో ఉభయ రాష్ట్రాల ఉన్నతాధికారులకు నివేదిక కోసం ఆదేశాలు జారీ చేశారు.**

**కర్ణాటకకు దిగువన ఉన్న ఆంధ్రప్రదేశ్ కృష్ణానదిలోని అదనపు జలరాశిని ఉపయోగించుకోకపోతే అరుదైన ఈ జాతీయ సంపద మనకు దక్కదు. ఈ అదనపు జలాల సద్వినియోగానికి మనం పథకాలు వెంటనే వేసుకోవాలి. ఇది బచావత్ ట్రిబ్యునల్ స్పష్టంగా నిర్దేశించిన బాధ్యత. దాన్ని మనం నెరవేర్చాలి. ఈ అపరూప సంపదను మనం వినియోగించుకోని పక్షంలో అదనపు నదీజలాలను సముద్రంలో వదిలేసి వృథాపుచ్చుతున్నందుకు మొత్తం దేశమూ, ప్రజలూ మన రాష్ట్రాన్ని నిందిస్తారు.**

*– తెలుగుగంగ ప్రాజెక్ట్ స్పెషల్ ఆఫీసర్‌గా ఉన్న సుప్రసిద్ధ ఇంజనీర్ కె. రామకృష్ణయ్య హెచ్చరిక (1985)*

ఆంధ్రప్రదేశ్‌కు ఎగువన ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర పాలకులు దిగువన ఉన్న పూర్వపు ఆంధ్రప్రదేశ్ అయిదేళ్లనాడు రెండుగా చీలకముందు కృష్ణా, గోదావరి జలాల పంపిణీ విషయంలో పేచీకోరు రాజకీయాలకు పాల్పడ్డవారేనని మరిచిపోరాదు. బహుశా అందుకే అని ఉంటాడు ఆరుద్ర – 'ఓట్లు అడుక్కునే రాజకీయులకే గానీ ప్రజలకు ప్రాంతీయ విభేదాలు ఉండవు' అని! ఈ మాట ఎంత నిజమో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర ఏలికలు ఏళ్లూ, పూళ్లుగా నిరూపిస్తూనే వచ్చారు. కాగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అర్ధాంతర విభజన ఫలితంగా ఏర్పడిన రెండు తెలుగు రాష్ట్రాలకు నేటి సీఎంలు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, కేసీఆర్ పాత గాయాల్ని, పాత కథల్ని పాతిపెట్టి ప్రజా సంక్షేమాన్ని ఆశించి ఉభయ ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న పెక్కు సమస్యలకు శాశ్వత పరిష్కారం కనుగొనే రీతిలో ఒక చరిత్రాత్మక నిర్ణయానికి వచ్చారు. ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో, సమస్యల పరిష్కారం దిశగా వీరు ముందడుగు వేయడం బహుధా ప్రశంసనీయం.

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని 9వ, 10వ షెడ్యూల్స్‌లో విభజనానంతరం పరిష్కరించవలసిన పెక్కు అంశాల్లో ఒక ప్రధానమైన అంశం, కృష్ణా–గోదావరి జలాల పంపిణీ సమస్య. ఈ రెండు నదుల అవసరం ఒక్క ఆంధ్ర తెలంగాణలకే కాకుండా రెంటికీ ఎగువన ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాలకూ ఉంది. ఈ అంతర్రాష్ట్ర నదీజల వివాదాల పరిష్కారం ఈ మూడు రాష్ట్రాల ప్రజల అవసరాల దృష్ట్యా పరస్పరం జలరాశి ఉపయోగం దృష్ట్యా మాత్రమే జరగాలి. కానీ ఏలికల రాజకీయ స్వార్థ ప్రయోజనాలు ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని కాకుండా పాలకపక్షాల కచ్చిపోతు కుమ్ములాటలపై ఆధారపడుతున్నందున, మూడు రాష్ట్రాల ప్రజల మధ్య తగాదాలకు దారి తీస్తూ వచ్చాయి. కనీసం ఇప్పటికైనా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల దీర్ఘకాల ప్రయోజనాల రక్షణ కోసం జలవివాదాల దశకు చరమగీతం పాడాలని కేసీఆర్, వైఎస్ జగన్ నిర్ణయించి మిగతా సమస్యలతోపాటు ఒక పరిష్కారాన్ని సూచించే సంకల్పంతో ఉభయ రాష్ట్రాల ఉన్నతాధికారులకు నివేదిక కోసం ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు తొలి చర్యగా గోదావరి నుంచి కృష్ణానదిలోకి తెలంగాణ ప్రయోజనాలకోసం రోజుకు 4 శతకోటి ఘనపుటడుగుల నీరు (టీఎంసీ) విడుదల చేయాలని, ఇందులో సాగర్‌కు రెండు, శ్రీశైలానికి రెండు టీఎంసీల నీటిని విడుదల చేయడానికి ముఖ్యమంత్రులు ఇరువురూ అంగీకరించి, దీనిపై 15 రోజులలోగా సాధికార నివేదికను అందించమని అధికారులను ఆదేశించారు.

అంతకుముందు 'ముక్కూ, ముఖం' లేని విభజన పరిష్కారం ఫలితంగా పునర్విభజన చట్టంలోని 9వ షెడ్యూల్ కింద 86 సంస్థలూ, 10వ షెడ్యూల్ కింద 107 సంస్థలనూ విభజించాల్సి వచ్చింది, కానీ పరిష్కారం కోసం ముందస్తు ప్రణాళిక లేకుండానే వేసిన ముందడుగు కాస్తా 'వెనకడుగు'గా ముగిసి ఐదేళ్ల వ్యవధి ఒడిదుడుకుల అధ్యాయంగా ముగియవలసి వచ్చింది. బాబు–కేసీఆర్‌ల మధ్య 'పాము– కప్ప'ల మధ్య చెలగాటాలతో ముగిసింది. కాగా, ఇప్పటి జగన్– కేసీఆర్‌ల మధ్య సఖ్యతా సేతువు నిర్మాణం ఉభయప్రాంతాల శ్రేయస్సుకు అవసరం. ఒకవైపున పాలకుల ఒత్తిళ్లను తట్టుకుని రెండు తెలుగు రాష్ట్రాలు జలవనరుల వినియోగంలో అనుకున్న స్థాయిలో ముందుకు సాగలేక ఉత్తరాంధ్ర, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల ప్రయోజనాలు కుంటుపడ్డాయి. బచావత్ ఖాయం చేసిన నీటి కేటాయింపును, సముద్రంలోకి వృథాగా పోయే అదనపు జలరాశి వినియోగానికి ఎక్కడికక్కడ నిర్ణీత ప్రదేశాలలో డ్యాములు, రిజర్వాయర్ల నిర్మాణాల అవసరాన్ని నొక్కిచెప్పినా, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ అక్కరకురాని ప్రతిపాదనలు చేసింది.

తెలుగు రాష్ట్రాల జలరాశి వినియోగానికి ఒక్క రాయలసీమకే గాకుండా తెలంగాణ, కోస్తాంధ్ర ప్రయోజనాలను సహితం కాపాడగల పెక్కు చిన్న చిన్న రిజర్వాయర్ల నిర్మాణాన్ని శ్రీరామకృష్ణయ్య ప్రతిపాదించారు గానీ వినే నాథుడు లేక మరుభూమిలో కురిసిన వర్షంలా అయిపోయింది. చివరికి ఆంధ్రప్రదేశ్ విభజన సమస్య తలెత్తినప్పుడు రాష్ట్రవ్యాప్త పర్యటన జరిపిన జస్టిస్ శ్రీకృష్ణ కమిటీ అంతిమ నివేదికలో 'రాష్ట్రంలోని మూడు ప్రాంతాలలోనూ వెనుకబడిన ప్రాంతాలున్నాయనీ, మూడు ప్రాంతాలలోని సమస్యలతోను, అభివృద్ధితోనూ పోల్చితే రాయలసీమ అన్ని ప్రాంతాలకన్నా వెనకబడి కుంటుతోంద'ని కూడా చెప్పింది. కర్ణాటక, మహారాష్ట్ర పాలకులు ఆ రెండు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు ఎగువన ఉన్నందున డ్యాముల నిర్మాణం కర్ణాటక పెంచగా, మహారాష్ట్ర పాలకులు బాబ్లీ డ్యామును మహారాష్ట్ర ప్రయోజనాలకు సరిపడా కుదించి తెలంగాణకు ప్రాణప్రదంగా ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు, గోదావరి నీటి ప్రవాహానికి అడ్డు నిలిచారు.

నిజానికి ప్రాజెక్టుల నిర్మాణంలో ఎగువన ఉన్న రాష్ట్రాలు దిగువన ఉన్న రాష్ట్రాలకు నదీ జలరాశి అందకుండా ఏ రూపంలోనూ అడ్డుకునే లేదా ప్రతిబంధకం కలిగించే చర్యలకు పాల్పడరాదని అంతర్జాతీయంగా చట్టాలు ఉన్నాయి. 1922 నాటి 'కొలరాడో రివర్ కాంపాక్టు' సంధి అమెరికా రాష్ట్రాలన్నింటికీ శిరోధార్యం, ఆదర్శం. ఇది కొలరాడో నదీ పరీవాహక ప్రాంతాన్ని ఎగువ భాగం (అప్పర్ డివిజన్) అనీ, దిగువ భాగం (కిందనున్న ప్రాంతాలు–లోయర్ డివిజన్) అనీ రెండు బేసిన్లుగా విభజించారు. ఎగువన ఉన్న నదీ ప్రాంత భాగంలో కొలరాడో, న్యూమెక్సికో, ఉటా, వోమింగ్ రాష్ట్రాలు, దిగువన ఉన్న రాష్ట్రాలు నెవాడా, అరిజోనా, కాలిఫోర్నియా పైనున్న రాష్ట్రాలు దిగువనున్న రాష్ట్రాలకు ప్రవహించే కొలరాడో నదీ జలాలను వరుసగా పదేళ్లపాటు 9.3 కిలోమీటర్ల పరిధి వరకూ నదీ జలరాశిని ఏనాడూ అడ్డుకోరాదని ఆ సంధి శాసించింది. అలా కొలరాడో నదీ జలరాశిని రెండువైపుల ఉన్న రాష్ట్రాలకు మధ్య సమంగా పంపిణీ చేశారు. ఇలాంటి ఒప్పందాలే హూవర్ డ్యామ్, పావెల్ డ్యామ్ ప్రాంతాలను శాసించాయి. కాగా, తుంగభద్రా ప్రాజెక్టు నదీజలాల నిర్వహణకు కర్ణాటక కేంద్రంగా ఉభయ రాష్ట్రాల ప్రయోజనాల కోసం 1953లో హోస్పేట దగ్గర్లో ఏర్పర్చిన తుంగభద్ర బోర్డును అక్కడినుంచి ఎత్తివేసేదాకా కర్ణాటక నాయకులు నిద్రపోలేదు. 1985 నుంచీ పేచీకోరుగా మారింది ఎందుకు? కృష్ణాజలాల్లోని అదనపు నీటిని ఆంధ్రప్రదేశ్ వాడుకోకుండా నిరోధించడానికే కర్ణాటక రాజకీయులు ఆ పన్నుగడ పన్నారు. 1951లో కృష్ణా–పెన్నార్ పథకం వస్తే రాయలసీమ భూముల దాహం తీరుతుందని ఆశించారు. కానీ అదీ సరిగా నెరవేరలేదు.

ఇటు తెలంగాణ ప్రాంతం ఆంధ్ర ప్రాంతంలో భాగం కాబట్టి తెలంగాణ మెట్ట ప్రాంతాలకు కృష్ణా–గోదావరి జలాలు సేద్యయోగ్యం చేసి ఆ భూములు సస్యశ్యామలం కావడానికి తోడ్పడగలవు. తెలంగాణ ఎత్తైన పీఠభూమితో కూడిన ప్రాంతం కావటంవల్ల అక్కడి పంటలు ప్రధానంగా వర్షాధారంపై పండేవి కాకుండా చెరువులపై ఆధారపడే సాగుభూములు. అందువల్లనే కృష్ణా–గోదావరి జలాలు రెండింటిపైన ఎక్కువ భాగం ఆధారపడవలసి వస్తోంది. కనుకనే మనకు సేద్యధారలందించి కరువు కాటకాలనుంచి తెలుగు భూముల్ని కృష్ణా–గోదావరులపై ఆనకట్టలు నిర్మించి తన సొంత బ్రిటిష్ పాలకుల నుంచి శిక్షలు అనుభవించిన సర్ ఆర్థర్ కాటన్ గోదావరి జిల్లాలలో యావత్తు తెలుగు ప్రజలనుంచి అపారమైన ఆదరాభిమానాలకు పాత్రుడయ్యాడు. ఆయన రాజకీయవేత్త కాకపోతేనేమి–ముందుచూపున్న క్రాంతదర్శి. కనుకనే, మొత్తం దేశానికి విభిన్న కాలువల ద్వారా అన్ని రాష్ట్రాలకు ఏమూలనున్నా సేద్యధారలందించగల మహా రిజర్వాయర్ నిర్మాణాన్ని సహితం రూపకల్పన చేశాడు. బ్రహ్మపుత్రా నదికి, గోదావరి నదికి లంకె కుదర్చాలని చూసిన రూపశిల్పి కాటన్. ఇదే ద్రష్టకూ 'భ్రష్ట'కూ ఉన్న తేడా. స్వార్థపరులే నేతలుగా చెలామణి అవుతున్నందునే నదీ జల వ్యవస్థలను తీర్చిదిద్ది సువ్యవస్థితంచేసి విస్తరింపజేయడంలో విఫలమయ్యారు. అందుకే బచావత్ ట్రిబ్యునల్ తీర్పులో జలరాశిని అవసరాల మేరకు వాడుకోవచ్చునేగానీ, ఏ రాష్ట్రమూ దానిపై తన హక్కు ముద్రను గుద్ది దబాయింపులకు దిగరాదని చెప్పింది. అలాంటి దబాయింపులకు బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ వీలు కల్పించింది కాబట్టే ఇన్ని తగాదాలు, వివాదాలూనూ. అందుకే మహాకవి ఖలీల్ జిబ్రాన్ చెప్పినా, సినారె చెప్పినా నేడు మనం రుజువు చేస్తున్న సత్యం ఒక్కటే: ఇంతకూ 'దేశ నాయకుడెవడు? ఎవడు వాడు?/ నేల దున్నని వాడు/ నేత నేయని వాడు/ రాళ్లు మోయనివాడు/ రంగు ఫిరాయించేవాడు'!!

abkprasad2006@yahoo.co.in

## రెండో మాట



సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### ప్రమాదం



"విజయవంతమైన పాలనను అందించే ప్రభుత్వాలు కూడా యాక్సిడెంట్ల విషయంలో నేరభావానికి గురవుతున్నాయి. మృతుల సంఖ్య ఎక్కువగా ఉండటం, సంతాప తీర్మానాలు ప్రకటించడం, నష్టపరిహారం, పునరావాసం కల్పించడం–మళ్లీ మరో ప్రమాదం జరిగినప్పుడు కూడా ఇదే వరుస కొనసాగిస్తున్నాం. జమ్మూ కశ్మీర్‌లోని తదుపరి ప్రభుత్వమైనా దీన్ని ఛేదించి, ఈ విధానానికి చరమగీతం పాడాలి"

– ఒమర్ అబ్దుల్లా, నేషనల్ కాన్ఫరెన్స్ నేత

### జీఎస్టీ



"ఒక దేశం ఒకటే పన్ను అనే స్వప్నాన్ని నిజం చేసిన ప్రధానమైన సంస్కరణ జీఎస్టీ. సమాఖ్య స్ఫూర్తికి జీఎస్టీ ప్రవేశం ఒక గొప్పఉదాహరణ. జీఎస్టీ వచ్చి రెండేళ్లు అయిన సందర్భంగా దీన్ని సాధ్యం చేసినవారిని అభినందిస్తున్నా. జీఎస్టీని ప్రజలకు అనుకూలంగా మలచడానికి సమాచారం స్వీకరిస్తున్నాం"

– నరేంద్రమోదీ, ప్రధాని

### ఉమ్మడి కోరిక



"ఇంగ్లండ్‌తో జరిగిన వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించాలని పాకిస్తాన్‌కు చెందిన క్రికెట్ అభిమానులంతా కోరుకున్నారు. క్రికెట్ విషయానికి వచ్చేసరికి ఇలాంటి మినహాయింపులు తప్పవు. అప్పుడప్పుడు అలా ఇరు దేశాలు ఒకే కోరిక కోరుకుంటాయి"

– మహబూబ ముఫ్తీ, పీడీపీ నేత

### వీడ్కోలు



"ఐదేళ్ల క్రితం నేను తీసుకున్న నిర్ణయం నా జీవితాన్ని మార్చేసింది. ఈ రోజు తీసుకుంటున్న మరో నిర్ణయం కూడా నా జీవితాన్ని ఉన్నతమైన మలుపు తిప్పుతుందని అనుకుంటున్నానంటూ... జైరా వాసిమ్ బాలీవుడ్‌కి గుడ్‌బై చెప్పారు. సినిమాల్లోకి రావడానికైనా, వెళ్లడానికైనా జైరాకు ఉన్న స్వేచ్ఛను గౌరవిస్తాను. అయితే, అలా విరమించుకోవడానికి మతపరమైన సంప్రదాయాలే కారణం కావడం నన్ను తీవ్రంగా కలచివేస్తోంది. అటువంటి సందర్భంలో తీసుకునే నిర్ణయం స్వేచ్ఛాయుతమైనదని భావించలేం. ముఖ్యంగా మహిళల విషయంలో అస్సలు అలా అనుకోలేం"

– బర్ఖాదత్, జర్నలిస్ట్

### దళితులు



"గే కుమారులను, లెస్బియన్ కుమార్తెలను బయటకు గెంటేసే దళిత కుటుంబాలు నాకు తెలుసు. విద్యావేత్తలు దీన్ని బ్రాహ్మణిజం అని విమర్శిస్తారు. విభజనతత్వానికి అణగారిన వర్గాలు కూడా బలిపశువులు అవుతాయి"

– దేవ్‌దత్ పట్నాయిక్, కాలమిస్ట్

## పాపం.. ఎస్‌జీటీలు

తెలంగాణ ఆవిర్భావం తర్వాత చేపట్టిన మొట్టమొదటి ఏకైక టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్‌టీ) ఇప్పటికీ అపరిష్కృతంగానే మిగిలింది. 2017లో వెలువడిన నోటిఫికేషన్ దశ నుంచి నేడు సాగుతోన్న నియామకాల వరకు అడుగడుగునా అవాంతరాలే. స్కూల్ అసిస్టెంట్ ఎంపిక సజావుగా సాగినా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ నియామకాల్లో స్తబ్ధత నెలకొంది. 2018 డిసెంబరు 31న ఎస్‌జీటీ ఇంగ్లిష్ కేటగిరీ పోస్టుల ఎంపిక జాబితాను టీఎస్ పీఎస్‌సీ ప్రకటించింది. వెనువెంటనే రీలింక్విష్‌మెంట్ (ఏదో ఒక ఉద్యోగానికి మాత్రమే సంసిద్ధంగా ఉండడం) ఆప్షన్ ఇచ్చింది. ఫిబ్రవరి 1 నాటికి గడువు నిర్ధారించింది. విచిత్రమేంటంటే ఎస్ జీటీ తెలుగు కేటగిరీ జాబితాను ప్రకటించకుండా రీలింక్విష్‌మెంట్ ఆప్షన్ ఇవ్వడం. కాగా తెలుగు మీడియం జాబితాను ఈ ఏడాది ఏప్రిల్ 4న విడుదల చేశారు. అప్పటికే రీలింక్విష్‌మెంట్ గడువు ముగిసింది. ఇంగ్లిష్ మీడియం పోస్టులకు ఎంపికైనవారు తాము తెలుగు కేటగిరీ జాబితాలో ఉన్నామో? లేదో? తెలియక రీలింక్విష్‌మెంట్‌కు మొగ్గుచూపకపోవడంతో ఈ ఐచ్ఛికాన్ని ఎంచుకునే వారి సంఖ్య వందకే పరిమితమయింది. వాస్తవంగా రెండు కేటగిరీ పోస్టులకు ఎంపికైనవారు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 600 మంది ఉన్నట్లు సమాచారం. వీరంతా ఏదో ఒక ఉద్యోగంలోనే జాయిన్ అయినపక్షంలో మిగిలిన పోస్టులన్నీ బ్యాక్‌లాగ్‌లో పెట్టే ప్రమాదముందని అభ్యర్థుల ఆందోళన.

టీఎస్‌పీఎస్‌సీ ఆర్టికల్ 6(ఏ) ప్రకారం ఒకే నోటిఫికేషన్‌లో పేర్కొన్న పోస్టుల్ని భర్తీ చేసే క్రమంలో ఖాళీలు ఏర్పడితే వాటిని మెరిట్ ప్రాతిపదికన తర్వాత ఉన్నవారితో భర్తీ చేయాలి. బ్యాక్‌లాగ్‌లో ఉంచేందుకు వీలులేదు. మిగిలిపోయే వాటిని బ్యాక్‌లాగ్‌లో పెడితే ఉద్యోగావకాశాన్ని కోల్పోయే ప్రమాదముందని కొందరు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. దీనిపై ఈ ఏడాది మే 22న కోర్టు స్టే విధించడంతో ఎస్‌జీటీ భర్తీ ప్రక్రియ నిలిచిపోయింది. కోర్టు స్టేతో సుమారు 4,695 ఎస్‌జీటీ నియామకాలు ఆగిపోయాయి. కోర్టు స్టేపై టీఎస్‌పీఎస్‌సీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందంటూ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రీలింక్విష్‌మెంట్ ఆప్షన్ ఇవ్వడమే ఏకైక పరిష్కారమని అభ్యర్థులు కోరుతున్నారు. గత కొద్ది రోజులుగా ఆప్షన్ ఇవ్వాలంటూ రెండు కేటగిరీ పోస్టులకు ఎంపికైనవారు టీఎస్ పీఎస్‌సీ కాల్‌సెంటర్‌ను ఆశ్రయిస్తున్నారు. దీన్ని తక్షణమే అమలు చేస్తే వేలమంది నిరుద్యోగులకు నిజంగా మేలు జరుగుతుంది.

– తిరుమల శ్రీనివాస్ కరుకోల
హైదరాబాద్ । 81438 14131

# గురువును మరువని కాలం

సందర్భం



జూలూరు గౌరీశంకర్

గురుశిష్యుల మధ్య సంబంధాలు మృగ్యమైపోయాయని, వీళ్ల మధ్య సంబంధాలు చాప్టర్‌లెక్చరర్స్, మార్కెట్ సంబంధాలని చర్చలు చేస్తున్న సందర్భంలో గురువును గురువుగా ప్రతిష్ఠించడం మొత్తం సమాజం గర్వించ తగింది. గురువుకు ఉన్న మహోన్నత స్థానం నేటికీ చెక్కుచెదరలేదనే సంఘటనలు అరుదుగా జరుగుతాయి.

ఉపాధ్యాయులను విద్యార్థులు నేటికీ తమ గుండెల్లో దాచుకుంటూనే ఉన్నారు. తన బోధనతో భావితరాన్ని సాధకులుగా మార్చగల శక్తి ఒక్క ఉపాధ్యాయునిలోనే ఉంది. తల్లిదండ్రుల తర్వాత గురువుదే ఉత్తమ స్థానమని నిర్వచనాలు చెప్పటం, ఉపాధ్యాయ దినోత్సవాల నాడు మననం చేసుకోవటం మాత్రమే కాదు, పిల్లలకోసం తపించి, పిల్లల కోసం తమ జీవితాలను అర్పించి, తరగతి గదే దేవాలయంగా భావించిన ఉపాధ్యాయులను ఏ తరమూ మర్చిపోదని యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట సోషల్‌వెల్ఫేర్ ప్రిన్సిపాల్‌గా పనిచేసి ఆదివారం పదవీ విరమణ చేసిన పసుపులేటి విద్యాసాగర్‌రావు సన్మానసభలో కళ్లకు కట్టినట్లు కనపడింది.

గురుకుల విద్యావ్యవస్థలో తన సర్వీసు కాలం చదువుకుని వివిధ రంగాలలో స్థిరపడ్డ విద్యార్థులంతా తమ గురువును బండి మీద నిలుచోబెట్టి ఊరేగింపుగా ఆ స్కూల్ ప్రాంగణంలోకి బండిలాగుతూ తీసుకుపోవటం ఒకింత ఆశ్చర్యంగా, పరమానందంగా అనిపించింది. ఈ అత్యాధునిక మార్కెట్ సమాజంలో ప్రతిదానిని వినిమయ వస్తువుగా మార్చి, అమ్మకాలు కొనుగోళ్లు చేస్తున్న కాలంలో తమ గురువు పదవీ విరమణ సభలో గురువుకు కృతజ్ఞతగా దంపతులను బండిమీద కూర్చోబెట్టి బండిని విద్యార్థులు వేదికదాకా తీసుకొని పోయే సంఘటనను ఈ కాలంలో చూస్తాననుకోలేదు. ఇది మంచి ఉపాధ్యాయుడు విద్యాసాగర్‌కు దక్కిన గౌరవం మాత్రమేకాదు, తమను కంటిపాపలా చూసుకుని జ్ఞానబోధన చేసిన గురువులను ఏ విద్యార్థులూ మర్చిపోరనడానికి నిదర్శనం. ఇది ఒక్క గురువుకు చేసిన సన్మానం మాత్రమే కాదు మొత్తం గురుకుల విద్యావ్యవస్థకు ఉపాధ్యాయలోకానికి అత్యంత ఘనంగా జరిగిన



సన్మానంగా భావించాలి.

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ మద్రాసులో రైలు దిగగానే, ఆయన విద్యార్థులు ఇదే రీతిలో బండిపై కూర్చోబెట్టి విద్యాసంస్థదాకా తీసుకుపోయారని పాఠంగా చదువుకున్నాంకానీ, అదే సన్నివేశం ఈ కాలంలో కూడా చూడగలగటం ఒక విశేషం. ఇది మంచి పరిణామం. ఇది విద్యార్థులు ఉపాధ్యాయుల మధ్య ఉండే అనుబంధానికి తార్కాణంగా నిలుస్తుంది.

తమ విద్యార్థులు ఉన్నతస్థాయికి వెళ్లాలని ప్రతి టీచర్ కోరుకుంటారు. ఎదుగుతున్న సమాజ పురోభివృద్ధి వెనుక ఉపాధ్యాయులు, తరగతి గది పాత్రే ప్రముఖంగా ఉంటుంది. దేశాన్ని సుభిక్షంగా ఉంచేది, అత్యున్నతంగా తీర్చిదిద్దేది తరగతిగదే నన్నది గుర్తించే తరగతి గదిలో ప్రపంచం రూపొందుతుందని కొఠారి కమిషన్ చెప్పింది. తెలంగాణను తీర్చిదిద్దటానికి గురుకుల పాఠశాలలు గొప్ప కృషిచేస్తున్నాయి. పీవీ గురుకులవిద్యావ్యవస్థను తెలంగాణలో ప్రారంభించి, మానవవనరుల శాఖా మంత్రి అయ్యాక దేశవ్యాపితంగా జిల్లాకొక గురుకుల పాఠశాలను నెలకొల్పారు. లక్షమంది బీసీ కుటుంబాలకు చెందిన పిల్లలు నేడు గురుకుల పాఠశాలల ద్వారా నాణ్యమైన చదువును పొందగలుగుతున్నారు. తెలంగాణ గురుకులాల నుంచి రాబోయే విద్యార్థులు రేపటి బంగారు తెలంగాణకు పునాదులుగా నిలుస్తారు. సంచారజాతుల పిల్లలు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా దేశ సంపదగా మారటం కంటే గొప్ప విషయం మరొకటి లేదు. శక్తిమంతమైన సమాజనిర్మాణం చేయటానికి పునాదులుగా నిలిచి సేవలందిస్తున్న ఉపాధ్యాయుల కృషి మరువలేనిది.

మొత్తం సమాజం ఉపాధ్యాయులు చేస్తున్న సేవకు వారిని గొప్పగా సత్కరించుకోవాలి. ప్రతి ఊరులో దేవాలయాన్ని చూసినంత పవిత్రమైన భావనను పాఠశాలలపై చూపి ఆ పాఠశాలల రక్షణ కోసం, వాటి ఉన్నతి కోసం అందరూ సహకరించాలి. గుడిలోకి పోతే ముక్తి లభిస్తే, బడిలోకి పోతే సమాజ విముక్తి లభిస్తుంది. అందరికీ చదువు అందాలన్న మహాత్మాజ్యోతిబాపూలే, అంబేడ్కర్ ఆలోచనలకు రూపంగా తెలంగాణ రాష్ట్రంలో అట్టడుగు వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యలభిస్తోంది. ఇది శుభతరుణం.

వ్యాసకర్త తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు । 94401 69896

# దాసోహమయితేనే దాసుడు

ఎనిమిది మంది ఇష్ట సఖులు, పదహారు వేల మంది గోపికలు ఉన్నప్పటికీ కృష్ణుని నిత్యమూ అంటి పెట్టుకుని గడిపే అవకాశం వేణువు మాత్రమే పొందడం బృందావనంలోని గోపికలకు అసంతృప్తి కలిగించింది. వారిలో అసూయ రగిలించింది. ఒకసారి గోపికలందరూ శ్రీకృష్ణుడిని చుట్టుముట్టి "రాధాకృష్ణులు ప్రేమకు ప్రతిరూపం అంటారు కదా. అంతటి ప్రియసఖి రాధకు, నరకాసుర సంహారంలో సహాయపడిన సత్యభామకు, స్వయంవరం నుండి ఎత్తుకొచ్చి వివాహం చేసుకున్న రుక్మిణికి, మిగతా భార్యలు, గోపికలలో ఒక్కరికి కూడా నిత్యం నీతో కలిసి వుండే అదృష్టం, అవకాశం ప్రసాదించలేదు. మా మీద చులకన భావం ఎందుకు కృష్ణా? వేణువుకి మాత్రమే సదా నిన్ను అంటి పెట్టుకునే అవకాశం ఇచ్చావు. వేణువు మీద అంత ప్రేమ, ఇష్టం ఎందుకో కారణం తెలుసుకోవాలని ఉంది" అని అడిగారు గోపికలు. చిలిపి కృష్ణుడు కొంటెగా నవ్వి ఆ రహస్యం వేణువునే అడిగి తెలుసుకోమన్నాడు.

సంశయ నివృత్తి కోసం వేణువుని పలకరించిన గోపికలు "మేమంతా కృష్ణుడి సాంగత్యం, కడగంటి చూపు కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తుంటాము. ఎప్పటికో తప్ప ఆ అదృష్టం దక్కదు. అవకాశం వరించదు. నీవు మాత్రం కృష్ణుడితో



జ్యోతిర్మయం

నిత్యం గడిపే భాగ్యం పొందావు. ఇదెలా సాధ్యమైందో వినాలని ఉంది. నీకేమైనా మాయలు తెలుసా? ఏదైనా ప్రత్యేక వస్తువుతో తయారయ్యావా?" అని ప్రశ్నించారు.

ఆ ప్రశ్నకు వేణువు ఆశ్చర్యపోయినప్పటికీ బదులు పలికింది. "నాకు మాయలూ, మంత్రాలు తెలియవు. అతీంద్రియ శక్తులు అసలే లేవు. మీరనుకునే విధంగా ప్రత్యేకమైన వస్తువుతో తయారు కాలేదు. సుగంధం వెదజల్లడం కూడా తెలియదు. అంతెందుకు? సొంతంగా సంగీతం ఆలపించడం కూడా తెలియదు" అంది. గోపికలు ఆశ్చర్యపోయి "నీ సొంత ఆలాపన కూడా చేయకుండా కృష్ణుడి సాన్నిధ్యంలో నిత్యం గడపడం సాధ్యమైన విషయంగా నమ్మలేకపోతున్నాం. మరి నీ నుండి వినిపించే సంగీతం మాటేమిటి?" అని అడిగారు. "సొంత ఊహలు, సొంత ఆలోచనలు లేకుండా పూర్తిగా కృష్ణుడికి దాసోహమయ్యాను. నాకిష్టమైన సంగీతం ఎప్పుడూ ఆలపించలేదు. కృష్ణుడు ఇష్టపడి పలికించిన సంగీతాన్ని మాత్రమే ఆలపించాను. ఆయన సంగీత సాధనకు కేవలం నేనొక సాధనం అయ్యాను. అందువల్లనే కృష్ణుడికి నిత్యం చేరువగా ఉండే భాగ్యం దక్కింది" అంది వేణువు వినమ్రంగా.

కృష్ణుడుని సంతృప్తి పరచడానికి, ఆయన సాన్నిధ్యంలో నిత్యం గడపడానికి చేయాల్సిన పనేమిటో గోపికలకు బోధపడింది. భగవంతుడి మీద భారం వేసి దాసోహం అనడమే సరైన చర్య.

– నారంశెట్టి ఉమామహేశ్వరరావు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 270 1083


● 'మజిలీ'లో...


● '118'లో...


● 'ఎఫ్ 2'లో...


● 'యాత్ర'లో...


● 'చిత్రలహరి'లో...

# జ టు జూ రిపోర్ట్

**జనవరి టు జూన్**
**హాఫ్ ఇయర్లీ రిపోర్ట్ వచ్చేసిందోయ్.**
**టికెట్లు తెగాయి. టికెట్లు మిగిలాయి.**
**చాలాసార్లు ప్రేక్షకులు నవ్వారు.**
**కొన్నిసార్లు నిర్మాతలు నిరాశపడ్డారు.**

**చిత్రం : ఎఫ్ 2**
నటీనటులు : వెంకటేశ్, వరుణ్ తేజ్, తమన్నా, మెహరీన్
డైరెక్టర్ : అనిల్ రావిపూడి
నిర్మాత : 'దిల్' రాజు
విడుదల తేది : జనవరి 12
కథ : భార్య పెట్టే బాధలను భరించలేక వెంకటేశ్, పెళ్లయితే జీవితం ఇలా ఉంటుందేమోనని వరుణ్ తేజ్, ఆల్రెడీ పెళ్లయిన రాజేంద్ర ప్రసాద్ బ్యాంకాక్ పారిపోతారు. అక్కడ కొన్నిరోజులు ఉన్న తర్వాత తమ పెళ్లాలకు వేరే వాళ్లతో పెళ్లి సెట్ అవుతుందని తెలుసుకొని పెళ్లి చెడగొట్టే ప్రయత్నాలు చేస్తుంటారు తోడల్లుళ్లు వెంకీ, వరుణ్. ఈ ప్రయత్నాల్లో ఫ్రస్టేట్ అయి ఫన్ ఎలా క్రియేట్ చేశారన్నది కథ.
బడ్జెట్ : 40 కోట్లు ; వసూళ్లు : 94 కోట్లు

**చిత్రం : యాత్ర**
నటీనటులు : మమ్ముట్టి, జగపతిబాబు, సుహాసిని
దర్శకుడు : మహీ వి. రాఘవ్
నిర్మాత : విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి
విడుదల తేది : ఫిబ్రవరి 8
కథ : మాజీ ముఖ్య మంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాజకీయ చరిత్రలో పాదయాత్ర ఓ కీలక ఘట్టం. ఆ అంశం ఆధారంగా రెండు గంటల సినిమాలో పాదయాత్రలో రాజశేఖర్ రెడ్డి ప్రజల కష్టాలు ఎలా తెలుసుకున్నారు? వాటిలో నుంచి కొత్త కొత్త పథకాలకు పునాది ఎలా వేశారు? అనేది చిత్రకథ.
బడ్జెట్: 18 కోట్లు
వసూళ్లు: 22 కోట్లు

**చిత్ర : లక్ష్మీస్ ఎన్టీఆర్**
నటీనటులు : విజయ్‌కుమార్, యజ్ఞాశెట్టి, శ్రీతేజ్
దర్శకులు : రామ్‌గోపాల్ వర్మ, అగస్త్య మంజు
నిర్మాతలు : రాకేష్ రెడ్డి, దీప్తి
విడుదల తేది : మార్చి 29
కథ : అవిభక్త ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, నటుడు ఎన్టీఆర్ జీవితంలో రాజకీయ వెన్నుపోటు పర్వంగా ప్రజలు చెప్పుకునే సంఘటనల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కింది. ఎన్టీఆర్ సినిమా ప్రస్థానం గురించి కాకుండా.. ఎన్టీఆర్ జీవితంలోకి లక్ష్మీపార్వతి వచ్చినప్పటి నుంచి ఆయన జీవితం ఎలా సాగిందనే అంశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఎన్టీఆర్ పాత్రలో విజయ్‌కుమార్, లక్ష్మీపార్వతి పాత్రలో యజ్ఞా శెట్టి, చంద్రబాబునాయుడు పాత్రలో శ్రీతేజ్ నటించారు. కొన్ని నాటకీయ పరిణామాల మధ్య ఈ సినిమా తొలుత ఆంధ్రప్రదేశ్‌లో విడుదల కాని విషయం తెలిసిందే.
బడ్జెట్ : రెండున్నర కోట్లు ; వసూళ్లు : 7 కోట్లు

**చిత్రం : మజిలీ**
నటీనటులు : నాగచైతన్య, సమంత, దివ్యాంశ కౌశిక్
దర్శకుడు : శివ నిర్వాణ
నిర్మాతలు : సాహు గారపాటి, హరిష్ పెద్ది
విడుదల తేది : ఏప్రిల్ 5
కథ : వైజాగ్‌లో చదువుకుంటున్న పూర్ణ (నాగచైతన్య) అనే కుర్రాడు క్రికెటర్‌గా స్థిరపడాలని కలలు కంటుంటాడు. కానీ పూర్ణ తండ్రికి ఇష్టం ఉండదు. పూర్ణ వినే రకం కాదు. ఇక లాభం లేదని పూర్ణకు ఓ ఏడాది సమయం ఇస్తాడు అతని తండ్రి. ఈ ఏడాదిలోపు క్రికెటర్ అయితే ఓకే. లేకపోతే తను చెప్పింది చేయాలని అతని తండ్రి కండీషన్. పూర్ణ కూడా క్రికెట్‌పై ఫోకస్ పెడతాడు. ఇంతలో అతని జీవితంలో ప్రేమ చిగురిస్తుంది. అన్షు (దివ్యాంకా కౌశిక్) అనే అమ్మాయిని ప్రేమిస్తాడు. కానీ శ్రావణి (సమంత)ని పెళ్లి చేసుకోవాల్సి వస్తుంది. పూర్ణ ఎందుకు క్రికెటర్ కాలేకపోయాడు. అసలు అన్షు-పూర్ణ ఎలా విడిపోయారు? పూర్ణ లైఫ్‌లోకి శ్రావణి వచ్చిన తర్వాత జరిగిన సంఘటనలు ఏంటి? అనే పరిస్థితుల సమాహారమే ఈ సినిమా కథ.
బడ్జెట్ : 30 కోట్లు ; వసూళ్లు : 47 కోట్లు

**చిత్రం : చిత్రలహరి**
నటీనటులు : సాయిధరమ్ తేజ్, నివేదా పేతురాజ్, కల్యాణీ ప్రియదర్శన్.
దర్శకుడు : కిశోర్ తిరుమల
నిర్మాతలు : నవీన్ ఎర్నేని, చెరుకూరి మోహన్, వై. రవి శంకర్
విడుదల తేది : ఏప్రిల్ 12
కథ : ఇంజినీరింగ్ చదివి ఓ టీవీ రిపేర్ షాపులో వర్క్ చేస్తుంటాడు విజయ్ కృష్ణ. తెలివైన కుర్రాడు. కానీ లైఫ్‌లోని ప్రతీ స్టేజ్‌లో అతన్ని ఫెయిల్యూరే పలకరిస్తుంది. అందరూ అతన్ని ఫెయిల్యూర్ అంటున్నప్పటికీ అతని తండ్రి మాత్రం విజయ్‌ను ప్రోత్సహిస్తుంటాడు. ఈ క్రమంలో అతను డెవలప్ చేస్తున్న యాప్ ప్రజెంటేషన్‌లో కూడా విజయ్ ఫెయిల్ అవుతాడు. బ్యాడ్ లక్ కొద్దీ అతని లవ్‌స్టోరీ కూడా బెడిసి కొడుతుంది. ఆ టైమ్‌లో విజయ్ లైఫ్‌లో ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నాడు? అతనికి సాయంగా నిలబడింది ఎవరు? అటు కెరీర్‌లో.. ఇటు లవ్‌లో రెండింటిలోనూ విజయ్ గెలిచాడా?లేదా? అన్నదే కథ.
బడ్జెట్ : 16 కోట్లు ; వసూళ్లు : 22 కోట్లు

**చిత్రం : జెర్సీ**
నటీనటులు : నాని, శ్రద్ధాశ్రీనాథ్
దర్శకుడు : గౌతమ్ తిన్ననూరి
నిర్మాతలు : సూర్యదేవర నాగవంశీ
విడుదల తేది : ఏప్రిల్ 19
కథ : ఇండియన్ క్రికెట్ టీమ్‌కు ఆడాలని ఎంతో శ్రమిస్తుంటాడు అర్జున్ (నాని). రంజీ మ్యాచ్‌లలో మంచి క్రికెటర్‌గా పేరు తెచ్చుకుంటాడు. కానీ ఇండియన్ టీమ్‌లో ప్లేస్ మాత్రం దక్కదు. దీంతో విసుగెత్తిపోయిన అర్జున్ క్రికెట్‌ను వదిలేస్తాడు. ఆ లోపే సారా (శ్రద్ధాశ్రీనాథ్)తో అర్జున్ ఏడడుగులు వేయడం, వీరిద్దరికీ కుమారుడు (హరీష్ కల్యాణ్) పుట్టడం జరుగుతుంది. రంజీ క్రికెటర్‌గా తాను సంపాదించిన ప్రభుత్వోద్యోగాన్ని అవినీతి ఆరోపణల కారణంగా కోల్పోతాడు అర్జున్. కుటుంబ భారాన్ని సారా మోస్తుంటుంది. కొడుకుని క్రికెటర్‌ని చేయాలనుకుంటాడు అర్జున్. ఓ సారి నాని తన బర్త్‌డేకి తండ్రిని ఇండియన్ జెర్సీ(టీ షర్ట్)ని గిఫ్ట్‌గా అడుగుతాడు. నాని కోరిన ఈ చిన్ని కోరిక అర్జున్ జీవితాన్ని ఎలా మార్చింది? 36 ఏళ్ల వయసులో అర్జున్ మళ్లీ క్రికెటర్‌గా ఎందుకు గ్రౌండ్‌లో అడుగుపెట్టాడు? అసలు అర్జున్ ఎందుకు క్రికెట్‌ను వదిలేశాడు? అన్నదే కథ.
బడ్జెట్: 25 కోట్లు; వసూళ్లు: 36 కోట్లు

**చిత్రం : మహర్షి**
నటీనటులు : మహేశ్‌బాబు, పూజా హెగ్డే, 'అల్లరి' నరేశ్, ప్రకాశ్‌రాజ్ తదితరులు
నిర్మాతలు : అశ్వనీ దత్, 'దిల్' రాజు, పీవీపీ
దర్శకుడు : వంశీ పైడిపల్లి
విడుదల తేది : మే 9
కథ : డబ్బు సాధించడమే నిజమైన సక్సెస్ అనుకునే మనస్తత్వం ఉన్నవాడు రిషి. దానికోసం పరిగెడుతూ ఉంటాడు. ఈ ప్రయాణంలో తనకు దగ్గరైన ఇద్దరు వ్యక్తులకు దూరం అవుతాడు. ఫైనాన్షియల్ సక్సెస్ ముఖ్యమా? ఎమోషనల్ సక్సెస్ గొప్పా? అనే సందిగ్ధంలో రిషి ఎటువైపు నడిచాడు? ఇంతకీ జీవితంలో నిజమైన సక్సెస్ ఏంటో తెలుసుకున్నాడా? అనే కథ.
బడ్జెట్ : 130 కోట్లు
వసూళ్లు : 145 కోట్లు

**చిత్రం : ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ**
నటీనటులు : నవీన్ పొలిశెట్టి, శృతీ శర్మ, సుహాస్
నిర్మాత : రాహుల్ యాదవ్ నక్కా
దర్శకుడు : స్వరూప్ ఆర్ఎస్ జె
విడుదల తేది : జూన్ 21
కథ : డిటెక్టివ్ సినిమాల్లో ట్విస్ట్ రివీల్ అవకముందే పసిగడితే చాలు కేసులు సాల్వ్ చేయొచ్చు అనుకునే అమాయకపు జీనియస్ ఆత్రేయ. గుళ్లో హుండీలో డబ్బులు పోవడం, కుక్కపిల్లలు తప్పిపోవడం వంటి చిన్న చిన్న కేసులు డీల్ చేస్తుంటాడు. ఆ సమయంలోనే ఓ అనాథ శవాలతో క్రైమ్‌ను నడిపించే ఓ పెద్ద మాఫియా కేసుని టేకప్ చేస్తాడు ఆత్రేయ. ఆ మిస్టరీను ఎలా చేధించాడు? అనేది చిత్రకథ.
బడ్జెట్ : 4 కోట్లు
వసూళ్లు : ఇంకా థియేటర్లో రన్ అవుతోంది


● 'ఏజెంట్ సాయి...'లో..

**చిత్రం : మల్లేశం**
నటీనటులు : ప్రియదర్శి, అనన్య, ఝాన్సీ
దర్శక-నిర్మాత: రాజ్ ఆర్.
విడుదల తేది : జూన్ 21
కథ : పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం బయోపిక్. ఆసు పోయడం కోసం అమ్మ పడుతున్న అవస్థను చూడలేక ఆసు యంత్రం తయారు చేయాలనుకుంటాడు మల్లేశం. 6 కూడా పాస్ కాని మల్లేశం ఆసు యంత్రం ఎలా కనుక్కొన్నాడు? ఈ మెషీన్ తయారీలో తనకు ఎదురైన అడ్డంకులేంటి? అన్నది కథాంశం.
బడ్జెట్ : రెండున్నర కోట్లు
వసూళ్లు : ఇంకా థియేటర్లో రన్ అవుతోంది


● 'మల్లేశం'లో...

**చిత్రం : బ్రోచేవారెవరురా**
నటీనటులు : శ్రీవిష్ణు, నివేదా థామస్, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ
నిర్మాత : మన్యం విజయ్ కుమార్
దర్శకుడు : వివేక్ ఆత్రేయ
విడుదల తేది : జూన్ 28
కథ : దర్శకుడు అవాలని కలలు కంటుంటాడు సత్యదేవ్. టాప్ హీరోయిన్ నివేదా పేతురాజ్‌కి కథ చెప్పే అవకాశం వస్తుంది. ఇంటర్ ఏడేళ్లుగా పాస్ అయ్యే ప్రయత్నం చేస్తుంటారు శ్రీవిష్ణు, రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శి. వీళ్ల గ్యాంగ్‌లో ప్రిన్సిపల్ కూతురు నివేదా థామస్ కూడా తోడవుతుంది. సరదాగా సాగిపోతున్న సమయంలో నివేదా థామస్ కిడ్నాప్ అవుతుంది. సత్యదేవ్, నివేదా పేతురాజ్ వెళ్తున్న కార్‌కి యాక్సిడెంట్ అవుతుంది. సత్యదేవ్ సినిమా మొదలెట్టాడా? నివేదా థామస్ కిడ్నాపర్స్ నుంచి ఎలా బయటపడింది? అన్నది కథాంశం .
బడ్జెట్: 6 కోట్లు;
వసూళ్లు : ఇంకా థియేటర్లో రన్ అవుతోంది


● 'బ్రోచేవారెవరురా'లో...

**గమనిక:**
సినిమా బడ్జెట్, వసూళ్లకు చెందిన లెక్కలన్నీ సుమారుగా చెప్పినవే. అన్ని హక్కులు, థియేట్రికల్ రన్‌ను పరిగణించి వసూళ్లు ప్రచురించాం.

– గౌతమ్ మల్లాది,
– మునిమి శివాంజనేయులు

**చిత్రం : 118**
నటీనటులు : కల్యాణ్‌రామ్, నివేదా థామస్, షాలినీ పాండే
డైరెక్టర్ : కేవీ గుహన్
నిర్మాత : మహేష్ కోనేరు
విడుదల తేది : మార్చి 1
కథ : ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్టు గౌతమ్ (కల్యాణ్ రామ్) రిసార్ట్‌లోని 118 అనే రూమ్‌లో ఒక రోజు రాత్రి బస చేయాల్సి వస్తుంది. ఆ రోజు రాత్రి సరిగ్గా 1 గంట 18 నిమిషాలకు ఎవరో ఓ అమ్మాయిని హత్య చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు కలగంటాడు. మరో సందర్భంలోనూ అతనికి అదే కల వస్తుంది. అసలు ఆ గదికి, అతని కలకు ఉన్న లింక్ ఏంటి? గౌతమ్‌కి వచ్చిన కల నిజంగా జరిగిందా? ఈ ప్రాసెస్‌లో గౌతమ్‌కి ఎదురైన సంఘటనలు ఏంటి? అన్నదే కథ.
బడ్జెట్ : 12 కోట్లు
వసూళ్లు : 17 కోట్లు

**చిత్రం : కల్కి**
నటీనటులు : రాజశేఖర్, అదా శర్మ, రాహుల్ రామకృష్ణ
దర్శకుడు : ప్రశాంత్ వర్మ
నిర్మాత : సి. కల్యాణ్
విడుదల తేదీ : జూన్ 28
కథ : కొల్లాపూర్‌లో ఓ రాజకీయ నాయకుడి తమ్ముడు హత్యకు గురవుతాడు. ఆ హత్యను పరిశోధించడానికి పోలీస్ ఆఫీసర్ కల్కి (రాజశేఖర్) వస్తాడు. క్రైమ్ రిపోర్టర్ రాహుల్ రామకృష్ణ సహాయంతో ఆ హత్య ఎలా జరిగింది? దాని వెనక ఉన్న కారణం ఏంటి? అనే విషయాలను కల్కి ఎలా తెలుసుకుంటాడు? అన్నది కథాంశం.
బడ్జెట్: 16 కోట్లు
వసూళ్లు: ఇంకా థియేటర్స్‌లో రన్ అవుతుంది


● 'కల్కి'లో..


● 'వినయ విధేయ రామ'లో...


● 'ఎన్టీఆర్ కథానాయకుడు'లో...


● 'సీత'లో...


● 'మిస్టర్ మజ్ను'లో...


● 'సూర్యకాంతం'లో...

## అంచనాలు అందుకోలేదు

ఈ ఆరు నెలల్లో విడుదలైన చిత్రాల్లో భారీ అంచనాల నడుమ విడుదలైన మూడు నాలుగు సినిమాలు ఆ అంచనాలను అందుకోలేకపోయాయనే చెప్పాలి. ముఖ్యంగా దివంగత నటుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జీవితం ఆధారంగా తీసిన 'ఎన్టీఆర్ కథానాయకుడు', 'ఎన్టీఆర్ మహానాయకుడు', రామ్‌చరణ్ హీరోగా బోయపాటి శ్రీను తెరకెక్కించిన 'వినయ విధేయ రామ' సెన్సేషనల్ హిట్టవుతాయనే నమ్మకంతో థియేటర్‌కి వచ్చాయి. కానీ ఆ నమ్మకం నిజం కాలేదు. అఖిల్ 'మిస్టర్ మజ్ను' కూడా అందరూ ఊహించినట్లు ఘనవిజయాన్ని నమోదు చేసుకోలేకపోయింది. నిహారిక కొణిదెల నటించిన 'సూర్యకాంతం' వసూళ్లపరంగా విజృంభిస్తుందన్న నమ్మకాన్ని నిలబెట్టుకోలేకపోయింది. ఇంకా నిరాశపరచిన వాటిలో ప్రభుదేవా, తమన్నాల 'అభినేత్రి 2', అల్లు శిరీష్ 'ఏబీసీడీ', బెల్లంకొండ సాయి శ్రీనివాస్, కాజల్ అగర్వాల్‌ల 'సీత', మంచు విష్ణు 'ఓటర్' తదితర చిత్రాలు ఉన్నాయి. తాప్సీ 'గేమ్ ఓవర్'కి మంచి పేరొచ్చినా వసూళ్లు అంతంత మాత్రమే అని ట్రేడ్ టాక్. ఇలా మంచి టాక్ తెచ్చుకుని అంత మంచి వసూళ్లు రాబట్టలేకపోయిన సినిమాలూ ఉన్నాయి. 'ఫలక్‌నుమా దాస్'కి యూత్ ఎట్రాక్ట్ అయ్యారని టాక్ వచ్చింది కానీ వసూళ్లల్లో అది కనిపించలేదు. హవీష్ '7' కూడా ఇలా వచ్చి అలా వెళ్లిపోయింది.

# ఒకే ఇంటి నుంచి ముగ్గురు చీఫ్ సెక్రెటరీలు

స్త్రీ శక్తి


● కేశిని ఆనంద్ ఆరోరా: హర్యానా ప్రభుత్వ కొత్త ప్రధాన కార్యదర్శి

**కేశినీ ఆనంద్ గురించి మరికొంత**
● హర్యానా ప్రభుత్వ తొలి మహిళా డిప్యూటీ కమిషనర్ ● ఆస్ట్రేలియాలోని 'యూనివర్సిటీ ఆఫ్ వెస్టర్న్ సిడ్నీ' నుంచి ఎంబీఏ డిగ్రీ ● వయోజన విద్యావ్యాప్తికి కృషి ● మండల్ కమిషన్ అల్లర్లు, అలజడుల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణ ● ఉడాయ్ (ఆధార్) ఆఫీస్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ● ఆన్‌లైన్‌లో టీచర్‌ల బదలీ విధానానికి రూపకర్త ● నీతికి, నిజాయితీకి, నిబద్ధతకు మారుపేరు

దేశంలో అనేక చోట్ల సరస్వతీ నిలయాలు ఉన్నాయి. అయితే హర్యానాలోని ఒక 'సరస్వతీ నిలయం' వాటికి భిన్నమైనది. ఆ నిలయం నుంచి ఆదివారం నాడు హర్యానా ప్రభుత్వం మరొక మహిళను తన కొత్త ప్రధాన కార్యదర్శిగా నియమించుకుంది. ఆ మహిళ పేరు కేశిని ఆనంద్ ఆరోరా. అంతకుముందు అదే ఇంటినుంచి మీనాక్షీ ఆనంద్ చౌదరి (2005–06), ఊర్వశీ గులాటి (2009–12) ఆ రాష్ట్రానికి ప్రధాన కార్యదర్శులు అయ్యారు. ఈ ముగ్గురూ అక్కాచెల్లెళ్లు. పెద్దమ్మాయి మీనాక్షి, రెండో అమ్మాయి ఊర్వశి. ఇప్పుడు ప్రధాన కార్యదర్శి అయిన కేశిని మూడో అమ్మాయి. ఆ ఇంటిలో అంతా చక్కగా చదువుకుని, ముఖ్యంగా ఆ ఇంట్లోని అమ్మాయిలు ముగ్గురూ సరస్వతీ పుత్రికలై ఉన్నత పదవిని అలంకరించారు కనుకనే ఆ ఇంటిని సరస్వతీ నిలయం అనడం.


● అక్కచెల్లెళ్లు: కేశిని, మీనాక్షి, ఊర్వశి

కేశిని ఆనంద్ అరోరా 1983 బ్యాచ్ ఐ.ఎ.ఎస్. అధికారి. నాలుగేళ్లుగా ప్రధాన కార్యదర్శిగా ఉన్న డి.ఎస్.దేశి పదవీ విరమణతో ఆయన స్థానంలోకి వచ్చారు కేశిని. హర్యానాలో ఇప్పటి వరకు నలుగురు మహిళలు ఈ హోదాలో పని చేశారు. ఊర్వశి తర్వాత (వెనువెంటనే కాదు) ప్రమీలా ఇస్సార్ అనే మహిళ కొంతకాలం ఆ పదవిలో ఉన్నారు. ప్రస్తుతం బాధ్యతలు స్వీకరించిన కేశిని.. హర్యానాలో సీనియర్ మోస్ట్ ఐఏఎస్. మరో పద్నాలుగు నెలలు మాత్రమే సర్వీస్ మిగిలి ఉన్న కేశిని.. సాధారణ పరిపాలన, సిబ్బంది వ్యవహారాలు, పార్లమెంటరీ వ్యవహారాల శిక్షణ, పాలనా సంస్కరణ శాఖలను చూస్తారు.

మంచి విషయం

# ప్రశంసల జల్లు

చెన్నైని గతంలో వరదలు ముంచెత్తాయి. ఇప్పుడు నీటి కొరతతో ఆ మహా నగరం అల్లాడుతోంది. హోటళ్లు టిఫిన్స్ మాత్రమే ఉంచి, భోజనాల్ని రద్దు చేస్తున్నాయి. భోజనం తయారీకి డ్రమ్ముల కొద్దీ నీళ్లు కావాలి కదా అందుకని. కార్పొరేట్ ఆఫీసులు సైతం 'ఎవరి నీళ్లు వాళ్లే ఇంటి నుంచి తెచ్చుకోవాలి' అని నోటీసు బోర్డులు పెట్టేస్తున్నాయి! ఇళ్లల్లోనైతే మగ్గు నీరు కూడా మహద్భాగ్యం అయింది. అతిథులకు ఎవరైనా మంచినీళ్లిచ్చారంటే వాళ్లు ఉన్నదంతా దోచి ఇచ్చినట్లే. పరిస్థితి ఇంత ఘోరంగా ఉన్న ఈ తరుణంలో సూపర్‌స్టార్ రజనీకాంత్ కూతురు సౌందర్య, తన కొడుకు వేద్‌తో కలిసి ఈత కొలనులో సేదతీరడం సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలకు దారి తీసింది. ఆమె గుట్టుగా ఆ పని చేసి ఉన్నా ఇంతగా ట్రోల్ అయి ఉండేవారు కాదు. వేద్‌తో కలిసి స్విమ్మింగ్ పూల్‌లో ఉన్న ఫొటోను ఆమె నెట్‌లో షేర్ చేశారు. అది చూసి చెన్నై నెటిజన్‌లు ఆగ్రహంతో ఆమెపై కామెంట్లు పెట్టారు. సున్నితమైన ఈ పరిస్థితిని గమనించిన సౌందర్య వెంటనే ఫొటోను డిలీట్ చేసి, 'పిల్లలకు యాక్టివిటీస్ ఎంత ముఖ్యమో చెప్పేందుకు మాత్రమే ఆ ఫొటోను పోస్ట్ చేశాను. సందర్భోచితం కాదని తెలిసి తక్షణం తొలగిస్తున్నాను' అని ట్వీట్ చేశారు. దీంతో నీటికి కటకటగా ఉన్న చెన్నైలో ఇప్పుడు సౌందర్య మీద ప్రశంసల వర్షం కురుస్తోంది.


కొడుకు వేద్‌తో ఈతకొలనులో సౌందర్య

## ఈ పాటకు ట్యూన్ తెలుసా?



**పల్లవి :**
అలా చూడు ప్రేమలోకం పిలుస్తున్నది
కలే నేడు తీపి నిజమై ఫలిస్తున్నది
ప్రపంచమంతా దాటేద్దాం పద అన్నది
ప్రేమించుకుందాం రా నేస్తం
మన వయస్సు తపస్సు తరించు వరమిది
॥అలా॥

**చరణం : 1**
ప్రతీ జన్మ నీతోనే ముడేశాడు బ్రహ్మా
అనే నమ్మి నీ పేరే జపించాను లేమ్మా
అదే పాట నా దాకా ఎలా చేరెనమ్మా
ప్రతిబాట నావైపే నిన్నే పంపెనమ్మా
నిరంతరం నీ ఊసేదో నను రమ్మన్నది
ప్రతీక్షణం నీ ధ్యాసేగా కలవరించి వరించి రప్పించుకున్నది
॥అలా॥

**చరణం : 2**
అలల్లాంటి ఈ రాగం నువ్వే నేర్పలేదా
తుఫానంటి ఈ వేగం నువ్విచ్చింది కాదా
వెలే వేసి లోకాన్ని ఎటో వెళ్లిపోదాం
ఎదో చేసి కాలాన్ని అలా ఆగమందాం
రహస్య రాజ్యం చేరే జత కథే ఇదీ
సుఖాల తీరం కోరే మన ప్రయాణమివాళ ఫలించు క్షణమిది
॥అలా॥

**చిత్రం : ప్రేమించుకుందాం రా! (1997)**
**రచన : సిరివెన్నెల**
**సంగీతం : మహేష్**
**గానం : ఎస్.పి.బాలు, కె.ఎస్.చిత్ర**

కట్‌చేయ్‌...దాచేయ్‌...

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | 5 | | | 8 | | 4 | | 1 |
| 1 | | 6 | 4 | | | | | |
| 9 | 4 | | | | 5 | | 8 | 6 |
| 5 | 7 | | | 2 | 3 | | 6 | |
| 6 | | | 7 | | 4 | | | 8 |
| | 2 | | 1 | 6 | | | 7 | 5 |
| 7 | 1 | | 2 | | | | 3 | 9 |
| | | | | | 7 | 1 | | 2 |
| 2 | | | | 3 | | | 5 | 7 |

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 4 | 1 | 2 | 5 | 8 | 3 | 9 | 7 | 6 |
| 8 | 3 | 9 | 4 | 6 | 7 | 1 | 2 | 5 |
| 6 | 7 | 5 | 1 | 2 | 9 | 3 | 8 | 4 |
| 2 | 8 | 1 | 6 | 7 | 5 | 4 | 3 | 9 |
| 7 | 5 | 6 | 9 | 3 | 4 | 2 | 1 | 8 |
| 9 | 4 | 3 | 8 | 1 | 2 | 6 | 5 | 7 |
| 1 | 6 | 7 | 2 | 9 | 8 | 5 | 4 | 3 |
| 5 | 2 | 8 | 3 | 4 | 6 | 7 | 9 | 1 |
| 3 | 9 | 4 | 7 | 5 | 1 | 8 | 6 | 2 |

## ఈ అమ్మాయి



హరితేజ

'బిగ్ బాస్' ఫేమ్, నటి భానుశ్రీ ప్రధాన పాత్రలో దొంతు రమేష్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఈ అమ్మాయి'. అవధూత వెంకయ్యస్వామి ప్రొడక్షన్స్‌పై దొంతు బుచ్చయ్య నిర్మిస్తున్న ఈ సినిమా మూడవ షెడ్యూల్ సోమవారం ప్రారంభమైంది. దొంతు బుచ్చయ్య మాట్లాడుతూ – ''లేడీ ఓరియంటెడ్ చిత్రమిది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా రమేష్ తెరకెక్కిస్తున్నాడు. నటీనటులు, సాంకేతిక నిపుణుల సహకారంతో అనుకున్న షెడ్యూల్ ప్రకారం షూటింగ్ జరుగుతోంది. ఈ చిత్రంలోని నాలుగు పాటలను ఇండోనేషియాలోని అందమైన ప్రదేశాల్లో చిత్రీకరించనున్నాం. పాటల చిత్రీకరణతో షూటింగ్ పూర్తవుతుంది. ఈ నెలలో పాటలు రిలీజ్ చేసి, ఆగస్టు చివరి వారంలో సినిమాని విడుదల చేస్తాం'' అన్నారు. చమ్మక్ చంద్ర, సత్తిపండు, ధన్‌రాజ్, భద్రం, చలాకీ చంటి, హరితేజ, గోపాలకృష్ణ, మహేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎస్.రవి శంకర్.

## లుక్ టెస్ట్



మహేశ్‌బాబు

హాలిడే ముగిసింది. రెస్ట్ అయిపోయింది. మళ్లీ వర్క్ మోడ్‌కి షిఫ్ట్ అయ్యారు మహేశ్‌బాబు. నెక్స్ట్ చేయబోయే 'సరిలేరు నీకెవ్వరు' పాత్రలోకి మారిపోవడానికి రెడీ అయ్యారు. ఈ సినిమాకు సంబంధించి హైదరాబాద్‌లో మహేశ్ లుక్ టెస్ట్ జరుగుతోందని తెలిసింది. సినిమాలో మహేశ్‌బాబు ఏ లుక్‌తో కనిపించాలో ఈ లుక్ టెస్ట్‌లో డిసైడ్ అవుతారు. అలాగే చిత్రకథానాయిక రష్మికా మండన్నాపై కూడా ఫొటోషూట్ చేస్తున్నారట. విడివిడిగా ఇద్దరి లుక్ టెస్ట్ చేసి, జంటగా కూడా ఫొటోషూట్ జరుపుతున్నారని సమాచారం. ఈ సినిమాలో మహేశ్ ఆర్మీ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారని తెలిసిందే. అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని 'దిల్' రాజు, అనిల్ సుంకర నిర్మించనున్నారు. విజయశాంతి కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ నెల 5న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని సమాచారం. కశ్మీర్, కర్నూల్ ప్రాంతాల్లో ఎక్కువ శాతం షూటింగ్ జరగనుంది.

## తెలుగు సినిమా తీరు మారింది

**- సుకుమార్**

''సినిమా రచన వేరు, దర్శకత్వం వేరు. ఈ రెండూ ఒకరే చేయడంతో ఎక్కువ సినిమాలు చేయలేకపోతున్నాం. ఇప్పుడు తెలుగు సినిమా తీరు మారింది. నిజాయతీ నిండిన కథలే ప్రేక్షకుల మనసు గెలుచుకుంటున్నాయి. కొత్త దర్శకులు చాలా మంచి సినిమాలతో వస్తున్నారు'' అని దర్శకుడు సుకుమార్ అన్నారు. విజయ్ దేవరకొండ తమ్ముడు ఆనంద్ దేవరకొండ హీరోగా జీవితారాజశేఖర్‌ల కుమార్తె శివాత్మిక హీరోయిన్‌గా పరిచయమవుతోన్న చిత్రం 'దొరసాని'. కె.వి.ఆర్. మహేంద్ర దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. 'మధుర' ఎంటర్‌టైన్మెంట్, బిగ్ బెన్ బ్యానర్స్‌పై 'మధుర' శ్రీధర్ రెడ్డి, యష్ రంగినేని నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదల కానుంది. సురేష్ ప్రొడక్షన్స్ సమర్పణలో విడుదలవుతున్న ఈ సినిమా ట్రైలర్‌ని సుకుమార్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''నిషీధి' అనే షార్ట్ ఫిల్మ్‌తో శ్యామ్ బెనగల్ నుండి ప్రశంసలు పొందాడు కె.వి.ఆర్. మహేంద్ర. దర్శకుడిగా అతని అభిరుచి ఏంటో 'దొరసాని' ట్రైలర్ చెబుతోంది. ఈ కథలో అంతా నిజాయతీనే కనిపిస్తోంది. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి'' అన్నారు.

''కథ విన్నప్పుడు నాకు కలిగిన ఫీల్‌ని తెరమీదకు వందశాతం తెచ్చాడు మహేంద్ర. ఎడిటర్ నవీన్ నూలి మినహా దాదాపుగా అందరూ కొత్త వాళ్లతోనే ఈ సినిమా నిర్మించాం'' అన్నారు 'మధుర' శ్రీధర్ రెడ్డి. ''ఈ సినిమాలో ఏ ఎమోషన్ ఫేక్‌గా అనిపించదు. ఇందులో ఒక వాస్తవికత, స్వచ్ఛత ఉంది. 1980దశకాల్లో నడిచే ప్రేమ కథ ఇది'' అన్నారు కె.వి.ఆర్ మహేంద్ర. ''ఈ సినిమా ట్రైలర్ చూస్తుంటే ఇద్దరు కొత్త వాళ్లు చేశారనిపించడం లేదు. సామాజిక పరిస్థితులకు అద్దం పట్టే ఇలాంటి కథలు తప్పకుండా ఆలోచనలో మార్పును తెస్తాయి'' అన్నారు నిర్మాత దొరస్వామి రాజు. ''మా ఇంట్లో అంతా సినిమా వాతావరణమే. నా కుటుంబం నాకు ఒక పెద్ద ఫ్యామిలీ (సినిమా ఇండస్ట్రీ, అభిమానులు)ని ఇచ్చింది అని ఈ సినిమా చేస్తున్నప్పుడు తెలిసింది'' అన్నారు శివాత్మిక. ''అమెరికాలో ఉద్యోగం చేసేవాణ్ణి. 'పెళ్ళి చూపులు' ట్రైలర్ లాంచ్ రోజు ఆఫీస్‌కి వెళ్లకుండా రూమ్‌లో ఉన్నా. ట్రైలర్ లాంచ్‌లో విజయ్ మాట్లాడేది చూసి ఆనందంతో కన్నీళ్లొచ్చాయి. అన్నయ్యను సపోర్ట్ చేసిన సురేష్ ప్రొడక్షన్స్, మధుర ఎంటర్‌టైన్మెంట్స్, బిగ్ బెన్ ఇప్పుడు నన్ను సపోర్ట్ చేస్తున్నాయి'' అని ఆనంద్ దేవరకొండ చెప్పారు. ''చాలా మంచి ప్రేమ కథ ఇది. శివాత్మిక, ఆనంద్‌లకు ప్రేక్షకుల ఆశీస్సులు కావాలి. సినిమా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు జీవిత. ఈ చిత్రానికి కెమెరా: సన్నీ కూరపాటి, సంగీతం: ప్రశాంత్ ఆర్.విహారి, సహనిర్మాత: ధీరజ్ మొగిలినేని.



ఆనంద్, జీవిత, శివాత్మిక, సుకుమార్, 'మధుర' శ్రీధర్, మహేంద్ర

## సూపర్ స్పీడ్



కాజల్ అగర్వాల్

కథానాయికగా వచ్చి పన్నెండేళ్లు పూర్తయినా కాజల్ అగర్వాల్ సినిమాలు సైన్ చేయడంలో ఏ మార్పు లేదు. అదే స్పీడ్‌తో వరుస సినిమాలు అంగీకరిస్తున్నారు. ఈ ఏడాది గడిచిన ఆర్నెలల్లో ఆమె నటించిన ఓ సినిమా రిలీజ్ అయింది (సీత). రెండు సినిమాలు పూర్తయ్యాయి (రణరంగం, తమిళ చిత్రం కోమలి) కూడా. ఇప్పుడు మరో కొత్త చిత్రాన్ని కాజల్ అంగీకరించారని తెలిసింది. అది తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో రూపొందనుండటం మరో విశేషం. మంచు విష్ణు హీరోగా నటించి, నిర్మించనున్న చిత్రం 'భక్త కన్నప్ప'. ఇందులో విష్ణుకి జోడీగా కాజల్ అగర్వాల్‌ను హీరోయిన్‌గా అనుకుంటున్నారట. ఈ సినిమాను భారీ వ్యయంతో తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో తెరకెక్కించాలన్నది విష్ణు ఆలోచన. ఈ సినిమాకు హాలీవుడ్ టెక్నీషియన్స్ పని చేస్తారని తెలిసింది. ప్రస్తుతం లొకేషన్స్ వెతికే పనిలో పడ్డారు విష్ణు. త్వరలోనే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రానుంది.

## శ్రీహరిగారి పేరు నిలబెడతాడు

**- శాంతిశ్రీహరి**

''మేఘాంశ్ తొలి సినిమా 'భైరవ' (బాల నటుడు). 'రాజ్‌ధూత్' రెండవ (హీరో) చిత్రం. పాఠాలు సరిగ్గా చదవడు కానీ, డైలాగులున్న పేజీలు మాత్రం బాగా చదువుతాడు. మేఘాంశ్ రక్తంలోనే నటన ఉందని అప్పుడే అర్థమైంది. 'రాజ్‌ధూత్' ట్రైలర్ చూసిన తర్వాత శ్రీహరిగారి పేరును మేఘాంశ్ నిలబెడతాడన్న నమ్మకం వచ్చింది'' అని దివంగత నటుడు శ్రీహరి సతీమణి, నటి శాంతి అన్నారు. శాంతిశ్రీహరి తనయుడు మేఘాంశ్ కథానాయకుడిగా పరిచయమవుతోన్న చిత్రం 'రాజ్‌ధూత్'. నక్షత్ర, ప్రియాంక వర్మ హీరోయిన్లు. అర్జున్–కార్తీక్ దర్శకత్వంలో ఎమ్.ఎల్.వి సత్యనారాయణ (సత్తిబాబు) నిర్మించిన ఈ సినిమా ఈ నెల 5న విడుదల కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో నిర్మాత సి.కల్యాణ్ మాట్లాడుతూ– ''నేనీ స్థాయిలో ఉన్నానంటే కారణం మా బావ (శ్రీహరి). మా ఇద్దరిదీ 35 ఏళ్ల అనుబంధం. నాకు హైదరాబాద్‌లో ఇల్లు కొనిచ్చింది ఆయనే. దాని పేరు శ్రీహరి నిలయం. తండ్రిలా మేఘాంశ్ పెద్ద స్టార్ అవ్వాలి'' అన్నారు. ''మా దర్శకులు ఇద్దరైనా ఒక్కరిలా పనిచేసి, చాలా క్లారిటీతో ఈ సినిమా తీశారు. పైరసీని ఎంకరేజ్ చేయకుండా థియేటర్‌లో సినిమా చూడండి'' అని మేఘాంశ్ అన్నారు. ''నిర్మాతకు కథ చెప్పగానే మూడు రోజుల్లో ఓకే చేశారు. మేఘాంశ్ పెద్ద డైరెక్టర్స్‌తో సినిమాలు చేయొచ్చు.. కానీ మమ్మల్ని నమ్మి అవకాశం ఇచ్చారు'' అన్నారు అర్జున్–కార్తీక్. ''శ్రీహరిగారి వల్ల ఎంతో మంది వివిధ రంగాల్లో సెటిల్ అయ్యారు. నేను ఇలా ఉండటానికి కారణం శ్రీహరిగారే. ఆయన రుణం ఎప్పటికీ తీర్చుకోలేను'' అన్నారు ఫైట్ మాస్టర్ విజయ్. ''నేను నిర్మాతగా ఉన్నానంటే కారణం శ్రీహరిగారే. ఆయన ఉండుంటే ఇంకా చాలా మంది నిర్మాతలు ఇండస్ట్రీకి వచ్చేవారు. ఎంతో మందికి సహాయం చేసిన గొప్ప వ్యక్తి. మహాసముద్రంలాంటి వ్యక్తి మన మధ్య లేకపోవడం దురదృష్టకరం'' అన్నారు నిర్మాత బెల్లకొండ సురేష్. ''రాజ్‌ధూత్'తో నేను గొప్ప నిర్మాత అవుతానో? లేదో? తెలియదు. కానీ అర్జున్–కార్తీక్ మంచి దర్శకులవుతారు. మేఘాంశ్ బాగా నటించాడు'' అన్నారు చిత్రనిర్మాత సత్యనారాయణ. దర్శకులు ఇ.సత్తిబాబు, దేవీప్రసాద్, బాబీ, రవికుమార్ చౌదరి, శ్రీరామ్ ఆదిత్య, అజయ్ భూపతి, మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ తనయుడు సాయి, నటుడు రాజా రవీందర్, నిర్మాత అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణ, తలసాని సాయి, శాంతిశ్రీహరి, నక్షత్ర, మేఘాంశ్...

## కొత్త కాంబినేషన్



హవీష్



లింగుస్వామి

హీరోలకు కెరీర్ స్టార్టింగ్ స్టేజ్‌లో కమర్షియల్ సక్సెస్ అవసరం. వాటిని అందించడంలో దర్శకుడు లింగుస్వామి మాస్టర్ అనుకోవచ్చు. విశాల్‌ను 'పందెంకోడి', కార్తీని 'ఆవారా'తో అటు తమిళం, ఇటు తెలుగు భాషల్లో మంచి బ్రేక్‌ని అందించారు లింగుస్వామి. ఇప్పుడు హవీష్ హీరోగా తెలుగు, తమిళ భాషల్లో ఓ సినిమాకు దర్శకత్వం వహించనున్నారాయన. ఈ సినిమా ఆగస్ట్‌లో ప్రారంభం కానుంది. ఇదో మాస్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనుందని సమాచారం. సినిమాకు పని చేయనున్న మిగతా నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే ప్రకటించనున్నారు. విశాల్, కార్తీ తమ కెరీర్‌లో మంచి మాస్ హీరోలుగా నిలబడే సినిమాలను ఇచ్చినట్లే హవీష్‌కు మంచి బ్రేక్‌ని అందించి లింగుస్వామి తన మ్యాజిక్ రిపీట్ చేస్తారా? చూడాలి.

## సైకలాజికల్ థ్రిల్లర్

సాయి పల్లవి, ఫాహద్ ఫాజిల్, ప్రకాశ్‌రాజ్, అతుల్ కులకర్ణి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'అథిరన్'. వివేక్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ ఏడాది ఏప్రిల్‌లో విడుదలై మలయాళంలో ఘన విజయం సాధించింది. ఈ చిత్రాన్ని జయంత్ ఆర్ట్స్ బ్యానర్‌పై ఎ.కె. కుమార్, జి. రవికుమార్ తెలుగులో అనువదిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ– ''సైకలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన చిత్రమిది. 1970లలో కేరళలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమా రూపొందింది. ప్రభాస్ 'సాహో'కి నేపథ్య సంగీతం అందిస్తున్న జిబ్రాన్ ఈ చిత్రానికి అద్భుతమైన నేపథ్య సంగీతం ఇచ్చారు. ప్రస్తుతం అనువాద కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో తెలుగు టైటిల్ ప్రకటించి, ఆగస్టు చివరి వారంలో సినిమాని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం''అన్నారు. రెంజి పానికర్, లియోనా లిషోయ్, శాంతి కృష్ణ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: అను మోతేదత్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: దక్షిణ్ శ్రీన్వాస్, సంగీతం: పి.ఎస్. జయహరి.



సాయిపల్లవి, ఫాహద్ ఫాజిల్

## స్పెయిన్‌లో సందడి

మరో ఇరవై రోజులు స్పెయిన్‌లోనే గడపనున్నారు కీర్తీ సురేశ్. ఈ నెలాఖరకు గానీ ఇండియా రారని తెలిసింది. స్పెయిన్‌లో ఈ లాంగ్ స్టే తన కొత్త చిత్రం కోసమే. నూతన దర్శకుడు నరేంద్రనాథ్ దర్శకత్వంలో కీర్తీ సురేశ్ ఓ లేడీ ఓరియంటెడ్ సినిమా చేస్తున్నారు. జూన్ 11న ఈ సినిమా కొత్త షెడ్యూల్‌ను స్పెయిన్‌లో స్టార్ట్ చేశారు. ఈ షెడ్యూల్ జూలై 26 వరకూ సాగనుందని తెలిసింది. ఇటీవలే నదియా, కీర్తీ సురేశ్‌లపై కీలక సన్నివేశాలను షూట్ చేశారట. నదియా పాత్ర చిత్రీకరణ పూర్తయింది. స్పెయిన్ షెడ్యూల్‌తో ఈ సినిమా దాదాపు 90 శాతం షూటింగ్ పూర్తి చేసుకోనుందని తెలిసింది. దసరాకు ఈ సినిమా విడుదల కానుంది. మహేశ్ కోనేరు నిర్మాత. 'మహానటి' ఫేమ్ డ్యానీ కెమెరామేన్‌గా వ్యవహరిస్తున్నారు.



కీర్తీ సురేశ్

## చిత్రం చెప్పింది

ప్రేమలో ఉన్నవాళ్లంతా పెళ్లి చేసుకుంటారని చెప్పలేం. లవ్‌కి బ్రేకప్ చెప్పుకునే జంటలు ఉంటాయి. ఇప్పుడు అందాల తార సుస్మితా సేన్ తన బాయ్‌ఫ్రెండ్ రోహ్‌మన్‌తో లవ్‌కి కటీఫ్ చెప్పారన్నది కొందరి ఊహ. ఆ ఊహ తప్పని ఇక్కడున్న చిత్రం చెప్పింది. చిత్రం అంటే ఫొటో అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ ఫొటోని స్వయంగా సుస్మితా సేన్ విడుదల చేశారు. రోహ్‌మన్‌తో కలసి తాను జిమ్ చేస్తున్న ఫొటోను ఆమె బయటపెట్టారు. ఈ ఫొటో చాలు.. ఈ ఇద్దరూ విడిపోలేదని చెప్పడానికి. మరి పెళ్లెప్పుడూ అంటే.. ఇద్దరూ చేసుకున్నప్పుడు. ఆ విషయం గురించి మౌనం వహిస్తున్న ఈ ఇద్దరూ పార్టీల్లో, రెస్టారెంటుల్లో.. ఇలా చాలా చోట్ల జాయింట్‌గా కనిపిస్తున్నారు.



రోహ్‌మన్, సుస్మితాసేన్



విక్రమ్

## ఆగలేదండీ బాబు!

విక్రమ్ 'మహవీర్ కర్ణ' సినిమా ఆగిందా? చెన్నై కోడంబాక్కమ్‌లో జరుగుతున్న చర్చల్లో ఇదొకటి. మహాభారతంలోని 'కర్ణుడి' పాత్ర ఆధారంగా ఆర్.ఎస్. విమల్ దర్శకత్వంలో యునైటెడ్ ఫిల్మ్ కింగ్‌డమ్ సంస్థ ఈ చిత్రాన్ని ప్రకటించింది. దాదాపు ఏడాది క్రితం ఈ సినిమాకి సంబంధించిన వార్త బయటికొచ్చింది. తమిళ్, హిందీ భాషల్లో మొత్తం 300 కోట్ల బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని ప్లాన్ చేశారు. అయితే ఇప్పుడీ సినిమా గురించి చడీ చప్పుడూ లేకపోవడంతో ప్రాజెక్ట్‌కి బ్రేక్ పడిందనే వార్త ప్రచారంలోకొచ్చింది. సినిమా ఆగలేదండీ బాబు.. ప్రస్తుతం లొకేషన్స్ వెతికే పనిలో ఉన్నామని యూనిట్ సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రీ–ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రం ఫొటోషూట్ ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిందట.



ధనుష్

## నాలుగోసారి!

సెల్వరాఘవన్– ధనుష్ కాంబినేషన్‌కు తమిళంలో మంచి ఫాలోయింగ్ ఉంది. ఈ అన్నదమ్ములిద్దరూ తమ కాంబినేషన్ కుదిరిన ప్రతిసారీ ఓ డిఫరెంట్ సినిమాను ప్రేక్షకులకు అందించారు. 'కాదల్ కొండేన్ (తెలుగులో 'అల్లరి' నరేశ్ చేసిన 'నేను'), పుదుపేట్టై, మయక్కం ఎన్న' సినిమాలు వీరి కాంబినేషన్‌లో వచ్చి, పెద్ద హిట్స్‌గా నిలిచాయి. ఇప్పుడు వీరిద్దరూ నాలుగోసారి సినిమా చేయనున్నారు. ప్రస్తుతం ధనుష్ 'అసురన్' అనే సినిమా, దురై సెంథిల్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. ఈ సినిమాల తర్వాత అన్న సెల్వరాఘవన్ సినిమాను సెట్స్ మీదకు తీసుకెళ్తారు. ఈ మూడు సినిమాలనూ కలైపులి యస్.థాను నిర్మిస్తుండటం విశేషం.



శ్రీకాంత్

## వినోదం పంచే ఎర్రచీర

హారర్, యాక్షన్, సస్పెన్స్ ప్రధానంగా రూపొందుతున్న చిత్రం 'ఎర్రచీర'. సత్య సుమన్‌బాబు దర్శకత్వం వహిస్తున్నారు. బేబీ ఢమరి సమర్పణలో శ్రీ సుమన్ వెంకటాద్రి ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందుతున్న ఈ సినిమాలో హీరో శ్రీకాంత్ ఓ కీలక పాత్రలో నటించనున్నారు. సత్య సుమన్‌బాబు మాట్లాడుతూ– ''ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. చేజింగ్, హారర్, కామెడీ సన్నివేశాలు అబ్బురపరుస్తాయి. శతాధిక చిత్రాల హీరో శ్రీకాంత్ నటించడం మా సినిమాకి ప్రత్యేక ఆకర్షణ. ఆయన పాత్ర చాలా ఆసక్తికరంగా ఉంటుంది. శ్రీరాం, అలీ పాత్రలు ఆకట్టుకుంటాయి'' అన్నారు. ''బడ్జెట్ పరంగా ఎక్కడా రాజీ పడకుండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. ఆగస్టు చివరి వారంలో లేదా సెప్టెంబర్ మొదటి వారంలో సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం'' అని ఎగ్జిక్యూటివ్ నిర్మాత తోట సతీష్ అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: చందు.

## త్వరలో ఏపీ మా అవార్డులు

'మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్' ఆధ్వర్యంలో త్వరలో అవార్డులు ఇవ్వనున్నట్లు 'మా ఏపీ' వ్యవస్థాపకుడు–దర్శకుడు దిలీప్ రాజా, 'మా ఏపీ' ప్రెసిడెంట్ సినీ నటి కవిత తెలిపారు. తెనాలిలో ఇటీవల 'మా ఏపీ' సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత స్వర్గీయ విజయ నిర్మలకు నివాళులర్పించారు. అనంతరం దిలీప్‌రాజా, కవిత మాట్లాడుతూ– ''2018కి సంబంధించి ఉత్తమ చిత్రాలకు అవార్డులు ఇవ్వనున్నాం. ఎలాంటి జ్యూరీని నియమించకుండా తెలుగు రాష్ట్రాల ప్రజలే న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారు. ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తే వారిని అవార్డులకు ఎంపిక చేస్తాం. స్వర్గీయ విజయనిర్మల స్మారక అవార్డును ప్రముఖ దర్శకులకుగానీ, ప్రముఖ మహిళా నటీమణికిగానీ ఇస్తాం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రజలు ఆగస్టు 15, 2019 వరకు ఎంట్రీలను పంపొచ్చు. తమ పేరు, చిరునామా, ఆధార్ కార్డులతో ప్రజలు తమ తీర్పును సీల్డ్ కవర్‌లో 'మా ఏపీ' కార్యాలయం, ఆలపాటి నగర్, సుల్తానాబాద్, తెనాలి–522201, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్‌కు పంపాలి'' అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నటుడు, 'మా ఏపీ' ప్రధానకార్యదర్శి నర్సింహరాజు, జయశీల, నిర్వహణ కమిటీ చైర్మన్ బాసింశెట్టి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సాగుబడి
నల్లగొండ
మంగళవారం 2-7-2019

పాత నమూనాపై దుమ్మెత్తిపోయడం
ద్వారా ఎప్పటికీ మార్పు తేలేవు
ఆ నమూనాను తలదన్నే సరికొత్త నమూనాను నిర్మించాల్సిందే!
- రిచర్డ్ బక్‌మిన్‌స్టర్ ఫుల్లర్, అమెరికన్ ఆర్కిటెక్ట్

ఆరుద్ర కార్తె - జూలై 5 వరకు, పునర్వసు కార్తె - జూలై 6 నుంచి



# పచ్చ బంగారం!

**ప్రకృతికి, భూమికి, రైతుకు మేలు చేసే సరికొత్త పంట వెదురు. గత ఏడాది వరకు వెదురు అటవీ జాతి మొక్క. పార్లమెంటులో చట్టసవరణ చేసిన తర్వాత రైతులు సాగు చేయదగిన పంటగా మారింది. నేషనల్ బాంబూ మిషన్ ప్రోత్సాహంతో రైతుల పొలాల్లో దీర్ఘకాలిక తోటలుగా ఏడాది పొడవునా పచ్చగా అలరారే వెదురు పొదలు విస్తరించబోతున్నాయి. సాంఘికపరంగా, వాణిజ్యపరంగా, ఆర్థికపరంగా ప్రాధాన్యత సంతరించుకున్న వెదురును అటవీయేతర ప్రభుత్వ భూములు, రైతుల భూముల్లో ఎంపిక చేసిన రాష్ట్రాల్లో సాగు చేయించడానికి ఈ ఏడాది నుంచే నేషనల్ బాంబూ మిషన్ శ్రీకారం చుట్టింది. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కూడా ఉన్నాయి. ఆంధ్రపదేశ్‌లో అటవీ శాఖ, తెలంగాణలో ఉద్యాన శాఖ వెదురు సాగుకు సంబంధించి నోడల్ విభాగంగా పనిచేస్తున్నాయి. నాటిన నాలుగో ఏడాది నుంచి 70-80 ఏళ్ల పాటు రైతుకు ఏటా ఆదాయం వస్తుందని అధికారులు చెబుతున్నారు. మామిడి, జీడిమామిడి తోటలకన్నా ఎక్కువ ఆదాయాన్ని సమకూర్చుతుందని భావిస్తున్న వెదురు పంట సాగు పద్ధతి ఏమిటన్నది ఆసక్తికరమైన అంశం. పొలాల్లో తోట మాదిరిగా సాగు చేసుకోవచ్చు లేదా ఇతర తోటలు, పంటలు సాగయ్యే పొలాల గట్లపైన కూడా వెదురును నాటుకోవచ్చు.. రోజుకు అర అడుగు చొప్పన వేగంగా పెరగడమే కాకుండా.. భూతాపాన్ని తగ్గించడంలో కీలకపాత్ర పోషించనున్న వెదురు సాగు వివరాలు 'సాగుబడి' పాఠకులకు ప్రత్యేకం..**

వేగంగా పెరుగుతూ రైతుకు కొన్ని దశాబ్దాల పాటు నిరంతర ఆదాయాన్నిచ్చే పర్యావరణహితమైన చెట్టు వెదురు. అందుకనే వెదురును పచ్చని బంగారం అని, పేదవాడి కలప అని, ప్రజల స్నేహితుడు అని పిలుస్తుంటారు. ఆకురాల్చే సతత హరిత మొక్కగా ప్రసిద్ధి పొందింది. ప్రకృతి నుంచి తాను తీసుకునే ప్రతి లీటరు నీటి కి 6.6 గ్రాముల కలపను అందిస్తుంది. మన దేశంలో 23 జాతులకు చెందిన 136 రకాల దేశ, విదేశీ వెదురు రకాలు అందుబాటులో ఉన్నాయి. మన అడవుల్లో 1.37 కోట్ల హెక్టార్లలో విస్తరించిన వెదురు పొదలు 1.25 కోట్ల టన్నుల వెదురు గడల దిగుబడినిస్తున్నాయని అంచనా. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నర్సరీలను ఏర్పాటు చేయించి ఈ ఏడాది 9 లక్షల వెదురు మొక్కలను రైతులకు అందించనుంది. తెలంగాణ ఉద్యాన శాఖ వెదురు రకాలను, సాగు పద్ధతులను ఖరారు చేసి రైతులను సమాయత్తం చేస్తోంది.

## ఏయే నేలల్లో వెదురు పెరుగుతుంది?

వాగుల వెంబడి, పర్వత కొండవాలు వెంబడి తేమ వాతావరణం గల లోయలలో, కొండ ప్రాంతాలతోపాటు పల్లపు ప్రాంతాల్లోనూ, ఉష్ణ, సమశీతోష్ణ స్థితి, శీతల ప్రదేశాల్లో పెరుగుతుంది. సముద్ర మట్టానికి 4 వేల మీటర్ల ఎత్తు ప్రాంతాల్లో కూడా పెంచవచ్చు. వెదురు సాగుకు ఇసుకతో కూడిన బంక మన్ను, ఎర్ర నేలలు, నల్లరేగడి నేలలు అనుకూలం. ఆమ్ల నేలలు పనికి రావు. నేలలో ఉదజని సూచిక 6.5 – 7.5 వరకు ఉండాలి. 2 అడుగుల లోతు వరకు మంచి మట్టి ఉంటే వెదురు బాగా పెరుగుతుంది.

## పొలాల్లో సాగుకు అనువైన వెదురు రకాలు

రైతుల పొలాల్లో సాగుకు అనువైనవిగా 5 వెదురు రకాలను గుర్తించారు.

**బాంబూస బాల్ కోవా (భీమా వెదురు) :** ఇది ముఖ్యంగా బాగా ఎత్తుగా, నిటారుగా పెరిగే వెదురు రకం. దీని కణుపులు దగ్గరగా, గట్టిగా ఉండి చిన్న రంధ్రం ఉంటుంది. ఇది చాలా ఎక్కువ దిగుబడినిచ్చే రకం. కలపకు, ఇంటి వస్తువుల తయారీకి, పనులకు ఉపయోగపడుతుంది. తడి ఎక్కువగా ఉన్న బంక మట్టి నేలలు అనుకూలం. ఇది ఎక్కువ దిగుబడినిచ్చే రకం. 30–45 ఏళ్లకు పుష్పిస్తుంది.

**డెన్డ్రోకాలమస్ స్ట్రిక్టస్ :** ఈ రకం మంచినీటి వసతి గల పొడి నేలల్లో బాగా పెరుగుతుంది. కొండరాయి, చదును భూములు అనుకూలం. ఇది ఎక్కువ తడి గల ప్రదేశాలలో పెరగదు. గులక, బంక మట్టి నేలలు ఇష్టపడదు. ఈ రకం వెదురు బొంగులు పక్క కొమ్మలు లేకుండా సాఫీగా నిటారుగా ఉంటాయి.

**డెన్డ్రోకాలమస్ హామిల్టోని :** ఈ వెదురు మొక్కకు సారవంతమైన బంకమట్టి ఇసుక నేలలు అనుకూలం. తడిగా ఉండే ప్రాంతాలు అంటే అధిక వర్షపాతం గల జిల్లాల్లో లోయలు, వాగుల వెంబడి పెంచవచ్చు. దీని ఆకులలో సిలికేట్ తక్కువగా ఉంది. పశుగ్రాసంగా కూడా వాడవచ్చు. 30 సంవత్సరాలకు ఒకసారి పుష్పిస్తుంది.

**బాంబూస టుల్డా :** ఈ రకం వెదురు నదీ ప్రవాహం వెంబడి ఉన్న గులకరాళ్ల నేలల్లో తడిగా ఉన్న గులకరాళ్ల నేలల్లో తడిగా ఉన్న ప్రదేశాలు ఇష్టపడతాయి. ఇది దక్షిణ పీఠభూమిలోని అడవుల్లో కనిపిస్తుంది. ఇది 35–60 ఏళ్లకోసారి పుష్పిస్తుంది.

**డెన్డ్రోకాలమస్ ఆస్పర్ :** ఈ వెదురు మొక్క ఈశాన్య రాష్ట్రాల్లో వ్యాపించి ఉంది. దీని పిలకలను కూరగాయగా వాడతారు. మొలిచే 4–5 రోజుల వయసు కలిగి, 1 – 15 అడుగుల ఎత్తు మొలిచిన కాండం సూదిలా ఉన్న త్రికోణపు లేత కొమ్మలను కూరగాయలుగా వాడవచ్చు. ఇది 30 సంవత్సరాలకు ఒకసారి పుష్పిస్తుంది.

వెదురు చెట్ల జీవితకాలం రకాన్ని బట్టి 7–120 ఏళ్ల మధ్య ఉంటుంది. ఏ రకం వెదురు చెట్టయినా పుష్పించిన తర్వాత చనిపోతుంది. ఒక ప్రదేశంలో సేకరించిన విత్తనాలను ఏ ప్రదేశంలో నాటినా అది పుష్పించే విధానంలో ఏ మాత్రం మార్పుండదు. నవంబర్ నుంచి మార్చి లోపు పుష్పించి, విత్తనాలు ఏప్రిల్, మే నెలలో పక్వానికి వస్తాయి. 4×7 సంచులలో జనవరిలో నాటాలి. అధిక వర్షపాతం పడిన తర్వాత జూన్/జూలై నెలల్లో మొలుస్తాయి. వెదురు దుంపలు, చిన్నకాండాలు, కాండం శాఖల పిలకలను నాటుకోవడం మంచిది. టిష్యూకల్చర్ ద్వారా కూడా వెదురు మొక్కలను ఉత్పత్తి చేయవచ్చు.

## ఎకరానికి 160 మొక్కలు

వెదురును తోటగా నాటుకోదలచిన భూమిని మొదట బాగా కలియదున్నాలి. వెదురు మొక్కల మధ్య, వరుసల మధ్య 5 మీటర్ల(5×5 మీ.) ఎడంలో నాటుకోవాలి. రెండు అడుగుల లోతు, వెడల్పు, పొడవు (60×60×60 సెం.మీ.) గుంతలను తవ్వి, వాటిలో బాగా చివికిన 25 కిలోల పశువుల ఎరువు వేసి, పై మట్టితో కలపాలి. ఈ విధంగా నాటితే ఎకరానికి 160 మొక్కలు సరిపోతాయి.

- వార్షిక పంటలు సాగు చేసుకునే పంట పొలాల్లో గట్ల మీద 2 మీటర్ల దూరంలో వెదురు మొక్కలు నాటుకోవచ్చు.
- ప్రెసిషన్ ఫార్మింగ్‌లో అధిక సాంద్రత సాగులో అయితే వరుసల మధ్య 8 అంగుళాలు, మొక్కల మధ్య 4 అంగుళాల దూరం పాటించాలి. ఇలా రెండు వరుసలు నాటుకున్న తర్వాత అడుగు ఖాళీ వదలి మళ్లీ అదే పద్ధతిలో 8×4 అంగుళాల దూరంలో నాటుకోవాలి. ఇలా నాటితే ఎకరానికి వెయ్యి మొక్కలు వేసుకోవచ్చు. ?
- నాలుగేళ్లకు వెదురు బొంగుల దిగుబడి ప్రారంభం
- నాటిన 4 ఏళ్లు గడచిన తర్వాత మంచి దిగుబడి వస్తుంది.
- ఎకరానికి 160 వెదురు మొక్కలు నాటిన తర్వాత 5వ సంవత్సరం నుంచి సంవత్సరానికి ఎకరానికి 10 నుంచి 14 టన్నుల వెదురు బొంగుల దిగుబడి వస్తుందని తెలంగాణ ఉద్యాన శాఖ అంచనా.

### 9.5 లక్షల వెదురు మొక్కలు సిద్ధం



తెలంగాణ రాష్ట్రంలో బాంబూ మిషన్ అమలుకు రూ. 11 కోట్లను ఖర్చు చేయనున్నామని, ఈ ఏడాది రైతులకు ఉచితంగా పంపిణీ చేయడానికి 9.5 లక్షల వెదురు మొక్కలను సిద్ధం చేశాం. ఫర్నిచర్ తయారీకి, బుట్టలు తదితర హస్తకళాకృతులు తయారు చేయడానికి, ఇళ్ల నిర్మాణంలో వాసాలుగా వాడేందుకు తెలంగాణకు అనువైన 4 రకాల వెదురును ఎంపిక చేశాం. రోజుకు అరడుగు ఎత్తున వెదురు పెరుగుతుంది. ఒక్కో వెదురు పొద నుంచి ఏడాదికి కనీసం 7 గడల దిగుబడి వస్తుందని అంచనా. ఎంత తక్కువగా చూసినా గడ రూ. వందకు అమ్ముడుపోతుంది. ఏటా ఎకరానికి రూ. లక్షకు తగ్గకుండా ఆదాయం వస్తుంది. కోతులు, అడవి పందులు, రాళ్ల వర్షం, దొంగల బారి నుంచి ఎటువంటి ముప్పూ వెదరుకు లేకపోవడం విశేషం. ఈ ఏడాది తెలంగాణలో 2,500 మంది రైతులకు వెదురు సాగుపై రాయితీ ఇస్తున్నాం. ఆసక్తి గల తెలంగాణ రైతులు మీసేవా కేంద్రాల్లో పట్టాదారు పాసుపుస్తకం చూపి తమ పేర్లు నమోదు చేయించుకోవచ్చు. వాతావరణంలో నుంచి రోజుకు మూడున్నర కిలోల కార్బన్ డయాక్సయిడ్‌ను తీసుకొని, మూడు కిలోల ఆక్సిజన్‌ను వెదురు పొద విడుదల చేస్తుంది. ఆ విధంగా రైతుకు ఆదాయాన్నివ్వడంతోపాటు భూతాపాన్ని తగ్గించడానికి కూడా వెదురు సాగు ఉపకరిస్తుంది.

**– వెంకట్రామ్‌రెడ్డి, కమిషనర్, తెలంగాణ ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ**

- ప్రెసిషన్ ఫార్మింగ్‌లో అధిక సాంద్రత సాగులో అయితే 3వ సంవత్సరం నుంచి ఎకరానికి 40 టన్నుల దిగుబడి వస్తుంది.
- 6వ సంవత్సరం నుంచి పొదకు 6 నుంచి 10 బొంగుల చొప్పున పంటకోత చేయవచ్చు. ఆ సంవత్సరం పుట్టిన కొత్త వెదురు మొక్కలతో పాటు 7 పాత బొంగులను వదలి మిగతావి నరకాలి. ఈ పద్ధతినే ఎన్+7 పద్ధతి అంటారు.
- వెదురు తోటలకు ఎకరానికి రూ. 40 వేల ఖర్చు

తోటగా వెదురు పొదలు సాగు ప్రారంభించడానికి ఎకరానికి రూ. 40 వేలు, హెక్టారుకు రూ. లక్ష ఖర్చవుతుంది. ఖర్చులో సగం ప్రభుత్వం రాయితీ ఇస్తుండగా, మిగతా సగాన్ని బ్యాంకుల నుంచి రైతులు రుణం పొందవచ్చు. తెలంగాణలో వెదురు సాగు చేసే ప్రతి రైతుకు గరిష్టంగా 2 హెక్టార్లకు ప్రభుత్వం రాయితీ ఇస్తున్నది. రాయితీ మొత్తంలో మొదటి ఏడాది 50%(ఎకరానికి రూ. 10 వేలు), రెండో ఏడాది 30%(ఎకరానికి రూ. 6 వేలు), మూడో ఏడాది 20%(ఎకరానికి రూ. 4 వేలు) రాయితీని విడుదల చేస్తారు. నాలుగో ఏడాది నుంచి వెదురు గడల దిగుబడితో రైతుకు ఆదాయం రావడం ప్రారంభమవుతుంది.

## పొలం గట్లపై కూడా..

రైతులు పొలాల్లో పూర్తిగా తోటగా కాకుండా కేవలం గట్లపై పెంచడాన్ని కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. గట్ల మీద ఎటుచూసినా రెండు మీటర్ల దూరంలో వెదురు మొక్కలను నాటుతున్నారు. ఆ విధంగా ఎకరానికి 130 మొక్కలు పడతాయి. రెండు ఎకరాల వరకు ప్రభుత్వ రాయితీ 50%, ఆపైన విస్తీర్ణానికి ప్రభుత్వ రాయితీ 20% మాత్రమే. రాయితీ మొత్తాన్ని మొదటి సంవత్సరం 50%, రెండో సంవత్సరం 30%, మూడో సంవత్సరం 20% రైతులకు అందిస్తారు.

వెదురు నర్సరీలను ప్రతి జిల్లాలో ప్రోత్సహించడం, ఆ మొక్కలతో రైతులు పండించిన వెదురుతో ఆయా జిల్లాల్లోనే ఫర్నిచర్, బుట్టలు తదితర హస్తకళా వస్తువులు తయారు చేయించడం ద్వారా, ఇళ్ల నిర్మాణానికి వినియోగించడాన్ని ప్రోత్సహించడం ద్వారా మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడానికి కూడా నేషనల్ బాంబూ మిషన్ ద్వారా ప్రణాళికలు అమలుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. రైతులకు ఎకరానికి రూ. లక్ష వరకు ఆదాయాన్ని ఇవ్వడంతో పాటు భూతాపాన్ని గణనీయంగా తగ్గించడానికి వెదురు సాగు ఉపయోగపడుతుంది.

## 7న ఏలూరులో సురక్షిత వ్యవసాయ, ఆహార సదస్సు

గో ఆధారిత వ్యవసాయదారుల సంఘం, లయన్స్ క్లబ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూలై 7 (ఆదివారం)న ఉ. 9 గం. నుంచి మ. 3 గం. వరకు ఏలూరులోని ఐ.ఎ.డి.పి. హాల్ (డి.ఇ.వో. ఆఫీసు ఎదుట)లో సురక్షిత వ్యవసాయ, ఆహార సదస్సు జరగనుంది. సేఫ్ ఫుడ్ మూవ్‌మెంట్ చైర్మన్ డాక్టర్ పి.బి. ప్రతాప్ కుమార్, ప్రకృతి వ్యవసాయ నిపుణులు గద్దె సతీష్, చిరుధాన్యాల ఆవశ్యకత – వంటకాలపై మిల్లెట్స్ రాంబాబు, వ్యవసాయ భూముల్లో ఔషధ మొక్కల గుర్తింపు – వాటి ప్రయోజనాలపై నిపుణులు దాట్ల సుబ్బరాజు, ప్రకృతి వ్యవసాయంపై గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం నేత సుబ్రహ్మణ్యంరాజు(76598 55588) తదితరులు ప్రసంగిస్తారు. వివరాలకు.. డా. ప్రతాప్‌కుమార్ – 94401 24253

## ఆదివారం బసంపల్లిలో గో ఆధారిత వ్యవసాయంపై శిక్షణ

అనంతపురం జిల్లా చెన్నే కొత్తపల్లి మండలం బసంపల్లి గ్రామంలోని ఆలయ ప్రాంగణంలో జూలై 7(ఆదివారం)న ఉ. 9 గం. నుంచి సా. 4 గం. వరకు గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ పద్ధతిపై సీనియర్ రైతు నాగరాజు శిక్షణ ఇస్తారు. పాల్గొనదలచిన రైతులు ముందుగా తమ పేర్లు నమోదు చేయించుకోవాలి. రుసుము రూ. 100 (భోజనం సహా). వివరాలకు.. 91826 71819, 94405 66069

## ప్రతి నెలా 9న నాచుగుంటలో ప్రకృతి వ్యవసాయంపై సదస్సు

ఆంధ్రప్రదేశ్ గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం అధ్యక్షులు, సీనియర్ ప్రకృతి వ్యవసాయదారుడు భూపతిరాజు రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో ప్రతి నెలా 9 వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లా ఉంగుటూరు మండలం నాచుగుంట గోశాలలో రైతులకు శిక్షణ ఇస్తారు. ఉ. 10 గం. నుంచి సా. 5 గం. వరకు శిక్షణ ఇస్తారు. గత పదేళ్లుగా రామకృష్ణంరాజు 12 ఎకరాలలో వరి, చెరకు తదితర పంటలను తక్కువ నీటితో సాగు చేస్తూ చక్కని ఫలితాలు సాధిస్తూ.. నేరుగా వందలాది మంది వినియోగదారులకు ట్రాన్స్‌పోర్ట్ ద్వారా అందిస్తూ అద్భుత నికరాదాయం పొందుతున్నారు. వివరాలకు.. 94404 87864

## విశిష్ట పసుపు వంగడం 'పీతాంబర్'

- **అత్యధిక దిగుబడితోపాటు 12.5% కుర్కుమిన్**
- **విడుదలైన మూడేళ్లకు కొల్లిపర రైతు క్షేత్రంలోకి..**



పీతాంబర్ పసుపు మొక్క



పీతాంబర్ పసుపు విత్తనం

అంతర్జాతీయ మార్కెట్లో ఆదరణ కోల్పోతున్న దేశవాళీ పసుపు సాగుచేసే రైతుల కోసమని లక్నోలోని కేంద్రీయ ఔషధ, సుగంధ మొక్కల సంస్థ (సీఐఎంఏపీ–సీమాప్), రూపొందించిన సీఐఎం–పీతాంబర్ రకం పసుపు విత్తనాన్ని గుంటూరు జిల్లా తెనాలి సమీపంలోని కొల్లిపర రైతు వుయ్యూరు సాంబిరెడ్డి దక్కించుకున్నారు. సాధారణ రకాల కన్నా అధికంగా 60–65 క్వింటాళ్ల దిగుబడినీ, రెట్టింపునకు పైగా అంటే 12.5 శాతం కుర్కుమిన్‌ను ఇచ్చే కొత్త పసుపు వంగడాన్ని 2016 అక్టోబరులో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విడుదల చేశారు. అప్పట్నుంచి విత్తన అభివృద్ధికి కృషి చేస్తున్న ఆ సంస్థ, ఈ ఏడాది దేశవ్యాప్తంగా 40 మంది రైతులకు ఐదేసి కిలోల చొప్పున విత్తన పసుపును అందజేసింది. సేంద్రియ విధానంలో అధిక కుర్కుమిన్ శాతం పసుపు సాగులో ప్రయోగాలు చేస్తున్న సాంబిరెడ్డి, ఆ నలభై మందిలో ఒకరు.

ప్రస్తుతం సాగులో వున్న పసుపు వంగడాల్లో కుర్కుమిన్ శాతం 3 శాతం నుంచి గరిష్ఠంగా 7 శాతం మాత్రమే వుంటోంది. పసుపు ఉత్పత్తిలో అగ్రగామి భారత్‌లో దేశవాళీ రకాల్లో కుర్కుమిన్ తగ్గిపోవటం, ఎగుమతి మార్కెట్లో అవకాశాలు తగ్గిపోతూ ధరను కోల్పోతున్నాయి. లక్నోలోని 'సీమాప్' శాస్త్రవేత్త డాక్టర్ గుప్తా ఎనిమిదేళ్ల కృషి చేసి పీతాంబర్ పసుపు వంగడాన్ని రూపొందించారు. వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన 130 రకాల పసుపుపై విస్తృత పరిశోధనల అనంతరం అధికోత్పత్తిని, అధిక కుర్కుమినాయిడ్ (కుర్కుమిన్) కలిగిన క్లోన్‌ను గుర్తించి సీఐఎం–పీతాంబర్‌గా నామకరణం చేశారు. 180–190 రోజుల్లోనే పంట చేతికొస్తుంది. ఆకుమచ్చ తెగులును తట్టుకుని, రైతుకు రెండింతలు లాభాన్నిస్తుందని శాస్త్రవేత్తలు ప్రకటించారు.

'పసుపు రైతుల ఆశాకిరణం 'పీతాంబర్'' శీర్షికన 2016 నవంబరు 8న 'సాగుబడి' పేజీలో ప్రచురితమైన కథనంతో, సేంద్రియ పసుపు సాగులో వున్న వుయ్యూరు సాంబిరెడ్డి సీమాప్ సంస్థను సంప్రదించారు. ఆయన ప్రయత్నాలు ఫలించి ఈ జూన్ 21న కొరియర్‌లో పసుపు విత్తనం అందుకున్నారు. అదే రోజు తన చేలో విత్తారు. అధిక ధరలకు పసుపు విత్తనం కొనుగోలు చేయలేక సాంబిరెడ్డి, గత రెండేళ్లుగా మేలు రకం విత్తనాన్ని కొద్దికొద్దిగా సేకరించుకుని అభివృద్ధి చేస్తున్నారు. తొలి ఏడాది 'ప్రగతి' రకం (కేరళ, 3.62 శాతం కుర్కుమిన్), రెండో ఏడాది బిహార్‌లో అభివృద్ధి చేసిన రాజేంద్ర సోనియా (8.4 శాతం), రాజేంద్ర సోనాలి (6–7 శాతం) రకాలను సాగు చేశారు. ప్రస్తుతం ఆ మూడు రకాలతోపాటు పీతాంబర్‌ను కలిపి మొత్తం ఎకరం విస్తీర్ణంలో నాటినట్టు సాంబిరెడ్డి చెప్పారు. సేంద్రియ సాగుకు గుర్తింపుగా 'పార్టిసిపేటరీ గ్యారెంటీ సిస్టమ్'(పీజీఎస్) గ్రీన్ సర్టిఫికెట్‌ను ఈ ప్రాంతంలో తొలిగా అందుకున్న సాంబిరెడ్డి(93969 62345) సొంతంగా పండించిన పసుపును స్వయంగా మార్కెట్లో విక్రయించడానికి సన్నద్ధమవుతున్నారు.

**– బి.ఎల్.నారాయణ, సాక్షి, తెనాలి**

## కూరగాయ పంటల్లో కోత సమయం

| పంట పేరు | కోత సమయం |
|---|---|
| టమాట | **మొదటి కోత :** మొక్క నాటిన 65–70 రోజులకు<br>**తర్వాత కోతలు :** 4–5 రోజుల వ్యవధిలో, 2 నెలల వరకు కోయవచ్చు |
| వంగ | **మొదటి కోత :** నాటిన 65–70 రోజులకు<br>**తర్వాత కోతలు :** 3–4 రోజుల వ్యవధిలో, 2 నెలల వరకు కోయవచ్చు |
| మిరప | **మొదటి కోత :** నాటిన 55–65 రోజులకు<br>**తర్వాత కోతలు :** 4–5 రోజుల వ్యవధిలో 3 నెలల వరకు కోయవచ్చు |
| బెండ | **మొదటి కోత :** నాటిన 45–50 రోజులకు<br>**తర్వాత కోతలు :** 2–3 రోజుల వ్యవధిలో, 2 నెలల వరకు కోయవచ్చు |
| తోట/పాలకూర | **మొదటి కోత :** నాటిన 25–30 రోజులకు<br>**తర్వాత కోతలు :** 3–4 రోజుల వ్యవధిలో 2 నెలల వరకు కోయవచ్చు |
| గోంగూర | **మొదటి కోత :** నాటిన 30 రోజులకు<br>**తర్వాత కోతలు :** 7–10 రోజుల వ్యవధిలో, 3 నెలల వరకు కోయవచ్చు |
| పుదీన | 3 నెలల తర్వాత కోయాలి |
| మెంతికూర | **మొదటి కోత :** నాటిన 30 రోజులకు<br>**తర్వాత కోతలు :** 12–15 రోజుల వ్యవధిలో 2 నెలల వరకు కోయవచ్చు |
| ధనియాలు, కొత్తిమీర | విత్తిన 20–25 రోజులు తర్వాత కోయాలి |
| బఠాణీ, గోరుచిక్కుడు, చిక్కుడు, ఫ్రెంచి చిక్కుడు | **మొదటి కోత :** నాటిన 55 రోజుల తర్వాత<br>**తర్వాత కోతలు :** 5–7 రోజుల వ్యవధిలో, 3 నెలల వరకు కోయవచ్చు |
| కాకర, బీర, సొర, పొట్ల, దోస | **మొదటి కోత :** విత్తిన 60 రోజుల తర్వాత<br>**తర్వాత కోత :** 10 రోజుల వ్యవధితో 2 నెలల వరకు కోయవచ్చు |

**గమనిక:** సేంద్రియ పద్ధతుల్లో కూరగాయల సాగు, పూల సాగు సంబంధిత సాంకేతిక సలహాల కోసం, సూచనల కోసం సుస్థిర వ్యవసాయ కేంద్రం శాస్త్రవేత్తలను సంప్రదించవచ్చు. సేంద్రియ ఇంటిపంటలు పండించుకునేందుకు అవసరమైన కూరగాయల విత్తనాల కోసం సికింద్రాబాద్, తార్నాకలోని సుస్థిర వ్యవసాయ కేంద్రంను సంప్రదించవచ్చు. ఫోన్ : 1800 120 3244

## నీటి అవసరాన్ని బట్టి పండించుకునే కూరగాయలు

అతి తక్కువ నీరు అవసరమయ్యే కూరగాయలు / పండ్లు : పుచ్చకాయలు, కిరిణి కాయలు(మస్క్ మిలన్), గుమ్మడి, బూడిద గుమ్మడి

**తక్కువ నీరు అవసరమయ్యే కూరగాయలు:** గోరుచిక్కుడు, చిక్కుడు, అలసంద, బఠాణీ, బీట్‌రూట్, బీరకాయ, ఆనపకాయ

**కొద్దిపాటి నీరు అవసరమయ్యే కూరగాయలు:** టమాట, వంగ, మిరప, ఉల్లి, ఆలుగడ్డ, క్యారెట్, దోస

**ఎక్కువ నీరు అవసరమయ్యే కూరగాయలు:** ఆకుకూరలు, క్యాబేజి, క్యాలీఫ్లవర్, బ్రకోలి

# ఇంటిపైనే చేపల చెరువు!



ఇంటి పంట



ఇంటి భవనంపైన ఆకుకూరలు, కూరగాయలు, పండ్లను సాగు చేయడం మనకు తెలుసు. అయితే, కూరగాయలు సాగుచేయడానికి సిమెంటు మడులు ఏర్పాటు చేయడంతోపాటు మిద్దెపైన ఏకంగా చేపల చెరువునే ఏర్పాటు చేశాడు అస్సాంకు చెందిన ఓ పర్యావరణ శాస్త్రవేత్త. ఆయన పేరు డాక్టర్ అమర్ జ్యోతి కశ్యప్. గౌహతి నగరంలోని హతిగోన్ ప్రాంతం ఎల్.ఎన్.బి. రోడ్డులోని తన రెండంతస్థుల భవనం పైన కొంతభాగంలో చెరువును ఏర్పాటు చేసుకొని అందులో చేపలు పెంచుతున్నాడు. నేలపైన ఖాళీ జాగా లేని నగరవాసులు ఎవరైనా ఈ పద్ధతిలో మేడపైన చేపల సాగును చేపట్టవచ్చని డాక్టర్ కశ్యప్ అంటున్నారు.

గౌహతి యూనివర్సిటీలో పర్యావరణ శాస్త్ర ఆచార్యునిగా పనిచేసిన డాక్టర్ కశ్యప్ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి.. 'ఎన్విరాన్' అనే స్వచ్ఛంద సంస్థను నెలకొల్పి పదేళ్లుగా ప్రజానీకంలో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందిస్తున్నారు. తొలుత రూ. 50 వేల పెట్టుబడితో మేడపైనే చేపల చెరువును ఏర్పాటు చేసుకుంటే.. అందంగా, ఆహ్లాదంగా ఉంటుందన్నారు. ఆరోగ్యదాయకంగా పెంచుకున్న చేపలు ఆహారంగా తినవచ్చు, ఇతరులకూ అమ్ముకొని ఆదాయం కూడా పొందవచ్చని ఆయన చెబుతున్నారు.

ఆయన ఇల్లు 4 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. మేడపైన ఒక వెయ్యి చదరపు అడుగుల్లో చేపల చెరువు, మరో వెయ్యి చదరపు అడుగుల విస్తీర్ణంలో సిమెంటు మడులు నిర్మించి అందులో ఇంటి అవసరాల కోసం సేంద్రియ పద్ధతుల్లో కూరగాయలు, ఆకుకూరలు సాగు చేసుకుంటున్నారు డాక్టర్ కశ్యప్. మిగతా 2 వేల చదరపు అడుగులు పిల్లలు ఆడుకోవడానికి ఖాళీగా ఉంచారు. బెండ, వంగ, సొరకాయలు.. క్యాలీఫ్లవర్, క్యాబేజీ, ఆకుకూరలతోపాటు ఔషధ మొక్కలను కూడా తమ మిద్దె మీద పెంచుతున్నారు. 'మేం కూరగాయలు కొనటం మానేశాం. మేం తినగా మిగిలిన వాటిని పొరుగు వారికి, స్నేహితులకు పంచిపెడుతున్నాం అన్నారాయన.

అస్సాం తేయాకు తోటల సాగుకు ప్రసిద్ధి. డాక్టర్ కశ్యప్ తన మేడ మీద సేంద్రియ పద్ధతుల్లో 30 గ్రీన్ టీ మొక్కలు పెంచుతున్నారు. ఇది చాలా లాభదాయకమని చెబుతూ గ్రీన్ టీ ద్వారా తనకు రూ. లక్ష ఆదాయం వస్తున్నదన్నారు. సేంద్రియ గ్రీన్ టీ ఆకుల్లో ఎపిగల్లోకటెచిన్–3 గల్లటె అనే యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది. ఇది వృద్ధాప్యంలో మెదడుకు మేలు చేస్తుంది, అల్జిమెర్స్/పార్కిన్సన్, టైప్2 డయాబెటిస్‌ల రిస్క్‌ను తగ్గిస్తుందని ఆయన అంటున్నారు.

## వేస్ట్ అస్సిమిలేటర్

ఇంట్లో వెలువడే కుళ్లింపజేయదగిన వ్యర్థపదార్థాలతో వర్మీకంపోస్టు తయారు చేసుకోవడానికి ఉపకరించే వేస్ట్ అస్సిమిలేటర్‌ను కొన్ని సంవత్సరాల క్రితం డాక్టర్ కశ్యప్ తయారు చేశారు. వర్మీకంపోస్టు తయారయ్యే క్రమంలో వేస్ట్ అస్సిమిలేటర్ నుంచి వెలువడే పోషక ద్రవం వర్మీ వాష్‌ను సేకరించి ఇంటిపంటలపై చల్లుతున్నారు. చీడపీడలు ఆశించకుండా ఉండడంతో పాటు మొక్కలకు పోషకాలు కూడా అందుతుండడంతో ఇంటిపంటల దిగుబడి బాగా వస్తున్నదని ఆయన తెలిపారు.

ప్లాస్టిక్ బిన్ లేదా కాంక్రీటు రింగ్‌ను వేస్ట్ అస్సిమిలేటర్‌గా ఉపయోగించవచ్చు. రోజువారీగా వంటింటి వ్యర్థాలను 1–2 కిలోలు దీంట్లో 60–180 రోజులు లేదా అది నిండే వరకు వేస్తూ ఉండాలి. 25 రోజుల తర్వాత 100 వానపాములను అస్సిమిలేటర్‌లోకి వదలాలి. వ్యర్థాలు కుళ్లే క్రమంలో కిందికి వచ్చే పోషక ద్రవం వర్మీవాష్‌ను సీసాలోకి సేకరించి పెట్టుకొని పంటలకు వాడుకోవాలి. ఇంటికి రెండు చొప్పున వేస్ట్ అస్సిమిలేటర్లను ఏర్పాటు చేసుకుంటే.. ఏడాది పొడవునా వర్మీకంపోస్టు, వర్మీవాష్ ఇంటిపంటలకు సరిపడా అందుబాటులో ఉంటాయని డాక్టర్ కష్యప్ అంటున్నారు. వర్మీవాష్ బయోపెస్ట్ రెపెల్లెంట్‌గా కూడా ఉపయోగపడుతున్నదని తెలిపారు. ఆయన ఈ–మెయిల్.. environnortheast@gmail.com

ఫేస్‌బుక్‌లో sakshi saagubadi గ్రూప్‌ను చూడండి.
నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్
మీ అభిప్రాయాలు, సూచనలను sagubadi@sakshi.com కు పంపవచ్చు.

# సాక్షి భవిత

స్పర్థయా వర్థతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

మంగళవారం
2-7-2019





## విద్యుత్.. ఎలక్ట్రిసిటీ.. కరెంట్!

**ఒక్క అయిదు నిమిషాలు కరెంట్ లేకపోతే తట్టుకోలేం.. అందుకే దేశంలో విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు అనేక చర్యలు.. నిరంతరాయ విద్యుత్ సరఫరా చేసేందుకు ఎన్నో పథకాలు.. సంప్రదాయ థర్మల్ విద్యుత్, హైడ్రో పవర్ జనరేషన్ నుంచి సోలార్ పవర్, న్యూక్లియర్ పవర్, విండ్ ఎనర్జీ ఉత్పత్తి వరకూ.. విద్యుత్ ఉత్పత్తికి వందల సంఖ్యలో ప్లాంట్లకు అనుమతులు.. ఇవే ఇప్పుడు యువతకు ఉద్యోగాల పరంగా వరంగా మారాయి అంటున్నారు నిపుణులు.. ఐటీఐ, డిప్లొమా, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ వంటి ప్రొఫెషనల్ కోర్సుల అభ్యర్థులకు అవకాశాల వేదికగా మారుతోంది విద్యుత్ రంగం. విద్యుత్ రంగంలో కొలువులు..అందిపుచ్చుకునేందుకు మార్గాలు.. అర్హతలు, నైపుణ్యాల గురించి తెలుసుకుందాం...**

# విద్యుత్ రంగం.. కొలువుల తరంగం

- విద్యుత్ ఉత్పాదనలో అగ్రగామిగా నిలుస్తున్న భారత్
- దేశంలో వందల సంఖ్యలో పవర్ ప్రాజెక్టులు
- భారీ సంఖ్యలో ఉద్యోగాలు లభిస్తాయంటున్న నిపుణులు

పవర్ సెక్టార్.. దేశ అభివృద్ధిలో కీలక రంగం. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు పలు కొత్త పథకాలు అమల్లోకి తెచ్చాయి. గ్రీన్ బిల్డింగ్ ఎనర్జీ ఇనీషియేటివ్; క్లీన్ ఎనర్జీ మిషన్; నేషనల్ పాలసీ ఆన్ బయోఫ్యూయల్స్; ఉదయ్ స్కీమ్; పవర్ ఫర్ ఆల్; సౌభాగ్య స్కీమ్ వంటివి ముఖ్యమైనవి. పరిశ్రమల నుంచి గృహ వినియోగదారుల వరకూ.. నిరంతరాయ విద్యుత్ అందించడమే లక్ష్యంగా.. కేంద్ర ప్రభుత్వం పలు విధానాలు రూపొందించింది. ఫలితంగా దేశంలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల సంఖ్య ఏటేటా పెరుగుతోంది.

### ప్రపంచంలో అయిదో పెద్ద దేశం

శక్తి ఉత్పాదన కోసం ప్రభుత్వం విస్తృతంగా చర్యలు చేపడుతోంది. ఫలితంగా గత ఆర్థిక సంవత్సరంలో 344 గిగా వాట్ల సామర్థ్యంతో భారత్ ప్రపంచంలోనే అయిదో పెద్ద దేశంగా నిలిచింది. విద్యుత్ ఉత్పత్తి పరంగా మూడో పెద్ద దేశమనే ఘనత కూడా సాధించింది. ఇది దేశంలో విద్యుత్ రంగం విస్తరణ తీరుకు నిదర్శనంగా చెప్పొచ్చు.

### 'క్లీన్ ఎనర్జీ'తో కొలువులు

ప్రస్తుతం విద్యుత్ రంగంలో క్లీన్ ఎనర్జీ విధానం కీలకంగా మారింది. ప్యారిస్ అగ్రిమెంట్ ఆన్ క్లీన్ ఎనర్జీ లక్ష్యాలను చేరుకునేందుకు రూపొందించిన క్లీన్ ఎనర్జీ మిషన్ పేరిట పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించింది. ఫలితంగా సౌర విద్యుత్, పవన విద్యుత్ (విండ్ పవర్), బయో-ఫ్యూయల్స్, హైడ్రో పవర్ విభాగాల్లో వందల సంఖ్యలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల స్థాపన జరుగుతోంది. హైడ్రో పవర్ విభాగంలో ఇటీవల నిబంధనలు సరళీకృతం చేయడంతోపాటు ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలు సైతం అందిస్తోంది. గతంలో 25 మెగావాట్ల సామర్థ్యం ఉన్న జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు పలు రాయితీలు లభించేవి. తాజాగా ఇంతకంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు సైతం ప్రోత్సాహకాలు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. దాంతో వీటిని ఏర్పాటు చేసేందుకు సంస్థలు ముందుకు వస్తున్నాయి. ఇవన్నీ కూడా యువతకు ఉద్యోగాలకు వేదికగా నిలుస్తున్నాయి.

### పెరుగుతున్న అవకాశాలు

ప్రభుత్వ, ప్రైవేటు రంగాలతోపాటు పీపీపీ విధానంలో ప్రతిఏటా వందల సంఖ్యలో విద్యుత్ ఉత్పాదన కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. ఇవి ఉపాధి మార్గాలు, ఉద్యోగావకాశాల పరంగా యువతకు వరంగా మారాయి. లక్షల సంఖ్యలో కొలువులకు వేదికగా నిలుస్తున్నాయి. ఫలితంగా ఐటీఐ నుంచి ఎంటెక్, ఎంబీఏ, కాస్ట్ అకౌంటెన్సీ, పవర్ మేనేజ్‌మెంట్.. ఇలా అన్ని కోర్సుల విద్యార్థులకు ఇప్పుడు విద్యుత్ రంగం కొలువుల కామధేనువుగా నిలుస్తోంది అంటున్నారు నిపుణులు.

### భారీ సంఖ్యలో జాబ్స్

ప్రస్తుతం దేశంలో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు ప్రాధాన్యం పెరిగింది. ఫలితంగా ఈ రంగంలో భారత్ కొలువుల పరంగా అంతర్జాతీయంగా టాప్-10లో నిలుస్తోంది. ఇంటర్నేషనల్ రెన్యువబుల్ ఎనర్జీ ఏజెన్సీ ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం-2018లో అంతర్జాతీయంగా 11 మిలియన్ల ఉద్యోగాలు లభించగా.. ఒక్క భారత్‌లోనే ఆ సంఖ్య 7.19 లక్షలుగా ఉండటం విశేషం. హైడ్రో పవర్ విభాగంలో 3.47 లక్షలు; సోలార్ పవర్ విభాగంలో 1.15 లక్షలు; విండ్ పవర్ సెక్టార్‌లో 58 వేల ఉద్యోగాలు లభించాయి. ఇదే ధోరణి కొనసాగితే 2022 నాటికి భారత్‌లోని సోలార్, విండ్‌పవర్ సెక్టార్స్‌లో మరో మూడు లక్షల కొత్త ఉద్యోగాలు లభిస్తాయని ఇంటర్నేషనల్ రెన్యువబుల్ ఎనర్జీ ఏజెన్సీ అంచనా వేసింది.

### సంప్రదాయ ఇంధన రంగంలో ఇలా

సంప్రదాయ ఇంధన ఉత్పత్తి కేంద్రాలుగా భావించే థర్మల్ పవర్ కార్పొరేషన్స్‌లో ప్రస్తుతం 1.2 మిలియన్ల మంది పనిచేస్తున్నారు. రానున్న మూడేళ్లలో అదనంగా మరో రెండు లక్షల ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని ఫిక్కీ, అసోచామ్ వంటి సంస్థల అంచనా. థర్మల్ పవర్ జనరేషన్‌కు అవసరమైన బొగ్గు వనరుల లభ్యత తగ్గుతోంది. దాంతో భవిష్యత్తులో రెన్యువబుల్ ఎనర్జీ విభాగాలే కీలకంగా నిలుస్తాయి. ఫలితంగా ఈ విభాగాల్లోనే ఎక్కువ సంఖ్యలో ఉద్యోగాలు లభిస్తాయని భావిస్తున్నారు. మొత్తం విద్యుత్ రంగంలోని ఉద్యోగాల్లో పునరుత్పాదక రంగంలో కొలువులు 70శాతం మేరకు ఉంటాయని పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

### 'న్యూ'క్లియర్ ఎనర్జీ

ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్ ఉత్పత్తి పరంగా ప్రాధాన్యం సంతరించుకున్న మరో విభాగం.. న్యూక్లియర్ ఎనర్జీ. మన దేశంలో న్యూక్లియర్ ఎనర్జీ ఉత్పత్తి కోసం ప్రత్యేక పథకాలు అమలవుతున్నాయి. వచ్చే ఏడాది చివరి నాటికి న్యూక్లియర్ ఎనర్జీ ఉత్పత్తిని 20వేల మెగావాట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికి అనుగుణంగా కొత్తగా న్యూక్లియర్ రియాక్టర్ కేంద్రాలను నెలకొల్పాలని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. వీటిద్వారా వచ్చే ఏడాది చివరి నాటికి మరో యాభై వేల కొత్త ఉద్యోగాలు లభించే అవకాశముంది.

### నియామకాల్లో వృద్ధి

పవర్ అండ్ ఎనర్జీ విభాగంలో భారీగా ఉద్యోగాలు లభిస్తాయని టీమ్‌లీజ్ సర్వీసెస్ వంటి సంస్థల నివేదికలు వెల్లడిస్తున్నాయి. తాజా అంచనాల ప్రకారం- 2018-19 ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థానికి ఈ రంగంలో మొత్తం 15.6 లక్షల ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. 2019-20 ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో కొత్తగా 35వేలకు పైగా కొలువులు లభించనున్నాయి. మొత్తంగా చూస్తే ఈ విభాగం నియామకాల పరంగా 13.82 శాతం వృద్ధి సాధించింది. ఇదే పంథా భవిష్యత్తులోనూ కొనసాగనుంది.

### ప్రధాన ఉపాధి వేదికలు

- జల విద్యుత్ కేంద్రాలు
- సోలార్ పవర్ జనరేషన్ కంపెనీలు
- విండ్ పవర్ జనరేషన్ సంస్థలు
- థర్మల్ పవర్ జనరేషన్ సంస్థలు
- ప్రభుత్వ విభాగాల్లోని డిస్కమ్‌లు, ట్రాన్స్‌కోలు.

### లభించే ఉద్యోగాలు

ప్లాంట్ అసిస్టెంట్, ఆపరేటర్, టెక్నీషియన్, సూపర్‌వైజర్, ఇంజనీర్, ప్రొడక్షన్ ఆఫీసర్, ప్లాంట్ డిజైన్ ఇంజనీర్, ప్లానింగ్ ఇంజనీర్. వీటిలో ప్లాంట్ అసిస్టెంట్ నుంచి టెక్నీషియన్ వరకు క్షేత్రస్థాయి ఉద్యోగాలకు ఐటీఐ(ఎలక్ట్రికల్) అర్హత ఉండాలి. సూపర్‌వైజర్ స్థాయి కొలువులకు డిప్లొమా, ఇంజనీర్ హోదా పొందేందుకు బీటెక్(ఎలక్ట్రికల్) తప్పనిసరి. ఉన్నత స్థాయి ఉద్యోగాల పరంగా ఎంటెక్‌లో పవర్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్ ఉత్తీర్ణులకు అవకాశం కల్పిస్తారు.

- ప్రభుత్వ విభాగాల్లోని ట్రాన్స్‌కోలు, డిస్కమ్‌లలో ఏఎల్ఎం(అసిస్టెంట్ లైన్‌మెన్), జేఎల్ఎం (జూనియర్ లైన్‌మెన్), సబ్-ఇంజనీర్, ఏఈఈ ఉద్యోగాలకు నేరుగా నియామకాలు చేపడతారు. వీటిలో ఏఎల్ఎం, జేఎల్ఎం పోస్టులకు ఐటీఐ అర్హతతో పోటీపడొచ్చు. సబ్ ఇంజనీర్, ఏఈఈ ఉద్యోగాలకు డిప్లొమా, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ అర్హతలతో పోటీ పడొచ్చు.
- గేట్ స్కోర్ ఆధారంగా ప్రభుత్వ రంగ సంస్థ(పీఎస్‌యూ)ల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ట్రైనీ ఇంజనీర్ వంటి హోదాల్లో ప్రవేశించొచ్చు.

### అకడమిక్ మార్గాలివే

విద్యుత్ రంగంలో ఉద్యోగాలు కోరుకునే విద్యార్థులు అందుకు తగ్గ అర్హతలు పొందేందుకు పలు అకడమిక్ మార్గాలు అందుబాటులో ఉన్నాయి. ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లొమా, ఇంజనీరింగ్, ఎంటెక్, పీహెచ్‌డీ వంటి కోర్సులు పూర్తిచేసుకొని.. ఉద్యోగావకాశాల కోసం ప్రయత్నించవచ్చు.

### మేనేజ్‌మెంట్ నిపుణులు

ప్రస్తుతం పవర్ సెక్టార్‌లో మేనేజ్‌మెంట్ నిపుణులకు డిమాండ్ పెరుగుతోంది. ముఖ్యంగా ప్లాంట్ మేనేజ్‌మెంట్, డిస్ట్రిబ్యూషన్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన విభాగాల్లో మేనేజ్‌మెంట్ పీజీ విద్యార్థులకు సంస్థలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఐఐటీలు, యూపీఈఎస్, పండిట్ దీన్ దయాళ్ పెట్రోలియం యూనివర్సిటీ వంటి కొన్ని ఇన్‌స్టిట్యూట్‌లు ఎంబీఏ పవర్ మేనేజ్‌మెంట్ పేరుతో ప్రత్యేక కోర్సును అందిస్తున్నాయి.

### పీహెచ్‌డీతో శాస్త్రవేత్తలుగా

ఎలక్ట్రికల్, పవర్, ఎనర్జీ విభాగాల్లో ప్రస్తుతం పీహెచ్‌డీ అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. ఫిజిక్స్, ఇంజనీరింగ్, అప్లయిడ్ సైన్స్ విభాగాల్లో.. ఎమ్మెస్సీ, ఎంటెక్ ఉత్తీర్ణులు సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ స్కోర్ ఆధారంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో పవర్ జనరేషన్ కార్పొరేషన్స్‌లో సైంటిస్టులుగా కెరీర్ ప్రారంభించొచ్చు. ప్రారంభంలోనే నెలకు రూ.70 వేల వరకు వేతనం లభిస్తుంది.

### ఆకర్షణీయ వేతనాలు

పవర్ సెక్టార్‌లో ఆకర్షణీయ వేతనాలు లభిస్తున్నాయి. ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణులకు ప్రారంభంలో నెలకు రూ.15వేల నుంచి రూ.20వేల వేతనం అందుతోంది. అదే విధంగా బీటెక్‌తో ప్రైవేట్ సంస్థల్లో నెలకు రూ.30వేల వరకు, ప్రభుత్వ విభాగాల్లో రూ.40 వేల వరకు వేతనం అందుకోవచ్చు.

### క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్

పవర్ జనరేషన్ విభాగంలోని ప్రముఖ ప్రైవేటు సంస్థలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్ ద్వారా ఎంట్రీ లెవల్‌లో ఇంజనీర్ స్థాయి హోదాలో ఉద్యోగ నియామకాలు చేపడుతున్నాయి. టాటా పవర్, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ కార్పొరేషన్, టోరెంట్ పవర్, ఎస్సార్ పవర్ కార్పొరేషన్ తదితర సంస్థలు ఐఐటీల్లో ప్లేస్‌మెంట్స్ నిర్వహిస్తున్నాయి. క్యాంపస్ డ్రైవ్‌లో ఎంపికైన వారికి నెలకు రూ.50 వేలకు పైగానే సగటు వేతనం లభిస్తోంది.



### పవర్ సెక్టార్... ముఖ్యాంశాలు

- గతేడాది చివరి నాటికి రెన్యువబుల్ ఎనర్జీ విభాగంలో ఉద్యోగాల సంఖ్య 7.19 లక్షలు.
- 2022 నాటికి రెన్యువబుల్ ఎనర్జీ విభాగంలో కొత్తగా వచ్చే ఉద్యోగాలు మూడు లక్షలు
- న్యూక్లియర్ పవర్ విభాగంలో వచ్చే ఏడాది చివరి నాటికి కొత్తగా 50వేల ఉద్యోగాలు.
- థర్మల్ పవర్ విభాగంలో రానున్న మూడేళ్లలో రెండు లక్షల కొత్త కొలువులు వస్తాయని అంచనా.
- తాజాగా టీమ్ లీజ్ సంస్థ అంచనా ప్రకారం-2018-19 మొదటి ఆరు నెలల్లో 14 ప్రధాన నగరాల్లో 38వేలకు పైగా కొత్త ఉద్యోగాలు. వీటికి అదనంగా ఇతర ప్రాంతాల్లో మరో పది వేలకు పైగా కొలువులు లభించే అవకాశం ఉంది.

### అవకాశాలు అపారం

ప్రస్తుతం ఇంధన రంగంలో అవకాశాలు అపారం. వ్యవస్థీకృత, అవ్యవస్థీకృత విభాగాల్లో దాదాపు 15 లక్షల మంది పని చేస్తున్నారు. రానున్న మూడు, నాలుగేళ్లలో ఈ సంఖ్య గణనీయంగా పెరగడం ఖాయం. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రధానంగా రెన్యువబుల్ ఎనర్జీ విభాగాలే కీలకంగా నిలుస్తున్నాయి. అవకాశాలు కూడా వాటిలోనే ఎక్కువగా అందుబాటులోకి వస్తున్నాయి.

-పి.వి.ఎస్.ఎన్.మూర్తి,
అసోసియేట్ డైరెక్టర్, రెన్యువబుల్ ఎనర్జీ ప్రమోషన్ అసోసియేషన్

---

## విద్యా సమాచారం

### సీఐటీడీలో పీజీ ప్రవేశాలు

బాలానగర్ (హైదరాబాద్)లోని భారత సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సీఐటీడీ) 2019-21కి గాను పీజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

Central Institute of Tool Design

- **కోర్సు:** ఎంటెక్ (మెకట్రానిక్స్).
- **కాల వ్యవధి:** రెండేళ్లు (నాలుగు సెమిస్టర్లు).
- **మొత్తం సీట్లు:** 32
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ/సంస్థ నుంచి కనీసం 55 శాతం మార్కులతో మెకానికల్/ఈసీఈ/ఈఈఈ/ఈఐఈ/మెకట్రానిక్స్/ఆటోమొబైల్/ ఏరోనాటికల్ విభాగంలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- **వయసు:** 45 ఏళ్లకు మించకూడదు.
- **ఎంపిక:** రాత పరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. (దరఖాస్తును ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని పూరించిన దరఖాస్తును పోస్టు ద్వారా పంపించాలి).
- **దరఖాస్తుకు చివరితేదీ:** జులై 16, 2019. (రూ.500 ఆలస్య రుసుముతో జులై 20, 2019 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు).
- **ప్రవేశ పరీక్షతేదీ:** జులై 24, 2019.
- **పరీక్ష కేంద్రం:** జేఎన్‌టీయూహెచ్, కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కూకట్‌పల్లి,హైదరాబాద్.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.citdindia.org


### సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్లో..

- ఎంసెట్ కాలేజ్ ప్రెడిక్టర్ (ఆంధ్రప్రదేశ్/తెలంగాణ).
- నీట్ కటాఫ్ మార్క్స్ అండ్ ర్యాంకులు (ఆంధ్రప్రదేశ్/తెలంగాణ).

విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి
Google Play App Store





## న్యూ ఎడ్యుకేషన్ పాలసీ-2019

# డిగ్రీ కోర్సులకు కొత్త రూపు!

**నూతన జాతీయ విద్యా విధానం రూపకల్పనకు ఇస్రో మాజీ చైర్మన్ కె.కస్తూరి రంగన్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన కమిటీ తమ నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. కమిటీ ముసాయిదా విద్యా విధానంలో.. విద్యా వ్యవస్థకు సంబంధించి పలు సూచనలతోపాటు డిగ్రీ కోర్సులపై కీలక సిఫార్సులు చేసింది. ప్రస్తుతం వీటిపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో.. డిగ్రీ కోర్సులకు సంబంధించి కస్తూరి రంగన్ కమిటీ సిఫార్సులపై ప్రత్యేక కథనం..**

- కొత్తగా నాలుగేళ్ల డిగ్రీ కోర్సులు
- డిగ్రీలో మల్టిపుల్ ఎంట్రీ, ఎగ్జిట్‌లు
- సర్టిఫికేషన్స్ విధానం అమలు
- మల్టిడిసిప్లినరీ, రీసెర్చ్‌లకు పెద్ద పీట
- ముసాయిదా విద్యావిధానంపై కమిటీ సిఫార్సులు

### భవిష్యత్‌కు బాటలు

దేశ భవిష్యత్‌ను నిర్దేశించే సాధనాల్లో విద్య ముందు వరుసలో ఉంటుంది. 2020 నాటికి భారత జనాభా(130+కోట్లు)లో సగం మంది యువతే ఉంటారని అంచనా. అంటే.. మన దేశం యువభారత్‌గా అవతరించనుంది. యువ జనాభా వల్ల కలిగే ప్రయోజనాలు పొందేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం జాతీయ నూతన విద్యా విధానాన్ని తీసుకురావాలని భావిస్తోంది. తద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు..పరిశోధనల ప్రోత్సాహానికి చర్యలు తీసుకోనుంది. అంతేకాకుండా సైన్స్, టెక్నాలజీ, అకడెమిక్స్, పరిశ్రమలు తదితర రంగాలను వెంటాడుతున్న మానవ వనరుల కొరతకు పరిష్కారం చూపనుంది.

### డిగ్రీ విద్య.. సమూల మార్పులు

కస్తూరి రంగన్ కమిటీ అండర్ గ్రాడ్యుయేట్ విద్యపై పలు కీలక సిఫార్సులు చేసింది. ఉన్నత విద్యా వ్యవస్థలో భాగంగా డిగ్రీ కోర్సుల సరళీకరణపై ప్రత్యేకంగా దృష్టిసారించింది. కమిటీ చేసిన తాజా సిఫార్సులతో డిగ్రీ కోర్సులు, బోధన పరంగా సమూల మార్పులు జరిగే అవకాశముంది. ప్రస్తుతం దేశంలో మూడేళ్ల(కొన్ని నాలుగేళ్ల ఆనర్స్ కోర్సులు మినహా) డిగ్రీ స్థాయి కోర్సులు అందిస్తున్న సంగతి తెలిసిందే. నూతన విద్యా విధానం ముసాయిదాలో.. మూడేళ్ల డిగ్రీ కోర్సులను కొనసాగిస్తూనే నాలుగేళ్ల డిగ్రీ కోర్సులను మరింతగా అందుబాటులోకి తేవాలని కస్తూరి రంగన్ కమిటీ సూచించింది. మూడేళ్ల డిగ్రీ కోర్సును కొనసాగించాలా లేదా నాలుగేళ్ల డిగ్రీని ఎంచుకోవాలా అనే విషయాన్ని ఆయా ఇన్‌స్టిట్యూట్‌ల స్వీయ నిర్ణయానికే వదిలేసింది.

### నాలుగేళ్ల డిగ్రీ

నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ద్వారా సరళీకృత గ్రాడ్యుయేట్ విద్యా వ్యవస్థకు రూపకల్పన జరుగుతుందని కమిటీ పేర్కొంది. ఈ దిశగా నాలుగేళ్ల వ్యవధితో బ్యాచిలర్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్, బ్యాచిలర్ ఆఫ్ లిబరల్ ఎడ్యుకేషన్ డిగ్రీ కోర్సులను ప్రతిపాదించింది. ఈ విధానంలో విద్యార్థికి సబ్జెక్టుల పరంగా మేజర్స్, మైనర్స్‌ను ఎంపిక చేసుకొనే వెసులుబాటు ఉంటుంది. దీన్ని విద్యా సరళీకరణకు పునాదిగా కమిటీ అభివర్ణించింది.

### బహుళ మార్గాలు

బహుముఖ విద్యా వ్యవస్థ మెరుగైన ఫలితాలను అందిస్తుందని కమిటీ పేర్కొంది. ఇందులో భాగంగా డిగ్రీ కోర్సుల్లో మల్టి ఎంట్రీ, మల్టి ఎగ్జిట్ విధానాన్ని ప్రతిపాదించింది. ప్రస్తుత మూడేళ్ల డిగ్రీ విధానంలో ఒక సబ్జెక్టులో ఒక మార్కు తక్కువ వచ్చినా డిగ్రీ పట్టా చేతికందదు! దీంతో విద్యార్థులకు సకాలంలో విద్యార్హతలను అందించడంలో ప్రస్తుత విద్యా విధానం పూర్తి స్థాయిలో సఫలం కావట్లేదు. కాగా, తాజా ప్రతిపాదన విద్యార్థులకు ఉపయోగపడనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### సర్టిఫికేషన్స్

నూతన విద్యా విధానంలో మల్టిపుల్ ఎగ్జిట్‌లకు సంబంధించి సర్టిఫికేషన్ విధానాన్ని ప్రతిపాదించారు. ఇందులో భాగంగా డిగ్రీ కోర్సుల్లో చేరి.. ఒక సంవత్సరం పూర్తికాగానే వైదొలిగే వారికి డిప్లొమా; రెండేళ్లు చదివిన వారికి అడ్వాన్స్‌డ్ డిప్లొమా; మూడేళ్ల పూర్తి చేసిన వారికి ఎప్పటిలానే బీఎస్సీ, బీకామ్,బీఏ డిగ్రీలు అందించనున్నారు. నాలుగేళ్ల కోర్సును పూర్తి చేసిన వారికి బ్యాచిలర్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్, బ్యాచిలర్ లిబరల్ ఎడ్యుకేషన్(రీసెర్చ్) డిగ్రీలను అందించనున్నారు. డిగ్రీ కోర్సు నాలుగో సంవత్సరంలో పరిశోధనలపై ప్రత్యేక దృష్టిపెడతారు.

### మల్టీ డిసిప్లినరీ

నాలుగేళ్ల కోర్సు ద్వారా మల్టీ డిసిప్లినరీ అప్రోచ్, రీసెర్చ్, ఇంటర్న్‌షిప్స్ పరంగా విద్యార్థులకు ప్రయోజనాలు ఉంటాయని కమిటీ పేర్కొంది. ఇందులో భాగంగా ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో ఇన్‌స్టిట్యూట్ విధానాన్ని పక్కనబెట్టాలని సూచించింది. ఒకే ఇన్‌స్టిట్యూట్‌లో హ్యూమానిటీస్, ఆర్ట్స్, సోషల్, ఫిజిక్స్, లైఫ్ సైన్సెస్, మ్యాథమెటిక్స్, స్పోర్ట్స్ కోర్సులతోపాటు ఒకేషనల్, ప్రొఫెషనల్ విద్యను అందుబాటులోకి తేవాలని సూచించింది. అన్ని రకాల కోర్సులు ఒకే ఇన్‌స్టిట్యూట్‌లో అందుబాటులో ఉన్నప్పుడే మల్టీడిసిప్లినరీ అప్రోచ్ సాధ్యమవుతుందని పేర్కొంది. మల్టీ డిసిప్లినరీ అప్రోచ్‌లో భాగంగా సైన్స్ విద్యార్థి ఆర్ట్స్; కామర్స్ విద్యార్థి మ్యాథ్స్ అధ్యయనానికి అవకాశం ఉంటుంది. దీంతోపాటు సరైన కోర్సుల కూర్పు, క్రెడిట్ వ్యవస్థను అమలు చేయడం ద్వారా విద్యార్థులు ఒకే సమయంలో స్వీయ ప్రోగ్రామ్‌తోపాటు ఆసక్తి కలిగిన ఇతర సబ్జెక్టులను సైతం అధ్యయనం చేసేందుకు వీలుంటుంది.

### అనుసంధానం

సరళీకృత విద్యా వ్యవస్థ అనుసంధానంపై కమిటీ ప్రత్యేక దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా డిగ్రీ నుంచి పీహెచ్‌డీ వరకు సమగ్ర అనుసంధానం ఉండాలని సూచించింది. విద్యార్థి నాలుగేళ్ల డిగ్రీని పూర్తి చేస్తే.. ఒక ఏడాది మాస్టర్స్ కోర్సుతో పీహెచ్‌డీకి నమోదు చేసుకొనే వెసులుబాటు కల్పించింది. ఒక సబ్జెక్టు లేదా స్పెషలైజేషన్‌లో విద్యార్థిని నిష్ణాతుడిగా తీర్చిదిద్దే క్రమంలో గ్రాడ్యుయేషన్ విద్య విస్తృతమైనదిగా, సరళీకృతమైందిగా ఉండాలని కమిటీ సూచించింది. ఇందులో భాగంగా అన్ని విభాగాలు, స్ట్రీమ్‌లకు సంబంధించి ఇంటర్‌డిసిప్లినరీ కరిక్యులం రూపకల్పన, అభివృద్ధి అవసరాన్ని పేర్కొంది.

### మార్పు కోసం

నాలుగేళ్ల డిగ్రీ కోర్సులకు సంబంధించి కమిటీ చేసిన కొన్ని కీలక సిఫార్సులు..

- కామన్ కోర్ కరిక్యులం.
- ఒకటి లేదా రెండు ఏరియాల్లో స్పెషలైజేషన్.
- ప్రాథమిక భావనలు, తాజా పరిణామాలతో ప్రాక్టికల్ వర్క్ కలయికగా అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్.
- భాషా విద్యపై ప్రధానంగా దృష్టిసారించాలి. ఇన్‌స్టిట్యూట్‌లు దేశీయ భాషలతోపాటు విదేశీ భాషలకు సంబంధించిన కోర్సులను అందించాలి.
- డిగ్రీ స్థాయిలో సరళీకృత విద్య ద్వారా విద్యార్థుల్లో వృత్తిపరమైన పోటీతత్వం పెంచాలి. అదే విధంగా ఉద్యోగితా సామర్థ్యాలు, పని ప్రదేశంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేలా కరిక్యులం ఉండాలి.

### నాలుగేళ్ల డిగ్రీ బెటర్!

నూతన విద్యావిధానం ముసాయిదాలో కమిటీ చేసిన నాలుగేళ్ల డిగ్రీ కోర్సు ప్రతిపాదన ఆహ్వానించదగింది. అమెరికాతోపాటు అనేక పాశ్చాత్య దేశాల్లో నాలుగేళ్ల డిగ్రీ విధానం ఉంది. కానీ, మన దేశంలో మూడేళ్ల డిగ్రీ వ్యవస్థ ఉంది. దాంతో ఆయా దేశాలకు వెళ్లేందుకు డిగ్రీ అనంతరం మన విద్యార్థులు అదనంగా ఏడాది కోర్సు(ఏదైనా) చదవాల్సి వస్తోంది. తాజా ప్రతిపాదనతో మన విద్యా వ్యవస్థకు అంతర్జాతీయ విద్యా వ్యవస్థతో అనుసంధానం ఏర్పడుతుంది. అదేవిధంగా డిగ్రీలో మల్టిపుల్ ఎంట్రీ, ఎగ్జిట్ విధానం కూడా మంచి ఆలోచనే! దీనిద్వారా హ్యూమానిటీస్ విద్యార్థి సైన్స్, సైన్స్ విద్యార్థి ఆర్ట్స్ చదివేందుకు అవకాశం ఉంటుంది. ఈ విధమైన మల్టీ డిసిప్లినరీ అప్రోచ్‌తో కూడిన విద్యా వ్యవస్థ మంచి ఫలితాలను ఇస్తుంది. అన్ని ఇన్‌స్టిట్యూట్‌లు నాలుగేళ్ల డిగ్రీని అందించేలా చూడాలని కోరుకుంటున్నాను.

–**చుక్కా రామయ్య**, ప్రముఖ విద్యావేత్త.

# సాక్షి స్పోర్ట్స్

మంగళవారం
2-7-2019



## వరల్డ్ కప్ స్నూకర్ ఫైనల్లో భారత్

అంతర్జాతీయ బిలియర్డ్స్, స్నూకర్ సమాఖ్య (ఐబీఎస్‌ఎఫ్) వరల్డ్ కప్ స్నూకర్ టోర్నమెంట్‌లో పంకజ్ అద్వానీ, లక్ష్మణ్ రావత్‌లతో కూడిన భారత జట్టు ఫైనల్లోకి దూసుకెళ్లింది. దోహాలో సోమవారం జరిగిన సెమీఫైనల్లో భారత్ 3-2 (57-59, 7-76, 101-9, 66-16, 75-34) ఫ్రేమ్‌ల తేడాతో బ్రెండన్ ఒడొనోగుయె, ఆరన్ హిల్‌లతో కూడిన ఐర్లాండ్ జట్టుపై విజయం సాధించింది. నేడు జరిగే ఫైనల్లో పాకిస్తాన్ (అస్జద్ ఇక్బాల్, మొహమ్మద్ బిలాల్)తో భారత్ తలపడుతుంది. రెండో సెమీఫైనల్లో పాకిస్తాన్ 3-1తో ఖతర్‌పై గెలిచింది.

# తప్పులు సరిచేసుకుంటారా?

**నేడు బంగ్లాదేశ్‌తో భారత్ కీలక పోరు ● గెలిస్తే సెమీస్ ఖాయం**
**తీవ్ర ఒత్తిడిలో మొర్తజా సేన ● ఓడితే టోర్నీ నుంచి ఔట్**

**మధ్యాహ్నం 3 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం**



షకీబ్

**బర్మింగ్‌హామ్:** వరల్డ్ కప్‌లో ఒక రోజు విరామంతో భారత్ మరో ప్రధాన పోరుకు సన్నద్ధమైంది. ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో నేడు జరిగే తమ ఎనిమిదో లీగ్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో టీమిండియా ఆడుతుంది. బలాబలాల పరంగా చూస్తే ఇప్పటికీ భారత్‌దే పైచేయిగా కనిపిస్తున్నా... దక్షిణాఫ్రికా, వెస్టిండీస్‌లను ఓడించడంతో పాటు తాము పరాజయంపాలైన మ్యాచ్‌లలో కూడా ఎంతో మెరుగైన ప్రదర్శన చేసిన బంగ్లాను తక్కువగా అంచనా వేయలేం. ముఖ్యంగా వరల్డ్ కప్‌లో చెలరేగిపోతున్న షకీబ్‌ను ఆపడం భారత్‌కు ఎంతో కీలకం.

### భువీకి చాన్స్...

ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో మరోసారి రోహిత్, కోహ్లిల బ్యాటింగే భారత్‌ను ఆదుకుంది. ఈ నేపథ్యంలో వీరిద్దరు విఫలమైతే పరిస్థితి ప్రమాదకరంగా మారవచ్చు. బంగ్లా కూడా ఈ రెండు వికెట్లే లక్ష్యంగా ఒత్తిడి పెంచుతుందనడంలో సందేహం లేదు. మయాంక్ అగర్వాల్ ఈ మ్యాచ్‌కు జట్టుతో చేరే అవకాశం లేదు కాబట్టి రాహుల్ ఓపెనర్‌గానే కొనసాగుతాడు. నాలుగో స్థానంలో పంత్ మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోనుండగా, చెలరేగేందుకు పాండ్యా సిద్ధంగా ఉన్నాడు. అయితే భారత్‌కు ధోని బ్యాటింగే పెద్ద ఆందోళనగా మారింది. ఇంగ్లండ్‌తో చివర్లో భారీ షాట్లు ఆడలేకపోగా, గత రెండేళ్లుగా స్పిన్‌ను ఎదుర్కోవడంలో ధోని రికార్డు పేలవంగా ఉంది. ఈ ప్రపంచకప్‌లోనైతే అతను స్పిన్నర్ల బౌలింగ్‌లో 87 బంతులు ఎదుర్కొని ఒకే ఒక ఫోర్‌తో 41 పరుగులే చేశాడు! బంగ్లా త్రయం షకీబ్, మెహదీ, మొసద్దిక్‌లను అతను ఎలా ఆడతాడన్నది కీలకం. భారత్ ఈ మ్యాచ్‌లో రెండు మార్పులతో బరిలోకి దిగే అవకాశం కనిపిస్తోంది. గత మ్యాచ్‌లో భారీగా పరుగులు ఇచ్చిన లెగ్ స్పిన్నర్ చహల్ స్థానంలో భువనేశ్వర్‌ను ఆడించవచ్చు. ముగ్గురు రెగ్యులర్ పేసర్లతో పాటు భువీ బ్యాటింగ్ అదనపు బలం కానుంది. కేదార్ జాదవ్ స్థానంలో ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు కూడా చోటు దక్కవచ్చు. జాదవ్ కంటే దూకుడుగా ఆడగలగడంతో పాటు కట్టుదిట్టమైన బౌలింగ్, మెరుపు ఫీల్డింగ్ అతనికి తొలి అవకాశం కల్పించవచ్చు. బుమ్రా, షమీ పదునైన బౌలింగ్‌పై కూడా టీమిండియా నమ్మకం పెట్టుకుంది. మిడిల్, లోయర్ బలహీనతను అధిగమించగలిగితే మిగతా పనిని మన బౌలర్లు పూర్తి చేయగలరు.

### అదే జట్టుతో...

ప్రపంచ కప్‌లో బంగ్లాదేశ్ ఆటతీరు ఒక్కసారిగా ఆశ్చర్యపరిచేలా సాగుతోంది. షకీబ్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో చెలరేగిపోతుండగా... సీనియర్లు ముష్ఫికర్, తమీమ్ తమ స్థాయిని ప్రదర్శించారు. ఆ జట్టు ఇప్పటి వరకు మూడు విజయాలే సాధించినా... ఇతర మ్యాచ్‌లలో కూడా గట్టి పోటీనిచ్చింది. అదృష్టం కలిసిరాక ఓటమి పాలైనా, తమదైన రోజున ఎలాంటి ప్రత్యర్థినైనా ఓడించగలదు. గత మూడు ఐసీసీ టోర్నీలలో కూడా భారత్‌ను ఓడించేందుకు ఆ జట్టు చివరి వరకు ప్రయత్నించింది కానీ గెలుపు మాత్రం దక్కలేదు. ఈసారి అవకాశం చేజార్చుకోకూడదని టీమ్ పట్టుదలగా కనిపిస్తోంది. లిటన్ దాస్, సౌమ్య సర్కార్ కూడా చక్కటి బ్యాటింగ్ ప్రదర్శన కనబరుస్తున్నారు. ఆల్‌రౌండర్ మహ్ముదుల్లా గాయం నుంచి కోలుకోవడంతో జట్టు ఊపిరి పీల్చుకుంది. మరో 53 పరుగులు చేస్తే మహ్ముదుల్లా వన్డేల్లో 4 వేల పరుగులు పూర్తి చేసుకుంటాడు. బౌలింగ్‌లో భారత్‌ను దెబ్బ తీయగల సత్తా ముస్తఫిజుర్‌కు ఉంది. టోర్నీలో నిలకడగా రాణిస్తున్న మరో పేసర్ సైఫుద్దీన్‌ను భారత్ ఎప్పుడూ ఎదుర్కోలేదు కాబట్టి అది బంగ్లాకు కొంత అనుకూలాంశం. కెప్టెన్ కాబట్టి మొర్తజా జట్టులో కొనసాగుతున్నాడు తప్ప అతని బౌలింగ్‌లో ఏమాత్రం పస లేదు. ఆరు మ్యాచ్‌లలో మొర్తజా తీసింది ఒకే ఒక వికెట్! ఈ మ్యాచ్‌లోనైనా అతను తన అనుభవంతో రాణిస్తే బంగ్లాకు అంతకు మించి ఆనందం ఉండదు.

**ప్రపంచ కప్‌లో ఆరు మ్యాచ్‌లలో పరాజయం లేకుండా సాగిన భారత్‌ను ఇంగ్లండ్ చేతిలో ఓటమి ఒక్కసారిగా కలవరపెట్టింది. ఆ మ్యాచ్ చేజార్చుకోవడం వల్ల ఉన్నపళంగా జరిగిన నష్టమేమీ లేదు కానీ జట్టులో ఉన్న లోపాలు మాత్రం బయటపడ్డాయి. సునాయాసంగా సెమీఫైనల్ చేరే స్థితిలో కనిపించిన టీమిండియాకు ఇప్పుడు ముందుకెళ్లాలంటే మరో విజయం కావాలి. అయితే ప్రత్యర్థి ప్రమాదకరమైన బంగ్లాదేశ్ రూపంలో ఎదురుగా నిలిచింది. గతంలో బంగ్లాదేశ్ సాధించిన సంచలనాలు, ఈ టోర్నీలో ఆ జట్టు ప్రదర్శనపరంగా చూస్తే భారత్‌కు ఇదేమీ సులువైన మ్యాచ్ కాబోదు. మన మిడిలార్డర్ సమస్యను ప్రత్యర్థి లక్ష్యంగా మార్చుకుంటే హోరాహోరీ పోరు ఖాయం. గత మ్యాచ్ ఓటమిని పక్కన పెట్టి అదే వేదికపై సరైన వ్యూహంతో తమ స్థాయికి తగ్గట్లుగా ఆడితే మాత్రం కోహ్లి సేనకు ఎదురుండదు.**

**5** మరో 5 వికెట్లు తీస్తే బుమ్రా వన్డేల్లో 100 వికెట్లు పూర్తి చేసుకుంటాడు.

**8** మరో 8 వికెట్లు తీస్తే కుల్దీప్ వన్డేల్లో 100 వికెట్లు పూర్తి చేసుకుంటాడు.

### తుది జట్లు (అంచనా)

**భారత్:** కోహ్లి (కెప్టెన్), రోహిత్, రాహుల్, పంత్, ధోని, పాండ్యా, జాదవ్/జడేజా, భువనేశ్వర్, షమీ, కుల్దీప్, బుమ్రా.
**బంగ్లాదేశ్:** మొర్తజా (కెప్టెన్), తమీమ్, సర్కార్, షకీబ్, ముష్ఫికర్, లిటన్ దాస్, మహ్ముదుల్లా, మొసద్దిక్, మెహదీ, సైఫుద్దీన్, ముస్తఫిజుర్.

### ముఖాముఖి

వన్డేల్లో భారత్, బంగ్లాదేశ్ జట్లు 35 మ్యాచ్‌ల్లో తలపడ్డాయి. 29 మ్యాచ్‌ల్లో భారత్... 5 మ్యాచ్‌ల్లో బంగ్లాదేశ్ గెలిచాయి. మరో మ్యాచ్ రద్దయింది. ప్రపంచకప్‌లో ఈ రెండు జట్ల మధ్య మూడుసార్లు పోరు జరిగింది. రెండుసార్లు భారత్, ఒకసారి బంగ్లాదేశ్ విజయం సాధించాయి.

### పిచ్, వాతావరణం

ఆదివారం భారత్, ఇంగ్లండ్ ఆడిన పిచ్‌పైనే ఈ మ్యాచ్ జరగనుండటం విశేషం. పూర్తిగా బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్. భారీ స్కోరుకు అవకాశం ఉంది కాబట్టి టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకోవచ్చు. ఒక వైపు 59 మీటర్లే ఉన్న బౌండరీ లక్ష్యంగా ఇంగ్లండ్ పరుగులు సాధించిందని విమర్శించిన కోహ్లి... ఇప్పుడు అదే అనుభవంతో తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేయవచ్చు. ఈ మ్యాచ్‌కు వర్ష ప్రమాదం లేదు.

# విజయ్ శంకర్ ఆట ముగిసింది

**గాయంతో ప్రపంచ కప్ నుంచి ఔట్ ● మయాంక్ అగర్వాల్‌కు చోటు**



విజయ్ శంకర్



మయాంక్

**బర్మింగ్‌హామ్:** ప్రపంచ కప్ కీలక దశలో మరో భారత ఆటగాడు టోర్నీకి దూరమయ్యాడు. ఎడమ కాలు బొటన వేలి గాయం కారణంగా ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ వరల్డ్ కప్ నుంచి తప్పుకున్నాడు. అతని స్థానంలో టెస్టు ఓపెనర్ మయాంక్ అగర్వాల్‌ను సెలక్షన్ కమిటీ ఎంపిక చేసింది. శిఖర్ ధావన్ తర్వాత గాయం కారణంగా మెగా టోర్నీ నుంచి తప్పుకున్న రెండో ఆటగాడు విజయ్ శంకర్. జూన్ 19న నెట్ ప్రాక్టీస్‌లో బుమ్రా వేసిన యార్కర్‌తో విజయ్ కాలి బొటనవేలికి గాయమైంది. అయితే ఆ తర్వాత పెద్దగా ఇబ్బంది అనిపించకపోవడంతో భారత్ ఆడిన తర్వాత రెండు మ్యాచ్‌లలో (అఫ్గానిస్తాన్, వెస్టిండీస్‌లతో) అతను బరిలోకి దిగాడు. ఆ తర్వాత అదే గాయం తిరగబెట్టింది. ఫలితంగా ఇంగ్లండ్‌తో మ్యాచ్‌కు దూరమయ్యాడు. 'సీటీ స్కాన్ అనంతరం విజయ్ శంకర్ బొటన వేలికి ఫ్రాక్చర్ అయినట్లుగా తేలింది. దీని నుంచి కోలుకునేందుకు కనీసం మూడు వారాల సమయం పడుతుంది. దాంతో అతను వరల్డ్ కప్ నుంచి తప్పుకుంటున్నాడు' అని బీసీసీఐ ప్రకటించింది.

**ఆది నుంచి విమర్శలే..:** 2019 జనవరిలోనే వన్డేల్లో అరంగేట్రం చేసిన విజయ్ శంకర్ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ పర్యటనల్లో అద్భుతంగా ఆడకపోయినా... సెలక్టర్లను ఆకట్టుకునేందుకు రెండు ఇన్నింగ్స్‌లు (45, 46) సరిపోయాయి. మిడిలార్డర్ బ్యాట్స్‌మన్‌గా అంబటి రాయుడును కాదని 9 వన్డేల అనుభవం ఉన్న అతడిని సెలక్టర్లు ప్రపంచ కప్‌కు ఎంపిక చేశారు. పైగా 'మంచి బ్యాట్స్‌మన్, చక్కటి బౌలర్ కావడంతో పాటు అద్భుతమైన ఫీల్డర్ కాబట్టి మూడు రకాలుగా ఉపయోగపడతాడు' అని చైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్ ప్రశంసాపూర్వక మాటలు కూడా చెప్పాడు. అయితే ఈ ప్రపంచ కప్‌లో అతని ప్రభావం అంతగా ఏమీ కనిపించలేదు. ఆడిన 3 మ్యాచ్‌లలో 15 నాటౌట్, 29, 14 పరుగులు చేసిన అతను ఒకే మ్యాచ్‌లో బౌలింగ్ చేసి 2 వికెట్లు తీశాడు. పాక్‌తో మ్యాచ్‌లో తాను వేసిన తొలి బంతికే వికెట్ తీయడం మాత్రం అందరికీ గుర్తుండిపోయే క్షణం. విండీస్‌తో మ్యాచ్ తర్వాత విజయ్ శంకర్ పనికి రాడని, అతడిని తప్పించాలని అభిమానులు, విశ్లేషకుల నుంచి చాలా విమర్శలు వచ్చాయి. ఇప్పుడు గాయంతో అతను మొత్తం టోర్నీకే దూరమయ్యాడు.

### ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు, నె.ర.రే.-నెట్ రన్‌రేట్, పా-పాయింట్లు

| జట్టు | ఆ | గె | ఓ | ర | నె.ర.రే. | పా |
|---|---|---|---|---|---|---|
| ఆస్ట్రేలియా | 8 | 7 | 1 | 0 | 1.000 | 14 |
| భారత్ | 7 | 5 | 1 | 1 | 0.854 | 11 |
| న్యూజిలాండ్ | 8 | 5 | 2 | 1 | 0.572 | 11 |
| ఇంగ్లండ్ | 8 | 5 | 3 | 0 | 1.000 | 10 |
| పాకిస్తాన్ | 8 | 4 | 3 | 1 | -0.792 | 9 |
| శ్రీలంక | 8 | 3 | 3 | 2 | -0.934 | 8 |
| బంగ్లాదేశ్ | 7 | 3 | 3 | 1 | -0.133 | 7 |
| దక్షిణాఫ్రికా | 8 | 2 | 5 | 1 | -0.080 | 5 |
| వెస్టిండీస్ | 8 | 1 | 6 | 1 | -0.335 | 3 |
| అఫ్గానిస్తాన్ | 8 | 0 | 8 | 0 | -1.418 | 0 |

# రాయుడును వీడని '3డి'

సాక్షి క్రీడా విభాగం

మరోసారి ప్రపంచ కప్ అవకాశం మన అంబటి తిరుపతి (ఏటీ) రాయుడు చేజారింది. జట్టులో నాలుగో స్థానానికి ఎంపికైన విజయ్ శంకర్ గాయం నుంచి తప్పుకున్నా... అదే స్థానానికి చివరి వరకు పోటీ పడిన రాయుడుకు మాత్రం మరోసారి మొండిచేయి ఎదురైంది. ప్రపంచ కప్ స్టాండ్ బై ఆటగాళ్లలో అతని పేరు ఉన్నా, అసలు సమయానికి మాత్రం ఆ చాన్స్ మయాంక్ ఎగరేసుకుపోయాడు. పునరాగమనం తర్వాత నిలకడైన ప్రదర్శనతో '4'కు సరైనవాడు అని కోహ్లితో ప్రశంసలు పొందినా... న్యూజిలాండ్ గడ్డపై భారత టాప్ స్కోరర్‌గా నిలిచినా దురదృష్టవశాత్తూ రాయుడును సెలక్టర్లు గుర్తించలేదు. ఇప్పుడు జట్టు ఉన్న పరిస్థితుల్లో మిడిలార్డర్‌లో సమర్థంగా ఆడగల సత్తా రాయుడుకి ఉందనడంలో సందేహం లేదు. ఓపిగ్గా ఇన్నింగ్స్‌ను

**తీవ్ర ప్రభావం చూపిన నాటి సెటైర్ ట్వీట్**

నడిపించడంతో పాటు అవసరమైన సమయంలో ధాటిగా ఆడగల నైపుణ్యం అతని సొంతం. సెలక్టర్ల ఎంపిక ప్రక్రియే కాస్త ఆశ్చర్యకరంగా అనిపించింది. ఓపెనర్ ధావన్ గాయపడితే ఒక మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ పంత్‌ను ఎంపిక చేశారు. ఇప్పుడు మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ తప్పుకుంటే ఇప్పటి వరకు ఒక్క వన్డే కూడా ఆడని ఓపెనర్‌ను ఎంచుకున్నారు. తనను కాదని శంకర్‌ను ఎంపిక చేస్తూ 'త్రీ డైమెన్షనల్ ఆటగాడు' అంటూ ఎమ్మెస్కే ప్రసాద్ వ్యాఖ్యానించడం... పరోక్షంగా దానిపై సెటైర్ విసురుతూ 'వరల్డ్ కప్ చూసేందుకు 3డి అద్దాలు కొన్నాను' అంటూ రాయుడు ట్వీట్ చేయడం వివాదం రేపింది. ఏదో స్థానం కోల్పోయిన బాధలో అన్నాడు పాపం కాబట్టి చర్య తీసుకోవడం లేదు అని బీసీసీఐ పెద్దలు కొందరు అప్పట్లో వ్యాఖ్యానించినా... ఆ విషయాన్ని వారంతా తేలిగ్గా వదిలి పెట్టలేదని అర్థమవుతోంది. తమనే ప్రశ్నించిన రాయుడుకు మళ్లీ అవకాశం ఇవ్వరాదనే సంకేతం తాజా ఎంపికలో కనిపించిందనడంలో సందేహం లేదు.

**ఇదీ మయాంక్ రికార్డు...**

భారత్ తరఫున ఆస్ట్రేలియాతో 2 టెస్టులు ఆడి ఆకట్టుకున్న కర్ణాటక బ్యాట్స్‌మన్ మయాంక్ పరిమిత ఓవర్ల మ్యాచ్‌లలో ఇంకా అరంగేట్రమే చేయలేదు. దేశవాళీ వన్డేల్లో (లిస్ట్ ఎ) 75 మ్యాచ్‌లలో 48.71 సగటుతో 3,605 పరుగులతో అతనికి చెప్పుకోదగ్గ రికార్డు ఉంది. అతని స్ట్రయిక్ రేట్ కూడా 100.72 కావడం విశేషం. ముఖ్యంగా గత రెండేళ్లలో అతను 61.60 సగటుతో వన్డేల్లో పరుగులు చేశాడు. ఐపీఎల్‌లో కూడా ఆకట్టుకున్న మయాంక్ అగర్వాల్... గత ఏడాది భారత 'ఎ' తరఫున ఇంగ్లండ్ గడ్డపై 4 వన్డేల్లో 71.75 సగటు, 105.90 స్ట్రయిక్ రేట్‌తో 287 పరుగులు సాధించడం అతని ఎంపికకు కారణమైంది. ప్రపంచ కప్‌కు ఎంపిక చేసేందుకు బీసీసీఐకి రాసిన లేఖలో 'సరైన టాపార్డర్ బ్యాట్స్‌మన్' కావాలని టీమ్ మేనేజ్‌మెంట్ కోరడాన్ని బట్టి చూస్తే అతడిని ఓపెనింగ్ స్థానానికే ఎంపిక చేశారని అర్థమవుతోంది.



# సంచలనాల మోత

- 15 ఏళ్ల కోరి గాఫ్ చేతిలో ఐదుసార్లు చాంపియన్ వీనస్ ఓటమి
- తొలి రౌండ్‌లోనే ఓడిన ఒసాకా, జ్వెరెవ్, సిట్సిపాస్
- వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ



కోరి గాఫ్

**లండన్:** టెన్నిస్ సీజన్ మూడో గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ వింబుల్డన్‌లో తొలి రోజే సంచలనాల మోత మోగింది. మహిళల సింగిల్స్ విభాగంలో రెండో సీడ్ నయోమి ఒసాకా (జపాన్), పదో సీడ్ సబలెంకా (బెలారస్), 16వ సీడ్ వొంద్రుసోవా (చెక్ రిపబ్లిక్), ఐదుసార్లు చాంపియన్, నాలుగుసార్లు రన్నరప్‌గా నిలిచిన అమెరికా దిగ్గజం వీనస్ విలియమ్స్ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. వింబుల్డన్‌లో మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించిన పిన్న వయస్కురాలిగా చరిత్ర సృష్టించిన అమెరికా టీనేజర్, 15 ఏళ్ల కోరి గాఫ్ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ కెరీర్‌ను చిరస్మరణీయ విజయంతో మొదలుపెట్టింది. 39 ఏళ్ల వీనస్ విలియమ్స్‌తో జరిగిన తొలి రౌండ్‌లో కోరి గాఫ్ 6-4, 6-4తో గెలుపొంది అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఈ క్రమంలో 1991 తర్వాత వింబుల్డన్‌లో తొలి రౌండ్ మ్యాచ్ నెగ్గిన పిన్న వయస్కురాలిగా కోరి గాఫ్ గుర్తింపు పొందింది. 2004 మార్చి 13న కోరి గాఫ్ జన్మించే సమయానికి వీనస్ అప్పటికే రెండుసార్లు వింబుల్డన్ సింగిల్స్ టైటిల్స్‌ను, రెండుసార్లు యూఎస్ ఓపెన్ టైటిల్స్‌ను సాధించడం విశేషం. ఇతర మ్యాచ్‌ల్లో ప్రపంచ 39వ ర్యాంకర్ యులియా పుతింత్‌సెవా (కజకిస్తాన్) 7-6 (7/4), 6-2తో ఒసాకాపై, రిబరికోవా (స్లొవేకియా) 6-2, 6-4తో సబలెంకాపై, బ్రింగిల్ (అమెరికా) 6-4, 6-4తో ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్ వొంద్రుసోవాపై సంచలన విజయాలు సాధించారు.

**జొకోవిచ్ శుభారంభం**

పురుషుల సింగిల్స్ విభాగంలో ఆరో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ), ఏడో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్) తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. జ్వెరెవ్ 6-4, 3-6, 2-6, 5-7తో జిరీ వెసిలీ (చెక్ రిపబ్లిక్) చేతిలో... సిట్సిపాస్ 4-6, 6-3, 4-6, 7-6 (10/8), 3-6తో ఫాబియానో (ఇటలీ) చేతిలో ఓడిపోయారు. డిఫెండింగ్ చాంపియన్ జొకోవిచ్ (సెర్బియా) 6-3, 7-5, 6-3తో కోల్‌ష్రైబర్ (జర్మనీ)పై నెగ్గాడు. **భారత ప్లేయర్ ప్రజ్నేశ్ గుణేశ్వరన్ 6-7 (1/7), 4-6, 2-6తో 15వ సీడ్ మిలోస్ రావ్‌నిచ్ (కెనడా) చేతిలో ఓడిపోయాడు.**

# లంక విజయం

- అవిష్క ఫెర్నాండో సెంచరీ
- విండీస్‌కు వరుసగా ఏడో ఓటమి
- నికోలస్, అలెన్ పోరాటం వృథా



ఫెర్నాండో

**చెస్టర్ లీ స్ట్రీట్:** రేసులో లేని మ్యాచ్‌లో శ్రీలంక పరుగుల డోసు పెంచింది. ఈ ప్రపంచకప్‌లో తొలిసారి 300 మార్కు దాటింది. చివరకు 23 పరుగుల తేడాతో వెస్టిండీస్‌పై గెలిచింది. ముందుగా శ్రీలంక 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 338 పరుగుల భారీస్కోరు చేసింది. అవిష్క ఫెర్నాండో (103 బంతుల్లో 104; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీ సాధించగా, కుశాల్ పెరీరా (51 బంతుల్లో 64; 8 ఫోర్లు) అర్ధసెంచరీ సాధించాడు. హోల్డర్ 2 వికెట్లు తీశాడు. అనంతరం వెస్టిండీస్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 315 పరుగులు చేసి పోరాడి ఓడింది. నికోలస్ పూరన్ (103 బంతుల్లో 118; 11 ఫోర్లు, 4 సిక్స్‌లు) శతక్కొట్టగా, అలెన్ (32 బంతుల్లో 51; 7 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. మలింగకు 3 వికెట్లు దక్కాయి. ఫెర్నాండోకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన విండీస్ ఇన్నింగ్స్ తడబడుతూ సాగింది. ఓపెనర్ అంబ్రిస్ (5), షైహోప్ (5) మలింగ పేస్‌కు తలవంచారు. గేల్ (48 బంతుల్లో 35; 1 ఫోర్, 2 సిక్సర్లు) కూడా త్వరగానే ఔటయ్యాడు. హెట్‌మైర్ (38 బంతుల్లో 29; 2 ఫోర్లు) ఎక్కువగా కష్టపడలేదు. దీంతో 84 పరుగులకే కీలకమైన 4 వికెట్లను కోల్పోయింది. ఈ దశలో నికోలస్ పూరన్ దాటిగా ఆడటం మొదలు పెట్టాడు. అతనికి కెప్టెన్ హోల్డర్ (26; 4 ఫోర్లు) కాసేపు తోడయ్యాడు. ఐదో వికెట్‌కు 61 పరుగులు జోడించాక హోల్డర్ ఔట్‌కాగా...అనంతరం బ్రాత్‌వైట్ (8) రనౌటయ్యాడు. అలెన్ వచ్చాక పూరన్ మరింత రెచ్చిపోయాడు. గెలుపు మలుపు తీసుకుంటున్న దశలో ధాటిగా ఆడుతున్న అలెన్ రనౌటయ్యాడు. తర్వాత 92 బంతుల్లో సెంచరీ చేసుకున్న పూరన్ ఎనిమిదో వికెట్‌గా నిష్క్రమించడంతో ఓటమి ఖాయమైంది.

**సంక్షిప్త స్కోర్లు**

**శ్రీలంక ఇన్నింగ్స్:** 338/6 (50 ఓవర్లలో) (అవిష్క ఫెర్నాండో 104, కుశాల్ పెరీరా 64, తిరిమన్నె 45 నాటౌట్; హోల్డర్ 2/59), **వెస్టిండీస్ ఇన్నింగ్స్:** 315/9 (50 ఓవర్లలో) ( పూరన్ 118, అలెన్ 51, మలింగ 3/55).

## స్టాక్‌ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్‌ | నిఫ్టీ |
|---|---|
| 292 ▲ | 77 ▲ |
| 39,686 | 11,886 |

మరిన్ని వార్తలు, స్టాక్‌ అప్‌డేట్స్‌ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30గం॥లకు)

| సూచీ | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్‌ | 8,077 | ▲ | 70 |
| డోజోన్స్‌ | 26,649 | ▲ | 50 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,497 | ▲ | 72 |
| డాక్స్‌ | 12,521 | ▲ | 123 |
| షాంఘై | 3,045 | ▲ | 66 |
| నికాయ్‌ | 21,730 | ▲ | 454 |

● అమెరికా ● బ్రిటన్‌ ● జర్మనీ ● చైనా ● జపాన్‌

## ఫారెక్స్‌ రేట్లు రూ. లలో

| | | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్‌ డాలర్‌ | థామస్‌కుక్‌ | 68.20 | 69.84 |
| £ | బ్రిటన్‌ పౌండ్‌ | థామస్‌కుక్‌ | 86.10 | 89.22 |
| € | యూరో | థామస్‌కుక్‌ | 76.90 | 79.79 |
| ¥ | జపాన్‌ ఎన్‌ (100) | థామస్‌కుక్‌ | 62.56 | 64.97 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్‌ | థామస్‌కుక్‌ | 47.33 | 49.48 |
| S$ | సింగపూర్‌ డాలర్‌ | థామస్‌కుక్‌ | 50.11 | 51.91 |
| SAR | సౌదీ రియాల్‌ | థామస్‌కుక్‌ | 17.66 | 19.37 |
| UAE D | యూఏఈ దిర్హామ్‌ | థామస్‌కుక్‌ | 18.08 | 19.59 |
| ¥ | చైనా యువాన్‌ | థామస్‌కుక్‌ | 9.45 | 10.81 |

## ఐఓబీ సీఈఓగా కర్ణం శేఖర్‌



**చెన్నై:** ఇండియన్‌ ఓవర్సీస్‌ బ్యాంక్‌ (ఐఓబీ) మేనేజింగ్‌ డైరెక్టర్, చీఫ్‌ ఎగ్జిక్యూటివ్‌ ఆఫీసర్‌గా కర్ణం శేఖర్‌ నియమితులయ్యారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆఫీసర్‌ ఆన్‌ స్పెషల్‌ డ్యూటీ, హోల్‌ టైమ్‌ డైరెక్టర్‌ హోదాలో బ్యాంకులో చేరిన ఈయన్ను సీఈఓగా నియమించినట్లు ఐఓబీ సోమవారం ప్రకటించింది. ఆర్‌ సుబ్రమణికుమార్‌ స్థానంలో ఈయన నియామకం జరిగినట్లు తెలిపింది. ఎస్‌బీఐలో ప్రొబేషనరీ ఆఫీసర్‌ (పీఓ)గా బ్యాంకింగ్‌ రంగంలో తన ప్రస్థానాన్ని ప్రారంభించిన శేఖర్.. అదే బ్యాంకులో డిప్యూటీ మేనేజింగ్‌ డైరెక్టర్, చీఫ్‌ క్రెడిట్‌ ఆఫీసర్, దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లో ట్రెజరీ మేనేజర్‌గా సేవలందించారు. దేనా బ్యాంక్‌ మేనేజింగ్‌ డైరెక్టర్, సీఈఓగానూ సేవలందించారు.

## ఐసీఐసీఐ రుణ రేట్లు
## 0.10 శాతం తగ్గింపు



**ముంబై:** ప్రైవేటు రంగంలోని ఐసీఐసీఐ బ్యాంకు రుణాలపై వడ్డీ రేట్లను 10 బేసిస్‌ పాయింట్లు (0.10 శాతం) తగ్గించింది. అన్ని కాల వ్యవధులు కలిగిన రుణాలపై మార్జినల్‌ కాస్ట్‌ ఆఫ్‌ ఫండ్స్‌ ఆధారిత రుణ రేటును (ఎంసీఎల్‌ఆర్‌) 0.10 శాతం తగ్గించామని, ఇది తక్షణం అమల్లోకి వచ్చిందని బ్యాంకు ప్రకటించింది. దీంతో ఏడాది ఎంసీఎల్‌ఆర్‌పై రుణ రేటు 8.65 శాతానికి తగ్గింది. నివాస గృహాలపై రుణాలు, ఆటో మొబైల్‌ రుణాల్లో ఎక్కువ భాగం ఈ రేటు ప్రకారమే బ్యాంకు వడ్డీ వసూలు చేస్తుంటుంది. ఆర్‌బీఐ గత ఎంపీసీ సమావేశంలో రెపో రేటును పావు శాతం తగ్గించడంతో పాటు, ఈ ప్రయోజనాన్ని వెంటనే కస్టమర్లకు అందుబాటులోకి తీసుకురావాలని కోరటం తెలిసిందే. ఐసీఐసీఐ బ్యాంకు, యాక్సిస్‌ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు డిపాజిట్లపై వడ్డీ రేట్లను 0.10–0.25 శాతం మధ్య గత నెలలో తగ్గించిన విషయం గమనార్హం.

# ఆధ్యాత్మికం @ ఆన్‌లైన్‌!

- భారత్‌లో 30 బిలియన్‌ డాలర్ల మార్కెట్‌
- ఆధ్యాత్మిక కంటెంట్‌కు డిమాండ్‌
- అవకాశాలు అందుకుంటున్న కొత్త స్టార్టప్స్‌



**న్యూఢిల్లీ:** అందరికీ ఇంటర్నెట్‌ అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో ఆన్‌లైన్‌లో ఆధ్యాత్మిక కంటెంట్‌కు కూడా ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు కొంగొత్త స్టార్టప్‌ సంస్థలు పుట్టుకొస్తున్నాయి. భక్తులు, గురువులు, ఆలయాలు, ప్రార్థనా మందిరాలు మొదలైన వాటన్నింటినీ అనుసంధానిస్తూ, ఆయా వర్గాలకు అవసరమైన సేవలు అందించడంపై ఇవి దృష్టి పెడుతున్నాయి. దేశీయంగా మైమందిర్, ఆర్‌జ్ఞాన్, కాల్పనిక్‌ టెక్నాలజీస్‌ లాంటివి ఈ కోవకు చెందినవే. భారత్‌లో మతపరమైన, ఆధ్యాత్మిక సేవలకు సంబంధించిన మార్కెట్‌ పరిమాణం 30 బిలియన్‌ డాలర్ల పైగా ఉంటుందని అంచనా. షేర్‌చాట్‌ లాంటి సోషల్‌ నెట్‌వర్క్‌ ప్లాట్‌ఫాంపై 25 మంది పైగా ఆధ్యాత్మిక గురువులు ఉన్నారు. వీరిలో యోగా గురు బాబా రాందేవ్‌ కూడా ఉన్నారు. షేర్‌చాట్‌ త్వరలో మరింత మందిని తమ ప్లాట్‌ఫాంలో చేర్చుకునే ప్రయత్నాల్లో ఉంది.

**చిన్న ఆలయాలు, స్వామీజీలతో టైఅప్..**

కొత్తగా 20–25 కోట్ల మంది ఇంటర్నెట్‌ యూజర్లకు చేరువయ్యేందుకు ఈ ఆధ్యాత్మిక సేవల సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. ఆధ్యాత్మిక గురువులు, భక్తులను అనుసంధానం చేసే పనిలో ఉన్నాయని మైమందిర్‌ పోర్టల్‌లో ఇన్వెస్ట్‌ చేసిన యాక్సెల్‌ పార్ట్‌నర్స్‌ సంస్థ భాగస్వామి ప్రశాంత్‌ ప్రకాష్‌ తెలిపారు. ఆన్‌లైన్‌లో ఆధ్యాత్మిక గురువుల ఆధారిత కమ్యూనిటీలను తయారు చేయడంపై ఇవి దృష్టి పెడుతున్నాయి. సాధారణంగా కాస్త ఆర్థిక సామర్థ్యం ఉన్న ఆధ్యాత్మిక గురువులు .. తమ ప్రచార కార్యక్రమాలకు తోడ్పడే టెక్నాలజీలపై సొంతంగానే నిధులు వెచ్చించుకుంటున్నారు. ప్రస్తుతం దాదాపు ప్రతి ఆధ్యాత్మిక గురువుకు, ఆలయం, ప్రార్థనామందిరాలకు సోషల్‌ నెట్‌వర్కింగ్‌ సైట్‌ ఫేస్‌బుక్‌లో ఓ పేజీ ఉంటోంది. దీంతో వివిధ ప్రాంతాల్లో స్థానికంగా కాస్త పేరొందిన చిన్న స్థాయి ఆలయాలు, స్థానిక ఆధ్యాత్మిక గురువులు, స్వామీజీలపై ఆధ్యాత్మిక పోర్టల్స్‌ దృష్టి సారిస్తున్నాయి.

**పండుగలు, జ్యోతిష్యం వివరాలు కూడా...**

'మేం కాస్త చిన్న స్థాయి గురువులు, ఆలయాలను .. వాటి కంటెంట్‌ను ఇప్పుడు మా ప్లాట్‌ఫాంలో అందుబాటులోకి తెస్తున్నాం' అని ఆర్‌జ్ఞాన్‌ సహ వ్యవస్థాపకుడు ఉమేష్‌ ఖత్రి తెలిపారు. ఆధ్యాత్మిక అంశాలపై ఆసక్తి గలవారికి ఈ వెబ్‌సైట్‌ ఒక .. ఇన్‌స్టాగ్రాంలాంటిది. ఆర్‌జ్ఞాన్, మైమందిర్‌లకు ప్రతి నెలా చెరో అయిదు లక్షల మంది దాకా యాక్టివ్‌ యూజర్లు ఉన్నారు. వీరు మతపరమైన కంటెంట్, తమ ఇష్ట దేవతలు.. గురువుల ఫొటోలు, వీడియోలు వీటిలో షేర్‌ చేసుకుంటూ ఉంటారు. ఈ సైట్లు.. పండుగలు, హిందు క్యాలెండర్లు, జ్యోతిష్యం మొదలైన అంశాలకు సంబంధించిన వివరాలు, సమాచారాన్ని కూడా యూజర్లకు పంపిస్తుంటాయి. తమ ప్లాట్‌ఫాంపై నాణ్యమైన కంటెంట్‌ అందించేందుకు కాల్పనిక్‌ టెక్నాలజీస్‌ నేరుగా ఆలయాలతోనే ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుతం కాల్పనిక్‌ టెక్నాలజీస్‌ దగ్గర 230 ఆలయాలకు సంబంధించిన లైవ్, రికార్డెడ్‌ కంటెంట్‌ ఉంది. ఈ ఏడాది ఆఖరు నాటికి 50 మంది గురువులు, 500 ఆలయాలతో ఒప్పందాలు కుదుర్చుకోవాలని నిర్దేశించుకుంది.

### మారుతున్న అభిరుచులు...

మతపరమైన, ఆధ్యాత్మికమైన కంటెంట్‌ విషయంలో భారతీయుల ధోరణులు మారుతున్నాయి. గత మూడేళ్లలో చిన్న పట్టణాలు, గ్రామాలకు కూడా ఇంటర్నెట్‌ అందుబాటులోకి వచ్చింది. దీంతో చాలా మందికి తొలిసారిగా సోషల్‌ నెట్‌వర్క్‌ సైట్లు పరిచయమవుతున్నాయి. నగరాల్లో ఉండే వారితో పోలిస్తే ఇలాంటి చిన్న పట్టణాలు, గ్రామాల వారి కంటెంట్‌ వినియోగ ధోరణుల్లో గణనీయమైన వ్యత్యాసాలు ఉంటున్నాయి. 'భారతీయులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే ధోరణులు మారుతున్నాయి. చాలా మంది గుళ్లకు వెళ్లినప్పుడు ఫొటోలు తీసుకోవడం, వాటిని ఫేస్‌బుక్‌ లాంటి వాటిల్లో పోస్ట్‌ చేయడంలాంటివి చేస్తుంటారు. ఇలాంటి ఆధ్యాత్మిక భావాలున్న వారి కోసం ప్రత్యేకంగా ఒక కమ్యూనిటీ అవసరమన్న అభిప్రాయం నెలకొంది' అని మైమందిర్‌ వ్యవస్థాపకుడు రాహుల్‌ గుప్తా పేర్కొన్నారు. ఇటు భక్తులు, అటు ఆలయం కోణంలో ఇప్పటిదాకా పూర్తి స్థాయిలో విస్తరించని మార్కెట్‌పై దృష్టి పెడుతున్నట్లు ఆయన వివరించారు. చాలా మంది ఆధ్యాత్మిక గురువులకు లక్షల కొద్దీ సంఖ్యలో భక్తులు ఉంటున్నారు. పాత తరం వారితో పాటు టెక్నాలజీ విపరీతంగా వాడే కొత్త తరం యువత కూడా వీరిలో ఉంటున్నారు. వీరికి ఆశ్రమాలకు వెళ్లేంత సమయం దొరక్కపోవడంతో ఆయా గురువుల ప్రవచనాలను ఆన్‌లైన్‌లో వినడానికి మొగ్గుచూపుతున్నారని కాల్పనిక్‌ టెక్నాలజీస్‌ వ్యవస్థాపకుడు అశ్వనీ గర్గ్‌ చెప్పారు.

## లిబర్టీ స్టీల్‌ చేతికి ఆర్సెలర్‌ మిట్టల్‌ ప్లాంట్లు




**డీల్‌ విలువ రూ.5,782 కోట్లు**

**న్యూఢిల్లీ:** ఆర్సెలర్‌ మిట్టల్‌ కంపెనీకి చెందిన ఏడు స్టీల్‌ ప్లాంట్లను లిబర్టీ స్టీల్‌ కంపెనీ కొనుగోలు చేసింది. ఈ ప్లాంట్లతో పాటు ఆర్సెలర్‌ మిట్టల్‌ కంపెనీకే చెందిన ఇటలీ, ఫ్రాన్స్‌ల్లోని ఐదు సర్వీస్‌ సెంటర్లను కూడా కొనుగోలు చేశామని లిబర్టీ స్టీల్‌ వెల్లడించింది. ఈ మొత్తం డీల్‌ విలువ రూ.5,782 కోట్ల(74 కోట్ల యూరోలు)ని భారత సంతతి లోహ సామ్రాట్‌ సంజీవ్‌ గుప్తాకు చెందిన లిబర్టీ స్టీల్‌ పేర్కొంది.

**ఏడు ప్లాంట్లలో 14,000 మంది ఉద్యోగులు..**

చెక్‌ రిపబ్లిక్‌లోని ఒస్ట్రావ ప్లాంట్‌ను, రొమేనియాలోని గలాటి ప్లాంట్‌ను, ఉత్తర మాసిడోనియాలోని స్కోప్జే, ఇటలీలోని పియాంబినో, లగ్జెంబర్గ్‌లోని డ్యుడెలెంజ్, బెల్జియంలోని లీజ్‌ వద్ద గల రెండు ప్లాంట్లను ఆర్సెలర్‌ మిట్టల్‌ నుంచి కొనుగోలు చేశామని లిబర్టీ స్టీల్‌ పేర్కొంది. ఈ ఏడు ప్లాంట్లలో 14,000 మంది ఉద్యోగులున్నారని వివరించింది.

**టాప్‌ టెన్‌లో లిబర్టీ స్టీల్‌**

ఈ ఐదు ప్లాంట్ల కొనుగోళ్లతో అంతర్జాతీయంగా అగ్రశ్రేణి పది కంపెనీల్లో ఒకటిగా లిబర్టీ స్టీల్‌ నిలిచింది.(చైనాను మినహాయించి) విస్తృతమైన తుది ఉక్కు ఉత్పత్తుల రేంజ్‌తో 18 మిలియన్‌ టన్నులకు మించిన ఉత్పత్తితో అంతర్జాతీయంగా టాప్‌ 10 కంపెనీల్లో ఒకటిగా నిలిచామని లండన్‌ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న జీఎఫ్‌జీ అలయన్స్‌లో ఒక భాగమైన లిబర్టీ స్టీల్‌ పేర్కొంది.

## ట్రిపుల్‌ ఐటీలో ఎస్‌బీఐ ఇంక్యుబేటర్‌

- 'ఫైనాన్స్‌ ఎట్‌ ది డోర్‌స్టెప్‌' సిద్ధం
- దేశంలోనే మొదటిసారిగా ఏర్పాటు



ప్రారంభ కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ పి.జె. నారాయణన్, ఎస్‌బీఐ సీజీఎం ఓం ప్రకాశ్‌మిశ్రా తదితరులు

**హైదరాబాద్:** ట్రిపుల్‌ ఐటీ– హైదరాబాద్‌ ప్రాంగణంలో స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దేశంలోనే మొదటిసారిగా స్టార్టప్‌ ఇన్‌క్యుబేటర్‌ సెంటర్‌ను 'ఫైనాన్స్‌ ఎట్‌ ది డోర్‌స్టెప్‌' కార్యక్రమంలో భాగంగా ఇక్కడ ఏర్పాటు చేశారు. ఎస్‌బీఐ 64వ ఫౌండేషన్‌డే సందర్భంగా సోమవారం ఈ స్టార్టప్‌ లాంజ్‌ను ట్రిపుల్‌ ఐటీ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ పీ.జే. నారాయణన్, ఎస్‌బీఐ చీఫ్‌ జనరల్‌ మేనేజర్‌ ఓంప్రకాశ్‌మిశ్రా ఆరంభించారు. ఈ సందర్భంగా మిశ్రా మాట్లాడుతూ... హైదరాబాద్‌ నగరం దేశానికి టెక్నాలజీ క్యాపిటల్‌గా మారిందన్నారు. ''స్టార్టప్‌లకు టీ–హబ్‌ ద్వారా సాంకేతిక సహకారం లభిస్తోంది. ఆర్థిక సహకారం అందించేందుకు ఎస్‌బీఐ ముందుకొచ్చింది. ఎస్‌బీఐ ద్వారా రూ.200 కోట్ల ఫండింగ్‌ను ఐటీ సంస్థలకు ముఖ్యంగా ఫిన్‌టెక్‌ సెగ్మెంట్‌లలోని స్టార్టప్‌లకు కేటాయిస్తున్నాం'' అని చెప్పారాయన. స్టార్టప్‌లకు ఎస్‌బీఐ చేయూతనివ్వడం సంతోషంగా ఉందని పీ.జే. నారాయణన్‌ చెప్పారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ ఐటీ ఆర్‌ అండ్‌ డీ డీన్‌ ప్రొఫెసర్‌ సీవీ జవహర్, ప్రొఫెసర్‌ రమేష్‌ లోగనాథన్, ఎస్‌బీఐ జనరల్‌ మేనేజర్లు మియా, రమేష్, పలువురు అధికారులు, ట్రిపుల్‌ఐటీ అధ్యాపకులు, స్టార్టప్‌ల వ్యవస్థాపకులు తదితరులు పాల్గొన్నారు.

## జూన్‌లో తగ్గిన జీఎస్‌టీ వసూళ్లు

- రూ.99,939 కోట్లకు పరిమితం
- అంతక్రితం మాసంలో రూ.లక్ష కోట్లు



**న్యూఢిల్లీ:** జీఎస్‌టీ వసూళ్లు రూ.లక్ష కోట్ల మార్కు పైన స్థిరంగా కొనసాగడం లేదు. మే నెలలో స్థూల జీఎస్‌టీ వసూళ్లు రూ.1,00,289 కోట్లు వసూలు కాగా, జూన్‌లో రూ.99,939 కోట్లకు తగ్గాయి. దీంతో అంతకుముందు మూడు నెలల పాటు నమోదైన రూ.లక్ష కోట్ల మార్క్‌కు బ్రేక్‌ పడింది. అయితే, 2018 జూన్‌ నెలలో ఉన్న రూ.95,610 కోట్లతో పోలిస్తే 4.5 శాతం పెరిగినట్టు తెలుస్తోంది. ''జూన్‌లో రూ.99,939 కోట్ల వసూళ్లలో... సెంట్రల్‌ జీఎస్‌టీ (సీజీఎస్‌టీ) రూ.18,336 కోట్లు, స్టేట్‌ జీఎస్‌టీ (ఎస్‌జీఎస్‌టీ) రూ.25,343 కోట్లు, ఇంటిగ్రేటెడ్‌ జీఎస్‌టీ (ఐజీఎస్‌టీ) రూ.47,772 కోట్లు, సెస్సు రూ.8,457 కోట్లు''గా ఉన్నట్టు ప్రభుత్వ ప్రకటన తెలియజేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జీఎస్‌టీ వసూళ్ల లక్ష్యాన్ని చేరుకుంటామని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్‌ ఠాకూర్‌ మీడియాకు తెలిపారు. ఏదైనా ఒక నెలలో వసూళ్లు తగ్గినప్పటికీ, పూర్తి ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి నిర్ణీత లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. 2019–20 ఆర్థిక సంవత్సరానికి సీజీఎస్‌టీ రూపంలో రూ.6.10 లక్షల కోట్లు, కాంపెన్సేషన్‌ సెస్సు రూ.1.01 లక్షల కోట్ల మేర వసూలు చేయాలని కేంద్రం నిర్దేశించుకుంది.

**నకిలీ ఇన్‌వాయిస్‌లపై కఠిన చర్యలు**

జీఎస్‌టీ ఎగవేసేందుకు నకిలీ ఇన్‌వాయిస్‌లు జారీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఠాకూర్‌ చెప్పారు. నిజాయతీపరులైన పన్ను చెల్లింపుదారులు ఇబ్బంది పడకుండా చూడడం కోసం నకిలీ ఇన్‌వాయిస్‌లకు చెక్‌ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.

# జీవీకే ఎయిర్‌పోర్ట్స్‌కు చుక్కెదురు

- వాటా విక్రయానికి బిడ్‌వెస్ట్‌కు ఢిల్లీ హైకోర్టు గ్రీన్‌ సిగ్నల్‌
- వాటా కొనుగోలు రేసులో అదానీ?




**హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో:** ముంబై ఇంటర్నేషనల్‌ ఎయిర్‌పోర్టులో వాటాను 74 శాతానికి పెంచుకోవాలనుకున్న జీవీకే ఎయిర్‌పోర్ట్స్‌ హోల్డింగ్స్‌కు ఢిల్లీ హైకోర్టులో చుక్కెదురైంది. కోర్టు తీర్పుతో దక్షిణాఫ్రికాకు చెందిన బిడ్‌వెస్ట్‌ గ్రూప్‌నకు ఊరట లభించింది. ముంబై ఇంటర్నేషనల్‌ ఎయిర్‌పోర్టులో (ఎంఐఏఎల్‌) ఈ గ్రూప్‌ కంపెనీ అయిన బిడ్‌ సర్వీసెస్‌ డివిజన్‌కు (మారిషస్‌) ఉన్న 13.5 శాతం వాటాను థర్డ్‌ పార్టీకి విక్రయించుకోవచ్చని జస్టిస్‌ సంజీవ్‌ నరూలా తీర్పు వెలువరించారు. అంతేగాక వాటా విక్రయాన్ని నిలిపివేయాలంటూ గతంలో ఇదే కోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేశారు. బిడ్‌ సర్వీసెస్‌ డివిజన్‌ నుంచి వాటా కొనుగోలు విషయంలో డీల్‌ను సకాలంలో పూర్తి చేసే ఉద్దేశం జీవీకే కంపెనీ కనబరచలేదంటూ కోర్టు వ్యాఖ్యానించింది. అయితే బిడ్‌ సర్వీసెస్‌ వాటాను దక్కించుకోవడానికి అదానీ గ్రూప్‌ ఆసక్తి కనబరుస్తున్నట్టు సమాచారం.

**ఇదీ కేసు నేపథ్యం..**

ముంబై ఇంటర్నేషనల్‌ ఎయిర్‌పోర్టులో తనకున్న వాటాను కొనుగోలు చేసేందుకు ఇన్వెస్టర్‌ ఒకరు ఆసక్తి కనబరుస్తున్నారంటూ జీవీకే ఎయిర్‌పోర్ట్స్‌ హోల్డింగ్స్‌కు కొన్ని నెలల క్రితం బిడ్‌ సర్వీసెస్‌ డివిజన్‌ నోటీసు ఇచ్చింది. దీంతో రైట్‌ ఆఫ్‌ ఫస్ట్‌ రెఫ్యూజల్‌ అస్త్రాన్ని జీవీకే ప్రయోగించింది. బిడ్‌వెస్ట్‌ వాటాతోపాటు ఏసీఎస్‌ఏ గ్లోబల్‌ నుంచి 10 శాతం వాటాను కొనుగోలు చేసేందుకు జీవీకే కసరత్తు చేసింది. ఈ ప్రక్రియ పూర్తి అయితే జీవీకే ఎయిర్‌పోర్ట్స్‌ హోల్డింగ్స్‌ వాటా 50.5 శాతం నుంచి 74 శాతానికి చేరుతుంది. ఈ డీల్‌ కోసం జీవీకే రూ. 2,171.14 కోట్లు చెల్లించాలి.

అయితే నిధులు లేకపోవడంతో డీల్‌ పూర్తి చేసేందుకు సెప్టెంబర్‌ 30 వరకు సమయం ఇవ్వాలని బిడ్‌వెస్ట్‌ను జీవీకే కోరింది. అంత వరకు వేచి చూసేది లేదని, ఇన్వెస్టర్‌ పెట్టుబడితో సిద్ధంగా ఉన్నారంటూ బిడ్‌వెస్ట్‌ తేల్చి చెప్పింది. దీంతో జీవీకే కోర్టును ఆశ్రయించి మధ్యంతర ఉత్తర్వులు తెచ్చుకుంది. తాజాగా కోర్టు తీర్పుతో బిడ్‌వెస్ట్‌ వాటా విక్రయానికి అడ్డంకులు తొలగిపోయాయి.

# లీజుకు రిలయన్స్‌ ఇన్‌ఫ్రా కార్యాలయం

- రుణాల చెల్లింపునకు కంపెనీ ప్రయత్నాలు
- 2020 నాటికి రుణరహిత సంస్థగా మారాలని లక్ష్యం



**న్యూఢిల్లీ:** రుణభారం తగ్గించుకునే దిశగా రిలయన్స్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ (ఆర్‌ఇన్‌ఫ్రా) మరిన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ముంబైలోని శాంటాక్రూజ్‌ ఈస్ట్‌లో ఉన్న రిలయన్స్‌ సెంటర్‌ ఆఫీస్‌ కార్యాలయాన్ని దీర్ఘకాలిక లీజుకు ఇవ్వనున్నట్లు సోమవారం వెల్లడించింది. ఈ డీల్‌ ద్వారా వచ్చే నిధులను పూర్తిగా రుణాల చెల్లింపునకు మాత్రమే వినియోగించనున్నట్లు పేర్కొంది. 'కార్యాలయాన్ని దీర్ఘకాలిక లీజుకివ్వడం ద్వారా నిధులు సమకూర్చుకుంటాం. సదరు ఆవరణ మాత్రం రిలయన్స్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ యాజమాన్యంలోనే ఉంటుంది' అని స్టాక్‌ ఎక్స్ఛేంజీలకు కంపెనీ తెలియజేసింది. 2020 నాటికి రుణ రహిత సంస్థగా మారాలని నిర్దేశించుకున్నట్లు వివరించింది. ప్రస్తుతం రిలయన్స్‌ సెంటర్‌లో పని చేస్తున్న ఉద్యోగులను గ్రూప్‌ కంపెనీలకు ముంబైలో ఉన్న వివిధ కార్యాలయాలకు బదిలీ చేయనున్నట్లు తెలిపింది. అనిల్‌ అంబానీకి చెందిన రిలయన్స్‌ గ్రూప్‌లో భాగమైన రిలయన్స్‌ ఇన్‌ఫ్రాకు సుమారు రూ. 6,000 కోట్ల రుణభారం ఉంది. మరో గ్రూప్‌ సంస్థ రిలయన్స్‌ కమ్యూనికేషన్స్‌ (ఆర్‌కామ్‌)కు రూ, 57,500 కోట్ల అప్పులు ఉన్నాయి. వీటిలో రూ. 7,000 కోట్ల మొత్తాన్ని సొంత గ్రూప్‌ కంపెనీలకే ఆర్‌కామ్‌ చెల్లించాల్సి ఉంది.

**బ్లాక్‌స్టోన్‌తో చర్చలు..**

అధికారికంగా రిలయన్స్‌ ఇన్‌ఫ్రా వెల్లడించనప్పటికీ.. లీజు ప్రతిపాదనలకు సంబంధించి బ్లాక్‌స్టోన్‌ సహా పేరొందిన పలు అంతర్జాతీయ ప్రైవేట్‌ ఈక్విటీ సంస్థలు, అమెరికాకు చెందిన ఒక ఫండ్‌ సంస్థతో కంపెనీ చర్చలు జరుపుతోందని సమాచారం. 15,514 చ.మీ. ప్లాట్‌లో నిర్మించిన రిలయన్స్‌ సెంటర్‌ ఆఫీస్‌ భవంతి విస్తీర్ణం సుమారు 6.95 లక్షల చ.అ.లు ఉంటుంది. 425 కార్లకు పార్కింగ్‌ స్పేస్‌ ఉంది.

**సోమవారం బీఎస్‌ఈలో ఆర్‌ఇన్‌ఫ్రా షేరు 4.4 శాతం క్షీణించి రూ. 53.05 వద్ద క్లోజయ్యింది.**

# కారు.. బేజారు!

- మారుతీ విక్రయాలు 15% క్షీణత
- 27 శాతం పడిపోయిన టాటా మోటార్స్‌ అమ్మకాలు

**న్యూఢిల్లీ:** దేశీ వాహన రంగం ప్రతికూల వాతావరణంలో ప్రయాణిస్తోంది. వరుసగా పదో నెలలోనూ కార్ల విక్రయాలు క్షీణతను నమోదుచేశాయి. ఈ విభాగంలోనే మార్కెట్‌ లీడరైన మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్‌ఐ) జూన్‌ దేశీ అమ్మకాలు ఏకంగా 15.3% తగ్గిపోయాయి. కంపెనీ మినీ సెగ్మెంట్‌ 36.2% క్షీణించింది. వినియోగదారుల సెంటిమెంట్‌ బలహీనపడిన నేపథ్యంలో దేశీ ఆటో పరిశ్రమ అమ్మకాల్లో తగ్గుదల నమోదవుతూనే ఉందని టయోటా కిర్లోస్కర్‌ మోటార్‌ డిప్యూటీ మేనేజింగ్‌ డైరెక్టర్‌ ఎన్‌ రాజా అన్నారు. ఆర్థిక వ్యవస్థ నెమ్మదించడం, రుతుపవనాలపై అనిశ్చితి, అధిక వడ్డీ, ద్రవ్య లభ్యత సమస్య, బీఎస్‌–సిక్స్‌ అమలు వంటి ప్రతికూల అంశాలు సెంటిమెంట్‌ను బలహీనపర్చాయన్నారు. మొత్తం ఆటో ఇండస్ట్రీ కంటే పీవీ అమ్మకాల పరంగా సెంటిమెంట్‌ మరింత బలహీనంగా ఉందని ఎం అండ్‌ ఎం ప్రెసిడెంట్‌ (ఆటోమోటివ్‌ సెక్టార్‌) రాజన్‌ వాధేరా అన్నారు. పరిశ్రమ ఇప్పటికీ ఒత్తిడిలోనే కొనసాగుతుండగా.. మార్కెట్‌ మాత్రం త్వరలోనే కోలుకోవచ్చని చెప్పారు.

**జూన్‌ వాహన విక్రయాలు (దేశీయ)**

| కంపెనీ | 2019 | 2018 | క్షీణత (శాతం) |
|---|---|---|---|
| టాటా మోటార్స్‌ | 13,351 | 18,213 | -27 |
| మారుతీ సుజుకీ | 1,14,861 | 1,35,662 | -15.3 |
| టయోటా | 10,603 | 13,088 | -19 |
| మహీంద్రా ట్రాక్టర్స్‌ | 31,879 | 39,277 | -19 |
| అశోక్‌ లేలాండ్‌ | 12,085 | 14,091 | -14 |
| మహీంద్రా | 39,471 | 41,689 | -5 |
| ఎస్కార్ట్స్‌ | 8,648 | 9,758 | -11 |
| హ్యుందాయ్‌ | 42,007 | 45,314 | -7.3 |
| రాయల్‌ ఎన్‌ఫీల్డ్‌ | 55,082 | 72,588 | -24 |
| సుజుకీ మోటార్‌సైకిల్‌ | 57,023 | 46,717 | -22 |
| టీవీఎస్‌ మోటార్‌ | 2,26,279 | 2,46,176 | -8 |
| బజాజ్‌ ఆటో | 2,29,225 | 2,34,576 | -2 |



# ఎల్‌ఐసీ రికార్డు ఫలితాలు

- 2018–19లో నూతన ప్రీమియం ఆదాయం రూ.1.42 లక్షల కోట్లు
- అంతక్రితం సంవత్సరంతో పోలిస్తే 6 శాతం వృద్ధి




**ముంబై:** బీమా రంగ దిగ్గజం లైఫ్‌ ఇన్సూరెన్స్‌ కార్పొరేషన్‌ (ఎల్‌ఐసీ) గత ఆర్థిక సంవత్సరంలో అన్ని విభాగాల్లో మంచి పనితీరు ప్రదర్శించింది. ముఖ్యంగా తొలి ప్రీమియం ఆదాయం (కొత్త పాలసీల రూపంలో వచ్చేది) 5.68 శాతం వృద్ధితో రూ.1,42,191.69 కోట్లుగా నమోదైంది. కంపెనీ చరిత్రలో ఒక ఆర్థిక సంవత్సరంలో తొలి ఏడాది ప్రీమియం ఆదాయం ఈ స్థాయిలో సాధించడం ఇదే అత్యధికం. ఇక పూర్తి ఆర్థిక సంవత్సరానికి మొత్తం ప్రీమియం ఆదాయం రూ.3,37,185.40 కోట్లుగా ఉంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ.3,17,850.99 కోట్లతో పోలిస్తే 6.08 శాతం పెరిగింది. కంపెనీ స్థూల ఆదాయం రూ.5,60,784.39 కోట్లకు పెరిగింది. అంతక్రితం ఇదే కాలంలో రూ.5,23,611.11 కోట్లతో పోలిస్తే 7.10 శాతం వృద్ధి చెందింది.

- పెన్షన్, గ్రూపు సూపర్‌యాన్యుయేషన్‌ వ్యాపారం ద్వారా ఆదాయం రూ.91,179.52 కోట్లుగా ఉంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో వచ్చిన రూ.82,807.83 కోట్లతో పోలిస్తే 10.11 శాతం వృద్ధి చెందింది.
- 2019 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఎల్‌ఐసీ రూ.2,50,936.23 కోట్ల మేర పాలసీదారులకు పలు రూపాల్లో చెల్లింపులు చేసింది. అంతక్రితం ఇదే కాలంలో చేసిన రూ.1,98,119.83 కోట్లతో పోలిస్తే 26.66 శాతం పెరిగింది.
- కార్పొరేషన్‌ నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ 2017–18లో ఉన్న రూ.28,45,041.82 కోట్ల నుంచి 2018–19లో రూ.31,11,847.28 కోట్లకు పెరిగింది.
- డిజిటల్‌ రూపంలో ప్రీమియం వసూళ్లు 60 శాతానికి చేరాయి. అంతక్రితం ఏడాదితో పోలిస్తే 38 శాతం అధికం.

## గూగుల్‌పై విచారణకు
# సీసీఐ ఆదేశం

**న్యూఢిల్లీ:** ఆండ్రాయిడ్‌ మొబైల్‌ ప్లాట్‌ఫాంపై పోటీ సంస్థలను అణగదొక్కేసే విధానాలకు పాల్పడుతోందంటూ టెక్‌ దిగ్గజం గూగుల్‌ మీద ఆరోపణలపై విచారణకు కాంపిటీషన్‌ కమిషన్‌ ఆఫ్‌ ఇండియా (సీసీఐ)ఆదేశించింది. 150 రోజుల్లోగా నివేదిక సమర్పించాలంటూ డైరెక్టర్‌ జనరల్‌ (డీజీ)కి సూచించింది. ఆండ్రాయిడ్‌ ఆధారిత స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్లలో తన సొంత యాప్స్‌ను ఇన్‌స్టాల్‌ చేసుకునేలా తయారీ సంస్థలతో గూగుల్‌ ఒప్పందాలు కుదుర్చుకుంటోంది. దీనివల్ల వాటికి పోటీ యాప్స్‌కు మార్కెట్లో స్థానం దొరకడం లేదంటూ వాటి తయారీ సంస్థలు సీసీఐకి ఫిర్యాదు చేశాయి. దీంతో ఏప్రిల్‌ 16న విచారణకు ఆదేశించగా, ఈ ఉత్తర్వులను సీసీఐ తాజాగా బహిరంగపర్చింది.



# తొలగనున్న వాణిజ్య యుద్ధ భయాలు

**సెన్సెక్స్ 292 పాయింట్లు అప్**
- 39,687 వద్ద ముగింపు
- 77 పాయింట్లు ఎగసి 11,866కు నిఫ్టీ



అమెరికా– చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గే అవకాశాలుండటంతో సోమవారం స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగిసింది. శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో మరిన్ని సంస్కరణలు ఉంటాయనే ఆశలు కూడా సానుకూల ప్రభావం చూపించాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 292 పాయింట్ల లాభంతో 39,687 పాయింట్ల వద్ద, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 77 పాయింట్లు ఎగసి 11,866 పాయింట్ల వద్ద ముగిశాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 3 పైసలు తగ్గి 69.03కు పడిపోయినా, ముడి చమురు ధరలు 3 శాతం మేర భగ్గుమన్నా, మన మార్కెట్ ముందుకే దూసుకుపోయింది.

**బడ్జెట్ వారంలో లాభాలతో బోణీ...**

వాణిజ్య ఉద్రిక్తతల నివారణకు చర్చలను మళ్లీ ప్రారంభించడానికి అమెరికా–చైనా అగ్రనేతలు అంగీకరించారు. జపాన్‌లోని ఒసాకాలో జరిగిన జీ20 సమావేశంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పిన్‌లు ఈ మేరకు ఒక అంగీకారానికి వచ్చారు. ఒప్పందం కుదిరేంత వరకూ ఎలాంటి సుంకాలు విధించబోమని ట్రంప్ హామీ ఇచ్చారు. ఇది ప్రపంచ మార్కెట్లకు ఎంతో ఊరటనిచ్చింది. మరోవైపు మన ప్రధాని నరేంద్ర మోదీతో కూడా సమావేశమైన ట్రంప్... ద్వైపాక్షిక, వాణిజ్య వివాదాల పరిష్కారం నిమిత్తం త్వరలోనే ఇరు దేశాల వాణిజ్య మంత్రుల సమావేశానికి అంగీకరించారు. బడ్జెట్ వారంలో సెన్సెక్స్ లాభాలతోనే ఆరంభమైంది. ఇంట్రాడేలో 39,541–39,765 పాయింట్ల కనిష్ట, గరిష్ట స్థాయిల మధ్య కదలాడింది.

**జీఎస్‌టీ రేట్ల సరళీకరణ !**

అమెరికా– చైనా మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశాలున్నాయన్న అంచనాలతో ప్రపంచ మార్కెట్లు లాభపడ్డాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. వాహన అమ్మకాలు సీక్వెన్షియల్‌గా పుంజుకోవడం, వసూళ్లు పెరుగుతుండటంతో జీఎస్‌టీ రేట్లను మరింత సరళతరం చేసే ప్రతిపాదన ఉందన్న వార్తలు సానుకూల ప్రభావం చూపించాయని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో ఇన్వెస్టర్లు వేచి చూసే ధోరణి అవలంభిస్తున్నారని వ్యాఖ్యానించారు. దీర్ఘకాలంలో ద్రవ్యలోటు లక్ష్యాన్ని ప్రభుత్వం సాధించగలదన్న అంచనాలున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ నిధులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయం నిధులతో ద్రవ్యలోటు సమస్యను ఎదుర్కొనే అంచనా

**స్టాక్ మార్కెట్ డేటా**

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్‌ఈ | 1,654 |
| ఎన్‌ఎస్‌ఈ | 26,285 |
| ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్) | 5,91,774 |
| ఎఫ్‌ఐఐ | 426 |
| డీఐఐ | -51 |

**టాటా మోటార్స్ రయ్ రయ్...**

సెన్సెక్స్‌లో టాటా మోటార్స్, బజాజ్ ఆటో, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు టాప్ గెయినర్స్‌గా నిలవగా, ఓఎన్‌జీసీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, మారుతీ సుజుకీ, వేదాంతలు 4% వరకూ నష్టపోయి టాప్ లూజర్స్‌గా నిలిచాయి. బీఎస్‌ఈ రియల్టీ, వాహన, విద్యుత్తు, హెల్త్‌కేర్, ఫైనాన్స్ సూచీలు 3 శాతం వరకూ లాభపడగా, ఆయిల్, గ్యాస్ సూచీ 2 శాతం పతనమైంది. కన్సూమర్ డ్యూరబుల్స్, టెలికం, లోహ సూచీలు కూడా నష్టపోయాయి. హాంగ్ కాంగ్, దక్షిణ కొరియా సూచీలు మినహా మిగిలిన అన్ని ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. యూరప్ మార్కెట్లు కూడా లాభాల్లోనే ముగిశాయి.

**నిఫ్టీ 50**

**టాప్ 10 గెయినర్స్** (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| ZEEL | 367 | 8.37 |
| DRREDDY | 2,653.95 | 4.06 |
| BAJAJ-AUTO | 2,915.00 | 3.11 |
| TATAMOTORS | 167.6 | 3.11 |
| HDFC | 2,250.10 | 2.65 |
| IBULHSGFIN | 622.4 | 2.42 |
| EICHERMOT | 19,600.00 | 2.41 |
| INDUSINDBK | 1,436.00 | 1.81 |
| HDFCBANK | 2,486.00 | 1.73 |
| RELIANCE | 1,268.90 | 1.26 |

**టాప్ 10 లూజర్స్** (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| BPCL | 376.35 | -4.1 |
| ONGC | 161.25 | -3.87 |
| IOC | 152.1 | -2.44 |
| COALINDIA | 249.25 | -1.79 |
| HCLTECH | 1,049.10 | -1.46 |
| ULTRACEMCO | 4,520.35 | -0.78 |
| TITAN | 1,324.80 | -0.74 |
| JSWSTEEL | 274.8 | -0.65 |
| INFRATEL | 265.5 | -0.58 |
| MARUTI | 6,501.00 | -0.51 |

## మూడు వేరియంట్లలో రియల్‌మీ సీ2



హైదరాబాద్: ఫ్లిప్‌కార్ట్ ద్వారా ఆన్‌లైన్లో లభ్యమవుతున్న రియల్‌మీ సీ2 బడ్జెట్ ఫోన్... ఇపుడు మూడు వేరియంట్లలో అందుబాటులోకి వచ్చింది. 2 జీబీ ర్యామ్, 16 జీబీ స్టోరేజీ ఫోన్ ధర రూ.5,999. 2 జీబీ ర్యామ్ 32 జీబీ స్టోరేజీ ధర రూ.6,999, 32 జీబీ ర్యామ్, 32 జీబీ స్టోరేజీ ఉన్న ఈ ఫోన్ ధర రూ.7,999గా ఉన్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. 6.1 అంగుళాల హెచ్‌డీ డిస్‌ప్లే, గోరిల్లా గ్లాస్ 3, ఆక్టా కోర్ మీడియాటెక్ హీలియో పీ22 ప్రాసెసర్ వంటివి సీ2 ప్రత్యేకతలు.

## ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల హబ్‌గా భారత్

**కేంద్ర ఐటీ శాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్**



న్యూఢిల్లీ: విధానపరమైన నిర్ణయాలు, ఔత్సాహిక వ్యాపారవేత్తలను ప్రోత్సహించే విధానాలతో బ్రాడ్‌బ్యాండ్ సేవలను సామాన్యులకు మరింత అందుబాటులోకి తెస్తామని కేంద్ర ఐటీ, టెలికం శాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్ చెప్పారు. అలాగే, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ఎగుమతుల హబ్‌గా భారత్‌ను తీర్చిదిద్దుతామని ఆయన తెలిపారు. డిజిటల్ ఇండియా 2.0 లక్ష్యాల సాధనలో భాగంగా 'డిజిటల్ గ్రామాల' రూపకల్పన దిశగా కేంద్రం చేస్తున్న యత్నాలకు దేశీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంస్థలు, వాటి సమాఖ్య నాస్కామ్ మొదలైనవి తోడ్పాటు అందించాలని మంత్రి సూచించారు. 'ఇంటి ముంగిటికే బ్రాడ్‌బ్యాండ్ అందుబాటులోకి తేవడం వంటి అంశాలకు ప్రాధాన్యమిస్తున్నాం. ఇందులో ఔత్సాహిక వ్యాపారవేత్తలను కూడా భాగస్వాములను చేయాలని భావిస్తున్నాం. పాన్ షాప్‌లలో మొబైల్ సిమ్ కార్డు కొనుక్కున్నంత సులువుగా బ్రాడ్‌బ్యాండ్ విషయంలో కూడా ఏదైనా చేయగలమా అన్న దానిపై కసరత్తు జరుగుతోంది' అని ఆయన చెప్పారు.

## ఓరియంట్ ఎలక్ట్రిక్ 'ఐలువ్ సిరీస్' ఎల్‌ఈడీ లైట్లు



హైదరాబాద్: సీకే బిర్లా గ్రూపునకు చెందిన ఓరియంట్ ఎలక్ట్రిక్.. 'ఐలువ్ సిరీస్' ఎల్‌ఈడీ లైట్లను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ఈ నూతనతరం లైట్లు మానవ కంటికి హానికలిగించని ఫ్లికర్–కంట్రోల్ టెక్నాలజీతో రూపొందించినట్లు వివరించింది. లైటు వెలుగులో హెచ్చుతగ్గులు సంభవించడం వల్ల కంటిపై దుష్ప్రభావం పడి తలనొప్పి, కంటిచూపు మందగించడం వంటి ఇబ్బందులు ఉంటాయని, తమ నూతన టెక్నాలజీతో ఈ సమస్య లేకుండా స్థిరమైన కాంతి ప్రసారమవుతుందని సంస్థ సీఈఓ రాకేష్ ఖన్నా తెలిపారు.

## ఒక్క రోజుకు కూడా పాలసీ తీసుకోవచ్చు

**బజాజ్ అలియాంజ్ మైహోమ్ పాలసీలో కొత్త ఫీచర్లు**



పుణె: బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తన 'మై హోమ్ – ఆల్ రిస్క్ ఇన్సూరెన్స్ పాలసీ'లో వినూత్నమైన ఫీచర్లను ప్రవేశపెట్టింది. దీంతో ఈ పాలసీని ఒక్క రోజు నుంచి ఐదేళ్ల వరకు తమకు నచ్చిన కాలానికి తీసుకునే వెసులుబాటు ఉంటుంది. ఈ పాలసీ ఇంటితోపాటు, ఇంట్లోని విలువైన వస్తువులకు కవరేజీ కల్పిస్తుంది. మరో వినూత్నమైన సదుపాయం... ఇంట్లో నివాసం ఉండకపోయినా కానీ ఇంటికి రక్షణ కవరేజీని పొందొచ్చు. ఇంట్లో నివాసం ఉండకపోయినా, దొంగతనం, దోపిడీ జరిగితే జరిగిన నష్టానికి ఇకపై పరిహారం లభిస్తుంది. గతంలో దీనికి మినహాయింపు ఉండేది. ఇక మై హోమ్ ఆల్ రిస్క్‌పాలసీలో ఇంట్లోని వస్తువుల జాబితాలో బ్లడ్ ప్రెషర్ మానిటర్, షుగర్ టెస్టింగ్ మెషిన్, ఫిట్‌నెస్ ట్రాకర్ల వంటి ధరించే ఉత్పత్తులు, వినికిడి శక్తి కోసం వాడే మెషిన్లు తదితర వైద్య పరికరాలతోపాటు, కళ్లజోళ్లు, బ్యాగులకు కూడా పరిహారం పొందొచ్చు. ఆభరణాలకు సంబంధించి పూర్తి విలువకు సరిపడా కవరేజీ తీసుకోవచ్చు.

# చార్టర్డ్ అకౌంటెంట్లు, వైద్యులకు ప్రధాని ప్రశంసలు



న్యూఢిల్లీ: సమాజంలో నిజాయితీ సంస్కృతికి పాటుపడుతున్న చార్టర్డ్ అకౌంటెంట్ల సేవలను ప్రధాని నరేంద్రమోదీ ప్రశంసించారు. చార్టర్డ్ అకౌంటెంట్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. ''చార్టర్డ్ అకౌంటెంట్ల కష్టపడి పనిచేసే స్వభావం సమాజంలో నిజాయితీ సంస్కృతి, మెరుగైన కార్పొరేట్ గవర్నెన్స్‌ను ముందుకు తీసుకెళుతుంది'' అని తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇక వైద్యుల దినోత్సవం సందర్భంగా సమాజాన్ని ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉంచేందుకు రోజులో అన్ని సమయాల్లోనూ పాటుపడుతున్న డాక్టర్ల సేవలకు ధన్యవాదాలు తెలియజేశారు. ''ప్రజా సంక్షేమం కోసం వారి చిరస్మరణీయ సేవలకు ఏ పదాలు కూడా న్యాయం చేయలేవు. విశిష్ట వైద్యుడు డాక్టర్ బీసీ రాయ్‌కు నివాళులు అర్పిస్తున్నాను'' అని ప్రధాని ట్వీట్ చేశారు. డాక్టర్ బీసీ రాయ్ జయంతిని వైద్యుల దినంగా జరుపుకుంటారు.

## తగ్గిన విమాన ఇంధన ధర

**5.8% తగ్గింపు ● 4 నెలల కనిష్టం**



న్యూఢిల్లీ: విమాన ఇంధన(ఏవియేషన్ టర్బయిన్ ఫ్యూయల్–ఏటీఎఫ్) ధర 5.8 శాతం తగ్గింది. అంతర్జాతీయ ముడిచమురు ధరలు ఇటీవల కొంత తగ్గిన నేపథ్యంలో ధర నాలుగు నెలల కనిష్టస్థాయికి దిగివచ్చింది. ఢిల్లీలో కిలోలీటరుకు రూ.3,806.44 తగ్గి రూ.61,200.36 వద్దకు చేరింది. మరోవైపు సబ్సిడీ ఎల్‌పీజీ సిలెండర్ ధర రూ.3.02 తగ్గింది. దీంతో ఢిల్లీలో 14.2 కేజీల సిలెండర్ ధర రూ.494.35కి తగ్గింది. సబ్సిడీ లేని సిలెండర్ ధర రూ.100.5 తగ్గి రూ.637కు దిగివచ్చింది.

# కొన్ని సంస్థలపైనే ఆధారపడటమా?

**ఆడిటింగ్‌లో పోటీ లోపించిందా..? ● కార్పొరేట్ శాఖ కార్యదర్శి శ్రీనివాస్**



న్యూఢిల్లీ: కంపెనీల పనితీరు విషయంలో వాటి ఆర్థిక పటిష్టత గురించి నిజమైన, న్యాయమైన అభిప్రాయాలను తెలియజేయడమే చార్టర్డ్ అకౌంటెంట్లపై ఉన్న అతి పెద్ద బాధ్యత అని కార్పొరేట్ వ్యవహారాల శాఖ కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ అన్నారు. లిస్టెడ్ కంపెనీల ఆడిటింగ్ విషయంలో ఎంతో ఏకాగ్రత అవసరమని అభిప్రాయపడ్డారు. చార్టర్డ్ అకౌంటెంట్స్ 70వ వార్షిక దినం సందర్భంగా ఐసీఏఐ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ''చాలా కంపెనీల ఆడిటింగ్‌ను కొన్ని కంపెనీలే (ఆడిట్ సంస్థలు) చేస్తున్నాయి. ఇది 90 శాతానికి పైనే ఉండొచ్చు. అంతర్జాతీయంగా అగ్రస్థాయి 4 ఆడిటింగ్ సంస్థలు 75 శాతం ఆడిటింగ్ చేస్తున్నట్టు విన్నాను. అధికంగా ఆధారపడే పరిస్థితి ఉందా..? పోటీ లోపించిందా..? మార్కెట్ ఎకానమీలో ఇదే జరిగితే అది ఆందోళన కలిగించేదే'' అని శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. పీడబ్ల్యూసీ, డెలాయిట్, ఈవై, కేపీఎంజీలను అగ్రస్థాయి నాలుగు ఆడిటింగ్ సంస్థలుగా చెబుతారు. ఐఎల్అండ్ఎఫ్ఎస్, డీహెచ్‌ఎఫ్ఎల్ సహా ఎన్నో కంపెనీల ఖాతాల్లో లోపాలను గుర్తించడంలో ఆడిటింగ్ సంస్థలు విఫలమవుతున్న క్రమంలో ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. చార్టర్డ్ అకౌంటెంట్ తన విధుల విషయంలో న్యాయం చేయాలని, స్వతంత్రంగా వ్యవహరించడం తప్పనిసరి అని పేర్కొన్నారు. ఈ చర్చంతా కూడా స్వతంత్రతపైనేనన్నారు.

## 'స్టెర్లింగ్' కేసులో సినీతారలకు ఈడీ నోటీసులు



న్యూఢిల్లీ: బ్యాంకులకు భారీగా రుణాలు ఎగవేసిన ఫార్మా సంస్థ స్టెర్లింగ్ బయోటెక్ కేసులో సినీ నటుడు డినో మోరియా, డిస్క్ జాకీ (డీజే) అకీల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. కంపెనీ గతంలో వీరిద్దరికీ కొంత చెల్లింపులు జరిపిందన్న ఆధారాలు ఉండటంతో.. వాటికి సంబంధించి వివరణనివ్వడానికి విచారణకు హాజరు కావాల్సిందిగా ఆదేశించింది. చెల్లింపులు జరిగిన సందర్భాల గురించి వారిని ప్రశ్నించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. స్టెర్లింగ్ బయోటెక్ సంస్థ బ్యాంకులకు దాదాపు రూ. 8,100 కోట్ల రుణాలు ఎగవేసిందన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికి సంబంధించి మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద గ్రూప్‌నకు దేశ, విదేశాల్లో ఉన్న రూ. 9,778 కోట్ల అసెట్స్‌ను ఈడీ అటాచ్ చేసింది. ప్రస్తుతం కంపెనీ ప్రమోటర్లయిన నితిన్ సందేశరా, చేతన్ సందేశరా, దీప్తి సందేశరా పరారీలో ఉన్నారు. వీరిపై అవినీతి, పన్ను ఎగవేత వంటి క్రిమినల్ కేసులు ఉన్నాయి.

# 8 రంగాల్లో మరింత పెరిగిన వృద్ధి

**మే నెలలో 5.1 శాతంగా నమోదు**



న్యూఢిల్లీ: ఎనిమిది ప్రధాన రంగాల వృద్ధి (మౌలికరంగం) మే నెలలో 5.1 శాతంగా నమోదైంది. స్టీల్, విద్యుత్ ఉత్పత్తి పెరగడం సానుకూలించింది. స్టీల్ ఉత్పత్తి 19.9 శాతం, విద్యుదుత్పత్తి 7.2 శాతం మేర పెరిగాయి. ఎనిమిది కీలక రంగాల (బొగ్గు, ముడి చమురు, సహజవాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఫర్టిలైజర్స్, స్టీల్, సిమెంట్, విద్యుత్) వృద్ధి రేటు క్రితం ఏడాది మే నెలలో 4.1 శాతంగా ఉండడం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్, మే నెలల్లో కలిపి వృద్ధి 5.7 శాతంగా నమోదైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం మొదటి రెండు నెలల్లో వృద్ధి 4.4 శాతంతో పోలిస్తే మెరుగైంది. ఇక ఏప్రిల్ నెలకు ఈ ఎనిమిది రంగాల వృద్ధి 2.6 శాతంగా గతంలో పేర్కొనగా... తాజాగా దీనిని 6.3 శాతానికి పెంచారు.

**తయారీ రంగ.. పీఎమ్ఐ అంతంతే !**

భారత తయారీ రంగ వృద్ధి గత నెలలో తగ్గింది. కొత్త ఆర్డర్లు పెద్దగా పెరగకపోవడంతో ఉత్పత్తి, ఉద్యోగ కల్పన మందగమనంగానే పెరగడమే దీనికి కారణం. ఈ ఏడాది మేలో 52.7గా ఉన్న ఐహెచ్ఎస్ మార్కిట్ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్(పీఎమ్ఐ) ఈ ఏడాది జూన్‌లో 52.1కు పడిపోయింది. కాగా ఈ పీఎమ్ఐ 50 పాయింట్ల మార్క్‌పైన ఉండటం ఇది వరుసగా 23వ నెల ఈ సూచీ 50 పాయింట్ల ఎగువన ఉంటే, వృద్ధిగానూ, 50 పాయింట్ల కంటే తక్కువగా ఉంటే క్షీణత గానూ భావిస్తారు.

**ఎన్‌ఎస్‌ఈ నగదు విభాగంలో ట్రేడైన**

| కంపెనీ పేరు | ముగింపు ధర | క్రితం ముగింపు |
|---|---|---|
| ADANI PORT | 413.25 | 410.2 |
| ASIAN PAINT | 1353.85 | 1358.15 |
| AXIS BANK L | 810.45 | 808.55 |
| BAJAJ AUTO | 2911.95 | 2827.05 |
| BAJAJ FINSE | 8521.05 | 8524.65 |
| BAJAJ FINAN | 3699 | 3681.1 |
| BHARTI AIRT | 348.5 | 346.65 |
| BHARAT PETR | 376.2 | 392.45 |
| BRITANNIA I | 2737.55 | 2743.7 |
| CIPLA LTD | 555.8 | 553.45 |
| COAL INDIA | 249.25 | 253.8 |
| EICHER MOTO | 19625.3 | 19138.8 |
| GAIL (INDIA | 312.7 | 311.95 |
| GRASIM INDU | 920 | 914.1 |
| HCL TECHNOL | 1049.1 | 1064.65 |
| HDFC LTD | 2245.9 | 2192.1 |
| HDFC BANK L | 2485.55 | 2443.75 |
| HERO MOTOCO | 2616.5 | 2581.5 |
| HINDALCO I | 208.9 | 207.05 |
| HUL | 1780.2 | 1787.6 |
| INDIABULLS | 621.95 | 607.7 |
| ICICI BANK | 439 | 437.1 |
| INDUSIND BA | 1433.6 | 1410.5 |
| BHARTI INFR | 265.65 | 267.05 |
| INFOSYS LIM | 731.3 | 732 |
| INDIAN OIL | 151.65 | 155.9 |
| ITC LTD | 274.95 | 273.85 |
| JSW STEEL L | 275.75 | 276.6 |
| KOTAK MAHIN | 1481.2 | 1477.1 |
| LARSEN & TO | 1556.65 | 1553.2 |
| MAHINDRA &M | 660 | 655.35 |
| MARUTI SUZU | 6507.85 | 6534.65 |
| NTPC LTD | 142.55 | 141.35 |
| ONGC | 161 | 167.75 |
| POWER GRID | 207.05 | 206.9 |
| RELIANCE IN | 1268.85 | 1253.1 |
| SBI | 361.55 | 361.25 |
| SUN PHARMAC | 405.35 | 400.95 |
| TATA MOTORS | 168 | 162.55 |
| TATA STEEL | 506.95 | 504.4 |
| TATA CONSUL | 2239.55 | 2227.2 |
| TECH MAHIND | 704.65 | 706.6 |
| TITAN COMPA | 1323.2 | 1334.7 |
| ULTRATECH C | 4526.65 | 4555.85 |
| UPL LIMITED | 948.2 | 937.45 |
| VEDANTA LIM | 174.05 | 174.35 |
| WIPRO LTD | 282 | 280.5 |
| YES BANK LI | 109.15 | 108.75 |
| ZEE ENTERTA | 358.35 | 338.65 |

**నిఫ్టీ నెక్ట్స్ ఫిఫ్టీ**

| | | |
|---|---|---|
| ABB INDIA L | 1601.35 | 1602.45 |
| ACC LIMITED | 1562.7 | 1562.15 |
| AMBUJA CEME | 212.95 | 212.85 |
| ASHOK LEYLA | 87.1 | 87.25 |
| BAJAJ HOLDI | 3642.55 | 3598.25 |
| BANDHAN BAN | 545.5 | 538.75 |
| BANK OF BAR | 121.25 | 121.6 |
| BHEL | 73.05 | 73.15 |
| BIOCON LIMI | 252.2 | 250.55 |
| BOSCH LIMIT | 16588.05 | 16338.65 |
| CADILA HEAL | 240.35 | 241.7 |
| COLGATE PAL | 1130.7 | 1127.7 |
| CONTAINER C | 578.1 | 570.05 |
| DABUR INDIA | 401.75 | 400.5 |
| DLF LIMITED | 190.8 | 188.55 |
| AVENUE SUPE | 1426.05 | 1397.9 |
| GENERAL INS | 228 | 218.35 |
| GODREJ CONS | 664.8 | 663.1 |
| HAVELLS IND | 787.05 | 786.15 |
| HDFC AMC LI | 2080.95 | 2061.6 |
| HDFC LIFE I | 469.5 | 464.05 |
| HINDUSTAN P | 282.55 | 290.05 |
| HINDUSTAN Z | 244.55 | 244.1 |
| ICICI LOMBA | 1103.55 | 1112.55 |
| ICICI PRU L | 390.75 | 388.65 |
| VODAFONE ID | 12 | 12.15 |
| INTERGLOBE | 1581.1 | 1557.95 |
| L&T FINANCE | 117.35 | 115.15 |
| LUPIN LIMIT | 772.15 | 754.75 |
| MARICO LIMI | 370.25 | 370.55 |
| UNITED SPIR | 588.2 | 584.95 |
| MOTHERSON S | 126 | 121.95 |
| MRF LTD | 56758.85 | 56609.6 |
| NHPC LTD | 24.9 | 24.8 |
| THE NEW IND | 148.7 | 149.35 |
| NMDC LTD. | 114.9 | 112.95 |
| ORACLE FIN | 3160.6 | 3170.65 |
| PAGE INDUST | 20861.6 | 20581.7 |
| PIRAMAL ENT | 1965 | 1946.4 |
| PETRONET LN | 248.1 | 245.1 |
| P&G HYGIENE | 10771.6 | 10714.85 |
| PIDILITE IN | 1206.45 | 1214.45 |
| STEEL AUTHO | 51.1 | 50.75 |
| SBI LIFE IN | 735.9 | 723.7 |
| SHREE CEMEN | 21469.05 | 21820.8 |
| SIEMENS LTD | 1330.45 | 1311.35 |
| SHRIRAM TRA | 1054.65 | 1080.45 |
| UNITED BREW | 1355.2 | 1339 |

**బీఎస్‌ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్**

| కంపెనీ పేరు | ముగింపు ధర | క్రితం ముగింపు |
|---|---|---|
| AditSpin | 3.7 | 3.7 |
| Alphageo | 414.8 | 415.65 |
| Alu Flouride | 118 | 118.9 |
| Amar Raja Bat | 630.7 | 620.15 |
| And Bank | 23.55 | 23.6 |
| And Cemen | 3.86 | 3.97 |
| And Paper | 427 | 427.45 |
| And Petro | 53.5 | 53.9 |
| Aries Agro Ltd | 62 | 61.65 |
| Aurobindo Ph | 614.3 | 608.1 |
| Avantel Soft | 242 | 235.8 |
| Avanti Feeds | 349.2 | 351.8 |
| BKV Industrs | 2.73 | 2.87 |
| BN Rathi Sec | 20 | 20 |
| Balaji Amin | 371.5 | 377.8 |
| Bambino Agro | 159 | 162 |
| Bartronics | 3.89 | 3.83 |
| Bhagira Chem | 467.95 | 486.55 |
| Bhagya Nag | 24.15 | 24.5 |
| Brilliant Sec | 0.85 | 0.89 |
| CIL Securi | 13.7 | 13.3 |
| Combat Drugs | 24.1 | 25.35 |
| Cont Coffee | 256.05 | 255.85 |
| CoroFert | 414.15 | 416 |
| Country Club | 5.8 | 6.1 |
| Cubex Tub | 11.15 | 11.95 |
| Cybermate | 1.86 | 1.89 |
| DR Reddy | 2654.9 | 2549.8 |
| Danlaw Tec | 82 | 85.4 |
| DecCement | 396 | 392 |
| Divi's Lab | 1611 | 1596.85 |
| Divya Granit | 76 | 76 |
| Dolphin Medi | 1.14 | 1.14 |
| Dredgin Corp | 429.7 | 429.4 |
| Empee Sugars | 0.77 | 0.81 |
| Essen Supple | 21.4 | 21.4 |
| Everest Org | 162.1 | 163 |
| Fortune Info | 26.25 | 26.7 |
| Four Soft | 27.8 | 27.45 |
| Frontier Inf | 2.99 | 2.99 |
| GMR Infra | 15.08 | 14.9 |
| GVK Power | 5.96 | 5.95 |
| Gati Corpn | 72.9 | 72.55 |
| Gayatri Proj | 164.4 | 157.75 |
| Gayatri Sugrs | 2.42 | 2.32 |
| Gennex Lab | 3.8 | 3.86 |
| GodavDru | 23.45 | 22.65 |
| Goldstn Tele | 207.9 | 201.45 |
| Goldstone Tech | 10.44 | 9.3 |
| Granules (I) | 97.5 | 96.7 |
| HBL Nife Pow | 22.7 | 22.6 |
| HYDIndus | 1604.7 | 1619.15 |
| Heritage Food | 414.9 | 405.85 |
| HindFlurocarb | 10.98 | 10.5 |
| IDL Industrs | 266 | 273.9 |
| IVRCL Infras | 0.7 | 0.7 |
| Incap | 31.4 | 33 |
| IndoNationl | 459.35 | 461.1 |
| Infotech En | 534.25 | 542.7 |
| JSTL | 26.9 | 26.8 |
| KCP LTD | 83.2 | 83.7 |
| KNR Constructio | 286.05 | 279.95 |
| KakatiCem | 191.1 | 190.05 |
| KakatiTex | 3.55 | 3.5 |
| Kallam Spg | 13.1 | 12.95 |
| Karan Woo-sn | 2.59 | 2.72 |
| Kernex Micro | 26.2 | 26.95 |
| Krebs Bio | 81.45 | 80.95 |
| LGS Global | 4.15 | 4.31 |
| LancoIndus | 176.5 | 168.5 |
| Lokesh Mach | 46.6 | 47.25 |
| Lotus Choc | 16.55 | 16.65 |
| MIC Elec | 0.72 | 0.75 |
| Madhucon Proje | 5.93 | 6.22 |
| Maytas Infra | 6 | 6.1 |
| Medinova Dia | 14.35 | 15.1 |
| Mold-tek | 53.8 | 53.8 |
| Moldtek Plastic | 269 | 270.2 |
| Moschip Semi | 16.6 | 16.7 |
| NCLInd | 131.5 | 132.8 |
| NETTLINX | 34.7 | 33.95 |
| NMDC Ltd | 114.8 | 112.95 |
| NagarAgrich | 29.5 | 30.1 |
| NagarConst | 95.15 | 97.6 |
| Natco Pharma | 537.1 | 534.3 |
| Nava Bh Ventur | 96.95 | 94.15 |
| Neha Inter | 1.82 | 1.75 |
| Neocure Ther | 2.52 | 2.56 |
| Neuland Lab | 538 | 522.85 |
| Nihar Info Glo | 9.39 | 9.88 |
| Nile | 259.9 | 253.9 |
| Northgate Tech | 0.35 | 0.36 |
| Oil Country | 7.21 | 6.83 |
| Ortin Lab | 13.74 | 13.74 |
| Padmalaya Tele | 1.53 | 1.6 |
| Panyam Cemen | 8.36 | 8.53 |
| Peeti Securt | 5.16 | 4.92 |
| PennAlum | 0.19 | 0.19 |
| PennInd | 32.9 | 32.95 |
| Phytochem I | 24.5 | 24.7 |
| Pitti Lamin | 47.5 | 48 |
| Pokarna | 142.3 | 123 |
| Prajay Engs | 7.39 | 7.51 |
| PremiExpl | 203 | 196.5 |
| Prism Cement | 91.3 | 90.5 |
| Raasi Refrac | 5.3 | 5.05 |
| Ragsan Petro | 87.05 | 86.2 |
| Rain Industries | 101.65 | 100.3 |
| Raj Packagin | 22.55 | 23.7 |
| Ram Informat | 37 | 37 |
| RavilFin | 5.85 | 6.1 |
| Restile Cer | 2.65 | 2.36 |
| Roopa Indus | 11 | 10.5 |
| Sagar Cem | 666.6 | 660.5 |
| Samkrg Pist | 128.65 | 129.55 |
| SangInd | 62.6 | 62.3 |
| Satvah. Ispat | 6.25 | 6.03 |
| Saven Techno | 16.35 | 16.5 |
| Sibar Auto | 15.22 | 14.5 |
| South Magnes | 20.25 | 21.3 |
| SrRayAlk | 29.8 | 30.15 |
| Srinivasa Ship | 28.4 | 27.05 |
| Starchik Sp | 48.5 | 48.3 |
| Sujana Univers | 0.22 | 0.23 |
| Surana Tele | 3.82 | 3.81 |
| Suryachakra Pow | 0.21 | 0.22 |
| Suryalata Sp | 146.35 | 153.5 |
| SuvarCem | 52.5 | 50 |
| Suven Pharma | 271.5 | 271 |
| TCI Finance | 13.6 | 13.83 |
| Taj Gvk Hotel | 190 | 188.4 |
| Tanla Solutions | 71.9 | 74 |
| Tirumala Seu | 0.67 | 0.7 |
| Trans Biotek | 3.15 | 3.19 |
| Transport Co | 306 | 311.2 |
| Trendy Knit | 0.2 | 0.2 |
| VBC Ferro | 31.4 | 33.05 |
| VST Indus | 3404.15 | 3443.35 |
| Vamshi Rubb | 21.9 | 20.9 |
| Viceroy Hotels | 1.57 | 1.65 |
| VijayTextil | 18.8 | 18.5 |
| Vimta Labs | 174.2 | 172.85 |
| Virat Crane | 27.5 | 24.55 |
| Virinchi Con | 69.95 | 71.1 |
| VisakaInd | 370.35 | 375.35 |
| Vision Tech | 0.92 | 0.92 |
| Vista Pharma | 13.75 | 13.65 |
| Vivimed Labs | 15.85 | 16.1 |
| Vjil Consult | 40 | 40 |
| ZenoTech Lab | 15.05 | 15.8 |

# ముడి చమురు ధరలు భగ్గు

- నేడు, రేపు ఒపెక్ సమావేశం
- ఉత్పత్తి కోత మరో 6–9 నెలలకు పొడిగింపు



వియన్నా: ముడి చమురు ఉత్పత్తి కోతను కొనసాగించే దిశగానే ఒపెక్ సమావేశం సాగుతుండటంతో ముడి చమురు ధరలు సోమవారం భగ్గుమన్నాయి. ఆర్గనైజేషన్ ఆఫ్ ద పెట్రోలియమ్ ఎక్స్‌పోర్టింగ్ కంట్రీస్(ఒపెక్)లోని 14 దేశాల మంత్రులు సోమ, మంగళవారాల్లో వియన్నాలో సమావేశమవుతున్నారు. 2017 నాటి ఉత్పత్తి కోత నిర్ణయాన్ని మరో ఆరు నుంచి తొమ్మిది నెలల పాటు కొనసాగించడానికే ఈ సమావేశం మొగ్గు చూపుతుందన్న అంచనాలు ఉన్నాయి.

**3 శాతం పెరిగిన ధరలు...**

రోజుకు 1.2 మిలియన్ బ్యారెళ్ల చమురు ఉత్పత్తి కోత విధించాలని 2017 ఏడాది డిసెంబర్లో ఒపెక్, ఇతర చమురు ఉత్పత్తి దేశాలు నిర్ణయించాయి. అప్పటి నుంచి ముడి చమురు ధరలు రికవరీ అవుతూ వస్తున్నాయి. ఈ ఏడాది తొలి క్వార్టర్‌లో చమురు ధరలు జోరుగా పెరిగాయి. దీంతో చమురు ఉత్పత్తి దేశాల ఆదాయాలు బాగా పెరిగాయి. అయితే ఈ ఉత్పత్తి కోత జూన్‌తో ముగిస్తుంది.

కాగా ఇటీవల జరిగిన జీ20 సమావేశంలో ఒపెక్‌లో సభ్య దేశం కాని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఒపెక్‌లో కీలకమైన సౌదీ అరేబియాలు ఈ ఉత్పత్తి కోత ఒప్పందాన్ని ఆరు నెలల నుంచి తొమ్మిది నెలల పాటు కొనసాగించడానికి అంగీకరించాయి. ఈ వార్తకు అమెరికా–చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతల నివారణకు చర్చలను మళ్లీ ప్రారంభించాలని నిర్ణయించడం కూడా జత కావడంతో ముడి చమురు ధరలు భగ్గుమన్నాయి. న్యూయార్క్ మార్కెట్లో వెస్ట్ టెక్సాస్ ఆగస్టు డెలివరీ ఇంటర్మీడియట్ క్రూడ్ 3 శాతం ఎగసి 60.17 డాలర్లకు పెరిగింది.

**బిజినెస్ @ పార్లమెంట్**

# ఆర్‌బీఐకి మరిన్ని అధికారాలు!

**ఎన్‌బీఎఫ్‌సీలపై నియంత్రణ లక్ష్యం**



న్యూఢిల్లీ: నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ(ఎన్‌బీఎఫ్‌సీ)ల పై మరింత పర్యవేక్షణ, మరిన్ని నియంత్రణ అధికారాలను ఆర్‌బీఐకి కట్టబెట్టే విషయాన్ని పరిశీలిస్తున్నామని ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ తెలిపారు. ఎన్‌బీఎఫ్‌సీల లిక్విడిటీ పరిస్థితిని ఆర్‌బీఐ నిశితంగా పరిశీలిస్తోందని, ఈ రంగం పనితీరును, కార్యకలాపాల పర్యవేక్షణను కొనసాగిస్తుందని పేర్కొన్నారు. ప్రైవేట్ ఎన్‌బీఎఫ్‌సీలకు మూలధన నిధులు సమకూర్చే యోచనేదీ లేదని స్పష్టం చేశారు. పార్లమెంట్‌కు ఈ వివరాలను ఆమె వెల్లడించారు. వివిధ అంశాలపై వివరణలను ఆమె పార్లమెంట్‌కు నివేదించారు.

**మూత పడ్డ 6.8 లక్షలకు పైగా కంపెనీలు**

భారత్‌లో ఇప్పటివరకూ 6.8 లక్షలకు పైగా కంపెనీలు మూతపడ్డాయని ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ తెలిపారు. ఆర్‌ఓసీ కింద మొత్తం 18.9 లక్షల కంపెనీలు నమోదయ్యాయని, దీంట్లో 36 శాతం మేర కంపెనీలు మూతపడ్డాయని ఆమె పార్లమెంట్‌కు వెల్లడించారు. వరుసగా రెండు ఆర్థిక సంవత్సరాల పాటు వార్షిక నివేదికలను సమర్పించని కంపెనీలను గుర్తించి, రద్దు చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలను తీసుకుందని పేర్కొన్నారు.

**19 కోట్ల 'ముద్ర' రుణాలు ...**

ప్రధాన మంత్రి ముద్ర యోజన(పీఎమ్ఎమ్‌వై) కింద ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు ఈ ఏడాది జూన్ 21 వరకూ 19 కోట్ల ముద్ర రుణాలు మంజూరు చేశాయి. వీటిల్లో 2,313 ముద్ర ఖాతాలు మోసపూరితమైనవిగా గుర్తించామని ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ తెలిపారు. వీటిల్లో అత్యధికంగా తమిళనాడు(344)లో చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు.

**నకిలీ ఐటీసీ క్లెయిమ్‌లు రూ.2,565 కోట్లు...**

రూ.2,565 కోట్ల ఇన్‌పుట్‌ట్యాక్స్ క్రెడిట్(ఐటీసీ)క్లెయిమ్ చేస్తూ, దాఖలు చేసిన 535 నకిలీ ఇన్‌వాయిస్‌లను జీఎస్‌టీ అధికారులు గుర్తించారని ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంట్‌లో వెల్లడించారు. దీనికి సంబంధించి 40 మందిని ప్రభుత్వం అరెస్ట్ చేసిందని పేర్కొన్నారు.

**పెరుగుతున్న కంపెనీ మోసాలు...**

కంపెనీల మోసాలు పెరిగిపోతున్నాయని ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పేర్కొన్నారు. ఈ మోసాలకు పాల్పడ్డవారిపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 594 కంపెనీలకు పాత్ర ఉన్న 79 కేసులను గత మూడేళ్లలో సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్(ఎస్ఎఫ్ఐఓ) దర్యాప్తు చేసిందని ఆమె పార్లమెంట్‌కు వెల్లడించారు. ఈ కాలంలోనే రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్(ఆర్‌ఓసీ) 256 కేసులను దర్యాప్తు చేసిందని తెలిపారు. వైట్ కాలర్ నేరాల నియంత్రణ నిమిత్తం సెబీ, కంపెనీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలు డేటా బదిలీ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయని తెలిపారు.

**రూ.14,578 కోట్లకు అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు....**

బ్యాంకింగ్ రంగంలో అన్‌క్లెయిమ్‌డ్ డిపాజిట్లు గత ఏడాది 27 శాతం ఎగసి రూ.14,578 కోట్లకు పెరిగాయని పార్లమెంట్‌కు ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ నివేదించారు. 2016లో రూ.8,928 కోట్లుగా ఉన్న అన్‌క్లెయిమ్‌డ్ డిపాజిట్లు 2017లో రూ.11,494 కోట్లకు చేరాయని తెలిపారు. గత ఏడాది చివరినాటికి ఒక్క ఎస్‌బీఐలోనే రూ.2,516 కోట్ల అన్‌క్లెయిమ్‌డ్ డిపాజిట్లు ఉన్నాయని పేర్కొన్నారు. కాగా జీవిత బీమా రంగంలో రూ.16,888 కోట్లు, సాధారణ బీమా రంగంలో రూ.990 కోట్ల అన్‌క్లెయిమ్‌డ్ మొత్తాలున్నాయని తెలిపారు.

**23 కోట్ల టన్నుల చమురు నిక్షేపాలను కనుగొన్న ఓఎన్‌జీసీ...**

ప్రభుత్వ రంగ ఓఎన్‌జీసీ కంపెనీ గత మూడేళ్లలో 23 కోట్ల టన్నుల చమురు నిక్షేపాలను కనుగొన్నది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నాటికి ఓఎన్‌జీసి వద్ద 459.84 మిలయిన్ టన్నుల చమురు నిక్షేపాలున్నాయని పెట్రోలియమ్ శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లోక్‌సభకు రాతపూర్వకంగా వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఓఎన్‌జీసీ 21.11 మిలిన్ టన్నుల చమురును ఉత్పత్తి చేసిందని, గత మూడేళ్లలో మొత్తం 65.66 మిలియన్ టన్నుల చమురును ఉత్పత్తి చేసిందని పేర్కొంది. ఇంధన దిగుమతులను తగ్గించుకునే ప్రణాళిక కోసం ఓఎన్‌జీసీ ఒక కమిటీని ఏర్పాటు చేసిందని వివరించారు. 2017–18లో రూ.5.66 లక్షల కోట్లుగా ఉన్న ముడిచమురు దిగుమతుల బిల్లు గత ఆర్థిక సంవత్సరంలో రూ.7.83 లక్షల కోట్లకు పెరిగిందని పేర్కొన్నారు. 2013–14లో ముడి చమురు దిగుమతుల బిల్లు అత్యధికంగా రూ.8.64 లక్షల కోట్లకు పెరిగిందని తెలిపారు.

**బులియన్** రూ.లలో

| | |
|---|---|
| **ముంబై** | |
| బంగారం (24 క్యారెట్లు) | 34,340 |
| బంగారం (22 క్యారెట్లు) | 32,700 |
| వెండి (కిలో) | 40,700 |
| **చెన్నై** | |
| బంగారం (24 క్యారెట్లు) | 33,770 |
| బంగారం (22 క్యారెట్లు) | 32,160 |
| వెండి (కిలో) | 40,700 |
| **హైదరాబాద్** | |
| బంగారం (24 క్యారెట్లు) | 33,770 |
| బంగారం (22 క్యారెట్లు) | 32,160 |
| వెండి (కిలో) | 40,700 |
| **ప్రొద్దుటూరు** | |
| బంగారం (24 క్యారెట్లు) | 33,750 |
| బంగారం (22 క్యారెట్లు) | 31,300 |
| వెండి (కిలో) | 38,500 |
| **విశాఖపట్నం** | |
| బంగారం (24 క్యారెట్లు) | 34,530 |
| బంగారం (22 క్యారెట్లు) | 32,120 |
| వెండి (కిలో) | 39,500 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | |
| బంగారం (24 క్యారెట్లు) | 34,770 |
| బంగారం (22 క్యారెట్లు) | 32,160 |
| వెండి (కిలో) | 40,700 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

**ముడిచమురు...** (బ్యారల్)

| | రాత్రి 11.30కు | శుక్రవారం ముగింపు |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 58.63 | $58.47 |
| బ్రెంట్ | 64.97 | $64.74 |

**కోడిగుడ్లు** (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 2-7-2019

| | |
|---|---|
| విశాఖ | 442-00 |
| చిత్తూరు | 463-00 |
| వరంగల్ | 424-00 |
| చెన్నై | 470-00 |
| ముంబై | 476-00 |
| విజయవాడ | 422-00 |
| నమక్కల్ | 460-00 |
| గోదావరి | 422-00 |
| **1-7-2019 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 421-00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 4.80 |
| బెంగళూరు | 445-00 |
| కోల్‌కత్త | 456-00 |
| ఢిల్లీ | 397-00 |

# బుల్లి డాక్టర్లు...భలే

- ఇద్దరు చిన్నారుల డాక్టర్ కల నెరవేర్చిన 'మేక్ ఏ విష్'
- 12 ఏళ్ల నేహాను డాక్టర్ చేసిన కాంటినెంటల్ ఆస్పత్రి
- గ్లెనిగల్స్ గ్లోబల్ హాస్పిటల్స్‌లో శృతి సేవలు
- డాక్టర్స్ డే రోజు అవకాశం

**డాక్టర్ కావాలనేది వారి ఆశ. ఉచితంగా, ఉన్నతంగా సేవ లందించాలనేది వారి ఆశయం. కానీ, విధి వక్రించింది. పసిప్రాయంలో ప్రాణాంతక వ్యాధుల బారినపడ్డారు. డాక్టర్లుగా ఆసుపత్రులకు వెళ్లాల్సిన ఆ చిన్నారులు వైద్యచికిత్సల నిమిత్తం నిత్యం ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. తమ కల నెరవేరదేమోనన్న వారి బెంగ మేక్ ఏ విష్ ఫౌండేషన్ సహకారంతో సోమవారం డాక్టర్స్‌డే సందర్భంగా తీరింది. యాప్రాన్ ధరించి, మెడలో స్టెతస్కోప్ వేసుకొని డాక్టర్లుగా అవతారమెత్తారు.**

**– హైదరాబాద్**


కాంటినెంటల్ ఆస్పత్రిలో రోగికి ఇంజెక్షన్ ఇస్తున్న డాక్టర్ నేహా సుల్తానా

మహబూబాబాద్ పట్టణానికి చెందిన పాషా, పర్వీన్ దంపతులకు కూతురు నేహా సుల్తానా(12) ఆరో తరగతి చదువుతోంది. తన ఊరిలో రోగులను చూసి చిన్నారి నేహా ఎంతో చలించిపోయేది. తాను డాక్టరై పేదలకు, ఆపదలో ఉన్నవారికి వైద్యసేవ అందించాలని నేహా నిర్ణయించుకొంది. విధి మాత్రం మరోలా తలిచింది. ఆమె ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్నట్లుగా గత ఏడాది నిర్ధారణ అయింది. చిన్నారి కల గురించి మేక్ ఏ విష్ ఫౌండేషన్‌వారు తెలుసుకొని నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని కాంటినెంటల్ ఆస్పత్రి సీఈవో ఫైజల్ సిద్ధిఖీ దృష్టికి తీసుకొచ్చారు. మూడు గంటలపాటు ఆ ఆసుపత్రిలో డాక్టర్‌గా సేవలందించే అవకాశం సిద్ధిఖీ కల్పించారు.

### డాక్టర్ శృతి కల నెరవేరింది..




ఖమ్మం పట్టణానికి చెందిన మేడిపల్లి శృతి(7) చలాకీ, హుషారుగా ఉండేది. ఏడాది క్రితం అకస్మాత్తుగా తీవ్ర మైన అనారోగ్యం బారినపడింది. కానీ, డాక్టర్‌గా రోగులకు వైద్య సేవలందించాలనేది ఆమె కోరిక. కారులో ఉదయమే ఆసుపత్రికి వచ్చిన శృతికి లక్ష్మీ కాపూల్ గ్లెనిగల్స్ గ్లోబల్ హాస్పిటల్స్ వైద్యులు బొకే, చాక్‌లెట్లతో స్వాగతం పలికారు. యాప్రాన్ తొడిగించి, మెడలో స్టెతస్కోప్ వేసి ఎమర్జెన్సీ వార్డులోకి తీసుకువెళ్లారు. శృతి రోగులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకుంది. డాక్టర్ క్యాబిన్‌లో కూర్చుని రోగులను పరీక్షించింది. తరువాత గ్లెనిగల్స్ గ్లోబల్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ కె.రవీంద్రనాథ్, సీఈవో డాక్టర్ రాహుల్, వైద్యులు, సిబ్బందితోపాటు డాక్టర్స్ డే వేడుకల్లో పాల్గొంది. డాక్టర్ కావాలనుకున్న తన కోరికను గ్లెనిగల్స్ గ్లోబల్ హాస్పిటల్స్ యాజమాన్యం సహకారంతో తీరిందని శృతి సంతోషం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో మేక్ ఏ విష్ ఫౌండేషన్ ప్రతినిధి శశిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ సూత్రధారి ఎబూకా అరెస్ట్

- బ్రెజిల్ నుంచి ముంబైకి సముద్ర మార్గం ద్వారా
- అటునుంచి బెంగళూరు మీదుగా హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా
- గతంలో అనుచరుల ద్వారా హైదరాబాద్‌లో విక్రయం
- వరుసగా అనుచరులు పట్టుబడటంతో తానే రంగంలోకి..
- 7.42 లక్షల విలువైన 106 గ్రాముల కొకైన్, 70 వేల నగదు స్వాధీనం
- మరో ఐవరీ కోస్ట్ మహిళ టోరి అమినాట అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డిప్యూటీ కమిషనర్ వివేకానందరెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** బ్రెజిల్ నుంచి సముద్ర మార్గం ద్వారా ముంబైకి అటునుంచి బెంగళూరు మీదుగా హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా చేస్తున్న ప్రధాన సూత్రధారి డివైన్ ఎబూకా ఎట్టకేలకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ హైదరాబాద్ బృందానికి చిక్కాడు. ఈ మేరకు సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఆబ్కారీ శాఖ కార్యాలయంలో హైదరాబాద్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సి.వివేకానందరెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బెంగళూరు కేంద్రంగా డ్రగ్స్ కార్యకలాపాలు నిర్వహిస్తూ.. హైదరాబాద్‌లో కొకైన్ విక్రయించే ప్రధాన సూత్రధారి (ముఠా నాయకుడు) నైజీరియా దేశానికి చెందిన డివైన్ ఎబూకా సుజును నానల్ నగర్‌లోని ఓ ఇంట్లో ఉండగా పక్కా సమాచారంతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ హైదరాబాద్ బృందం పట్టుకుంది. ఎబూకాతోపాటు అతడి ప్రియురాలు ఐవరీ కోస్ట్ దేశానికి చెందిన టోరి అమినాట అనే మహిళను అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.7.42 లక్షల విలువైన 106 గ్రాముల కొకైన్, రూ.70 వేల నగదు, 4 సెల్‌ఫోన్లు, డ్రగ్స్ రవాణాకు ఉపయోగిస్తున్న ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

**అంతా చిక్కడంతో తానే రంగంలోకి..**

డివైన్ ఎబూకా టీం సభ్యులంతా పట్టుబడటంతో హైదరాబాద్‌లోని వినియోగదారులకు కొకైన్ విక్రయించడం ఇబ్బందిగా మారింది. దీంతో చివరకు ఎబూకానే రంగంలోకి దిగాడు. బెంగళూరు నుంచి అతని గర్ల్‌ఫ్రెండ్ టోరి అమినాటతో కలసి హైదరాబాద్‌కు వచ్చి నానల్ నగర్‌లో ఉంటున్నాడు. ముందే ఇతడిపై నిఘా పెట్టిన ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఎబూకా అతడి, గర్ల్‌ఫ్రెండ్‌ను పట్టుకున్నారు. వీరి నుంచి 106 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

**బ్రెజిల్ నుంచి హైదరాబాద్‌కు..**

ఎబూకాను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టిన ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఈ దందా మొత్తం బ్రెజిల్ కేంద్రంగా కొనసాగుతున్నట్లు గుర్తించింది. బ్రెజిల్‌లో ఉంటున్న నైజీరియన్ పౌరుడు చూస్ సముద్ర మార్గం ద్వారా ముంబైకి కొకైన్ స్మగ్లింగ్ చేస్తున్నాడు. అటు నుంచి థాగా అనే వ్యక్తి బెంగళూరుకు కొకైన్ సరఫరా చేస్తుండగా దానిని డివైన్ ఎబూకా అతడి అనుచరులతో కలసి హైదరాబాద్‌లో వినియోగదారులకు చేరవేస్తుంటాడు. హైదరాబాద్‌లో వినియోగదారులకు 6 నుంచి 7 వేల రూపాయలకు విక్రయిస్తున్నట్లు విచారణలో ఒప్పుకున్నాడు. నెలకు పైగా నిఘా పెట్టి కొకైన్ ముఠాకు చెక్ పెట్టిన బృందాన్ని సి.వివేకానందరెడ్డి అభినందించారు.

**ఒక్కరు చిక్కడంతో క్లూ..**

పది రోజుల క్రితం నానల్ నగర్‌లోని ఎసర్ పెట్రోల్ పంపు వద్ద టాంజానియా దేశానికి చెందిన జాన్‌పాల్ 3 గ్రాముల కొకైన్‌తో ఎన్‌ఫోర్స్‌మెంట్ హైదరాబాద్ బృందానికి పట్టుబడ్డాడు. ఇతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టిన ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందంమొత్తం కూపీ లాగారు. జాన్‌పాల్ ఇచ్చిన సమాచారంతో జూన్ 24వ తేదీన గోల్కొండ ఖాదర్‌బాగ్‌లోని ఓ ఇంటిపై దాడులు చేయగా ఐవరీ కోస్ట్ పౌరుడు జాడీ పాస్కల్, ఒకోరో ఉచెన్నా శామ్యూల్‌తోపాటు ఎబూకా సోదరుడు చిమ గుడ్‌లక్‌లను పట్టుకున్నారు. వారి నుంచి రికార్డు స్థాయిలో రూ.17.78 లక్షల విలువైన 254 గ్రాముల కొకైన్, నగదు రూ.3.20 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత 2 రోజులకు సైనిక్‌పురిలో ఉంటున్న ఘనా పౌరుడు నెల్సన్ శామ్యూల్ స్మిత్, రిపబ్లిక్ ఆఫ్ జాప్రి దేశానికి చెందిన మార్క్ 4 గ్రాముల కొకైన్‌తో పట్టుబడ్డారు. పట్టుబడిన ఒక్కొక్కరి నుంచి పూర్తిస్థాయిలో సమాచారాన్ని సేకరించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఈ ముఠా బెంగళూరు కేంద్రంగా దందా కొనసాగిస్తున్నట్లు గుర్తించారు.

## జాతీయ రహదారులను నోటిఫై చేయండి

### గడ్కరీని కోరిన కోమటిరెడ్డి

**సాక్షి, న్యూఢిల్లీ:** తెలంగాణలో జాతీయ రహదారులుగా గుర్తించిన రాష్ట్ర రహదారులను అధికారికంగా నోటిఫై చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలసి వినతిపత్రాన్ని ఇచ్చారు. గతంలో తెలంగాణలో 3,150 కిలోమీటర్ల రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా గుర్తించారని, అందులో 1,388 కి.మీ. మాత్రమే అధికారికంగా నోటిఫై చేశారని, మిగిలిన వాటిని నోటిఫై చేయలేదన్నారు. వలిగొండ–తొర్రూరు–నెల్లికుదురు–మహబూబాబాద్–ఇల్లందు–కొత్తగూడెం జంక్షన్ వరకు 234 కి.మీ., మెదక్–ఎల్లారెడ్డి–రుద్రూరు 92 కి.మీ., బోధన్–బాసర–బైంసా 76 కి.మీ., మెదక్–సిద్దిపేట–ఎల్కతుర్తి 133 కి.మీ.సహా ఇతర రహదారులను జాతీయ రహదారులుగా నోటిఫై చేయాలని కోరారు. అనంతరం కోమటిరెడ్డి మాట్లాడుతూ, గతంలో టీఆర్ఎస్ నేతలు తాము 3,150 కిలోమీటర్ల జాతీయ రహదారులను సాధించామని చెప్పుకుంటే నిజమే అనుకున్నామని, అయితే అందులో సగం కూడా అధికారికంగా నోటిఫై కాలేదని తెలిపారు.

## నిమ్స్‌లో అదనంగా మరో 500 పడకలు

- ఔట్‌పేషెంట్లకు ప్రత్యేక బ్లాక్ నిర్మాణం
- వైద్య పరికరాలను ప్రారంభించిన మంత్రి ఈటల

**హైదరాబాద్:** నిమ్స్ ఆస్పత్రిలో రోగుల నిష్పత్తికి తగినట్లుగా వారికి మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అదనంగా మరో 500 పడకలను పెంచుతున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ వెల్లడించారు. ఆస్పత్రికి వచ్చే ఔట్ పేషెంట్ల కోసం లైబ్రరీ భవనం సమీపంలో ఓ ప్రత్యేక బ్లాక్‌ను నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. ఆస్పత్రిలోని మైక్రో బయాలజీ, బయో కెమిస్ట్రీ, పాథాలజీ విభాగాల్లో రూ. 2.50 కోట్లతో కొత్తగా ఏర్పాటు చేసిన పలు వైద్య పరికరాలతో పాటుగా అత్యవసర విభాగంలో రూ.30.40 లక్షలతో ఏర్పాటు చేసిన బ్లడ్ ఇర్రాడియేటర్ యంత్రాన్ని మంత్రి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం నిమ్స్ ఆస్పత్రికి వస్తున్న రోగుల సంఖ్య రోజురోజుకు మరింత పెరుగుతోందని అందుకే జిల్లా, ఏరియా స్థాయి ఆస్పత్రులను మరింత బలోపేతం చేసి, నిమ్స్‌పై భారం పడకుండా చూస్తామని చెప్పారు. రోగులకు అన్ని రకాల వైద్యసేవలు ఇక్కడే అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన బ్లడ్ ఇర్రాడియేటర్ యంత్రం ద్వారా దాతల నుంచి సేకరించిన రక్తంలోని టి సెల్స్‌ను తగ్గించి, ఇన్‌ఫెక్షన్ సమస్యలు తలెత్తకుండా చూస్తుందని చెప్పారు.

**పరికరాల పునరుద్ధరణకు చర్యలు**

నిమ్స్ సహా అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో సాంకేతిక సమస్యలతో పని చేయని వైద్యపరికరాలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి చెప్పారు. ప్రభుత్వ నిధులతో పాటుగా ఆస్పత్రి అంతర్గత నిధులు, దాతల సహకారంతో అత్యాధునిక వైద్యపరికరాలు సమకూర్చడమే కాకుండా ఆయా వార్డులను ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు మంత్రిని కలసి క్రమబద్ధీకరించాలని కోరారు. మంత్రి వెంట డైరెక్టర్ డాక్టర్ మనోహర్, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

## మైనింగ్ నిలిపివేత ఉత్తర్వులపై సుప్రీం స్టే

**సాక్షి, న్యూఢిల్లీ:** తెలంగాణలోని భూపాలపల్లిలో ఉన్న ఓపెన్ కాస్ట్ కాకతీయ గని–2లో జనావాసాలకు 500 మీటర్లలోపు మైనింగ్, బ్లాస్టింగ్ చేయొద్దని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీం కోర్టు నిలిపివేసింది. ఎన్జీటీ ఆదేశాలను సవాలు చేస్తూ సింగరేణి కాలరీస్ కంపెనీ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ లావు నాగేశ్వరరావు నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారించింది. సింగరేణి తరపున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఆత్మారాం వాదనలు వినిపిస్తూ నివాసాలకు 500 మీటర్ల దూరంలో మైనింగ్, బ్లాస్టింగ్ చేయడంపై కేంద్ర పర్యావరణ శాఖ నిబంధనలు సడలించిందని నివేదించారు. గతంలో గోవా అడ్వొకేట్ జనరల్‌గా ఉన్నప్పుడు 500 మీటర్ల పరిధిలో మైనింగ్ చేయరాదని ఆత్మారాం చేసిన వాదనలను జస్టిస్ లావు నాగేశ్వరరావు ఈ సందర్భంగా ప్రస్తావించారు. అయితే ప్రతివాది నాగవెల్లి రాజలింగం తరపున న్యాయవాది కె.శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ నిబంధనలు అమలు చేయాలనే తాము కోరుతున్నామని నివేదించారు. ప్రతివాది తన స్పందనను ఆగస్టు 18 లోపు సమర్పించాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు.

## కృష్ణా ట్రిబ్యునల్ విచారణ వాయిదా

**సాక్షి, న్యూఢిల్లీ:** తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల పంపకాలకు సంబంధించి జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణ ఈ నెల 29, 30, 31 తేదీలకు వాయిదా పడింది. ఏపీలో కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో రాష్ట్రం తరపున న్యాయవాదుల మార్పు జరిగే వరకు విచారణ వాయిదా వేయాల్సిందిగా జూన్ 11న ప్రభుత్వం విజ్ఞప్తి చేయగా.. జూలై 1న నిర్ణయం తీసుకుంటామని ట్రిబ్యునల్ తెలిపింది.

## 'కాళేశ్వరంపై విచారణ జరపండి'

**సాక్షి, హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టులో జరుగుతున్న అవకతవకలపై విచారణ జరిపించి రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకతను చాటుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రఘునందన్‌రావు కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బహిరంగ లేఖ రాశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడుతూ.. గతంలోనూ ఈ విషయంలో తాము అనేక సూచనలు చేశామన్నారు.




**Honda Motorcycle and Scooter India Pvt. Ltd., Registered Office:** Commercial Complex II, Sector - 49 - 50, Golf Course Extension Road, Gurugram - 122018 (Haryana), India; **Website:** www.honda2wheelersindia.com; **Customer Care:** customercare@honda2wheelersindia.com

**Honda Exclusive Authorized Dealerships: NALGONDA:** Sri Vigneshwara Honda - 9290143623, 9290053788; Kushal Honda - 08682-248822/33, 9160644472/73/74; **MIRYALGUDA:** Mereddy Honda - 9618688155, 08689230666/7; **KODAD:** Mereddy Honda - 08683253925, 9618688177; **HUZURNAGAR:** Mereddy Honda - 8683242888, 9618002354; **SURYAPET:** Sri Vigneshwara Honda - 8885312455, 8179181884; **DEVARAKONDA:** Sri Honda - 8688111770, 08691-252225; **HALIA:** Mereddy Honda - 9618688166, 08680278822; **BHONGIR:** Kushal Honda - 08685-243555, 9154308152; **MOTHKUR:** Kushal Honda - 08694-287999, 9949939988; **THIRUMALGIRI:** Saraswathi Honda - 08693-243243 9505243243; **BIBINAGAR:** Kakateeya Honda - 9949588911, 9121886912; **CHITIYAL:** Sri Laxmi Narasimha - 9948138583, 9948537805; **ALER:** Kushal Honda - 9951208888; **CHOUTUPPAL:** Kushal Honda - 7330869678.

**For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com**

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792